# gnananandakavi rachanalu samajika samskrutika adhyayanam

(Socio, Cultural study of Gnananandakavi Writing's)

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the degree of

Doctor of Philosophy

in

Telugu


Researcher

**CHOUTA BALAKRISHNA**

**(Reg No.12HTPH15)**

Department of Telugu

School Of Humanities

University of Hyderabad

Hyderabad- 500046

Telangana State


**March– 2019**

# జ్ఞానానందకవి రచనలు సామాజిక, సాంస్కృతిక అధ్యయనం

(పిహెచ్.డి.పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)


పరిశోధన

చౌట బాలకృష్ణ

12HTPH15

పర్యవేక్షణ

డా. బాణాల. భుజంగరెడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు– 500046



మార్చి– 2019

# DECLARATION

I, **CHOUTA BALAKRISHNA** hereby declare that this Thesis entitled **"gnananandakavi rachanalu – samajika, samskrutika adhyayanam"** submitted by me under the guidance and supervision of **Dr. Banala Bhujanga Reddy** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/INFLIBNET.

**Signature of the Student**

**Date :**

**place :**

**(ChoutaBalakrishna)**

**Regd. No. 13HTPH07**

# CERTIFICATE

This is to certify that the Thesis entitled **"gnananandakavi rachanalu – samajika, samskrutika adhyayanam"** submitted by **Mr. CHOUTA BALAKRISHNA,** bearing **Regd. No. 12HTPH15** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**Published in the following publications:**

**"gnananandakavigari amrapali – manastatwa chitrana" 2nd Chapter,** (ISSN:2277-7881), (Pg.No.236-242) by International Journal of Multidisciplinary Educational Research Vol. 7, ISSUE 1(3), January-2018. Visakhapatnam: Sucharita publications.

**"suragali timoti gnananandakavi jevita visheshalu** (ISSN:2277-7881), (Pg.No.96-108) by International Journal of Multidisciplinary Educational Research Vol. 7, ISSUE 5(2), May-2018. Visakhapatnam: Sucharita publications.

And

**B.Presented in the following conferences:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter-3and 4 of the thesis.)

**1 "gnananandakavi rachanalu – jatiya drukpatham"** 3rd Chapter, National Seminar, 11th -12th December, 2015, department of Telugu S.V. K. P Dr,, K. S. Raju Arts & science College Penugonda, collaboration with AdikaviNannaya university and Andhra Pradesh cultural Department.

**2 "harijanulu antaranivara? – parisilana"** 4th chapter, international seminar, 2nd – 3rd march, 2017, Department of Psychology, Adikavi Nannaya university collaboration with NIEPMD, UETS, THPI

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D. Programme as detailed below.

| S.N | Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|---|
| 1 | HT701 | Research Methodology | 5.00 | Pass |
| 2 | HT702 | History of Telugu Research | 4.00 | Pass |
| 3 | HT703 | Studies in Specialized Area | 4.00 | Pass |
| 4 | HT704 | Society and Literature | 4.00 | Pass |

**(Dr. BANALA BHUJANGAREDDY)**
**Research Supervisor**

**(Prof. G.ARUNAKUMARI)**
**Head, Department of Telugu**

**(Prof. S. SARAT JYOTSNA RANI)**
**Dean, School of Humanities**

పరిశోధన శీర్షిక

జ్ఞానానందకవి రచనలు సామాజిక, సాంస్కృతిక అధ్యయనం

## విషయసూచిక (i-xii)


కృతజ్ఞతలు (vi – vii)

ప్రస్తావన (viii–xii)


## మొదటి అధ్యాయం

## జ్ఞానానందకవి జీవిత విశేషాలు (1-18)


1.1 బాల్యం

1.2 విద్యాభ్యాసం

1.3 ఉద్యోగం

1.4 వివాహం

1.5 రచనలు

1.5.1 కావ్యాలు

1.5.2 ఖండ కావ్యాలు

1.5.3 తెలుగువాచకాలు

1.5.4 నాటకాలు

1.5.5 పాటలు

1.6 విశిష్ట సభ్యత్వాలు

1.7 సాహితీసంస్థలు

1.8 సన్మానాలు

1.9 బిరుదులు

1.10 అవార్డులు

1.11. ప్రముఖుల ప్రశంసలు

## రెండో అధ్యాయం

## జ్ఞానానందకవి రచనలు – పరిచయం (19-97)

2.1 తరంగమాల

2.2 వసంతగానం

2.3 పాంచజన్యం

2.4 ప్రభంజనం

2.5 విజయాభిషేకం

2.6 అక్షరాభిషేకం

2.7 అక్షరాక్షతలు

2.8 అక్షరగుచ్ఛము

2.9 వెలుగుబాట

2.10 అక్షరపూజ

2.11 పిల్లనగ్రోవి

2.12 రాజధాని

2.13 వంశధార

2.14 ఆహ్వానము

2.15 ధర్మాగ్రహం

2.16 దేశబంధు

2.17 నా జీవిత గాధ

2.18 పర్జన్యం

2.19 గాంధీ

2.20 క్రీస్తుశతకం

2.21 షెడ్యుల్డ్ కులాలు అంటరానివారా?

2.22 ఆమ్రపాలి

2.23 గోల్కోండ

# మూడవ అధ్యాయం

**జ్ఞాననందకవి రచనలు - జాతీయనాయకుల సామాజికసేవ** (98-140)

3.1 నెహ్రు

3.2 గాడిచెర్ల హరిసర్వోత్తమరావు

3.3 రవీంద్రనాథ్ ఠాగూర్

3.4 మహాత్మా గాంధీ

3.5 కందుకూరి వీరేశలింగం

3.6 రాజా రామ్మోహన్ రాయ్

3.7 అయ్యదేవర కాళేశ్వరరావు

3.8 సుభాష్ చంద్రబోస్

3.9 అంబేద్కర్

3.10 నీలం సంజీవరెడ్డి

3.11 నార్ల వెంకటేశ్వరరావు

3.12 బెజవాడ గోపాలరెడ్డి

# నాలుగవ అధ్యాయం

## జ్ఞానానందకవి రచనలు-సామాజిక స్పృహ (141-158)

4.1 సమాజ పరిణామం

4.1.1 ఆదిమ కమ్యునిస్టు సమాజం

4.1.2 బానిస సమాజం – సామాజిక సంబంధాలు

4.1.3 భూస్వామ్య సమాజం – సామాజిక సంబంధాలు

4.1.4 జమిందారి సమాజం – సామాజిక సంబంధాలు

4.1.5 పెట్టుబడిదారి సమాజం – సామాజిక సంబంధాలు

4.1.6 సామ్యవాద సమాజం – సామాజిక సంబంధాలు

4.2 సమాజంలో మధ్య తరగతి ప్రారంభం

4.3 అట్టడుగు వర్గాల సామాజిక సంబంధాలు

# ఐదవ అధ్యాయం

## జ్ఞానానందకవి రచనలు -సంస్కృతి (159-182)

5.1 మతం

5.1.1 క్రైస్తవ మతం

5.1.2 క్రైస్తవమత సాహిత్యం

5.1.3 క్రిస్మస్ పండుగ

5.2 బౌద్ధం

5.2.1 బుద్ధుని మార్గం

5.2.2 ఆర్య సత్యాలు

5.2.3 అష్టాంగా మార్గాలు

5.2.4 త్రి రత్నాలు

5.3 ఇస్లాం సమాజం

5.4 మిశ్ర సంస్కృతి

**సింహావలోకనం** (183-185)

**ఉపయుక్త గ్రంథసూచి** (186-189 )

**ముద్రితమైన వ్యాసాలు**

**జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన ధ్రువపత్రాలు**

# కృతజ్ఞతలు

ఆసక్తి గల అంశంపై పరిశోధన చేసేందుకు అంగీకరించి, తగురీతిలో సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహించిన గురువులు, ఈ పరిశోధన పర్యవేక్షకులు డా.బాణాల. భుజంగరెడ్డి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన గురువులు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జి. అరుణకుమారి గారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

నా పరిశోధనకు డాక్టరల్ కమిటీ మెంబర్లుగా ఉండి నాకు సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహించిన గురువులు ఆచార్య శరత్ జోత్స్నరాణిగారికి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, హృదయపూర్వక ధన్యవాదాలు

పాఠాలు చెప్పడంతోపాటూ, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన అధ్యాపకులు, ఆచార్య తుమ్మలరామకృష్ణ, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, డా. పమ్మి పవన్ కుమార్, డా. డి. విజయలక్ష్మి గారికి, డా. డి. విజయ కుమారి గారికి, ఆచార్య గోనానాయక్ గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి నమస్కారాలు.

విలువైన పుస్తకాలను సేకరించి మాకందిస్తున్న హైదరాబాద్ విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయం, పి.ఆర్.కళాశాల గ్రంథాలయం(కాకినాడ) వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

నాకష్టాలను ఆనందాలను పంచుకోగలిగినంత చేరువైన మిత్రులు డా. రవిబాబు, డా. మాణిక్యరావు, డా. రాజీవ్ బాబు, డా. రమ్యజ్యోతి, డా. గౌరీశ్వరరావు, డా. భానునాయక్, గాలెన్న, మహేష్ చంద్రకాంత్, ఎం.కె.రావు, యాసీన్, సతీష్, నాగరాజు ఇంకా నా ఉన్నతిని కోరే మిత్రులు అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నా ఉన్నతిని ఎల్లవేళలా ప్రోత్సహించి ఉన్నతచదువులు చదివించిన నా తల్లిదండ్రులకు, నా చదువుకు కారణమైన చెల్లెలు సునీతకు తమ్ముళ్ళు హరీష్ కు, రాముకు, నా ఎదుగుదలలో వారిని చూసుకొనే అన్న వదినలకూ మా చిన్న అన్నకూ కృతజ్ఞతాభివందనాలు.

ఈ పరిశోధనకు ఆర్థికసహకారం అందించిన యు.జి.సి. వారికి కృతజ్ఞతలు. అకడమిక్ విషయాల్లో సహకరించిన భవానీశంకర్,రాంబాబు, కృష్ణమోహన్, బాలాజీగార్లకు కృతజ్ఞతలు.

**చౌట బాలకృష్ణ**

# ప్రస్తావన (Preface)

ఆధునిక యుగం ప్రారంభమై పద్య రచనా ఉరవడి తగ్గి ఆధునిక సాహిత్యం ఉధృతంగా విస్తరిస్తున్న క్రమంలో నవ్య సంప్రదాయమార్గంలో పద్యాన్ని చేతబట్టి, పద్యానికే కట్టుబడి రచనలు చేసి సామాజికంగా,ఆర్థికంగా, ఒక సాధారణ స్థితి నుండి అక్షర జ్ఞానంతో ఉన్నత స్థాయికి ఎదిగి తెలుగు సాహితీ లోకంలో గుర్తింపు పొందిన వ్యక్తి, జాతీయకవి, పద్మశ్రీ జ్ఞానానందకవి.

సాహిత్యం వివిధ ప్రక్రియలలో(నవల, నాటకం, కథ, వచన కవిత్వం)వస్తున్నా వాటిని కాదని జ్ఞానానందకవి ప్రాచీన కవులు ఆదరించిన సంప్రదాయమార్గాన్నే ఎన్నుకొని చారిత్రక కావ్యాలు, కథాకావ్యాలు, ఖండ కావ్యాలు, నాటికలు మరియు పాటలు రచించారు. సంప్రదాయ మార్గంలో రచనలు చేసిన అతి కొద్దిమందిలో ఈయన ఒకరు. ఈయన రచనల్లోని సామాజిక, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించుకొని “జ్ఞానాననందకవి రచనలు – సామాజిక సాంస్కృతిక అధ్యయనం” అనే శీర్షికతో పరిశోధన చేయదలిచాను.

అక్షరాలతో పరిచయంలేని, విద్యాగంధం ఎరుగని ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించారు. సాంఘిక, ఆర్థిక అసమానతలకు గురవుతూ దారిద్ర్యం విలయతాండవం చేస్తున్న రోజుల్లో అక్షరం చేతపట్టుకొని కళాప్రపూర్ణవరకు ఎదిగారు. ఆయన రచనల్లోని సామాజిక, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయడం ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం.

జ్ఞానాననందకవి రచనలు పరిశీలించిన విమర్శకులు, పరిశీలకులు ఈయనను దళితకవిగా కంటే జాతీయ కవిగా ఎక్కువ మంది గుర్తించారు. దళిత సమస్యతోపాటు ముఖ్యంగా చారిత్రక, జాతీయ, జాతీయోద్యమం, జాతీయోద్యమ నాయకులుమొదలైన వాటిని తన రచనల్లో చిత్రించారు. భారత జాతిని జాగృతం చేసిన మహనీయులను, దేశనాయకులను, సంస్కర్తలను, సాహితీవేత్తలను, గురుతుల్యులను కీర్తించడం, స్మరించడం కవి కవితా వైభవం. శాంతి, స్నేహశీలత్వం వస్తువుగా వెలువడిన “అక్షర గుచ్ఛము” ఖండ కావ్యం జైన ప్రవక్త మహావీరుడితో మొదలై శాంతి విధాత బుద్ధుడితో ముగుస్తుంది. “అక్షర పూజ”ఖండ కావ్యంలో కవికుల గురువు కాళిదాసును ప్రశంసించాడు. ఆచార్యనాగార్జునుడి ఆలోచనా విధానాన్ని, అంధ్ర దేశాన్ని ఏలిన శాతవాహన, విజయనగర రాజులను,ఆంధ్రుల ఔన్నత్యాన్ని వెలువరించిన చరిత్రకారుడు మొగస్తనీసును, తెలుగు భాషా సాహిత్యాలకు సేవ

చేసిన సి. పి. బ్రౌన్ లను తన రచనల్లో కీర్తించాడు. జ్ఞానానందకవి అన్ని రచనల్లో జాతీయతా దృక్పథాన్ని పరిశీలిస్తాను.

భారతదేశం వివిధ మతాల మిశ్రమం. భారతీయ సమాజంలో వ్యక్తి పుట్టుకే అతని కులాన్ని, అతని సామాజిక స్థాయిని నిర్ణయిస్తుంది. జ్ఞానానందకవి పుట్టుక రీత్యా అట్టడుగు వర్గానికి చెందినవారు. నాటి సమాజంలో విద్య అందరికీ అందుబాటులో లేదు. కొన్ని వర్గాలవారికి మాత్రమే పరిమితంగా ఉండేది. పాశ్చాత్యుల, మిషనరీల రాకతో విద్య అందుబాటులోకి వచ్చి అనేక మంది విద్యావంతులయ్యారు. ఈ క్రైస్తవ మిషనరీలలోనే జ్ఞానానందకవి విద్యను అభ్యసించారు. ఈయన సమాజ ప్రగతిని ఉద్దేశించి ప్రత్యేకంగా రాసింది 'పర్జన్యము'. మిగిలినవి పరోక్షంగా సామాజిక సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుత సమాజంలో ఉన్న కుళ్ళంతా ఎత్తి చూపి తాను జీవిస్తున్న సమాజంలో శిఖరాలను, లోతులను, వెలుతురును, చీకటిని స్వయంగా అనుభవించి తన కలం ద్వారా పర్జన్యం కావ్యాన్ని సమాజానికి అందించాడు. 'విజయాభిషేకం'లో అస్తవ్యస్థ సామాజిక పరిస్థితులు, పీడనలు కులమత వైషమ్యాలు, వేధింపులు కనిపిస్తాయి. ఇందులో వేదనలు లేని మానవీయ విలువలతో కూడిన సమాజ కాంక్షే ప్రధాన ఇతివృత్తం.ఈ కోణంలో కవిగారు తన రచనల ద్వారా చూపించిన సమాజాన్ని పరిశీలిస్తాను.

జ్ఞానానందకవి గొప్ప లౌకికవాది. పరమత సహనశీలి. వీరి రచనలు జాతిని చైతన్యం చేసేవిగా ఉంటాయి. ఒక వ్యక్తి అనుసరించే సంస్కృతీ సంప్రదాయాలే ఆ వ్యక్తీ మతాన్ని నిర్ధారిస్తాయి. ఈయన హిందూ, ముస్లిం, క్రైస్తవ సంస్కృతులతోపాటు బౌద్ధ సంస్కృతిని కూడా తన రచనల్లో చూపించారు. జ్ఞానానందకవి షోడష మహా జనపదాలలో మొదలైన గణభోగ్య ఆచారాన్ని "ఆమ్రపాలి" కావ్యంలో, అప్పటి వరకు అస్పృశ్యత కు గురౌవుతూ పాశ్చాత్యుల రాకతో మత మార్పిడి చేసుకొన్న దళితులు, దళితేతరులు అనుసరిస్తున్న క్రైస్తవ సంస్కృతిని "క్రీస్తు ప్రబంధం, క్రీస్తు శతకం" లో వివరించాడు.

కళాప్రపూర్ణ జ్ఞానానందకవి రచనలపై ఇప్పటి వరకు నాలుగు పరిశోధనా వ్యాసాలు, మూడుసిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి. మొదట శరత్ జోత్స్నారాణి ఆచార్య సి. ఆనందరామం పర్యవేక్షణలో "కళాప్రపూర్ణ డా. జ్ఞానానందకవి జీవితం – వాఙ్మయ సూచి" అనే శీర్షిక తో 1985లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. యస్. పరాంకుశం ఆచార్య వేదుల సుబ్రమణ్యశాస్త్రి పర్యవేక్షణలో "కళాప్రపూర్ణ డా.జ్ఞానానందకవి

సాహిత్యం సమాలోచన" అనే శీర్షిక తో1993లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. యస్. రాజేశ్వర శర్మ  ఆచార్య మాదిరాజు రంగారావు  పర్యవేక్షణలో "జ్ఞానానందకవి కావ్యాలు –పరిశీలన" అనేశీర్షికతో 1995లో కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధనచేశారు. దార్ల వెంకటేశ్వరరావు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి పర్యవేక్షణలో "జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన" అనే అంశంపై 1998లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు.  పోలే ముత్యం  ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచారి పర్యవేక్షణలో "యస్. టి. జ్ఞానానందకవి గోల్కొండ కావ్యం పరిశీలన" అనే అంశంపై 2002లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. వై. సారయ్య ఆచార్య బేతవోలు రామబ్రహ్మం  పర్యవేక్షణలో "యస్.టి. జ్ఞానానందకవి వివేకానందగానము – అనుశీలన" అనే అంశంపై 2005లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. పోలే ముత్యం  ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచారి పర్యవేక్షణలో "పద్మశ్రీ సురగాలి తిమోతి జ్ఞానానందకవి సాహిత్యం – విమర్శనాత్మక పరిశీలన" అనే అంశం పై 2008లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. అయితే ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలో సామాజిక, సాంస్కృతిక అంశాలు అనే దృష్టితో పరిశోధన జరగలేదు కనుక జ్ఞానానందకవి  రచనల్లో సామాజిక, సాంస్కృతిక అంశాలను పరిశీలిస్తాను.

ఈ పరిశోధనను ఐదు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో జ్ఞానానందకవి జీవిత విశేషాలు, రెండో అధ్యాయంలో జ్ఞానానందకవి రచనల పరిచయం, మూడో అధ్యాయంలో జ్ఞానానందకవి రచనల్లో జాతీయ నాయకుల సామాజిక సేవ, నాలుగో అధ్యాయంలో జ్ఞానానందకవి రచనల్లో సామాజిక స్పృహ, ఐదో అధ్యాయంలో జ్ఞానానందకవి రచనల్లో సాంస్కృతిక అంశాలను పరిశీలిస్తాను.

కవిత్వం అందరికి అలవడదు. అది ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం వల్ల వస్తుంది. కొందరు నిత్యం సాధన చేసి శిఖరాలను అందుకుంటారు. ఏదైనా ఒక వస్తువును అందరికి అనుభవంలోకి వచ్చే విధంగా కవితామయంగా తీర్చటం చాలా కష్టం. ఒక వ్యక్తి సమాజంలో తన ప్రత్యేకతను నిలబెట్టుకోవాలంటే ఎన్నుకొన్న లక్ష్యానికి అనుగుణంగా వ్యక్తిత్వాన్ని మలుచుకోవాలి. సామాన్య కుటుంబంలో జన్మించి దీక్షతో, అవిరళ కృషితో, పట్టుదలతో మంచి కవిత్వం చెప్పాలనే ఉద్దేశ్యంతో జ్ఞానానందకవి ఎంతో శ్రమించారు. అతని మేనమామ ప్రోత్సాహం, తోటి విద్యార్థుల అండదండలు, అధ్యాపకుల ఆశీస్సులు ఉన్నాయి. చిన్నతనం

నుండే ప్రతి వస్తువు మీద పద్యాలు రాయడం మొదలు పెట్టాడు. వాటిని సాహిత్య అభిమానులకు వినిపించేవాడు. కవిత్వం ఎలా ఉండాలో స్వయంగా కవిగారే 'పాంచజన్యం' అనే ఖండ కావ్యంలో ఇలా పేర్కొన్నారు.

*"తెలుగు వాఙ్మయ జలధిలో జలకమాడి*

*వలపు రతనాల పదముల తిలకమద్ది*

*జిలుగు మెఱుగుల మువ్వంపు చీరెగట్టు*

*చేవగల బోటి నా కవితా వధూటి."* **(పాంచ. పుట.** 56)

జ్ఞానానందకవి అలంకారాల ప్రాధాన్యాన్ని ఎరిగినవారు కాబట్టి ఈ చిన్న పద్యంలో చక్కని రూపాకాలంకారాన్ని ప్రయోగించాడు. 'తన కవితా వధూటి చేవగల బోటి' అని జ్ఞానానందకవి తన కవిత్వ ప్రౌఢిమను చాటుకున్నారు.

తెలుగు సాహిత్యంలో తనదైన ఒరవడితో ప్రత్యేకతను సంతరించుకున్న మంచి కవిగా, సహృదయులకు పద్యవిద్యా గురువుగా దర్శనమిస్తారు. చిన్నతనంలోనే తన మేనమామ తెలుగులో భారత, భాగవతాలలోని పద్యాలను చదువుతుండగా వాటిని విని చక్కగా తిరిగి అప్పజెప్పేవాడు. మేనమామ సాహచర్యం వల్ల చిన్నతనం నుండే సాహిత్యంపట్ల మక్కువ ఎక్కువైంది. వన్నెలు చిన్నెలు గల కవిత్వాన్ని చూసి అందరూ మెచ్చారు. ఇది ఆ దేవుడి దయవల్లనే నాకు సాధ్యమైందని "క్రీస్తు ప్రబంధం"లో ఇలా పేర్కొన్నారు.

*"వన్నెల్ చిన్నెలు నా కవిత్వమునకున్ వచ్చెన్ విపశ్చిద్వరుల్*

*నన్నున్ మెచ్చిరి మెచ్చుచుందురు కళా లావణ్యముంగాంచి మే*

*లెన్నున్ వీనికి కారణం బరయగ నీ నాటికీ నాటికిన్*

*నన్నున్ సృష్టి మొనర్చినట్టి ప్రభువేనం చెంతు స్వాంతములో"* **(క్రీస్తు. ప్ర.** 8)

మేనమామ ప్రోత్సాహంతో రామాయణ, భారత, భాగవత కావ్యాలను చదువుకున్నాడు. దాశరథీ, భాస్కర, వేమన, సుమతీ, శ్రీకాళహస్తీశ్వరా, నారసింహ మొదలగు శతకాలలోని పద్యాలన్నీ కంఠస్థము చేశారు. ఆంధ్రము, అమరము, శబ్దమంజరి అన్ని గ్రంథాలని కంఠతా పట్టడం వల్ల ఆయనకు సాహిత్యంపై అభిలాష ఏర్పడింది. దీనితో పాటు కవిత్వం రాయాలన్న ఉత్సుకత కూడా ఉంది.

గ్రామంలో భిక్షాటనకై వచ్చిన దాసరన్నలు, బుడబుక్కల వాళ్ళు, దొమ్మరవాళ్ళు, చెంచువాళ్ళు మొదలయిన జానపద గాయకుల శ్రవణానందకరమైన పాటలు ఈ యువకవిని

ఆకర్షించాయి. ఆనాటి నుండి తెలుగులో చూసిన, విన్న ప్రతి పుస్తకాన్ని ఎంతో ఆసక్తితో, తదేక దృష్టితో చదివేవారు. ఇతని పట్టుదలని చూసిన ఆనాటి ఉపాధ్యాయులు ఎంతో మెచ్చుకునేవారు. గ్రామీణ వాతావరణంలోని స్థలాలూ వ్యవసాయ జీవమూ ఆనాటి సామాజిక స్థితిగతులు తన కవిత్వానికి నిలయమయ్యాయి. వాటిని కింది పద్యంలో చూడొచ్చు.

*"పాతకళ్ళములను పారమ్మకోనేరు*
*గట్టు జువ్విచెట్టు పట్టు మఱియు*
*అసరివోలు చెఱువు నా తమ్మినాయుని*
*చెఱువుగట్లు కవిత కరువులయ్యె"* (**నా జీవిత గాథ. పుట.** 9)

ఆర్థిక పరిస్థితులు బాగా లేని కారణంగా పలుచోట్ల ఉపాధ్యాయ వృత్తిని చేపట్టినారు. ఆనాటి ప్రధానోపాధ్యాయులు ఈయన రాసిన కవితలు విని అబ్బురపడేవారట. అక్షరజ్ఞానం లేని వాతావరణంలో హరిజనుడై పుట్టిన వారికి కవిత్వం అబ్బటం దేవుడు ప్రసాదించిన వరంగా కొనియాడారు. ఇలాంటి సంఘటనలు కూడా జ్ఞానానందంలో ఉత్సాహాన్ని పెంపొందించాయి. తన మేనమామ ఊరైన 'పెంట' గ్రామంలో జ్ఞానానంద కవి మిషనరీ వారి ఆజ్ఞప్రకారం ఉపాధ్యాయుడుగా నియమితులయ్యారు. ఆ గ్రామంలోని వారందరూ ఈయన కవిత్వాన్ని విని ఎంతో కొనియాడారు.

*"చిట్టి పొట్టి శబ్దాల సేకరించు కొలది*
*కవినన్న భావం కలుగు చుండ*
*మనవారు కవనమ్ము కొఱుగు చున్నాడని*
*బంధువులు సంతోష పడుచునుండ."*

ఇలా ప్రజాబంధుజన ఆమోదకంగా కవిత్వం మొదలుపెట్టారు.

★★★

# మొదటి అధ్యాయం

# జ్ఞానానందకవి – జీవిత విశేషాలు



## 1.1 బాల్యం:

డా. సురగాలి తిమోతి జ్ఞానానంద కవి క్రీ.శ.1922 వ సంవత్సరం జూలై 16వ తేదీన నేటి విజయనగరం జిల్లా బొబ్బిలి తాలూకాలోని పెదపెంకి అనే చిన్న గ్రామంలో క్రైస్తవ ఆచార సంప్రదాయాలు పాటించే ఒక సామాన్య నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సురగాలి పాపమ్మ, ఎల్లయ్య. కవి తాను ఎలాంటి గ్రామంలో జన్మించాడో 'నా జీవిత గాథ' అనే కావ్యంలో ఒక పద్యంలో ఇలా అన్నారు.

*" బాహుబలుడు తాండ్ర పాపయ్య సరదారు*
*కోర మీసములకు బారు చరిత*
*ఆర్జనమ్ము చేసినటి బొబ్బిలిలోని*
*పేరుగొన్న 'పెదపెంకి' నాది."* (**నా జీవిత గాథ. పుట.** 2)

తెలుగు క్యాలెండర్ ప్రకారం అది దుందుభి నామ సంవత్సరం. పుట్టిన సంవత్సరం పేరును సార్ధకం చేస్తూ జ్ఞానానంద కవి ఆధునికాంధ్ర సాహిత్యంలో విజయ దుందుభులు మోగించారు. అటు భారతదేశంలోను ఇటు ఆంధ్రదేశంలోను క్లిష్ట పరిస్థితులు నెలకొని ఉన్న సమయంలో ఆంధ్రసరస్వతికి ఒక మేలి ఆభరణంగా

ఆవిర్భవించిన కవి కళాప్రపూర్ణ డా. సురగాలి తిమోతి జ్ఞానానందకవి. ఇంటి పేరును సార్థకం చేస్తూ తెలుగునేల నాలుగు దిక్కులు తమ కవితా పరిమళాలను వెదజల్లారు. జ్ఞానానందకవి 'సురగాలి'కి సుడిగాలి అనే అర్థం కూడా ఉంది. ఈ అర్థంలో ఇంటి పేరును సార్థకం చేసుకుంటూ 'ప్రభంజనం' కావ్యాన్ని రచించారు. తన అసంఖ్యాకమైన కావ్యాలతో కవితా రంగంలో సుడిగాలులు సృష్టించిన కవి జ్ఞానానందకవి. కవిగారి పూర్తి పేరు తిమోతి జ్ఞానానంద. తిమోతి అనేది పరిశుద్ధ గ్రంథం బైబిల్ లో కనిపించే ఒక నామం. దీని గ్రీకు మూలానికి [Honored by God] భగవంతుని చేత పురస్కృతుడు అని అర్థం. కృపానందం, దయానందం, లూకానందం మొదలైన పేర్లు పెట్టుకోవడం క్రైస్తవుల ఆనవాయితీ. అలాగే కవి కి తల్లిదండ్రులు 'జ్ఞానానందం' అని పేరు పెట్టారని భావించవచ్చు.

కవిగారి తండ్రి ఎల్లయ్య సామాన్య రైతు కూలీ. ఆయన తనకున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ కుటుంబ భారాన్ని లాగేవారు. ఎల్లయ్య నిరక్ష్యరాస్యుడు. ఎలాంటి విద్యను అభ్యసించలేదు. అయినా సంస్కారం ఉన్నవాడు. సాంఘిక అసమానతలతో ఆర్థిక అసమానతలతో, జీవితం గడుపుతుండగా కవి రెండో ఏటనే ఎల్లయ్య భార్య పాపమ్మ మరణించింది. తల్లిలేని జ్ఞానానందాన్ని నాయనమ్మ లక్ష్మమ్మ కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చింది. కొన్నాళ్ళకు ఎల్లయ్య పెంకి వంశానికి చెందిన పోలమ్మను వివాహం చేసుకున్నాడు.

### 1.2 విద్యాభ్యాసం:

జ్ఞానానందకవి బాల్యం అత్యంత కష్టమైనది. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం వారిది. ఎండనక వాననక శ్రమించి తండ్రికి చేదోడయ్యాడు. కవిగారి మేనమామ గుంట యోహాను బాల జ్ఞానానందుని తన గ్రామమైన పెంట తీసుకెళ్ళారు. అక్కడ నుండి జ్ఞానానందుల జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఐదేళ్ళ వయస్సులో బాల జ్ఞానానందునికి అక్షరాభ్యాసం చేయించిన తొలి గురువు మేనమామే. పలకమీద రాసి ఇచ్చిన అక్షరాలను పరిశీలనగా ఒకటి రెండు సార్లు దిద్ది మొత్తం చెరిపి వేసి తిరగి రాసి చూపించే వారట జ్ఞానానంద. మేనమామ తీరిక సమయాల్లో భారతం, భాగవతం, రామాయణాల్లోని పద్యాలు చదివేవారట. వాటిని విని తిరిగి

అప్పజెప్పేవారట. అంతటి నిశితమైనది ఆయన దృష్టి, చూపు. ఏకసంథాగ్రాహిత్య లక్షణం కూడా బాల్యంలోనే పొడసూపింది. ఆనాటి ఆ బీజాలే క్రమంగా అంకురించి , పల్లవించి కవితాసుమాలై పూచాయి. మేనమామ అల్లుడి చురుకుదనాన్ని, విద్యాసక్తిని కనిపెట్టి ప్రోత్సహించారు. ఇప్పుడున్నట్లుగా ఆ రోజుల్లో ఊరూరా పాఠశాలలు లేవు. రెండు మూడు ఊర్లకు ఒక పాఠశాల ఉండేది. వాటన్నింటిలో దళితులకు ప్రవేశం ఉండేది కాదు. అయితే కవిగారి అదృష్టవశాత్తూ స్వగ్రామమైన పెదపెంకిలో దళితులకు ప్రత్యేకంగా ఎలిమెంటరి పాఠశాల ఉండేది. అది జిల్లా బోర్డు ఆధీనంలో నడిచేది. ఆ పాఠశాలలో అలజంగె ఎల్లయ్య ఉపాధ్యాయులు. విద్యార్థుల్ని సొంత పిల్లల్లా చూసి విద్యాబుద్ధులు నేర్పించేవారు. కరుణాహృదయుడు జ్ఞానానందుని ప్రతిభను గుర్తించి ప్రత్యేక శ్రద్ధను చూపారు. తొలి తరగతులలోనే మేలైన పునాదులు వేశారు. మేనమామ తనపట్ల చూపిన ప్రేమను ‘ నా జీవితగాథ’ కావ్యంలో తెలియజేశారు.

“అక్షరముల నాకుక్షిని
నిక్షిప్తము జేసినట్టి నీతిజ్ఞుడు నీ
యక్షమ్యం బగు కీర్తికి
రక్షకుడై వెలయువాని ప్రణుతింతు మదిన్.”(**నా జీవిత గాథ.పుట.**16)

జ్ఞానానందం చదువుకోవడానికి తండ్రి అందించే ప్రోత్సాహాన్ని చూసి సవతితల్లి పోలమ్మ ఈర్ష్యపడేది. ఎంతో చాకిరి చేయించేది. తెలిసిన వారికది నరకం అనే అర్థమవుతుంది. జ్ఞానానంద కాకినాడలో ‘జీవామృత పాఠశాల’ లో బైబిల్ విజ్ఞానం నేర్చుకోడానికి వెళ్లే సందర్భంలో ఎల్లయ్య పలికిన యీ మాటల్లో ఆ విషయం స్పష్టమౌతుంది.

*“సవతి తల్లి పెట్టు చాకిరి యెంతగా*
*హృదయమునకు చెప్పలేని బాధ*
*సంఘటనలునో తెలియ జాలిన వారికే*
*యర్థమగును నరకమని యెఱుంగు”* (**నా జీవిత గాథ. పుట.** 61)

మేనమామ యెహోను బాలుడైన జ్ఞానానందున్ని భీముని పట్నంలో ఉన్న హయ్యర్ ఎలిమెంటరి పాఠశాలలో చేర్పించారు. ఆ పాఠశాల ప్రధాన అధ్యాపకులు కోసూరు సమాయేలు. ఆయన పెట్టిన ప్రవేశ పరీక్షలో జ్ఞానానందులు ఉత్తీర్ణులయ్యారు. జ్ఞానానందుని ప్రతిభ చూసిన సమాయేలు  నేరుగా రెండవతరగతిలో ఆయనకు ప్రవేశం కల్పించారు. లెక్కల్లో మాత్రం జ్ఞానానంద వెనకపడ్డా మిగిలిన సబ్జెక్టులలో సహవిద్యార్థుల కంటే మిన్నగా ఉండేవారు. కేవలం చదువులోనే కాదు ఆటపాటల్లోనూ ఆయనదే పైచేయి. ఎన్నో బహుమతులు సొంతం చేసుకున్నారు. చక్కని తన భవిష్యత్తుకు, కవితా నిర్మాణ కుశలతకు మార్గం వేసిన మేనమామను కవి నిండు మనసుతో మెండుగా కీర్తించారు.

పేదరికం వల్ల రోజు గడవడమే కష్టంగా ఉండేది. అయినా తండ్రి ఎల్లయ్య కూలినాలి చేసి అర్ధణ, అణా కూడపెట్టి కొడుకు భవిష్యత్తు బంగారం కావాలని 'బోర్డింగు ఫీజు' కట్టేవాడు. పుస్తకాలు కొని పెట్టేవాడు. సెలవులిచ్చినప్పుడు జ్ఞానానందులు ఇంటికి వెళ్ళినా ఖాళీగా ఉండే వారు కాదు. కూలి పనులకు వెళ్ళేవారు. అలా వచ్చిన డబ్బుల్ని దాచుకుని ఫీజులు కట్టుకునే వారు. బోర్డింగులో బాలుడిగా ఆయన అనుభవించిన కష్టాలు ఆనాటి స్థితిగతుల్ని కవి 'నా జీవిత గాథ'లో ఎంతో హృద్యంగా హృదయ విదారకంగా చిత్రించారు. అయినా సరే కష్టాల్ని దిగమింగి, చదువు మీదే దృష్టి పెట్టి, తొమ్మిది సంవత్సరాలకే తెలుగు పద్యాలను ఎంతో అందంగా చదివేవారు. జ్ఞానానందం ఆరవ తరగతిలో ప్రవేశించే నాటికి అక్కడ తెలుగు పండితులు అప్పయ్యశాస్త్రి. ఈయన వ్యాకరణంలో ఉద్దండులు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయుని కంటే అప్పయ్యశాస్త్రినే ఎక్కువ అభిమానించే వారు. ఆయన బోధనా నైపుణ్యం జ్ఞానానందుల్ని విశేషంగా ప్రభావితం చేసిందట.

*"అప్పయ్యశాస్త్రి పేరుగల యట్టి యొకానొక పండితుడు మా*
*కప్పుడు తెల్గు టీచరయి వ్యాకరణమ్మును భారతమ్ములో*
*నప్పటి పాఠముల్ హృదయమందున నాటగ బోధనసేసె నా*
*కప్పుడు నాటి బోధ స్మృతియందు రగుల్కొని మేలుకొల్పెడిన్."*

**(నా జీవిత గాథ. పుట. 25)**

 ఏడో తరగతిలో ఆదినారాయణ శాస్త్రి అనే ఆయన తెలుగు బోధించేవారు. ఆయన వద్దే "మధురైక సుశబ్దములన్ గణించితిన్" అన్నారు కవి. ఆ ఏడో తరగతిలోనే కవి జ్ఞానానందులు తొలి అడుగు వేశారు. ఆదినారాయణ శాస్త్రి గారి బోధనతోనే 'ఆంధ్రకల్పతరువు' ఛందశాస్త్ర గ్రంథాన్ని కొనుకున్నారు. కవిత్వం అల్లటానికి ఉపయోగపడుతుందని చెప్పిన ఆంధ్ర కల్పతరువు ఛందోగ్రంథం కొనుక్కోవటానికి జ్ఞానానందులు బోర్డింగులో రోజూ పెట్టె పప్పు, దప్పళం కూరలు ఉన్నవారి పిల్లలకు అమ్ముకుని, ఆ వచ్చిన డబ్బు భద్ర పరుచుకొని పుస్తకాలు కొనుక్కున్నాడట. ఆ రోజుల్లో ఎనిమిదో తరగతి పాస్ అయితే అప్పుడు ఉపాధ్యాయ వృత్తికి అర్హులయ్యేవారు. ఆ అర్హతకు తొలి మెట్టు అయిన ఎనిమిదో తరగతిలో జ్ఞానానందులు ప్రవేశించారు. ఒకరోజు తరగతి గదిలో తెలుగు మాస్టారు తికమక పడే ప్రశ్న ఒకటి జ్ఞానానందులు అడిగారట ఉపాధ్యాయుడు కంగారు పడగా తరగతి గదిలో విద్యార్థులు అందరూ ఒక్కసారిగా గోల చేశారు. క్రమ శిక్షణకు మారు పేరయిన ప్రధానోపాధ్యాయుడు సమాయేలు క్లాసుకి రాగా ఉపాధ్యాయుడు జ్ఞానానందుల మీద ఫిర్యాదు చేశారట ప్రధానోపాధ్యాయుడు జ్ఞానానందుని శిక్షించమని ఆజ్ఞాపించారు అని జ్ఞానానంద కవి చెప్పుకున్నారు.

తెలుగు మాష్టారు 'నీ రోగంబు నణంచెదన్ తెలుగు పాండిత్యమ్ము జూపింతువా?' అని బెత్తంతో 'ఇరవై యేడు దెబ్బలు కొట్టి జయమ్ము గొన్నట్టి జయశాలి వలె సంతసించే పండితుడు' అని అన్నారు జ్ఞానానంద కవి . అదే గుణపాఠంగా భావించి, శ్రమించి ఉద్దీపించిన ఉత్సాహంతో ధాటిగా సహాధ్యాయులు ప్రశంసించేటట్లుగా తేటగీతులు, సీసపద్యాలు రాయడం ప్రారంభించారు. జ్ఞానానందులు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. అప్పట్లో సాధారణంగా ఎనిమిదో తరగతి పాసైన వారిని మిషనరీలు కాకినాడ పంపేవారు. అక్కడే మేక్లరిన్ హైస్కూల్ లేదా రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలకు లేదా అక్కడ వున్న జీవామృత పాఠశాల (క్రైస్తవ మత విషయ పాఠశాల)కు పంపేవారు. జ్ఞానానందుల్ని దొర పిలిచి జీవామృత పాఠశాలకు వెళ్ళి బైబిల్ నేర్చుకొమ్మని కాకినాడ పంపారు. తండ్రి ఎల్లయ్య నీవు చాలా దూరము వెళ్ళి చదువుకోవాలి. తల్లిలేని పిల్లాడివి. నాకు ఎలాగు చదువులేదు, నీవైనా

బాగా చదువుకో అనీ, ఈ వేళ మీ అమ్మ ఉంటే ఎంత పొంగిపోయేదో అనీ. అపద్దం ఆడకు, నీతిగా బ్రతుకు అనీ దీవించి పంపారు. జ్ఞానానంద తండ్రి చెప్పినట్టుగా కాకినాడ వెళ్ళి ఒక ఏడాది శ్రద్ధగా చదివి టి.టి.సి. పూర్తి చేశారు. ఆ రోజులలో టి.టి.సి పూర్తి చేసిన వారిని మెక్లరిన్ హైస్కూలులో తొమ్మిదో ఫారంకి గానీ, రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలకు గాని పంపేవాళ్ళు. కాని జ్ఞానానంద తనకు ఇంకా చదువుకోవాలనుందని ఎం.డి.ముట్సన్ దొరకు చెప్పారు. కాని ఆయన ట్రైనింగ్ పాఠశాలకు వెళ్ళమన్నారు. ప్రవేశ పరీక్షపెట్టారు. దానిలో మంచి మార్కులు వచ్చాయి. జ్ఞానానందకవిని పద్దెనిమిది రూపాయలు ఫీజు తెమ్మన్నారు. కవిగారు ఇంటికి వచ్చారు. ఉన్న కొద్దిపాటి మెట్ట అమ్మి పిల్లవాన్ని చదివిద్దామని ఎల్లయ్య తపన. కాని పినతల్లి భూమి అమ్మటానికి ససేమిరా ఒప్పుకోనంది. ఈ ఘర్షణలో రెండు రోజులు గడిచాయి. ఇంతలో పినతల్లి అన్నగారు వచ్చి జ్ఞానానంద పినతల్లిని మందలించి జ్ఞానానందుల్ని ట్రైనింగ్ వెళ్ళేలా చేశారు. అతి కష్టం మీద ట్రైనింగ్ కళాశాలలో చేరారు. దానిని జ్ఞానానంద కవి కింది పద్యంలో వివరించారు.

*"చెల్లికి సుద్దుముద్దులను జెప్పిన వెండియు నామె మానసం*
*బెల్ల మదీయ విద్యకయి యేమియు తొందర చేయకుండ తొ*
*నల్లన సొమ్మునిచ్చె పిత యంతటికిన్ ముదమది మేలు సం*
*ధిల్లగ దీవనల్ సలిపి దేవునినన్ స్తుతియించె నెమ్మదిన్."*

**(నా జీవిత గాథ. పుట. 62)**

ఆ రోజుల్లో మెక్లరిన్ హైస్కూల్ లోని బాలురకు, రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులకు కలిపి ఒకే హాస్టల్ ఉండేది. ఆ హాస్టల్ కు ట్రైనింగ్ పాఠశాల విద్యార్థులనే ప్రెసిడెంట్ గా నియమించే సంప్రదాయం ఉండేది. ఆ పద్ధతి ఆసరాగా జ్ఞానానంద ప్రెసిడెంట్ అయ్యారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా అధికారుల ముందు పెట్టేవారు. అయినా తన చదువుతోటి, క్రమశిక్షణతోటి ఉపాధ్యాయుల ఆదరాభిమానాన్ని సంపాదించారు. విజయవంతంగా హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తి చేశారు. తరువాత సంస్కృత భాషను అభ్యసించాలనే కోరిక కలిగింది. ఎంతో శ్రమ పడి విజయనగరంలోని 'మహారాజ సంస్కృత

కళాశాల'లో సీటు సంపాదించుకున్నారు. కాని ఆనాటి కుల భేదాలను, సామాజిక వైషమ్యాలను తట్టుకోలేక వదిలేశారు. ఆనాటి పరిస్థితిని 'సంస్కృత కళాశాల' అనే ప్రకరణంలో ఇలా అన్నారు.

*"కొన్ని దినములెటులో కూటికి ఇబ్బంది*
*పడుచు సంస్కృతంపు పాఠశాల*
*కేగినాడు గాని పృథ్వీ తలేంద్రుల*
*స్థాపనంపు టన్న సత్రమందు*
*నరయు నాకు జాగ దొరకలేదు"* (**నా జీవిత గాథ. పుట.** 91)

## 1.3 ఉద్యోగం:

జ్ఞానానంద కవి కాకినాడలో 8వ తరగతి పూర్తి చేసిన తర్వాత కెనడా దొరలు తమ యాజమాన్యంలో శ్రీకాకుళం జిల్లా అన్నవరంలో ఉన్నత పాఠశాలలో అతనిని ప్రాథమిక ఉపాధ్యాయునిగా నియమించారు. ఒక రోజున జ్ఞానానందకవి అక్షరాలు దిద్దలేదని ఒక బాలుని వీపుపై కొడితే వాడు ఏడుస్తూ వెళ్ళి తండ్రికి చెప్పగా అతడు కోపంతో వచ్చి ఏం మాష్టారూ మా పిల్లవాణ్ణి కొట్టావట అని అడిగాడు. చమత్కార సంభాషణతో నచ్చజెప్పి అతనిని పంపించానని కింది విధంగా తెలిపాడు.

*"ఏమి మాష్టారు కొట్టినారేల పిల్ల*
*వానినడుగ చమత్కార భాషణముల*
*నెటులొ తప్పించుకొంటిని యిక మఱేమి*
*భయము వలదని నాకు జెప్పంగ నాత*
*డేగగ కుదరు కొన్నది యెదద యంత."*(**నా జీవిత గాథ. పుట.** 33)

కవిగారు అన్నవరంలో నెల రోజులు మాత్రమే ఉపాధ్యాయుడిగా పని చేశారు. తరువాత ఇంటివద్దనే కూలి పనికి వెళుతుండేవారు. వీరి దూరపు బంధువు పెంకిరూబేను ద్వారా 'అంటిపేటలో ఉపాధ్యాయ ఉద్యోగం ఒకటి ఖాళీగా ఉందని తెలుసుకొని అంటిపేటకు వెళ్ళారు. బ్రాహ్మణ అగ్రహారంలో జ్ఞానానందకవి ఉపాధ్యాయుడుగా చేరారు. అక్కడ ప్రధానోపాధ్యాయుడు కూడా బ్రాహ్మణుడే.

అయినప్పటికి జ్ఞానానందకవితో ప్రేమగా ఉండేవారట. కవిగారి పాండిత్యం గురించి పదిమందితో చెప్పేవారట. ఆయన గురించి జ్ఞానానంద కవి ఒక పద్యంలో ఇలా పేర్కొన్నారు.

*"బాపన హెడ్మాష్టరునున్*
*నాపయి ప్రేముడిని చిందినను నా రచనా*
*రూపము గని ముచ్చట పడి*
*నా పేరును జెప్పుచుండు నలుగురి లోనన్"* **(నా జీవిత గాథ.పుట.**44)

అక్కడ ఆరు నెలలు పనిచేసిన తర్వాత వేరే ప్రాంతానికి బదిలి అయ్యారు. కెనడా మిషను దొరల ఆజ్ఞ మేరకు జ్ఞానానందకవి పెంటగ్రామంలో ఉపాధ్యాయునిగా చేరారు. పగలు బడి పిల్లలకు పాఠాలు బోధిస్తూ రాత్రులందు యేసుక్రీస్తు గూర్చి, బైబిల్ లో ఉన్న విషయాల గురించి బోధించేవారు. తరువాత అలజంగిలో కొన్ని నెలలు ఉపాధ్యాయుడిగా పని చేశారు. మేడపల్లిలో కూడా ఒక నెల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. విజయనగరంలో పక్కి జగన్నాథరావు తాత ఆధ్వర్యంలో ఒక మేనేజ్‌మెంట్ స్కూల్ ఉండేది. అందులో జ్ఞానానందకవికి ఉపాధ్యాయ ఉద్యోగం లభించింది. విజయనగరంలో కొన్ని సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసే అదృష్టం లభించింది. అయితే వాళ్ళు ఇచ్చే జీతం భోజనానికి మాత్రమే సరిపోయేది. అద్దెకు, చాకలివాళ్ళకు డబ్బులు ఇవ్వలేక వారిచేత చాలా సార్లు తిట్లు, చీవాట్లు పడ్డారు. దానిని కింది పద్యంలో పేర్కొన్నారు.

*"అద్దెకియ్య లేక ముద్దుకియ్యగ లేక*
*చాకికీయ లేక చాలాసార్లు*
*తిట్లువారి చేత తిన్నాడు నరునకు*
*బ్రతుకు సూపనట్టి వసుధ నాది"* **(నా జీవిత గాథ. పుట.** 96)

1947 జనవరి 1వ తేదీన విజయవాడలో సుప్రసిద్ధ కవియైన గుఱ్ఱం జాషువా గారికి గండపెండెరగంధ గజారోహణ సన్మానోత్సవం జరిగింది. జ్ఞానానందకవి

ఆనాటికే విజయనగరంలో చక్కని సాహిత్యకృషి చేస్తున్నారు. జ్ఞానానంద కవి విజయవాడ వెళ్ళి ఆ సభలో పాల్గొని 'జాషువా' పై పద్యాలు చదివారు. ఆయన పద్యాలు చదివిన తీరు అందర్నీ ఆకర్షించింది. గుంట యోహాను భగవతారు 'రెండో జాషువా ఉద్భవించాడు' అని మెచ్చుకొన్నారు. గుంట యోహాను తన స్నేహితుడైన పొనుగుపాటి అంథోనిని పిలిచి ఉపాధ్యాయ ఉద్యోగం జ్ఞానానందకవికి ఇప్పించాలని కోరారు. సజ్జనుడు, మంచి క్రైస్తవుడు అయిన అంథోని విజయవాడ 'కొత్తపేట' ఎలిమెంటరి స్కూలు మేనేజరు అయిన అన్నవరపు ధియెంఫిలస్ ని కలిసి జ్ఞానానంద ఉద్యోగం విషయమై మాట్లాడారు. ఉద్యోగం దొరికింది. కాని అక్కడ పాఠశాలకు రాని పిల్లలకు జ్ఞానానందకవి హాజరు వేయలేదని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోపగించారు. అందుచేత ఆ ఉద్యోగం మానేశారు. అయినా జ్ఞానానంద కవి విజయవాడను వదలక అక్కడే ఉండి సాహిత్య కృషి చేశారు. చివరికి విశ్వనాథ సత్యనారాయణ దర్శనం లభించింది. 'దేశబంధు' అయ్యదేవర కాళేశ్వరరావు అండ దొరికింది. వీరి సహాయ సానుభూతుల వల్ల జ్ఞానానందకవి విజయవాడలో నిలదొక్కు కోగలిగారు.

జ్ఞానానంద కవి ఒకనాడు కృష్ణలంకలో ఉన్న ఎలిమెంటరి స్కూలు మేనేజరు, ప్రధానోపాధ్యాయులు అయిన గుత్తిపాటి వీరభద్రరావు చౌదరిని కలిశారు. అతను మాటల సందర్భంలో తమ పాఠశాలలో ఉద్యోగం చేయమని సంతోషంతో ఆహ్వానించారు. ఆ మరునాడే ఉపాధ్యాయుడిగా చేరారు. ఈ పాఠశాలలోనే 'వేములపల్లి కుటుంబరావు, కుమారి సీతారామమ్మ జ్ఞానానందకవి కి సహాధ్యాపకులు. వీరు కూడా ఈయనపై ఎంతో ఆదరణ చూపారు.

జ్ఞానానంద కవికి 1954 జూలై 16వ తేదీ నాడు కాకినాడలోని మెక్లరిన్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, మేనేజరు అయిన జి.ఎ. సమాయేలు జూనియర్ తెలుగు పండిట్ ఉద్యోగం ఇచ్చారు. ఎనిమిదో తరగతి చదివి హైయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తి అయిన జ్ఞానానంద కవికి ఈ తెలుగు పండిట్ ఉద్యోగం ఇచ్చినందుకు అప్పటి హైస్కూల్ పండితులు ఉపాధ్యాయులు అందరు క్రైస్తవులే అయినప్పటికీ తమ నిరసన భావాన్ని తెలియజేశారు. జ్ఞానానందకవికి ఏమి తెలుసని గుసగుసలాడుకున్నారు.

కాని, జ్ఞానానందకవి పాఠాలు బోధించేటప్పుడు చాటుగా విని ఆనందించేవారని కొన్నాళ్ళ తరవాత ఈ సంగతులను సమాయేలు గారే జ్ఞానానందకవితో చెప్పారట. జ్ఞానానంద కవి కాకినాడ మెక్లరిన్ హైస్కూలులో పనిచేసేటప్పుడు పొందిన కొన్ని అనుభవాలలో ఒకటిరెండు పేర్కొంటాను. "ఇంతటి కవితాశక్తి కలిగిన జ్ఞానానంద" మెక్లరిన్ హైస్కూల్ పండిత పదవికి కొత్తవాడైనా సాహిత్యమందు ఉద్దండుడు. కనుకనే ఈర్ష్యా ద్వేషాలు గల ఆ పండితులు, కుల క్రైస్తవుల మధ్య నిలబడగలిగినారు. అయినప్పటికీ ఈయన్ని ఉద్యోగం నుండి తీసివేయాలని అనేకులు గట్టి ప్రయత్నాలు చేశారు. ఈయన చేరిన పదిహేను రోజులకే ఆనాటి డి.ఇ.ఓ అద్దంకి ఫణీంద్రుడు మెక్లరిన్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులకు ఒక వర్తమానం పంపించారు. దాని సారాంశం జ్ఞానానందకవిని తొలగించాలని ఉంది. ఈ విషయాన్ని జ్ఞానానందకవికి తెలియజేశారు. అప్పటికే జ్ఞానానంద కవి కవితా వైదుష్యాన్ని బెజవాడ గోపాలరెడ్డి బాగా ఎరుగుదురు. వీరు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. జ్ఞానానంద కవి తన విషయమై ముఖ్యమంత్రికి, లేఖరాయడం దర్శించడం జరిగింది. అప్పటి ఉమ్మడి రాష్ట్రానికి బి.యస్. రెడ్డి విద్యాశాఖ డైరక్టరుగా ఉన్నారు. శ్రీ గోపాలరెడ్డి జ్ఞానానందకవి గురించి ఫోనులో మాట్లాడారు. తరువాత కవిగారు డైరెక్టరు దగ్గరకి వెళ్ళి వివరణ అడిగితే జ్ఞానానంద కవి వివరణ ఇచ్చారు. డైరెక్టరుగారు డి.ఇ.ఓ. పై ఆగ్రహించి టెలిగ్రాం ద్వారా జ్ఞానానంద కవికి వెంటనే హైస్కూలులో పండితునిగా ఆర్డరు జారి చేయవలసిందిగా ఆజ్ఞ జారి చేశారు. వెంటనే డి.ఇ.ఓ. ప్రధానోపాధ్యాయులు దగ్గరకు రావడం ఏ కాగితం మీద ఊస్టింగ్ ఆర్డరు వేశారో అదే కాగితం మీదనే తిరిగి ఆర్డరు వేశారు.

జ్ఞానానందకవి మెక్లరిన్ హైస్కూలులో పండితుడిగా పని చేస్తున్నారు. కాని అది పర్మినెంట్ కాదు. ఏడాది ఏడాది డి.ఇ.ఓ రెకమెండ్ చేయాలి. ఈ అవస్థను గురించి జ్ఞానానంద కవి తమ గురుదేవులైన విశ్వనాథకవిగారికి చెప్పారు. 1959లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి ఉన్నారు. విశ్వనాథ హిందూపుర శాసనసభ సభ్యులు సుబ్బారావును కలిసి సంజీవరెడ్డిని దర్శించారు. వారి వారి కుశల ప్రశ్నల అనంతరం విశ్వనాథ సంజీవరెడ్డితో జ్ఞానానందకవి ఉద్యోగంలో పడుతున్న

బాధలు వివరించారు. అప్పటి విద్యాశాఖమంత్రి పట్టాభి రామారావు గారితో జ్ఞానానందకవిగారిని పర్మెనెంట్ ఎగ్జంప్షన్ ఆర్డర్ ఇవ్వవలసిందిగా ఫోనులో చెప్పారు. జ్ఞానానంద కవి తెలుగు పండిట్‌గా పర్మెనెంట్ కావటానికి విశ్వనాథ ఇలా దోహదకారి అయ్యారు. ఈ అవస్థలు ఎందుకంటూ జ్ఞానానంద కవి 1956లో మద్రాసు విశ్వవిద్యాలయం 'విద్వాన్' పరీక్షలు కర్నూలులో వ్రాశారు. 1959 నాటికి పర్మెనెంట్ ఆర్డరుతో జ్ఞానానందకవిది ఎదురులేని ఉద్యోగమైంది. యాభై ఎనిమిది సంవత్సరాలకు ఉద్యోగ విరమణ చేయాలి కాని అప్పటి ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి ఐదు సంవత్సరాలు రీ-ఎంప్లాయిమెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు జ్ఞానానంద కవి ద్వితియశ్రేణి, ప్రథమశ్రేణి తెలుగు పండితుడిగా మెక్లరిన్ హైస్కూలులో పనిచేసి 1982లో పదివీ విరమణ చేశారు.

## 1.4 వివాహం:

జ్ఞానానంద కవిగారు కాకినాడలో మెక్లరిన్ హైస్కూలులో ద్వితీయశ్రేణి తెలుగు పండితునిగా ఉద్యోగంలో స్థిరపడిన తరువాత తన 32వ సంవత్సరంలో వివాహం చేసుకున్నారు. నేటి విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలోని క్రైస్తవ కుటుంబమైన నల్ల జాకబ్ కేథరీనమ్మల సంతానంలో మేటిల్డా సుగుణమణి అనే ఆమెను 1955 మే 18వ తేదీన జ్ఞానానందకవి వివాహం చేసుకున్నారు. ఈ వివాహం సాలూరులోని లూథరన్ చర్చిలో జరిగింది. వివాహానికి బొబ్బిలి రాజావారి బంధువులు, కవులు, పండితులు పురప్రముఖులు వచ్చారు. ఆకాశవాణి గాయకులు ఎం.దుర్గాప్రసాద్, జ్ఞానానందకవి గురువులు విశ్వనాథ సత్యనారాయణ పంపిన పద్యాల్ని చదివారు. విశ్వనాథ శిష్యునికి చదివింపుగా నూట పదహార్లు కూడా పంపారు. ఆయన పంపిన పద్యాల్లో ఒకటి.

*"నా శిష్యుండును సాధువౌ కవియు జ్ఞానానంద మీసాధువే*
*ళా శిష్టంబు నదృష్టమందెడిని వాల్లభ్యమ్ము దీపింపగన్*
*ఆశీర్యోగ్యుడు యోగ్యుడున్ నవశుభ ప్రారంభ సంపత్తికిన్*
*అశిస్సంతతినిత్త నీ శుభ వివాహ స్వేచ్ఛ వేళంబడిన్."*

(కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు. పుట. 49)

జ్ఞానానంద కవికి ఐదుగురు పిల్లలు. మొదట శరత్‌జ్యోత్స్నరాణి, పెద్దకుమారుడు శరదిందు రెండో కుమారుడు శరన్మధు, రెండో కుమార్తె శిరిషామనోజ్ఞ, చిన్నకుమారుడు రసజ్ఞశ్రీ. ఆస్తిపాస్తులు లేకపోయినా తనకు వచ్చే స్వల్ప వేతనంతో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ కూడా పిల్లలకు చక్కని భవిష్యత్తును ఇచ్చారు. కవిగారి భార్య మెటిల్డా అన్నివిధాలా అనుకూలవతిగా వ్యవహరించిన సహధర్మచారిణి. భర్త సాహిత్య వ్యాసాంగానికి అనేక విధాలుగా ప్రోత్సాహాన్ని అందించిన ధన్యురాలు. ఆమె 5-5-1991 నాడు మరణించారు.

## 1.5 రచనలు:

### 1.5.1. కావ్యాలు

1 గాంధీ (అమరగీత)

2 దేశ బంధు (అయ్యదేవర)

3 గోల్కొండ

4 క్రీస్తుచరిత్ర

5 ఆమ్రపాలి

### 1.5.2 ఖండ కావ్యాలు

1.తరంగమాల

2.వసంతగానం

3.పాంచజన్యం

4.ప్రభంజనం

5.పర్జన్యం (తొలిభాగం)

6.క్రీస్తుచరిత్ర (వచనం)

7.విజయాభిషేకం

8.పర్జన్యం (మలిభాగం)

9.అక్షరాభిషేకం

10.అక్షరాకృతులు

11.అక్షర గుచ్ఛం

12.వెలుగుబాట

13.క్రీస్తు ప్రబంధం (తొలిభాగం)

14.నా జీవితగాథ (ప్రథమభాగం)

15.అక్షరపూజ

16. హరిజనులు అంటరానివారా?

17.పిల్లనగ్రోవి

18.రాజధాని

19.కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు

20.వంశ ధార

21.వ్యూస్ అండ్ వర్స్

22.ఆహ్వానం

23.ధర్మాగ్రహం

24.వివేకానందగానం

1.5.3 **తెలుగు వాచకాలు**:

**1**.ఆరో తరగతి తెలుగు ఉపవాచకం

2.రెండో తరగతి తెలుగు ఉపవాచకం

3.తొమ్మిదో తరగతి తెలుగు ఉపవాచకం (ద్వితీయ భాష)

4.పదవ తరగతి తెలుగు ఉపవాచకం

1.5.4 **నాటకాలు**:

1.క్రిస్మస్

2.రోజులు మారాయి

1.5.5 **పాటలు**:

**1**.శిలువ పాటలు

2.నా పాటలు

3.క్రీస్తు ధ్వని

4.కొత్త పాటలు

**1.6 విశిష్ట సభ్యత్వాలు** : కవిగా, సాహితీ వేత్తగా జ్ఞానానంద కవి ప్రభుత్వం చేత, సాహిత్య సంస్థలచేత, స్థానిక సంస్థల చేత, విశ్వవిద్యాలయాల చేత ఇతర సంఘాల చేత అనేక కమిటీలలో నియమితులయ్యారు. వాటిలో ముఖ్యమైనవి పేర్కొంటున్నాను.

1. ఏ.పి. లైబ్రరి యాక్టు రివ్యూ కమిటి సభ్యులు
2. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులు
3. ఆంధ్ర విశ్వవిద్యాలయ అకడమిక్ కౌన్సిల్ సభ్యులు
4. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు
5. తూర్పు గోదావరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటి సభ్యులు
6. తూర్పు గోదావరి జిల్లా పరిషత్ నామినేటెడ్ సభ్యులు
7. తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యులు
8. తూర్పు గోదావరి జల్లా అధికార భాషా సంఘం సభ్యులు.

**1.7 సాహితీ సంస్థలు:**

జ్ఞానానందకవి కవిత్వమే ఊపిరిగా, సాహిత్యమే జీవితంగా ఆరాధించారు. అచ్చమైన అక్షరమూర్తిగా, సాహిత్య విలువల్ని పునరుద్ధరించటానికి తమవంతు కృషి చేశారు. సాహిత్య సంస్థల్ని నెలకొల్పి, సాహితీ సేవ చేశారు. ఆయన నెలకొల్పిన సాహితీ సంస్థలు.

1.సాహితీ సమాఖ్య – 1967

2.సాహిత్య కళాపీఠం – 1972

3.జాషువాకవి సాహిత్య పీఠం – 1980

**1.8.సన్మానాలు:**

జ్ఞానానందకవి సాహిత్య సముద్రంలో మునిగిన ఆంధ్ర సాహితీ ప్రియులు. ఆ మహాకవికి ఎన్నో సన్మానాలు, సత్కారాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

1. 1947వ సంవత్సరం నవంబరు ఒకటో తేదిన కాకినాడలో జ్ఞానానంద కవికి 'కనకాభిషేక సత్కారం' జరిగింది. దానిని నిర్వహించినవారు శ్రీ బొజ్జా ధర్మరాజు . ఆ సభకు అధ్యక్షత వహించినవారు రాజ్యసభ సభ్యులు శ్రీ పైడా వెంకటనారాయణరావు.
2. విజయనగరం జ్ఞానానందకవిని తొలిసారిగా సన్మానించి, తన సాహిత్య ప్రేమ చాటుకుంది. 1947 డిసెంబరులో జ్ఞానానందకవి 'వసంతగానం' కావ్య ఆవిష్కరణ విజయనగరంలో జరిగింది. ఆ సందర్భంగా జ్ఞానానందకవిని ఘనంగా సన్మానించారు.
3. 1950లో 'గాంధీ' (అమరగీత) కావ్య ఆవిష్కరణోత్సవం విజయవాడలో జరిగింది. ఈ కావ్యం అయ్యదేవర కాళేశ్వరరావుకు అంకితం చేయబడింది. ఈ సభలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, నవయుగకవి చక్రవర్తి జాషువా, ప్రసిద్ధ సంఘ సంస్కర్త గోపరాజు రామచంద్రరావు (గోరా) పాల్గొని ఉపన్యసించారు. అంతటి దిగ్గంతుల సమక్షంలో జ్ఞానానందకవికి సన్మానం జరిగింది. అప్పటికి ఆయన వయస్సు 23 సంవత్సరాలు మాత్రమే.
4. జ్ఞానానంద కవి 1959లో రచించిన 'పర్జన్యం' కావ్యాన్ని నాటి ముఖ్యమంత్రి డా,, నీలం సంజీవరెడ్డికి అంకితం చేశారు హైదరాబాదులో ఈ కావ్య ఆవిష్కరణ సభ కన్నుల పండుగగా జరిగింది. ఆనాటి సభకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రనాయకుడు శ్రీ అల్లూరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జ్ఞానానందకవిని సభ ఎంతో వైభవంగా సత్కరించింది. అదే సంవత్సరం 'ప్రభంజనం' కృతి అంకితోత్సవ సభ మకుటాయ మానంగా జరిగింది. కృతిపతి నాటి విద్యామంత్రి పట్టాభిరామారావు . ఆ సభకు అధ్యక్షులు కవి సామ్రాట్, కవితా గురువు విశ్వనాథ సత్యనారాయణ. ఆయన చేతులమీదగా సన్మానాన్ని అందుకున్నారు.
5. 1982లో కాకినాడలో జ్ఞానానంద కవికి గండపెండేర సన్మానం జరిగింది. ఈ సన్మానం చేసినవారు ప్రముఖ వాణిజ్య వేత్త శ్రీరామదాసు మోటార్ ట్రాన్సుపోర్టు సంస్థ అధినేత శ్రీ కె.వి.ఆర్. చౌదరి. మున్సిపల్ ఛైర్మెన్ శ్రీ జ్యోతుల

సీతారామమూర్త జ్ఞానానందకవి కాలికి గండపెండేరం తొడిగారు. ఆ సభకు డా. సి.నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఆచార్య యస్.వి. జోగారావు, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు డా॥ వెంకటపతిరాజులు జ్ఞానానందకవి కవితా ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. జ్ఞానానందకవి కీర్తి కిరీటంలో కలికితురాయి ఈ సభ.

ఇంకా ఈ మహాకవికి అనేక ఊళ్ళలో సన్మానాలు జరిగాయి. 1993వ సంవత్సరానికి గాను జాతీయ కవిగా ఆంధ్రప్రదేశ్ తరుపున ఢిల్లీలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో పాల్గోన్నారు జ్ఞానానంద కవి. ఈయనకి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల వెయ్యి రూపాయల చొప్పున జీవిత భరణం ఇచ్చింది.

### 1.9 **బిరుదులు:-**

తెలుగు సాహిత్య జగత్తులో కవి సార్వభౌమునిగా లబ్ద ప్రతిష్ఠులైన జ్ఞానానందకవి అందుకున్న బిరుదులు అనేకం.

| **క్ర.సం** | **బిరుదు** | **స్థలం** | **సంవత్సరం** | **ఎవరి అధ్యక్షతలో** |
|---|---|---|---|---|
| 1 | కవితా విశారద | విజయనగరం | 1947 | కొత్తపల్లి వీరభద్రరావు |
| 2 | కవి కోకిల | విజయవాడ | 1950 | విశ్వనాథ సత్యనారాయణ |
| 3 | కవిలోక విభూషణ | కాకినాడ | 1961 | డా. ఇవటూరి జోగారావు |
| 4 | శారదా వల్లభ | కాకినాడ | 1961 | డా. ఇవటూరి జోగారావు |
| 5 | విద్వత్కవి చూడామణి | కాకినాడ | 1968 | అల్లంరాజు సత్యనారాయణరావు |
| 6 | సాహితీ వల్లభ | కాకినాడ | 1968 | సలాది పార్థసారథి |
| 7 | మహాకవి | కాకినాడ | 1974 | ఆచార్య తూమాటి దొణప్ప |
| 8 | అభినవ జాషువా | విజయవాడ | 1974 | విశ్వనాథ సత్యనారాయణ |
| 9 | సాహితీ కృషీవల | చిలకలపల్లి (బొబ్బిలి) | 1975 | ఆర్.పి.జి. రంగారావు |

| | | | | |
|---|---|---|---|---|
| 10 | కవి సార్వభౌమ | కాకినాడ | 1979 | కె.రామారావు(మున్సిఫ్ మెజిస్ట్రేట్) |
| 11 | కవితా శ్రీనాథ | రామచంద్రాపురం | 1982 | యం. సెబాస్టియన్ రాజు |
| 12 | పద్యవిద్యా ప్రభువు | హైదరాబాదు | 1982 | డా॥ సి.నారాయణ రెడ్డి |

## 1.10 అవార్డులు:

ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయాల ద్వారా జ్ఞానానందకవికి లభించిన అత్యున్నత, పురస్కారాలు, వాటి వివరాలు;

1. 1974లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జ్ఞానానందకవికి గౌరవ డాక్టరేటును, కళాప్రపూర్ణ బిరుదును ఇచ్చి సత్కరించింది.
2. 1975లో జ్ఞానానంద కవి రాసిన 'ఆమ్రపాలి' కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.
3. 1975లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఉత్తమ పండితోపాధ్యాయ బహుమతిని' బహుకరించి జ్ఞానానంద కవిని సత్కరించింది.
4. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం సృజనాత్మక సాహిత్యానికి ఇచ్చే బెజవాడ పట్టాభిరామిరెడ్డి పురస్కారంతో జ్ఞానానందకవిని సత్కరించింది.

## 1.11. ప్రముఖుల ప్రశంసలు:

ఆధునిక కవీశ్వరులలో నిస్సందేహముగా నీకు స్థానమున్నది నీకొక శైలికలదు. నీ పద్యలక్షణము నీదుగా నేర్పాటైపోయినది.

**కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ**

బహుకావ్య గ్రంథకర్తగా సమాసదుందుభులతో పద్యముల అల్లి రంజిల్ల చేయు పాఠకుడుగా ఉపాధ్యాయుడుగా తెలుగు దేశమున కీర్తి సంపాదించిన సుహృద్వర్యుడు జ్ఞానానందకవి. ఆంధ్ర కవితా ప్రపంచంలో శ్రీ జ్ఞానానందకవి నేడొక విశిష్ట స్థానమున్నది. **– డాక్టరు బెజవాడ గోపాల రెడ్డి**

శ్రీ జ్ఞానానందకవి కావ్యములలో నొకవంక జాతీయాభిమాన మును వేఱొక వంక రాష్ట్రీయాభిమానమును సర్వత్ర జాలువారించుచుండును, కవిగారి పద్యములందలి  ధార అవిచ్ఛన్నమై సెలయేటివలె జాలువారుచున్నది. అందమైన నడకలేని కుంటి పద్య మొక్కటియు నెచ్చటను గానరాదు. వీరి  సీస పద్యముల నడక న న్నెక్కువగా నాకర్షించినది.

– **డాక్టర్ దివాకర్ల వేంకటావధాని**

మీ రా సుందరులు సహృదయులు, మీ పల్కు గంభీరము మీ వ్రాత సొగసుగా వుండును, మీ కవిత్వం అందరికి ఆనందం, ఆశయాల ధోరణిలో స్వధర్మమును మానవ సేవ చేయుటలో చూచు కొనవలెనన్న జాషువాధోరణిలో నడుస్తున్నది.

– **ఆచార్య రంగా**

జ్ఞానానందకవి గురుభక్తి, దేశభక్తి, ప్రజాకల్యాణ ధ్యేయంగా కలిగి సందేశాత్మకమైన  ఖండకావ్యాలను రచించారు. శబ్దమాధుర్యము అర్థ గాంభీర్యము కలిగి ప్రజ్ఞాతో తెలుగు తల్లి  మున్నగు రచనలు వారి కావ్యరస స్ఫూర్తికి నిదర్శనాలు. వీరు సంప్రదాయసిద్ధమైన కవిత్వ రచన చేయుటయేకాక సంస్కరణాభిలాష, పతిత జనోద్ధరణ కాంక్షగల కవి.

– **ఖండవల్లి లక్ష్మీ రంజనము**

శ్రీ జ్ఞానానందకవి ఉత్తమమైన కవులు మతాతీతులు వారి కవితా వైభవం వాగ్దేవికి అముల్యాలంకారములు ఎన్నో గ్రంథాలు వ్రాసి తెలుగు దేశంలో ప్రతిష్టగాంచారు. నిర్మోహమోటంనకు నిష్కల్మష భావంనకు శ్రీ జ్ఞానానందకవి ప్రతీక.

– **గౌతమీ కోకిల వేదుల సత్యనారాయణ శాస్త్రీ**

***

# రెండో అధ్యాయం

# జ్ఞానానందకవి రచనలు – పరిచయం

## 2.1. తరంగమాల:

జ్ఞానానందకవి తొలికృతి తరంగమాల. దీనిని 1932–1944 మధ్య కాలంలో రచించారు. 1947లో మొదటి ముద్రణ, 1997లో ద్వితీయ ముద్రణ పొందింది. జ్ఞానానందకవి తన తొలి కృతిని మిత్రుడైన చాపల సమాంకులుకు అంకితం చేశారు.

*"ఇది నీకు నాకునుం గల*
*యెద నిండిన స్నేహమునకు నే నీ కృతి నిం*
*పొదవగ నీకు నొసగితి ను*
*పదగ సమూయేల మిత్రవల్లభ గొనుమీ"* (**పుట**.11)

తరంగమాల ఖండకావ్యం క్రైస్తవుల పరిశుద్ధ గ్రంథం అయిన బైబిల్ (Holy Bible) ఆధారంగా రచించబడింది. 'క్రీస్తు ప్రభువు' అనేది తొలి కవితా ఖండిక. ఇందులో క్రీస్తును స్తుతించడం ప్రధాన అంశం. తరంగమాలలో 'ఆదరణ' అతిచిన్న ఖండిక. భారతీయ సమాజంలో క్రైస్తవులకెప్పుడు చిన్నచూపే. ఎందరో మహనీయులు వెలసిన క్రైస్తవ జగత్తులో నీకేల భయం క్రైస్తవ మనిషి అని హెచ్చరించారు జ్ఞానానందకవి.

క్రీస్తు అవతరణ మహాత్మ్యాన్ని జ్ఞానానందకవి 'క్రీస్తుజయంతి' ఖండికలో మనోహరంగా వర్ణించారు. 'క్రీస్తుచరిత' ఖండికలో సిలువ ఘట్టం కరుణ రసాత్మకమైనది. సమాజ ఉద్ధరణకు సిలువనెక్కిన ఆమహనీయుని కీర్తించినదే 'సిల్వగానము' అనే ఖండిక. దేవసభ ఖండికలో మహోన్నత మానవీయ విలువలను బోధించాడు.

తరంగమాల ఖండికను రాసేనాటికి జ్ఞానానంద కవి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. బాలల ప్రార్థన అనే ఉత్తమ కవితా ఖండికను సరళ సుందరంగా వ్రాశారు.

*"దురిత వార్ధిని మునిగి నరులనెల్ల*
*దయను రక్షింప దొరకొన్న ధర్మశీల*
*మరియగర్భాన మెఱసిన చిఱుతకూన*
*బాలల ప్రార్ధన నాలకించు."*(**పుట**.17)

*"నీ తరంగ మాలలో నేనొక తరంగమునై తుది వరకు పయనించితిని ఆంధ్రుడను నేనన్నదానికి బదులు క్రైస్తవుడను నేనని తగ్గిన యుజ్జీలను పట్టితెచ్చి గోదాలో విప్పిన మీ వీర కవితావేశము మెచ్చదగినది. కవితా లోకములో మీకు గల గౌరవము క్రైస్తవలోకములో గూడ కల్గుచో మీ శ్రమ సార్ధకమగునని ముగింతును"* అని మహాకవి జాషువా గారు ఈ తరంగమాలకు ఆశీస్సులు అందించారు.

జ్ఞానానంద కవి భవిష్యత్ రచన అయిన 'క్రీస్తు ప్రబంధము' కు బలమైన పునాదులు ఈ తరంగ మాలలోనే కనిపిస్తాయి. ఇతివృత్తం క్రైస్తవ మత సంబంధం అయినా ఆయన పదప్రయోగం, శైలివిన్యాసం పూర్తిగా ప్రాచీనాంధ్రుల అనుసరణమే. పౌరాణిక మార్గమే. అందువల్ల ఆయన కావ్యాలు సర్వాంధ్రపాఠకులకు ఆదరణీయం అయ్యాయి.

2.2. **వసంతగానం:**

వసంతగానం ఖండకావ్యాన్ని జ్ఞానానంద కవిగారు 1947లో రచించారు. ఉదయగిరి సీతారామస్వామికి దీనిని అంకితం చేశారు. ఇది స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలో వెలువడిన కావ్యం. "వసంతగానంలో ఆనాటి సాంఘిక పరిస్థితులు ప్రతిబింబించబడ్డాయి. దీనిలో భరతమాత, తెలుగుతల్లి, తెనుగుకాగడ, ఆంధ్రవాణి, జయపతాక జైహింద్ మొదలైన ఖండికలు దేశభక్తిని ప్రబోధిస్తున్నాయి" అని డా॥ ఎస్. శరత్‌జ్యోత్స్నారాణిగారు 'జ్ఞానానందకవి జీవితం – వాఙ్మయసూచి' లో పేర్కొన్నారు.

2.3. **పాంచజన్యం:**

'పాంచజన్యం' 1956లో వెలువడిన ఖండకావ్య సంపుటి. దీనిలో ఇరవైయారు ఖండికలు ఉన్నాయి. తొలిఖండిక విశ్వభారతి. చివరిఖండిక

అంబేయారు. దీనిని నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు అంకితం చేశారు. దీనికి విశ్వనాథసత్యనారాయణ పీఠిక రాశారు.

పాంచజన్యం విష్ణువుయొక్క శంఖం. అది మహాశంఖం. ఈ సంపుటిలో జ్ఞానానందకవి అనేకమంది దేశ నాయకులను కీర్తించారు. ప్రాచీన భారతకథలో నాయకులైన కర్ణుడు, భీష్ముడు లాంటి పాత్రలను పాంచజన్యం కావ్యంలో చిత్రించారు. సుభాష్‌చంద్రబోస్, పటేల్, అంబేద్కర్, నెహ్రూ మొదలైన వారు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఏవిధంగా గొంతెత్తి నినదిం చారో కింది పద్యంలో కనిపిస్తుంది.

*"ఎగురుచున్నది జగామగరాల తొలిసంజ*
*కళలీను మూడు వన్నెల పతాక*
*పలుకుచున్నది మునిబ్రహ్మ మోహనదాసు*
*శాంత్యహింసల మహాశక్తివాణి*
*నడవచు చున్నది ప్రాక్తన న్యాయ నైపుణ్య*
*సత్కళాధర్మ యోషాలలామ*
*కులుకు చున్నది మొన్న తెలవారి బంధాలు*
*సడలించుకొన్న స్వేచ్ఛా పురంధ్రి*

*శుభకళాంకిత విజయవిస్ఫుట విశాల*
*నవ్య భారత దేశ విజ్ఞానకలన*
*పాడు కొనవోయి!   గొంతెత్తి నే డు లెస్స*
*క్షితి నభమ్ముల మ్రోగ భరతకుమార!"* **(పుట.1)**

జ్ఞానానందకవి భారతదేశం ఎవరికాలంలో ఏవిధంగా వికసించిందో చూసి "పాడుకొనవోయి నీజాతి భవ్యగీతి నిలుపుకొనవోయి జాతి నిర్నిద్రకీర్తి" అని ప్రజలకు ప్రబోధించారు. పద్దెనిమిది రోజుల కురుక్షేత్ర యుద్ధంలో సింహభాగం భీష్మునిదే. పదిరోజులు పాండవ సైన్యాన్ని కకావికలం చేశాడు. చివరిరోజు అర్జునుని రథంపై ఉన్న శిఖండిని చూసి అస్త్రసన్యాసం చేశాడు. దానిని జ్ఞానానందకవి ఇలా వర్ణించాడు.

*"పదియు నెనిమది రోజులు భండనమున*
*ధర్మజుడు శౌరి విజయములే తల్లడిల్లి*
*వెలికిజీవుండు నగు నపుంసకుని ముందు*
*వృద్ధ వీరుండు శరము సూధింప వేల"* (**పుట**.25)

కర్ణుని నిరుపమాన త్యాగనిరతిని, అసమాన దానగుణ సంపదని తనివితీర వర్ణించారు. అతని శౌర్యధైర్య పరాక్రమాలను బహుధా ప్రస్తుతించారు. దేవేంద్రుడు మారువేషంలో వచ్చి కర్ణుని కవచకుండలాలను యాచించగా కర్ణుడు మారుమాటాడక కుండలాలను తీసి ఇస్తాడు. ఆ సందర్భంలో కర్ణుని దాన గుణానికి దాసోహం తెలిపారు జ్ఞానానందకవి.

*"అవురా నీ యసమాన దాన బలవిద్యా సంపదం గాంచి ని*
*న్నవరోధింపగ మాఱు వేసమున నొకాధీశుడే వచ్చి నీ*
*దు విశేషంబగు కర్ణ వేష్టణములన్ దోరాన నిమ్మన్ననో*
*రవిజా తక్షణ మీయవిపుల ధర్మంబున్ బ్రదర్శించెడిన్."* (**పుట**.22)

భారతీయ దాస్య శృంఖలాలను ఛేదించటానికి నేతాజీ ఆంగ్లేయులపై విరుచుకుపడి, వారి కుటిల పాలనను అంతం చేయడానికి యుద్ధమార్గాన్ని చేపట్టిన సుబాసు బాబు (సుభాష్ చంద్రబోస్)ను కీర్తించాడు. నవభారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహిత గుణగణాలను, కార్య దీక్షాదక్షతలను 'అంబేదూర' ఖండికలో వర్ణించారు.

*"అలగినావు త్వదీయకుల వాంఛ ఫలియింప*
*పందు తాతయ గుండె బెండు వోవ*
*చదివినావు సమగ్ర శాస్త్రాలు సీమలో*
*నాంగ్ల భూమిపతులాడు గఱువ*
*చర్చించినావు దేశస్ఫీత సౌభాగ్య*
*ముసించి బహువిషయమ్ములెన్నొ*
*ఉస్సురన్నావు తమస్సులో మ్రగ్గుచు*

*బ్రతుకు పంచముల శుభమ్ము గోరి*

*కుటిల కుల పిశాచి పటుదర్పము /నణంచ*

*కట్టనావు వీర కంకణమ్ము*

*మనువువై శాన మనినావు, మంత్రివై*

*యిండియా జగమ్ము నేలినావు."* (**పుట**.81)

అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞను, ఆ మహనీయుని మహోన్నత వ్యక్తిత్వాన్ని ఒక సీస పద్యంలో జ్ఞానానందకవి ఇలా వర్ణించారు

'ప్రభు' అనే ఖండిక కవి స్వీయ వేదనను తెలిపే రచన. ఎద లోతులను కదిలించే సముదాత్త భావ సరణిలో ఈ ఖండిక సాగింది. అస్పృస్యజాతుల బ్రతుకు, దారిద్ర్యమైన తనజాతి గోడును, రచనాకాలం నాటి దళితుల జీవన స్థితిని చూపించారు.కింది పద్యంలో రాష్ట్ర విజయ దుందుభిని మోగించారు.

*"ఆరలేదింక భాషారాష్ట్ర విభజన*

*వ్యత్యాసభావ దావానలమ్ము*

*కలియలేదింక ముక్కలు చెక్కలైపోర్గు*

*నిలయానబడియున్న తెలుగునేల*

*తెలమ లేదింక గౌతమిపూతవాహినీ*

*లాస్యాన నణగారు సస్యలక్ష్మి*

*పూయలేదింక శ్రీ పొట్టిరాముని దివ్య*

*దాశయసిద్ధి దీక్షాసుమాలు*

*అలముకొనగ లేదు తెలుగన్న గుండెలో*

*భ్రాతృభానరసవిభాసభూతి*

*ధర్మచక్ర మెత్త దయసేయరావమ్మ*

*దివ్యకల్పవల్లి తెలుగుతల్లి."* (**పుట**.78)

## 2.4. ప్రభంజనం:

'ప్రభంజనం' ఖండకావ్యాన్ని జ్ఞానానందకవి 1959లో రచించారు. దీనిని ఆనాటి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు శ్రీ బులుసు పట్టాభిరామారావుకు అంకితం చేశారు. ఇందులో మొత్తం 26 ఖండికలు ఉన్నాయి. వ్యక్తిగత ప్రశంసా కవితలు అధికంగా ఉన్నాయి. క్రీస్తు పురాణ పురుషుడు. ఇక మిగిలిన వాటిలో రాజకీయవేత్తలు, కవి శ్రేష్ఠులు, ప్రవక్తలు ఉన్నారు. బెజవాడ గోపాలరెడ్డి, నీలంసంజీవరెడ్డి, పట్టాభి, బులుసు సాంబమూర్తి టంగుటూరి ప్రకాశం, జవహార్ లాల్ నెహ్రు వంటి రాజకీయ వేత్తలు, గురుబ్రహ్మ విశ్వనాధ, కందుకూరి వీరేశలింగము, జాషువా కవి సంబంధులు ఉన్నారు. దేశభక్తుల గుణాలను కీర్తించటం ద్వారా దేశభక్తిని ప్రజల్లో నాటుకొనేటట్లు చేయటం ఈ కావ్యరచన ప్రధాన ఉద్దేశం.

*"ఈ జగానేలలో నిబ్రహింకుతుబుషా*
*శారదాంబకు మేలిచీర గట్టె*
*ఈ పుణ్య భూమిలోనే యన్న గోపన్న*
*భద్రాద్రి శ్రీరామభజన జేసె*
*ఈ యోరుగలు త్రోవనే కళావేత్త్రి మా*
*చల్దేవి దివ్యలాస్య మ్మొనర్చె*
*ఈ కాకతీయరాజ్యేంది రాంగణములో*
*భక్త పోతన్న కావ్యమ్ము వ్రాసె*
*ఈ పసిండి నేలనే, బ్రహ్మనాయండు*
*బాలాచంద్రు తాండ్రపాపరావు*
*నీపదా బురు హపునీడలో మెలగిరి*
*దివ్యకల్పవల్లి ! తెలుగుతల్లి!"* (**పుట**.61)

భారతదేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ ఎలుగెత్తి స్వాతంత్ర్య శంఖారావాన్ని వినిపించగా నిష్కళంక దేశభక్తులు, త్యాగశీలురు ముందుకు వచ్చి దాస్యాన్ని విముక్తి

చేయటానికి పాటుపడ్డారు. అట్టి మహాత్ముల కీర్తనయే ప్రభంజనం. ఆ మహనీయుల పోరాటమే ప్రభంజనం.

*“సాహిత్యమ్మున రాజకీయమున వైశాద్యమ్ము ధీమత్తయున్*
*బాహటింపగ సవ్యసాచివలె విద్వచ్ఛాప్య జోడించి యు*
*త్సాహంబు న్నిఖిలాంధ్ర వాఙ్మయ సభాధ్యక్షుండవై వెల్లు నీ*
*సౌహార్దమ్మునకున్ నమస్సులగు భాషానాథ రెడ్డ్వఅదీ.”* (**పుట**.8)

పై పద్యంలో బెజవాడ గోపాలరెడ్డిగురించి పేర్కొన్నారు. కవిత్వం, రాజకీయ రంగం రెండింటి సవ్యసాచిత్వం పై పద్యంలో కనిపిస్తుంది. ‘చరిత్ర సృష్టిలో గణుతి వహించునామము ప్రకాశము నీయది ధన్యుడీవె పో’ అని జ్ఞానానందకవి టంగుటూరి ప్రకాశం పంతులు మరణాన్ని పురస్కరించుకొని వ్రాసిన కవితా ఖండిక ‘ప్రకాశము’ దానిని కింది పద్యంలో కీర్తించారు.

*“గద్దఱికాదు తెల్ల దొరగారి ఫిరంగి కెదిర్చి నిల్చి నీ*
*పెద్దతనమ్ము సూపిన పవిత్ర సదాశయ మెల్ల దేశమం*
*దద్దిర పాదుకొన్నది యగ్గలమై బుతమై తురంభమై*
*ప్రొద్దుదయించెరా తెలుగు బొట్టెడు సూపిన వేలిబాటలో”* (**పుట**. 15)

‘బ్రహ్మర్షి’ ఖండికలో రఘుపతి రత్నం నాయుడుగారి సంఘ సంస్కరణ కార్యక్రమాలను ఆర్ద్రచిత్తంతో వర్ణించారు.

*“ఈ యనాథుల గేము నేమి కాన్పించును*
*రఘుపతి ప్రేమార్ద్రవపు చూపు*
*ఈ బ్రహ్మమతమునం దేమి రూపించును*
*బ్రహర్షి భక్తి జీవనపు గుండె*
*ఈ పంచమజనంబు లేమి భాషింతురు*
*వేంకటరత్నమ్ము పెద్దమనస్సు*
*ఈ వితంతు లెల్లరేమి శ్లాఘింతురు*
*బాబయ్యగారి దైవత్వ గుణము*

*ఈ పిఠాపురానికీశుండు మనస్సులో*
*నేమి తలచు రఘుపతేంద్రు విశ్వ*
*సామరస్యమైన స్వాంతమ్ము బ్రహ్మ తే*
*జమ్ము మొగము నందు గ్రమ్ముకొనుటా"* (**పుట**.26)

'కార్మికా' ఖండికలో జ్ఞానానందకవి ప్రగతిశీల భావజలాన్ని, దోపిడి సమాజాన్ని, కార్మిక, కర్షకుల దుస్థితిని హృదయ విదారకంగా కళ్ళకు కట్టారు. ఇజాలతో సంబంధంలేని నిజాలను కవిగారు చెప్పారు. రైతే దేశానికి వెన్నెముక. వారు లేకపోతే దేశంలేదు. వాళ్ళు పడే బాధల్ని కరుణ రసాత్మకంగా వర్ణించిన కవి జ్ఞానానందుడు. వాళ్ళను ఓదారుస్తూ ఇలా అన్నాడు.

*"కూడు పూటకు లేక కుమిలికూలారు నీ*
*యొడిలోన గూర్చున్న కడుపు పంట*
*ముదుకుగుడ్డకునైన బుట్టలే దని డెంద*
*మందు శోకించు నీసుందరాంగి*
*భగవంతుడా యిది ప్రారబ్ధకర్మమా*
*యని పల్వరించు మెత్తనిమనమ్ము*
*గంజిబువ్వయునైన గడుపార లేదని*
*దురపిల్లి వెడలు బంధువులఘోష*

*నిను జితింప జేయు నినుపగజ్జెలతల్లి*
*చటుల కుటిల పాశజాలమందు*
*నొదుగ జేయ నీదు హృదయనీ రేజం బ*
*దెంత కందె నొక్కొ ? యెవరి కెఱుక." (**పుట**.38)*

*"వచ్చునొక నీ మంద భాగ్యమైన*
*దీన జీవిత చర్య గుర్తించు దినము*
*పొరుగు దమ్ములు నయనాల దెఱచినారు*
*లూఱడిల్లుము శ్రామిక సహోదరుండ."* (**పుట**.40)

2.5. **విజయాభిషేకము:**

ఈ ఖండకావ్యం 1966లో ముద్రించబడింది. దీనిని మంతెన సుబ్బరాజుకి అంకితం చేశారు. ఈ కావ్యానికి విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకట అవధాని అభిప్రాయాలు రాశారు.

గురువులపై అమిత భక్తి శ్రద్ధలు, ఆంధ్రదేశం మీద అమితమైన అభిమానం, మాతృదేశం పట్ల మహితానురాగం, దేశనాయకుల పట్ల భక్తి ప్రపత్తులు, మిత్రులపై గాఢమైన అనురాగం, అస్తవ్యస్థ సామాజిక పరిస్థితుల మీద ధర్మాగ్రహం ఈ కావ్యఖండికలో కనిపించే ప్రధానాంశాలు. కులమత వైషమ్యాలు, పీడనలు, తాడనలు, వేధింపులు, వేదనలు లేని మానవీయ విలువలతో కూడిన సర్వసమతా సమాజ కాంక్షయే ఈ కావ్యంలోని ప్రధాన ఇతివృత్తం. గ్రంథనామం ఉదాత్త విజయం సాధించిన వారికి చేసే అభిషేకం అని అర్థం. ఈ అభిషేకం పుష్పాలతో చేస్తారు. కవులు చేసేది అక్షర పుష్పాభిషేకం. సాధారణంగా ఎవరైనా ఇష్టదైవానికి అభిషేకం చేస్తారు. కాని మన కవిగారు దేశ నాయకులకూ, కవితల్లజులకూ, పండిత, గాయక, వైతాళికులకూ విజయాభిషేకం చేశారు.

*"తనగర్భామున జగజ్జనకు దుద్భవమందు*
*మరియాంబ హృదయమ్ము టుఱగలింప*
*పరలోకమందు ఖేచరబృందముల స్వాదు*
*గానాలు భువనాలు క్రమ్ముకొనగ*
*తనకోరికలు ధరాతలమునుఁ దన్పింప*
*దైవమ్ము సుతు నవతారమెత్త*
*"ఎషయ" "యిర్మియ" ప్రవక్తేంద్రులు వాకొన్న*

*పలుకు క్రొంబూవులై పరిఢవిల్ల*

*పాప తమ సాంధనిర్మగ్న తాపజనుల*

*యుల్లముల వెల్గురేకలుపల్లవింప*

*విశ్వమంతయు నీవయై వెలుగుతండ్రి*

*నీమహోదయ వేళ రానిమ్ము శుభము"* **(పుట.**20)

విశ్వనాథ వారి ప్రసిద్ధ కావ్యం 'ఆంధ్రప్రశస్తి' శీర్షికను స్వీకరించి జ్ఞానానందకవి ఒక ఖండికను రాశారు. అందులో అయిదు పద్యాలు రాశారు. ఐదు పద్యాలూ ఆణిముత్యాలే. అందులో ఒకటి

*"ఒకనాడు శాత్రవ నికర గర్భముఁజీల్చి*

*తీండ్రించె దెసలు మా తెనుఁగుకత్తి*

*ఒకనాడు దివ్యరాజ్య కవాటముల విప్పి*

*తేనెలొల్కించి మా తెనుఁగువాణి*

*ఒకనాడు పెర భూములకు సోయగముదిద్ది*

*ఘనతఁగాంచినది మాతెనుగులక్ష్మి*

*ఒకనాడు ప్రకట శౌర్య కథోజ్వలితఁజూటి*

*ప్రణతులందినది మా తెనుగు శక్తి*

*ఒక్కనాదుర్వి సత్కాళాభ్యుదయ మంద*

*నాణెమగు వేదమధుర భాండముల నించి*

*గొనబు దేశాలఁబంచిన తెనుగు తల్లి*

*కారతుల నీయ రండు రండాంధ్రులార."* **(పుట.** 3)

విజయవాడ ఆకాశవాణి కవి సమ్మేళనంలో అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞను, ఆ మహనీయుని మహోన్నత వ్యక్తిత్వాన్ని ఒక సీస పద్యంలో జ్ఞానానందకవి ఇలా వర్ణించారు. 'సంక్రాంతి లక్ష్మి' అనే ఖండికను పఠించారు. సంక్రాంతి అందరికి పెద్దపండుగ. ధాన్యరాశులు ఇళ్ళకు చేరతాయి. రైతుల ఆనందోత్సాహాలకు అంతుండదు. ఆడపడుచుల ముగ్గులు, గొబ్బిళ్ళ అలంకారాలు కనువిందు చేస్తాయి.

గంగిరెద్దులాటలు, కోలాటాలు, హరిదాసు కీర్తనలు మార్మోగుతాయి. జ్ఞానానందకవి నిశితలోక పరిశీలనతో సంక్రాంతి లక్ష్మిని మధుర సందేశంతో శ్రోతలకు అందించారు.

*"ముగ్గులు వెట్టు తెల్గుపువుబోణి ముఖాంబుజ పత్రమింతమై*
*నిగ్గులుదేర చిర్నగవు నించగకళ్లములందు ధాన్యపున్*
*జగ్గులో వింతసౌరభము నాల్గుచెఱంగుల కమ్మిరింపనే*
*దిగ్గతి పౌష్యలక్ష్మి వెలయించెను తెల్గులకుం బ్రమోదముల్"* (**పుట**. 14)

నిత్యమొక్క బొట్టైన బృహదాంధ్ర సరిజ్జలాలు మురిగిపోరాదు. ముమ్మాడు కాలములందు ప్రజలు హర్షించు గొప్ప పథకాలు ఒరిగిపోరాదు. లోకోత్తరులగు కవి దిగంతముల కీర్తి ధ్వజాలు అని జ్ఞానానందకవి చాటి చెప్పారు. "మానవ సంఘమందు పెంపూనునె శాంత్వ హింసల సమతుల్య సౌరభ సంపదల్" అని ఆశించారు. దుర్భరమగు దైన్య జీవనపు రాపిడిలో ఇరికించి మానవుని పరువు ప్రతిష్ట చెరిచి పీల్చి పిప్పి చేయు నీ ధర వరలం పిశాచి తలదన్నే నెదుర్కొనరా! సహోదర! అని ఆకాశాన్నంటే ధరలను ఈసడించారు. అంతకుమించి చక్కని సామాజిక సందేశం అందించారు.

*"కలుగునా ? త్యాగదీక్షామూర్తికిన్ నేడు*
*ఆదమర్చిన జీవితాశయమ్ము*
*వెలుగునా? బాపూజీనిలిపి పోయిన యట్టి*
*స్వేచ్ఛ సముజ్జ్వల దీపకళిక*
*చెలగునా? భారతక్షితి వెన్నెలలు కాయ*
*పొందు పొత్తుల మేల్మి చందమామ*
*మెలగునా? భారతీయుల మనస్సీమలన్*
*సమ్యక్ స్వభావాల శాంతి దేవి*

*గూడుకట్టుకొనునె? కొండంతయానంద*

*మతి దరిద్రజన హృదంతరముల*

*ప్రభావమగునె? సత్కళాలక్ష్మి వదనాన*

*నగువు మొలక దేశనాయకుండ!"* (**పుట**.84)

'విజయాభిషేకం' కావ్యం కవి మానవతా దృష్టికి అద్దం పట్టింది. ఈ ఖండిక వరుసగా కవులకు, కృషీవలురకు, శ్రామిక జీవులకు, దేశహిత వీరులకు, రసజ్ఞులకు, అసహాయులకు, అమాయకులకు, దరిద్రులకు విజయాభిషేకాలు కలగాలని, అమరవీరులకు పుష్పాభిషేకాలు కలగాలని వర్ణించారు. జ్ఞానానందకవి తాను బాగుండటమే కాక తన పొరుగువారు కూడా బాగుండాలనే సర్వ హితైక దృష్టితో రాసింది ఈ కావ్యం. అభ్యుదయ భావ భరితం ఈ ఖండిక. రచనలో జ్ఞానానందకవి ఎంత సంప్రదాయ ప్రియుడో భావాలలో అంతే ఆధునికుడు. అందుకు నిదర్శనం ఈ కావ్యం.

*"కూలియ నాలి చేసినను కూటికి గుడ్డకు వాచిపోయి రో*

*గాలకు నగ్గమై కటికిగాటపు జీవిత యంత్ర సల్పి ప్రా*

*ణాలఁజచేతఁబట్టి పెనునొరక బాధల లోన నుక్కినన్*

*శీలము పోని మా శ్రామిక జీవులకున్ విజయాభిషేకముల్"* (**పుట**.85)

## 2.6. అక్షరాభిషేకం:

'అక్షరాభిషేకం' ఖండకావ్యం 1971లో ముద్రించబడింది. దీనిని ఆనాటి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరక్టర్ బొక్కు ప్రతాపరెడ్డి కి అంకితం చేశారు.

తెలుగు తనము, జాతీయత జ్ఞానానందకవికి ఇష్టమైన వస్తువులు స్వేచ్ఛాకాంక్ష, ఆశాసందేశం, గాంధీజీ, ప్రభు మొదలైనవి ఈ కావ్యంలోని ఖండికలు. అవి సంఘంలోని దురాచారాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా కవిలోని ఆవేదనను వ్యక్తపరుస్తున్నాయి. దేశభక్తిని ప్రబోధించి స్వార్థాన్ని నశింపజేసే శక్తి ప్రజల్లో కలగాలనే కాంక్షతో ఈ రచన చేశారు. ఈ కావ్యానికి విశ్వనాథ సత్యనారాయణ పీఠిక రాశారు.

డా. సి. నారాయణరెడ్డి, దాశరథి, అకాడమి కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు అభినందనలు అందించారు.

భారతీయులకు బాధలన్నీ తొలిగి స్వేచ్ఛగా ఉండాలనే కాంక్షను వ్యక్తం చేశారు. అరాచకాలు, అన్యాయాలు నికృష్ట సమస్యలు అలముకొని మానవజీవితాలలో సుఖశాంతులు కరువైనవనీ వాటిని నశింపజేయమనీ ప్రభువుని కోరారు. వర్ణభేదం అనే వ్యాధి దేశ సంపూర్ణ  స్వేచ్ఛకు అడ్డమై నిలిచింది. రాజకీయాలలో శకుని, సైంధవులు బయలుదేరారు. కాబట్టి స్వర్ణస్వప్నాలు ఎలా నెరవేరుతాయి అని జ్ఞానానంద కవి ఆవేదన చెందుతారు. ఆంధ్రదేశ వైభవం ఎంతో మహత్తరమైంది అని వర్ణిస్తూ దానితోపాటు నేటి దుస్థితిని కూడా వ్యక్తం చేస్తూ నిట్టూర్పు విడుస్తాడు.

*"ఆచార్య నాగార్జునా హ్వయుండిచ్చోటఁ*
*జిలికె నాశ్శీస్సుధా శీకరమ్ము*
*పోతనామమాత్యుండు బోధించె నిచ్చోటఁ*
*బరమ భాగవతంపు భక్తిగాథ*
*తాంధ్రపాపయ బహుదర్పితుం డిచ్చోట*
*మెఱపించెఁ గ్రోవ్వాడి కఱకుకత్తి*
*ఖ్యాత డొక్కావంశ్య సీతమ్మ యిచ్చోట*
*నిఱు పెదలకు క్షుధాతురత మాన్పె*
*"బులుసు" "టంగుటూరి" కులమణులిచ్చోట*
*సీమ రాచరికముఁజిత్తుజేయ*
*సాహసించుచరిత చల్లారెనే తెల్గు*
*నిగ్గు దెలుప నేఁడు సిగ్గుఁజేటు"*  **(పుట**.17)

అక్షరాభిషేకంలో 'అమ్మ' ఖండిక ఉదాత్తమైనది. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నది రామాయణ సూక్తి. స్వర్గసుఖాల్ని మించింది తల్లిప్రేమ. చిన్ననాడే తల్లిని కోల్పోయిన జ్ఞానానందకవి సవతి తల్లి లాలనలో పెరిగారు. అద్భుతకవితావేశంతో తల్లి ప్రేమను అతి సుందరంగా వర్ణించారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ నియంత్రణ పథకాన్ని ప్రోత్సహిస్తూ 'పరమేశ్వరా' అనే ఖండికను రాశారు. దుష్ట స్వభావములతో భ్రష్టుపట్టిన సంఘ జీవితాలను దుయ్యబట్టారు. క్రైస్తవులమని చెప్పుకుంటూ చేసే చెడ్డపనులను నిర్మొహమాటంగా వెల్లడించారు. ఇది కేవలం క్రైస్తవానికే పరిమితం కాదు. హిందువులలోను ఇలాంటి వారెందరో నైతికవిలువలు కోల్పోతున్నారు. సున్నితమనస్కులైన కవిగారి రోదన ఇంకా ఇలా ఉంది.

*"పదియవభాగ మిమ్మనుచుఁబంతము తోడ వచించి ధాత్రిలో*

*విదితము గా నెవండిదియ వేడుకమీఱఁగ జేయునో యతం*

*డెదుగునటంచుఁ బల్కితివి యేమిది యిట్టుల సాగుచున్నదే*

*హృదయముఁగల్గుబత్తునకిఁకేది రవంతతలమ్ము సంఘమున్"* (**పుట**.41)

విశ్వనాథ సత్యనారాయణ జ్ఞానానందాన్ని ఈ కావ్య పీఠికలో కీర్తిస్తూ "ఇతడు నిస్సందేహముగా మంచికవి. తెలుగు పద్యము రాయుట లో ఇతనికి కొన్ని మంచి వొడుపులు తెలియును. ఇతని పద్యము ప్రసిద్ధులైన చాలా మంది పద్యము కంటే బాగుగా నుండును. ఇతని ఈ పుస్తకం నుండి ఇతని కవితాశక్తికి చాలా ఉదాహరణములు చూపించగల్గుదును. కొన్ని పద్యములలో పద్యమును పూర్తి చేయునపుడు కొన్ని మంచి సంబోధనలు, కొన్ని సమాసములు చేర్చును. అది పద్యమునకు ఒక శోభ తెచ్చెడి లక్షణము" అని పేర్కొన్నాడు.

*"దుర్గా దేహభాగేశ్వరా!*

*కొనుమ యేటికోళ్ళు!*

*మనుష్యుల ధార్మికస్థితిన్!*

*కంచే చేనును మేసినట్లుగాన! మొదలైనవి"* (**పీఠిక.పుట**.III,IV)

## 2.7. అక్షరాక్షతలు:

'అక్షరాక్షతలు' అనే ఖండకావ్యం 1973లో ముద్రితమైంది. దీనిని S.R.M.T. సంస్థ నిర్వాహకులు కె.వి.ఆర్. చౌదరి కి అంకితం చేయబడింది. దీనిలో పద్దెనిమిది ఖండికలు ఉన్నాయి. ఇందులో 'దీక్షాగానం' అనేది మొదటి ఖండిక 'తెలుగుతల్లి' చివరి

ఖండిక. 'దీక్షాగానం' ఖండికలో దేశ సంరక్షణకోసం భారతీయులంతా దీక్షాబద్ధులై ఉండాలని కవి ప్రబోధించారు. భారతదేశ సంపదని విని అమెరికా సిగ్గుపడేదాకా, కరుడుగట్టిన ఆశాపరులు చైనీయుల సామ్రాజ్యవాదం సమసిపోయేదాకా భారతీయులు నిద్రపోరాదని కింది పద్యంలో సందేశమిచ్చారు.

*"ధ్వజమెత్తి ఘన సోషలిజము బాటను బోవు*
*ఇందిరమ్మ జయమ్ము పొందు వఱకు*
*చరఖామునీంద్రుని శాంత్య హింసాజ్యోతి*
*అష్టదిక్కుల యందు నలరు వఱకు*
*భువన భాండము మెప్పు బొందు జహ్వారులాలు*
*పంచశీల వ్రతమ్ము మించు వఱకు*
*పొట్టి బహ్దూరు శాస్త్రి కట్టినట్టి సమైక్య*
*భావమ్ము దేశాన ప్రబలు వరకు*

*విశ్వతో ముఖాన వృద్ధిగాంచిన దేశ*
*బహుళ పథక రాశి వఱలు వఱకు*
*లక్ష్య సిద్ధిలోన లవలేశమైనను*
*పట్టువిడువరాదు భారతవీర."* **(పుట**.13)

*"విప్లవాత్మ తోడ విశ్వమ్ము కదలాడ*
*హుంకరించి నవనవోజ్వలంపు*
*నవ సమాజ మవని యవతరింపగ లెనిన్*
*నీదు జీవితమ్ము నిలిపినావు!"* **(పుట**. 21)

పై పద్యంలో శ్రమ జీవులైన కార్మికుల దాస్య శృంఖలాలు తొలగాలని లెనిన్ ఆశించాడని, విశ్వానికే మార్గదర్శకుడుగా వెలుగొందాడని 'లెనిన్' అనే ఖండికలో

పేర్కొన్నారు. అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞను, ఆ మహనీయుని మహోన్నత వ్యక్తిత్వాన్ని ఒక సీస పద్యంలో జ్ఞానానందకవి కీర్తించారు. ఒక కవికి మంత్రి నుండి ఒక ఆహ్వానం వచ్చింది. దాని సారాంశం తనకు జరిగే సన్మాన సభలో పద్యాలు చదవడం. కాని, ఆ మంత్రి ప్రయాణపు ఖర్చులు పంపలేదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కవి భార్య దుద్దులు తాకట్టుపెట్టి సభకు వెళ్ళాడు. సభ అంగరంగ వైభోగంగా జరిగింది. కవులు సరస్వతీ పుత్రులే కాని లక్ష్మీ సంపన్నులు కారు అని 'దుద్దులు' ఖండికలో తెలిపారు.

వేమన హేతువాదదృష్టి, సంఘసంస్కరణ దృష్టి కవిగారిని బాగా ఆకర్షించాయి. రాళ్ళను దేవుళ్ళు చేసే వాళ్ళపైనా, పాముకు పాలు పోసి, మేము మహాత్ములం అని చెప్పుకునే పాషాండుల పైన వేమన ధ్వజమెత్తారు. లౌకిక సత్యాలను అందమైన ఆటవెలదులలో పొదిగిన ప్రజాకవి. సాంఘిక పరిస్థితులను విశ్లేషణాత్మకంగా వర్ణించిన ఖండిక వేమన. కవి సామాజిక నిబద్ధతకు నిదర్శనం ఈ ఖండిక. రాజులు పోయారు, రాచరికం పోయింది. ప్రజాస్వామ్యం వచ్చింది. పుట్టగొడుగుల్లా రాజకీయ పక్షాలు పుట్టుకొచ్చాయి. రాజకీయ ఎత్తుగడలు ముదిరాయి. కలవాళ్ళు మరింత ధనం కూడబెట్టుకుంటున్నారు. పేదల దుఃఖాలకు సానుభూతి చూపేవాళ్ళు లేరు. ఈ స్థితిలో భారతజాతిని ప్రగతి పథంలో పయనింప చేసేవాళ్ళు రావాలనీ, చౌకబారు సాహిత్యాన్ని అరికట్టాలని, భూకామందుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రబోధించారు. జీవనాధారం లేనివారికి అండగా నిలిచి దారిద్ర్యాంధకారం నుంచి మరలించి ఆనంద కిరణాలను నిలుపుమని కవి 'పరిధావి'ని ప్రార్థించారు.

*"అన్నం బింతయు లేక దుర్దశల పాలై జీవనాధారమ్*
*శూన్యంబై విలవించు మానవులకున్ చుక్కానిగా నుండి యీ*
*దైన్యోదగ్ర గంభీర వార్థిన నదెటుల దాటించి యానంద చై*
*తన్యజ్యోత్స్నల నింపెదోకద పరీధావి ప్రతిష్ఠచ్ఛవీ"* (**పుట**. 39)

ఇంకా ఈ సంపుటిలో ఆంధ్రవిశ్వవిద్యాలయం మాజీ కులపతి బుల్లయ్యని, కార్యనిర్వహణ అధికారి మాలకొండయ్యని సంఘసేవకుడైన గోరాని మూడు ఖండికలలో కీర్తించారు.

## 2.8. అక్షర గుచ్ఛము:

ఈ ఖండ కావ్య సంపుటి 1975 అక్టోబరులో ముద్రించబడింది. దీనిని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రధాన రథసారధి, తెలంగాణ సంస్కృతి మహోద్యమాల రథసారధి అయిన శ్రీ దేవులపల్లి రామానుజరావుకు అంకితం చేశారు. కావ్య నామం 'అక్షర గుచ్ఛము' గుచ్ఛము అంటే సమూహం(పూల సమూహం) క్షరము అంటే నాశనము కానిది అని ఒక వ్యుత్పత్తి. వర్ణం, మాతృక, వ్రాయి అనేవి పర్యాయపదాలు అక్షరాలు అనే గుత్తి అని అర్థం. పూలు, పూలమాలను సమర్పించడం భారతీయ సంప్రదాయం. పూగుత్తి నివ్వటం పాశ్చాత్య సంప్రదాయం. ఈ రోజుల్లో సభలు, సమావేశాలలో పెద్దలకు, నాయకులకు విశిష్ట వ్యక్తులకు పూగుత్తి ఇవ్వటం సంప్రదాయంగా మారింది. ఈ సంపుటిలో జవాను (సైనికుడు) ప్రియదర్శిని (ఇందిరాగాంధీ), రంగయ్యప్పారావు, గురజాడ, అంబేద్కరు, మాలకొండయ్య, జటావల్లభుల పురుషోత్తం మొదలయిన విశిష్ట, విలక్షణ వ్యక్తుల మీద ఖండికలు ఉన్నాయి. భరత భూమికి వన్నె చేకూర్చిన వారు, తెలుగు సీమకు వెలుగు చేకూర్చిన వారు అక్షర గుచ్ఛంలో కావ్య వస్తువులు. మహావీరుని ఉపశ్లాఘతో ఉద్యమించి, బుద్ధ భగవానుని శుభ ప్రశంసతో ముగుస్తుంది. జైనమత ప్రవక్తుడైన మహావీరుని మహోత్తర సందేశాన్ని వినిపించిన ఖండిక 'మహావీరుడు'. క్రీ.పూ.6వ శతాబ్దంలో సమాజం బ్రాహ్మణాధిక్యతతో, కర్మకాండలతో, యజ్ఞయాగాదులతో అతలాకుతలం అయిపోయింది. అలాంటి పరిస్థితులలో వైదిక మతానికి వ్యతిరేకంగా జైన, బౌద్ధమతాలు ఆవిర్భవించాయి. జైనమత స్థాపకుడు మహావీరుడి బోధనలు కావ్యరచనా కాలానికే కాక నేటి సమాజానికి కూడా అనువర్తించేవే.

*"ఓయి వర్ధమాన నీయవతారమ్ము*
*విశ్వ భువనమునకు వేగుచుక్క*
*ఓయి జనమహాత్మ నీ యుపదేశమ్ము*
*సర్వ లోకమునకు శాంతి లేఖ"* **(పుట.** 9)

'ప్రియదర్శిని' ఖండిక 1972లో రచించబడింది. అప్పుడు భారతప్రధాని ఇందిరాగాంధీ. ఆమె రాజనీతి చాతుర్యం, ప్రజాసంక్షేమ కార్యక్రమ విన్యాసం ఈ ఖండికలో పేర్కొనబడ్డాయి.

*"ఎత్తించినావు దిగ్భిత్తులు కొనియాడు*
*స్వచ్ఛ భారత్ ప్రతిష్ఠాధ్వజమ్ము*
*ఖండించినావు మూర్ఖ భ్రష్ట దుష్ట శా*
*త్రువుని మహోగ్రకరాళదంష్ట్ర*
*నిందించినావు పందెము వేసి 'నిక్సను'*
*కుటిలవైవిధ్యంపు గుట్టు నెఱిగి*
*చెండించినావు ప్రోద్దండులౌ మండూక*
*భక్షణుల్ సాగించు వాదపటిమ*
*సామ్యవాద సిద్ధాంత శాస్త్రమును జదివి*
*దీనదశలోన మ్రగ్గెడు దేశములను*
*పిలిచి భిక్షమ్ము పెట్టిన యలఘురాల*
*ఇందిరా ప్రియదర్శినీ! వందనములు."* (పుట. 17)

జ్ఞానానందకవి 'గురజాడ' అనే ఖండికలో నవయుగ వైతాళికుడు, ఆధునికాంధ్ర యుగకర్త, ముత్యాలసరం సృష్టికర్త, సంఘసంస్కరణను కవితా రంగంతో రెపరెపలాడించిన గురజాడను జ్ఞానానందకవి ఐదు పద్యాలలో వర్ణించారు. గురజాడ అపూర్వ సృష్టి కన్యాశుల్కం నాటకం. ప్రపంచ ప్రసిద్ధ నాటకాల సరసన తెలుగువారి వారసత్వంగా, సగర్వంగా నిలబడగల మహోన్నత నాటకం కన్యాశుల్కం. దీని ప్రథమ ప్రదర్శన 1892 ఆగష్టులో, ప్రథమ ముద్రణ 1897లో జరిగింది. కందుకూరి తన 'రాజశేఖర చరిత్ర' నవలలో ఎలా ఆనాటి సామాజిక దురాచారాలను, అంధవిశ్వాసాలను ఎత్తి చూపి ఖండించాడో, గురజాడ కూడా కన్యాశుల్కంలో ఆనాటి సామాజిక సమస్యలన్నింటిని కళ్ళకు కట్టినట్లు చూపించాడు. కన్యాశుల్కం కేంద్ర బిందువుగా నడిచిన నాటకం ఇది.

*"కన్యాశుల్క మదొక్క యుల్కమయి సంఘద్రోహులన్ వ్రేల్చగా*
*మన్యూద్దండ సముజ్జ్వలుండవయి ధర్మంబున్ బ్రబోధింపగా*
*నన్యంబింతయు లేక వ్రాసిన భవద్వ్యాసంగముల్ దేశమం*
*దన్యాయమ్ము నెదిర్చె నౌర గురజాడా యెంత ధన్యుండవో"* (**పుట**. 29)

భారతావనిలో సాహిత్యరంగంలో అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠ్ బహుమతి. అది అందుకున్న తొలితెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ. ఈయన రామాయణ కల్పవృక్ష అవతారికలో 'తాను మనస్సన్యాసి' అని చెప్పుకొన్నారు. దాన్ని ప్రస్తావించారు జ్ఞానానందకవి. విశ్వనాథ కవిత్వం చదువుతుంటే ఏ ప్రాచీన దేవతా విగ్రహమో నడిచి వచ్చి మనముందు నిలిచినట్లు ఉంటుంది. అంతటి ఆర్ష భావ భాస్వంతుడు ఆయన. ఆధునిక కవితా దృక్పథానికి కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్ళి కావ్యాలు, ఆయన వ్రాసిన నవలలు, అలాగే కథానికలు సాక్ష్యాలు. దాన్ని దృష్టిలో పెట్టుకొని జ్ఞానానందకవి కింది పద్యాన్ని చెప్పారు.

*"ప్రాచీనాధునిక ప్రశస్త కవితాపాథోధిలో మున్గి ప్రే*
*రేచన్ నిస్తుల వాక్య రత్న ఘటనారింఛోళి సాధించి వి*
*ద్యా చైతన్యము నార్ష భూములకు నొయ్యన్నేర్చు ధీ వాఙ్మయ*
*ప్రాచుర్యమ్ములు శ్లాఘనీయములు గావా విశ్వనాథాగ్రణీ"* (**పుట**. 36)

'క్షమాదేవి-భారతి' అనే ఖండికలో అన్ని దేశాల వారు సహనం గల భారతమాతను మెచ్చుకుంటున్నారు. కాని దేశంలో దుర్మార్గులు, దోపిడీలు సమసిపోలేదు. సత్ప్రతిభ కలిగి బాధలు పడే కవీంద్రులకు పట్టాభిషేకాలు జరగటం లేదు. అయితే 'కాకా' పట్టే వారికి అన్ని సమకూరుతున్నాయి. ఇవన్నీ భరిస్తుంది క్షమాదేవి-భారతి అని జ్ఞానానందకవి ఆవేదన. కుల వ్యామోహం ఉండరాదని తుచ్ఛమైన భోగాలకు అలవాటుపడిన మూర్ఖులు కూడా ఈ దేశంలో నివసించకూడదని ఆ రెండు జరిగినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని జ్ఞానానందకవి పేర్కొన్నారు. 'మహేంద్రజనని' అనే ఖండికలో అన వేమారెడ్డి, శ్రీకృష్ణదేవరాయలు, రఘునాథుడు తెలుగు భాషకు చేసిన సేవను తెలిపారు. ఆంధ్రులు

ధైర్యశౌర్యాలందు గొప్పవారు. ఎందరో వీరులకు జన్మ నిచ్చిన ఆంధ్రజనని పుణ్యాత్మురాలు అని జ్ఞానానందకవి చెప్పారు. ఈ విధంగా వస్తు వైవిధ్యానికి పెన్నిధి 'అక్షర గుచ్ఛం. కావ్యం శాస్త్ర మర్యాదలు, సంప్రదాయ మర్మాలు, చారిత్రక ధర్మాలు సమన్వయించుకొని ఆధునిక భావ భరితోజ్వలంగా మలచిన ఖండికల సంపుటి ఈ అక్షర గుచ్ఛము.'

## 2.9. వెలుగు బాట:

ఈ కావ్యం 1976వ సంవత్సరంలో ముద్రితమైంది. ఇది నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు అంకితం చేయబడింది. ఈ రచన ఉద్దేశాన్ని ప్రస్తావనలో ఇలా వివరించారు. "బొబ్బిలి ప్రాంతమునకు చెందిన చిలుకలపల్లి అను గ్రామమున 28.09.1975 తేదీన బొబ్బిలి కుమార రాజు, శాసనమండలి సభ్యులు శ్రీ ఆర్.వి.జి.కె. రంగారావు అధ్యక్షతన పంచాయితీ భవన్ ప్రవేశ మహోత్సవము బాగా జరిగినది. ఏతత్సభా కార్యక్రమ ప్రారంభకులుగా పంచాయితీ రాజ్య శాఖామాత్యులు గౌరవనీయ శ్రీ లాకలాపు లక్ష్మణదాసు గారు విచ్చేసిరి. ఆ సందర్భమును పురస్కరించుకొని తన గ్రామ పంచాయితీ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి కొండలరావు గారు నాకు ఘన సన్మానము గావించినారు. ఆనాటి సన్మాన సందర్భంగా మంత్రి లక్ష్మణదాసు గారు, ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవచించిన యిరువదంశాల సూత్రాలు కవితగా రూపొందించిన చాలా బాగుండుననియు రచన కుపక్రమించవలసినదనియు వారు సభా ముఖాన నన్ను కోరినారు. వారి కోరిక మేర ఇరువది సూత్రాలు కవితారూపంలో నేనే 'వెలుగుబాట' వెలువరించ గలిగినందుల కంతేని సంతసింతును" కావ్య రచనా ప్రేరణనే కాదు కావ్య వస్తువునీ తమ మాటల్లో వెల్లడించారు జ్ఞానానందకవి. పూర్వం శత్రుసంహారం చేయడానికి రణరంగంలోకి ఉరికిన వీర నారీమణుల పరాక్రమం, జన్మభూమి పరిరక్షణకై సాహసించిన రాజసముదాయాల గొప్ప గుండె నిబ్బరం, వెసులుబాటు లేని కార్యసాధనలోని తిరుగులేని తీక్షణ దృష్టి, వెనుదీయని ఆత్మ విశ్వాసబలం ఒక్కచోట పేరుకొనిపోయి భారతదేశ మహాసామ్రాజ్య భావి దిశకు నిన్ను నడుపుతుంది. భారతేందిరా నీకు

జోహారు" అని ఇందిరాగాంధీ గుణ వైభవాన్ని జ్ఞానానందకవి ఈ విధంగా అభివర్ణించారు.

*"అరిరాజకులనాశమై నాజి దుమికిన*
*వీరాంగనల శౌర్య విక్రమమ్ము*
*జన్మభూమ్యర్థమై సాహసించిన రాజ*
*నివహమ్ము పెనుగుండె నిబ్బరమ్ము*
*సడలని కార్య దీక్షా సాధనమ్ములో*
*తిరుగింత లేనట్టి తీక్షణ దృష్టి*
*ఎదురెంతవాడైన నింతేని జంకని*
*జయలేని యాత్మ విశ్వాసబలము*

*కుదురుకొనుచును నీలోన గుండునట్టి*
*భరత ప్రాజ్య సామ్రాజ్య భావిదిశకు*
*నడుపుచున్నది దిగ్దింగంతాలు మ్రొక్క*
*ఇందిరా! భారతేందిరా హే జయాస్తూ"*(పుట.15)

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం. త్యాగధనుల పుణ్యతనువుల చేత ప్రజాస్వామ్యం దక్కిందన్నారు. బ్రిటిష్ పాలనలో భారతీయుల స్వేచ్ఛకు సంకెళ్ళు పడ్డాయి. నేడు అవి తెగి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారు అని 'ప్రజాస్వామ్యం' అనే ఖండికలో పేర్కొన్నారు. ధనికుడు తన ధనాన్ని మరింత పెంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. కాని బీద సాధువులకు ఏ మాత్రం సాయం చేయరు. ఆర్థిక సమానత్వం కోసం పాటుపడరు. ఆర్థిక సమానత్వం కోసం బాపూజీ, నెహ్రూ, శాస్త్రీ, ఇందిరాగాంధీ వంటివారు ఎంతో కృషి చేశారంటూ జ్ఞానానందకవి ధనిక వర్గానికి ఇలా సందేశం ఇచ్చారు.

*"నీ డాబుల్ సరికట్టి పేదలకు తిండిన్ గూర్చి దేశానకున్*
*కూడుంగుడ్డలు భోగభాగ్యములు చేకూర్పం బ్రయత్నించియీ*
*మాడల్ బొక్కసమందు కూర్పక యెదో మర్యాద పాటించి యీ*
*నాడీ యార్థిక విప్లవ భావమునకు నన్నా చేతులందింపుమా"* **(పుట.** 27)

'భూసంస్కరణ' ఖండికలో భూపరిమితి చట్టం వల్ల కలిగిన మేలును పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల "అగ్గిలోన బడిన గుగ్గిలం బయ్యెను, భూమి కలవాడు పొగిలినాడు" అన్నారు. ప్రభుత్వం విధించిన పరిమితి కంటే ఎక్కువ భూమి ఉన్నవారి దగ్గర నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచింది. ఇరవై సూత్రాల పథకంలో ఇది ప్రధానమైనది. గిరిజనాభ్యుదయం ఇరవై సూత్రాల పథకంలో ఒకటి. గిరిజనులు చిరకాలం నుంచి మొన్నమొన్నటి దాకా కొండకోనల్లో జీవిస్తూ తినటానికి సరైన తిండి, కట్టుకోవడానికి సరైన బట్టలు లేక, చదువు సంధ్యలకు దూరం అయ్యారు. వీరందరు ఇందిరమ్మ చలవ వల్ల నేడు నాగరికులవుతున్నారని కవిగారు తెలిపారు. ఒకనాడు ఈటె చేతబట్టి వేటకొరకు తిరిగిన గిరిజనుడు, నేడు నాగరికత నిలయాన తిరుగుతూ చదువుకుంటున్నాడు. హరిజన గిరిజనుల వంటి దీనజనావళి కోసం ఇందిరాగాంధీ చేసిన మేలు వారి జీవితాలలో ఆనందరేఖలు విరిసేటట్లు వసతులు, విద్య, ఉద్యోగ సదుపాయాలు కల్పించారు. వీటి ప్రతిఫలాన్ని ప్రభుత్వం అనుసరించి చేసిన పథకాలు నిరూపించాయి. ఇందిరాగాంధీ ఆశయాలు నెరవేరాలని జ్ఞానానందకవి ఇలా ఆశాభావాన్ని తెలిపారు.

*"ఇంకి పోని యామె సంకల్పభావాలు*
*తొందరగనే సిద్ధినొందుగాక*
*జంకులేని యామె సాహసకృత్యాలు*
*జగతి మార్గ దర్శమగును గాక"* **(పుట.** 43)

## 2.10. అక్షరపూజ:

అక్షరపూజ కావ్యం 1979లో ముద్రితమైంది. ఆంధ్రవిశ్వకళా పరిషత్తు పూర్వకులపతి రాజా మేకా రంగయ్యప్పారావు బహదూర్ కు ఈ గ్రంథం అంకితం

చేశారు. కవికుల గురువుతో ఈ కావ్యం మొదలవుతుంది. ఒక్కో ఖండికను ఒక్కో పూజా కుసుమంగా మలచి కవి చదువులమ్మకు చేసిన పూజ ఇది. కాళిదాస ప్రశస్తి, రాజ రామ మోహన్ రాయలు, గ్రంథాలయము, రిపబ్లిక్, స్వరాజ్యలక్ష్మి, ఆశాభావము, తెలుగుతల్లి, సమతాగానం లాంటి ప్రాచీన, ఆధునిక భావ విలసితాలైన ఖండికలు దీనిలో ఉన్నాయి. కాళిదాసు ఖండికలో కాళిదాసు కవితా వైశిష్ట్యాన్ని ప్రశంసించారు. రమణీయ కావ్యరచన చేసి భారతీయ కవి ప్రపంచంలో కవి కుల గురువు స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడని కవి వర్ణించాడు. కాళిదాసు గొప్పతనాన్ని కిందిపద్యంలో రమ్యంగా చాటిచెప్పారు.

*“నిలిపెనా నీ జిహ్వకళికపై మధురమౌ*
*కమనీయ వాక్యాలు కాళికాంబ*
*పిలిచెనా నిను సభాస్థితికి గౌరవముతో*
*ముదమార నల మహాభోజరాజు*
*కొలిచెనా నీ సుధోక్తులు మెచ్చి సత్కళా*
*పాథోధియగు మల్లినాథ సూరి*
*మలచెనా నిను మహోజ్జ్వల దివ్య మూర్తిగా*
*నిను నమ్ము కొన్నట్టి యనుగు పడతి*
*ఈ వునల్లినట్టి యీ మహోన్నత కావ్య*
*నాటకాల బీజపాటవమ్ము*
*సందడించినది దిశాభిత్తివలయాన*
*క్రమ్మి! కాళిదాసు! కవి విభాసు”* **(పుట.** 2)

‘తెలుగు తల్లి’ ఖండికలో తెలుగు గడ్డమీద జన్మించి మహామహులై తెలుగు తేజాన్ని వికసింపజేసిన వారిని వర్ణించారు. రంగుల రాజకీయాలలో మునిగి పోయిన ఆంధ్రదేశానికి కష్టాలనిచ్చి పింగళి నామ సంవత్సరం వెళ్ళిపోయింది ‘కాళయుక్తి’ నీవైనా తెలుగు వాకిట వెలుగురేఖల వెల్లువ కురిపించమని జ్ఞానానందకవి కోరుకున్నారు. చైత్రమాసం కాలచక్రంలో ఎన్నోమార్లు వచ్చి వెళ్ళింది. ఇంకెన్నోసార్లు

వస్తుంది. ఈ సారైనా సౌఖ్య సంపదలనీ సమైక్యాన్నీ అందించాలని, దేశంలో శాంతి కలగాలని 'కాళయుక్తి' ఖండికలో పేర్కొన్నారు.

*"ఋతుమొనర్చెను పరభృతములు హాయిగా*
*విహరించి యామని వేళలందు*
*ఆరయ జగాజిల్గులమరె సంబరమొప్ప*
*శరదిందు కిరణాల చల్లదనము*
*తిరుగాడె "శిప్రా" నదీతీరా భూముల*
*తోరాన మలయసమీరకుందు*
*తనువుపొంగించె వింధ్యాటవీ ప్రాంతాన*
*నలరారు సుమనోజ్ఞమైన ప్రకృతి*
*ఒడలు పులకరించె నూర్వశీ లావణ్య*
*మోయి కాళిదాస నీయఖండ*
*కావ్యజగతిలోన కాలు వెట్టిన యెడ*
*కవివి యనగనీవె కావివి నిజము."* (**పుట**.4)

నాయకులు మంచి పనులు చేయనినాడు, సమతా, మమతా వాదాల్ని చూపనినాడు ప్రజలు నిరసన చేస్తారని జ్ఞానానందకవి తెలిపారు. గ్రంథాలయం అజ్ఞానాన్ని తొలగించి పాఠకులకు విజ్ఞానాన్ని బోధిస్తుంది. సహృదయులకు శాస్త్రశోభ చూపిస్తుంది. ఉజ్జ్వలమైన చైతన్యం ఇస్తుంది. సర్వవిజ్ఞాన శాస్త్ర సంచయాన్ని గర్భకుహరంలో నిలుపుకుంటుంది. ప్రజలను చీకటి నుండి వెలుగులోకి నడిపిస్తోందని గ్రంథాలయ విశిష్టతను వివరిస్తూ ఇలా అన్నారు.

*"ప్రతిభాశక్తిని, భావ సంపదను నిర్మాలిన్యపున్ యోచనా*
*గతినిన్, మంచిని సత్ప్రవర్తనమునున్ సమైక్యధీశక్తి సం*
*స్కృతినిన్, మానవతా స్వభావమును కల్పించు యధార్థంబు దు*
*ర్మతులన్ సన్మతులన్ పోనర్చెవిపో గ్రంథాల యాలెన్నగన్"* (**పుట**. 44)

'రాజరామ్మోహన్ రాయలు' ఖండికలో ఆ మహనీయుని వైశిష్ట్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. మధ్యయుగాల నాటి మొద్దు నిద్ర నుంచి భరతజాతిని మేల్కొల్పిన సంఘసంస్కర్త ఆయన. చిన్నతనం నుంచే విశిష్ట భాషలను నేర్చి పాండిత్యాన్ని గడించాడు. ఈ ఆర్ష భూమిలో భిన్నమతాల మధ్య నెలకొన్న వర్గపోరాటాలను మాన్పటానికి కృషిచేశాడు.

*"కలుగునే సుకముగా తలవాల్చి శాంతితో*
*జీవింపగా నొక్క చిన్న కొంప*
*వెలుగునే తోడునీడలు లేక పయనించు*
*కమనీయ మగునట్టి కయిత ప్రమిద*
*తొలగునే బ్రతుకును నలిపి ముద్దను జేయు*
*కఠిన దారిద్ర్య రాక్షస గణమ్ము*
*మెలగునే విసపు నవ్వుల లోకమున నిరా*
*ఘాటానజీవనగమ్య రథము*
*అడుగు ముందుకు వేయ నడుగునకడ్డుగా*
*నడుగువేయు దేశమందు శాంతి*
*సహన చంద్రికలు పిసాళించునే? దిక్కు*
*లేని సుకవి వెల్గునే ? నిజముగ."* **(పుట.** 8)

ఆంగ్ల ప్రభువుల స్నేహంతో హిందూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను పారదోలాడు. బూజుపట్టిన పాత పద్ధతుల్ని మాన్పి నిద్రాణస్థితి నుండి ప్రజలు మేల్కోవాలని రామమోహనుడు తపన పడ్డాడని వర్ణించాడు. 'భావిభారతం' ఖండికలో బాపూజీ కలలు పండి దేశం శాంతి సౌఖ్యాలతో ఉండాలి. క్రమశిక్షణతో ప్రజలు మెలగాలి. ప్రభుత్వ శాసనాలు దుఃఖజీవులకు సేద తీర్చాలి. పేదలకు ముప్పూటలా కూడు లభించాలని కవి కోరుకున్నారు. పూర్వం ధర్మం నాలుగు పాదాల నడిచినప్పుడు సౌఖ్యరాశులు గంపలకెత్తబడ్డాయి. మంచి మార్గాన జీవితాన్ని గడిపి, ఆ మార్గాన్నే ప్రజలకు బోధించిన బుద్ధుడు ఈ నేల మీద జన్మించాడు. అరుంధతిని పెండ్లాడిన ముని (వశిష్ఠుడు) ఈ నేలపైన కాలుపెట్టాడు. పంచముల ఉద్ధరణకై రామానుజుడు

పూనుకున్నాడు. మెగస్తనీసు నుంచి మహాత్మాగాంధీ దాకా తెలుగు గొప్పదనాన్ని ఎవరెవరు ఎలా చాటారో ప్రస్తుతించారో పేర్కొన్నారు.

*"ఆంధ్రులౌదార్యదివ్యజీవనముగాంచి*
*ప్రస్తుతింజేసె 'మెగస్తనీసు'*
*స్వచ్ఛాంధ్ర విప్రవేదోచ్చారణము నించు*
*మురిసె 'రాజారామ మోహనుండు'*
*అతిమధురమ్ము మహాంధ్ర వాఙ్మయ మంచు*
*నొప్పార వలికె ఫిలిప్బ్రౌన్*
*ఆంధ్రుల త్యాగ దీక్షాసక్తి తిలకించె*
*హర్షించె వార్ధామహాతపస్వి*
*ధీరచరితుడయిన మూరురాయరగండ*
*డనియె దేశభాషలందు తెలుగు*
*లెస్స యనుచు నదొక భిస్సగా నానాటి*
*దీప్తి నిలుపు నేడు తెలుగుతల్లి."* (**పుట**. 15)

### 2.11. పిల్లనగ్రోవి:

ఈ కావ్యం 1982లో ముద్రితమైంది. నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులైన కె.చంద్రయ్య(ఐ.ఏ.యస్) కు అంకితం చేశారు. ఈ కావ్యం 'పిల్లనగ్రోవి' అనే ఖండికతో మొదలై 'గండ పెండెర సన్మానం' అనే ఖండికతో ముగుస్తుంది. వీనుల విందైన రవళితో ఊదటానికి అనువుగా రంధ్రాలు పెట్టిన వెదురు గొట్టమే పిల్లనగ్రోవి. శ్రీకృష్ణుని మురళిగాన రవంతో జగం మైమరిచిందని భాగవత వర్ణన. గోమాతలు, గొల్లభామలు ప్రకృతిలోని సకల జీవరాశులు ఆ మధుర గానానికి మైమరిచి పోయాయట. తంత్ర నాదాలతోను, పిల్లనగ్రోవితోను ఆయనను స్తుతించును. అటు హైందవ మత పరంగానూ, ఇటు క్రైస్తవ మత పరంగానూ పిల్లనగ్రోవికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ మత విషయాన్ని వదిలినా పిల్లనగ్రోవి పిలుపుకు పరవశించని వారుండరు. దాన్ని 'శీర్షిక' గా గ్రహించిన కవిత కూడా అలాంటి మాధుర్యం కలదని

ధ్వనింపజేశారు. భావకవిత్వంలో కృష్ణుడికి అతని మురళి గానానికి ఒక ప్రత్యేకత ఉంది. మ్రోయింపకోయి మురళి అని భావకవితా నాయిక శృంగారపు తమిని వ్యక్తం చేస్తుంది. పిల్లనగ్రోవి పాట ఒకసారి పాడు కృష్ణా అంటూ శ్రీకృష్ణుడి ఔన్నత్యాన్ని ఇలా కీర్తించారు.

*"గురువంచి మడుగులో తిరుగాడు కాళియ*
*భుజగమ్ము నీ పదమ్ముల కెఱంగె*
*బుడుత ప్రాయమున నిన్ గడతేర్ప పాలిచ్చు*
*పూతన యల స్వర్గపురికి సనియె*
*తొడర నీడైన యెత్తులకు చిత్తయి పోయి*
*కొసకు జరాసంధుడుసురు వీడె*
*తనిపి నీ యుపదేశమునకు శుక్రసుతుండు*
*బవరమ్ము సేయ గాండీవముబట్టె*

*నిన్ను జూచి రుక్మిణి సతే ప్రత్యంగ*
*కములు పుల్కలెత్తె కంతుజనక*
*ఎడదవులలెత్తనేది? పిల్లనగ్రోవి*
*పాటనొక్కతూరి పాడు కృష్ణ"* **(పుట.**1)

'కుటుంబ నియంత్రణము' అనే ఖండిక విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారితమైంది. ఇందులో మొదటి ఐదు పద్యాలలో శిష్యుడు గురువుగారిని దేశంలో కరువు కాటకాలు రావడం, ధరలు మండిపోవటం, పూట తిండికి నోచుకోని దీన జనులను గూర్చి అడిగే ప్రశ్నలు కన్పిస్తాయి. తరువాత పద్యాలలో గురువు శిష్యునకు అధిక సంతానం వల్ల కలుగు నష్టాలను గురించి చెప్పినట్లు జ్ఞానానందకవి కల్పించారు. దేశం ప్రగతి పథంలో ప్రయాణించాలంటే జననాలకు 'ఫుల్‌స్టాప్' పెట్టాల్సిందే అన్నారు.

*"ప్రగతి వలెనన్న నీ జనప్రభవ మిచట*
*నాగిపోవలె నాడు మహాభ్యుదయము*
*నలువలంకులు నిండి తాండవమొనర్చు*
*దేశజన యుత్రి యానంద తీర్థమాడు"* (**పుట**. 26)

విద్యార్థులు క్షణికమైన ఆవేశాలకు లోనై వర్గాలుగా తిరుగుతారని, వేళకు పాఠశాలలకు హాజరుకారని, చదువు పట్ల అశ్రద్ధ చూపుతారని, ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించిన జ్ఞానానందకవి అనుభవంతో 'విద్యార్థులు' అనే ఖండికలో చెప్పారు. మద్యపానం వల్ల కలిగే అరిష్టాలను, దుష్పరిణామాలను తెలుపుతూ దాన్ని పిశాచిగా, జలగగా, మాయదారి జబ్బుగా వర్ణించి ఇల్లు గుల్ల చేస్తుందన్నారు. 'మనవి' అనే ఖండికలో 1977లో వచ్చిన తుఫాను చేత బాధితులైన వారిని ఆదుకోమని ప్రజలను తన కవిత ద్వారా ప్రార్థించారు. దేశంలో జరుగుతున్న క్రూరమైన సంఘటనలు, సంఘ విద్రోహ చర్యలు మొదలైన వాటిని కళ్ళకు కట్టినట్లుగా జ్ఞానానందకవి వర్ణించారు. దేశమంటే ఇదేనా అని

*"సతమతమైన జీవితము సల్పి నిరంతర ఘోరకష్టపున్*
*బ్రతుకుల నీడ్చి దేశహిత భావుకు లాత్మ నివేదనాపరి*
*స్థితి గమనింపలేని దొక దేశమె? యందు వసించు మానవ*
*ప్రతతికి నెట్టి యభ్యుదయ వైభవముల్ సమకూరునో కదా!"* (**పుట**. 41)

ప్రశ్నించారు. ప్రపంచ తెలుగు మహా సభలు మలేషియాలో జరుగు సందర్భంలో అక్కడికి సభ్యుల్ని పంపటానికి జరిపిన ఎంపికలోని లొసుగుల్ని వివరించి 'సిగ్గుచేటు' అనే ఖండికలో పేర్కొన్నారు. 'క్రిస్మస్' అనే ఖండికలో యేషెపు, మరియమ్మ వంటి ప్రవక్తలు 'యెహోవా' దేవుని కుమారుడుగా యేసు జన్మిస్తాడని చెప్పారు. ఆయన పుట్టినప్పుడు సకల ప్రజలు ఆనందించారు. క్రీస్తు శిలువపై మరణించి తిరిగి మూడు దినాల తర్వాత సజీవుడుగా లేవడం అనే విషయాలు వర్ణించబడ్డాయి. నీవు జన్మించిన వేళ మానవ లోకానికి శ్రీకారమైంది. నీవు చనిపోయి మూడవదినమందు తిరిగి లేచినప్పుడు ప్రజలకు జీవనమైందని జ్ఞానానందకవి ఇలా చెప్పారు.

*"నీ ప్రభాత వేళ నిజముగా మానవ*
*లోకమునకు మిపుల శ్రీకరమ్ము*
*మృతిని నిట్టె గెల్చి లేచివచ్చిన వేళ*
*క్షితి జనాళికెపుడు జీవనమ్ము"* **(పుట.** 70)

ఎమర్జెన్సీ ప్రవేశపెట్టడం వల్ల అన్ని వర్గాల వారిలోనూ గర్వం అణిగిపోయిందనీ, కలుష రాజకీయాలు, దుష్ట దుర్మార్గ చేష్టలు సమసిపోయాయని 'ఎమర్జెన్సీ' ఖండికలో చెప్పారు. 'ప్రత్యభినందన' ఖండికలో జ్ఞానానందకవి తనకు జన్మనిచ్చిన జనకుల నుండి తనకు సాహిత్యంలో సహాయాన్ని అందించిన ప్రముఖులందరికీ అభినందనలు తెలిపారు.

2.12. **రాజధాని:**

ఒక రాజ్యం ఉంటే దాని పరిపాలనా కేంద్రాన్ని రాజధాని అంటారు. ఫ్యూడల్ వంశాల పాలనలో రాజధానులు ఉన్నాయి. ఆధునిక ప్రజాస్వామ్య దేశాలలో దేశానికే కాదు రాష్ట్రాలకు ఉన్నాయి. జ్ఞానానందకవి మొదట జాతీయవాది. ఆ పై మాతృరాష్ట్రం ఆంధ్రరాష్ట్ర అభిమాని. అది ఆయన సంపూర్ణ లఘుకావ్యం 'గోల్కొండ'లో ప్రస్ఫుటం అవుతుంది.

*"వెలిగెన్ స్నిగ్ధ సమైక్య సంపదలదివ్వెల్ నాడు గోల్కొండభూ*
*స్థలి లో రెండు విభిన్న సంస్కృతుల మధ్యన్ ప్రేమ పీయూష ధా*
*రాలలో నందరి గుండియాల్ తడిసెతొల్తాన్ రాజధానీ! నమ*
*స్సులు నీ కరమ్మునేడు కాలినది విచ్చుంగత్తు లూరేగగన్."* **(పుట.**92)

ఆ అనుభవంతోనే ఈ ఖండకావ్య సంపుటికి కవి 'రాజధాని' అని పేరు పెట్టారు. ఇది ఔచిత్యవంతమైన నామకరణం. ఆ శీర్షికతో ఉన్న కవితలో రాజధాని ప్రాముఖ్యాన్నీ, ప్రత్యేకతనూ, వైశిష్ట్యాన్నీ గొప్పతనాన్నీ కీర్తించారు.

*"తెలుగు మాగాణి భూముల దొల్తతిరుగాడు*
*దేశీయ కవితకు తెరువుసూపి*
*కుండ వాంబాదేవి కొడుకు గీచినయట్టి*

*విజ్ఞతాయుతపు టనుజ్ఞ దాల్చి*
*శిరమెత్తి యింత యూపిరిపీల్చుకొన్న వై*
*దిక తత్వమునకు పతకము వైచి*
*సకల భాషా కళాజలరాశి ఘనుడు నా*
*రాయణభట్టు సాయమ్మునంది*
*తొలి మహేంద్ర కవిగ నిలిచిమానేలలో*
*రమ్యమైన యక్షరాల విత్త*
*నాలు సల్లియదొక శైలి నీదిగా నిల్పి*
*నట్టి శబ్ద శాసనా! జోహారు."* **(పుట.** 1)

అంతేకాదు ఈ సంపుటిలో నన్నయ భట్టు, తిక్కయజ్వ, శ్రీనాథుడు, బ్రహ్మనాయుడు, త్యాగరాజు, రాఘవేంద్రస్వామి, రంగాజీ, నార్ల, నట సామ్రాట్, తెలుగు తల్లి, డా. సి. నారాయణ రెడ్డి మొదలయిన శీర్షికలు ప్రసిద్ధాంధ్ర కవుల, భక్తుల, నాయకుల మహోన్నత వ్యక్తిత్వాలను కీర్తించేవే. ఆంధ్ర సంస్కృతి సౌరభాలకు దివ్యనీరాజనాలను అర్పించేవే. ఏ విధంగా చూచినా ఈ కృతి నామకరణం అత్యంత ఔచిత్య శోభితం. ఆంధ్రుల ఆది కవికి అక్షర నీరాజనాలు ఈ విధంగా అర్పించారు.

*"హళగన్నడములోని విలసనోజ్జ్వల మంజు*
*వృత్తమ్ములను స్వీకరించు నాడు*
*వేంగీధరాస్వామి పేరొలగమ్మున*
*ప్రథమ తాంబూలమ్ము వడయు నాడు*
*తెలుగులో తొలికావ్య మలర నిర్మలమైన*
*భావమ్ముతో స్వస్తి పలుకు నాడు*
*ఆ దశ భాషాశక్తి పొడిగించి తెల్గులో*
*సుప్రసన్నత జాటి చూపునాడు*

*నీపునీతబుద్ధి నిపుణతచే తెల్గు*

*నేల భారతమ్ము వ్రాలు నాడు*

*మరొక స్వర్గమేల? మధుర శర్కరయేల*

*నన్ను యాభిదా ప్రణామ శతము* " **(పుట.** 3)

తిక్కన నిర్వచనోత్తర రామయణాన్ని మనమసిద్ధికి అంకితం చేశారు. అదే తిక్కనకు శిష్యుడైన కేతన తన 'దశకుమార చరిత్ర'ను అంకితం చేశాడు. ఈవిధంగా గురుశిష్యులు తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిర యశోధన సంతృప్తిస్వాంతులు అయ్యారని జ్ఞానానందకవి ప్రశంసించారు. మనమసిద్ధి తిక్కనను గౌరవంతో 'మామ' అని పిలిచేవారు. ఆ సంబంధ సందర్భానికి తగ్గట్టుగానే తిక్కన తన కావ్య కన్యను అల్లుడికి కట్టబెట్టాడు. అదొక మనోహర సందర్భం. గురువుకి కావ్యాన్ని అంకితం చేయడం కూడా ఇలాంటిదే. ఆ రెండూ ఒకే కవితో ముడి పడి ఉండటం విశేషం. ఆ అరుదైన సందర్భాన్ని అక్షర బద్ధం చేశారు. మహిత కవితాత్ములు జ్ఞానానందకవి. ఉత్తర హరివంశకర్త అయిన నాచన సోమన ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రనకు సమానుడే. పందెం చరచి దూసుకెళ్ళగలిగిన నవీన గుణ సనాధుడు, సంవిధాన చక్రవర్తి "ఆళికంబున నక్షిని డాచిన సర్వజ్ఞ" అని చిన్నయ సూరి కీర్తించిన నాచన సోమనను పాఠకులకు ప్రత్యక్షర సత్యంగా జ్ఞానానందకవి పరిచయం చేశారు. కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు నిర్వహించిన పాత్ర లాంటిదే పలనాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు నిర్వహించిన పాత్ర.

*"అరవిల్లికులజురాలైన నాగమ్మ తో*

*విజృం భించి బార్ బరవమ్ము సేయువేళ*

*శైవము కన్న వైష్ణవమ్ము గోప్పదనంపు*

*ధాటిని లోకాన జాటువేళ*

*నరుక గా బడినట్టి నరసింగు శిరమును*

*కాంచి కన్నీటిని కార్చువేళ*

*జన్యరంగము నందు సైన్యాధి పత్యమ్ము*

*నపర పార్ధునకిచ్చి యలరు వేళ*

*తీక్షణ మైవెలుంగు త్రికలింగ శూరతే*
*జస్సు నిన్ను గ్రమ్మి చనిన వేళ*
*భండనమ్ము నందు రెండవ శౌరి వై*
*వెలిగినావు తెలుగు వెలమ వీర."* (**పుట**. 12)

ఆయన రాజకీయ చాతుర్యం అమోఘం. నాగమ్మ కుటిల నీతిని బ్రహ్మనాయుడు సమర్థంగా ఎదురించి గెలిచాడు. ఆ బ్రహ్మనాయుని వ్యక్తిత్వాన్ని, ఆదర్శాన్ని సంస్కరణనూ కవిబ్రహ్మ జ్ఞానానందకవి పాఠకుల కళ్ళకు కట్టారు. సర్వసమతా భావకాంక్షి, అభ్యుదయ స్వాంత భాస్వంతులు అయిన కవిని బ్రహ్మనాయుని వ్యక్తిత్వం ఆకర్షించింది. ఆంధ్రదేశంలో తొలి సహపంక్తి భోజనం బ్రహ్మనాయుడు ఏర్పరిచిన 'చాపకూడు.' అది అతని రాజనీతిజ్ఞతకు నిదర్శనం. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులు ఫైవ్‌స్టార్ హోటల్ విందుల బీజాలు దీనిలో కనిపిస్తాయి. కవిగారు రాసిన ఖండిక 'శ్రీనాథుడు' ఉద్భట వివాదప్రౌఢితో ప్రౌఢ దేవరాయల ఆస్థానకవి గౌడ డిండిమ భట్టు కంచుడక్క పగలగొట్టి అతని కవి సార్వభౌమ బిరుదాన్ని కైవసం చేసుకొన్నాడు బ్రాహ్మీదత్త వరప్రసాదుడు, కవితా సనాథుడు శ్రీనాథుడు. అంతటి మహాకవి ఘనతను అంతే ఘనంగా జ్ఞానానందకవి శ్రీనాథుని రాసికృతను కింది పద్యంలో సాక్షాత్కరించారు.

*"చవులూరించు సుధాపదార్థముల మృష్టాన్నంబులన్ మెక్కి నా*
*డవు భోగమ్ముల దేలినాడవు యశోఢంకన్ బజాయించి నా*
*డవు ఔన్నన్నము దిన్న వాడవట చల్లా యంబలిన్ ద్రావి నా*
*డవు సాహిత్య జగత్తులో నిలుచువాడా నీకు గైవారముల్."* (**పుట**. 18)

త్యాగరాజు, వీరబ్రహ్మం, రాఘవేంద్రస్వామి శీర్షికలు ఆ మహోన్నత వ్యక్తుల మహాత్మ్యాన్ని అభివర్ణించేవి. వారివారి వ్యక్తిత్వ వైభవాల్ని చాటి చెప్పేవి. అఖండ 'భారతము' అనే ఖండిక ప్రగతి పథంలో పయనిస్తున్న భారతదేశ ఔన్నత్యాన్ని కీర్తించింది. కాకినాడ సముద్రతీరాన వెలసిన మంగళాంబికా సహితుడైన ఆది కుంభేశ్వరుని ప్రజలు అను నిత్యం అభిషేక జలంతో పూజిస్తూంటారు. ఐదు

దశాబ్దాలకు మించి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ఆచార్య రంగా నిజమైన నిబద్ధ కర్షక నాయకుడు, గాంధేయవాది. ఆయనని జ్ఞానానందకవి 'రంగాజీ' ఖండికలో కీర్తించారు. సుప్రసిద్ధ సంపాదకులు, కవి, నాటకరచయిత, హేతువాది, మేధావి అయిన నార్ల వెంకటేశ్వరరావుని ఇలా కీర్తించారు.

*"కవి వటన్నగాదు కాని నాటక కర్త*
*వన్న గాదు దొడ్డ వ్యాసములకు*
*కర్తవన్నగాదు గాని మేల్ సంపాద*
*కుండ వీవు తెలుగు గుండె వీవు."* (**పుట**. 60)

2.13. **వంశధార:**

ఈ కావ్యం 1989లో ముద్రితమైనది. రిటైర్డ్ హైకోర్టు జడ్జి కొత్తపల్లి పున్నయ్య కు ఈ కావ్యం అంకితం చేశారు. కృతిపతి కావ్యాన్ని స్వీకరిస్తూ ఈ విధంగా కొనియాడారు. "కళాప్రపూర్ణ జ్ఞానానందకవి బహుకావ్య గ్రంథకర్త. మా ఇరువురం బాల్య మిత్రులం. నేను విజయనగరం మహారాజా వారి హైస్కూల్‌లో 1938లో చేరి 1942లో సీనియర్ ఇంటర్ చదువుతూ క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని అరస్టయి విడుదలయిన తరువాత విద్యార్థి కాంగ్రేసు సంస్థను స్థాపించి నడిపిస్తున్న రోజులవి. అప్పటికే శ్రీశ్రీ అభ్యుదయ కవిగా సాహిత్యరంగాన గౌరవ ప్రతిష్ఠలు పొందిన రోజులు. శ్రీశ్రీ రాసిన గేయాలు సాహిత్యాభిరుచి కలిగిన నాబోటి యువకులకు అభ్యుదయ సాహిత్యాభిమానులుగా ఉండేవాళ్ళం. బొబ్బిలి తాలుకాలోని పెదపెంకి గ్రామాన జన్మించి ఉపాధ్యాయ ట్రైనింగ్ లో ఉత్తీర్ణుడై ఉద్యోగ సందర్భంగా మిషనరీలను ఎదిరించి విజయనగరంలోని సంస్కృత కళాశాలలో చేరుటకై విజయనగరం విచ్చేశారు. జ్ఞానానందకవి సంస్కృత కళాశాలలో చేరి కొంత కాలమైన తరువాత పండితులు సరిపోక సంస్కృత కళాశాలకు స్వస్తి చెప్పారు. అప్పటికే ఛందోబద్ధంగా ధారాశుద్ధితో పద్యములు రాసి మాకు వినిపిస్తూ ఉండేవారు. ఆ పద్యములు విని ఆనందిస్తూ మేము జ్ఞానానందను ప్రోత్సహించే వాళ్ళం. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుల వారసునిగా పద్యరచన గావిస్తూ పుంఖాను పుంఖాలుగా పద్యాలు రాసి,

రాస్తూ ఆంధ్ర సాహిత్య శిరోమణుల మన్ననలు అందుకున్న కవిగ్రామణి జ్ఞాననందకవి. చిన్ననాటి నుండి నేను ఎరిగిన ఇంతటి మహాకవి సాహిత్య కళాతపస్వి తాను రచించిన ఈ "వంశధార" కావ్య కృతిని అవ్యాజానురాగ వాత్సల్యంతో నాకు అంకితం ఇవ్వడం నా జన్మ చరితార్థం అయ్యిందని తలుస్తూ హర్షాతిరేకంతో కృతజ్ఞతాబద్ధ హృదయంతో వినమ్రుడనై స్వీకరిస్తున్నాను " .

'వంశధార' ఖండ కావ్యం వంశధార అనే ఖండికతో మొదలవుతుంది. జ్ఞానానందకవి పుట్టిపెరిగింది నేటి విజయనగరం జిల్లా నాటి శ్రీకాకుళం జిల్లాలోని పెదపెంకి గ్రామం. ఈ ప్రాంతానికి జీవధార వంశధారానది తూర్పుకనుమల్లో పుట్టి ఒరిస్సాలో ప్రవేశించి, ఒరియా భూముల్ని సస్యశ్యామలం చేస్తూ పాతపట్నం, నరసన్నపేట, శ్రీకాకుళం వంటి ఆంధ్రప్రాంతాల్ని కూడా సస్యశ్యామలం చేస్తుంది. పూర్వగాంగా రాజుల పూజలందుకొని ఉత్తరాంధ్ర ప్రాంతానికి ముత్తైదువుగా నిలిచిన 'వంశధార'ను ప్రాంతీయాభిమాన పరవశులై జ్ఞానానందకవి కీర్తించారు.

*"నీవు మామూలుగా బయనించునాడు*
*చెప్పుకోదగ్గ బంగారు సిరులు కురియ*
*భీషణాకృతి నీవు జృంభించునాడు*
*మృత్యుపైశాచికీదేవి నృత్యమాడు"* **(పుట.** 7)

ఆంధ్రుల పెద్ద పండుగ సంక్రాంతి. ఆడపడుచుల ఆనందపు కేరింతలతో, అల్లుళ్ళ సరదాలతో, బంధువుల సంబరాలతో, ఇళ్లముందు రంగురంగుల ముగ్గులతో, గొబ్బిళ్ళ కళకళలతో, గ్రామీణ ప్రాంతాలు శోభిల్లుతుంటాయి. పంట చేతికొచ్చిన రైతుల ఆనందం సరేసరి. కోడిపందేలు, పోట్టేళ్ళ పందేలు, ఎడ్ల పందేలు వినోదాన్ని అందిస్తాయి. జ్ఞానానందకవి సంక్రాంతి సంబరాల్ని వర్ణిస్తూనే మారుతున్న కాలాన్ని కనుమరుగౌతున్న సంస్కృతి, సంపదనూ నిలుపుకోమని 'సంక్రాంతి లక్ష్మి' ఖండికలో సూచించారు.

*"సహజమ్ము మెఱయు నీ సంక్రాంతిలో మేలి*
*సింగారములు దాల్చు గంగిరెద్దు*
*పరవశించిన సృష్టిపై సంకురాతిరి*

*పరిమళించినది యీ విరులమాల*
*ప్రమదాన సరిక్రొత్త వస్త్రాలు ధరయించి*
*విఱ్ఱ వీగెను తెల్గుకుఱ్ఱవాడు*
*ఈ భోగి మంటకు నీ పిండి వంటకు*
*చిరునవ్వు లొలికించె చిన్నపాప*
*కళ్ళమున కుప్పనూర్చెదు పల్లెపడుచు*
*మృదుల కంఠాన మేల్కొల్పు పదము పాడె*
*ఈ సహధీశవైభవ శ్రీ మహత్తు*
*కలుగుదానవు మకర సంక్రాంతి నీవు"* (**పుట**. 14)

"నానా జాగరూకలై కవులు పరిశీలించి జాతి సమైక్యత, దేశ సమగ్రత, దేశ ప్రాదేశికత కోసము కృషిచేసి మహోన్నత మహోజ్జ్వల చైతన్య శంఖానాదాలు చేయవలయును. మతము, కులము ప్రాంతీయ భేదము లేని జాగృత వాతావరణం సృష్టింపవలయును గుండె పగిలిన నా ఆవేదనా పర్వ మహా కీకారణ్యములో బృంహిత ధ్వాన మొనరించిన పద్య మత్తేభమును తిలకించగలరు" అని జ్ఞానానందకవి కావ్య ఉపోద్ఘాతంలో పేర్కొన్నారు.

ప్రస్తుత సమాజంలో కనిపించే వర్ణ, వర్గ వైషమ్యాలను ఆర్థిక అసమానతలను, నయవంచనలను, కుట్రలను, నిరసిస్తూ 'చైతన్యము' అనే ఖండికలో వివక్ష లేని సమాజాన్ని జ్ఞానానందకవి కోరుకున్నారు. ఏదో కుటిల స్వభావంతో ఈ ఐదువేల యేండ్ల నుంచి హింసా సంక్లిష్ట స్థితిలో ముంచి సువర్ణ హిందువులు చేస్తున్న తమాషాయే మన వర్ణ వ్యవస్థ అని జ్ఞానానందకవి స్పష్టీకరణ.

*"వృత్తులను బట్టి వర్ణమ్ము లేర్పడినవి*
*యనెడు నీ మాట అర్థమ్ములైన వదియు*
*మూడు నాలుగే కద పంచము డెవడంచు*
*నడుగు చున్నారు నీ వేమియందు వవుర!"* (**పుట**.23)

క్రైస్తవుడిగా బైబిల్ గ్రంథంలోని మహాత్ముల బోధనల్ని గ్రహించి, క్రైస్తవ సోదరుల్ని అనుసరించమని 'మేలుకొలుపు' ఖండికలో జ్ఞానానందకవి ప్రబోధించారు. ఈ కావ్య ఉపోద్ఘాతంలో కింది వాక్యాలతో ముగిస్తాను అని పేర్కొన్నారు.

*"యజ్ఞములు సేయుట లోకకళ్యాణము కొసరమట*
*విరాట పర్వమును పంచుట వర్షములు వచ్చుట కోఅకట*
*పూజా పురస్కారాలు, ధూప దీప నైవేద్యాలు పొనరించుట మానవజాతి సహోదరత్వ సంస్థాపనకట."*

ఈ అంధ విశ్వాసాల గోపుర కవాటాలు పూర్తిగా నిర్మూలించబడనిచో హైందవమునకు ప్రగతి లేదు. నీ దేశానికి కర్మ సిద్ధాంతమే గతి. స్వార్థపరుల కుక్షింబరుల కులవర్గ ప్రోత్సాహకుల సంసారాలు సుఖమయుగా విలాస వైభోగ్యవంతముగా సాగుటెట్లు? ఈ దేశానికి పుట్టిన నీచ సంస్కృతికి ఇది వజ్రదుర్గమార్గము.

*"కవులు రచయితలు సమజానికి వైతాళికులు*
*వారి మేలు కొలువులు మానవ శిధిల జీవితాలలో*
*మధుర మధుమాసాల గుబాళింపులు.*
*నానా హంగామాలతో దేశము ఏ వైపు పయనించుచున్నది – నిరంతరం"*

## 2.14. ఆహ్వానము:

ఈ కావ్యం 1993లో ముద్రితమైంది. దీనిని కాకి మాధవరావు (ఐ.ఎ.ఎస్) కు అంకితం చేశారు. ప్రేమ, స్నేహానురాగాల యజ్ఞము నిర్వహించు దేశము ఈ భూచక్రంలో భారతదేశమే. అదే భారతదేశ సంస్కృతి. దానికే మీకు "ఆహ్వానము".

*"నిరసించునా ప్రజానేతరాజ్యమ్ములో*
*పేటురేగిన పైరవీల బెడద*
*దరిసించునా ప్రజాదర్బారులో నాయ*
*కుడు పేర్మిమై పేదగుండెలోతు*
*ఆరుసించునా పాలకాగ్రేసరుడు ప్రతి*
*భాశాలి ప్రతిలేని భావపటిమ*

*పరపించునా యేలుబడి సేయువాడు దే*

*శప్రజాహృది పృద్వి శాంతిగంగ*

*కూడు గుడ్డ గూడు కొదవైన పేదప్ర*

*జాళి యార్త రావ మాలకించు*

*నా యథార్థమైన నదియ దేశానకు*

*చాలావేల దివ్వటీల వెలుగు."* **(పుట.** 12)

భిన్నమతాలు, వర్గాలు, కులాలు, ఇంకెన్నో ఘర్షణలు భారత క్షోణిలో నాడూ నేడూ ఉన్నాయి. అయినా ఏకత్వభావన నశించలేదు. అందుకే ఆహ్వానము "నీదగు తలంపే దేశకల్యాణ రేఖాదీక్షా ద్రడి ముంపు దక్షతకు ముఖ్యంబిద్ది యోజింపుము" అంటారు జ్ఞానానందకవి. వర్తమాన రాజకీయ, సామాజిక పరిస్థితులకు సహితం అద్దం పడుతుంది. ఈ సంపుటిలో అంగీరస, ప్రభవ, విభవ, ప్రమోద అనేవి ఉగాది కవితలు. సమకాలిక పరిస్థితులకు అద్దం పడుతూ భవిష్యత్తు పట్ల ఆశావాహదృక్పథం వ్యక్తం చేయటం కనిపిస్తుంది. ప్రాచీన, ఆధునిక కవుల్లో కొందరిని ప్రస్తుతించటం కనిపిస్తుంది. కాని ఈ సంపుటిలో ఏ కవినీ కీర్తించకపోవడం విశేషం. అంతేకాదు ఈ సంపుటిలో వ్యక్తి ప్రశంసలు కూడా అరుదే. గాడిచర్ల హరి సర్వోత్తమ రావు శతజయంతిని పురస్కరించుకుని జ్ఞానానందకవి రచించిన ఖండిక 'గాడిచర్ల'. ఆధునికాంధ్ర దేశంలో గ్రంథాలయోద్యమానికి మూలకారణం గాడిచర్ల వారే. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్న గాడిచర్ల అరెస్టులకు భయపడకుండా బ్రిటిష్ అధికారులకు నిర్భయంగా సమాధానాలు చెప్పి వారిని ఆశ్చర్య చకితుల్ని చేశాడు.

*"బిట్టదరన్ బ్రిటీషు పృథవీపతు లెల్లరు ముక్కుమీద వ్రేల్*

*పెట్టుకొనంగ నీవొసగు బెట్టు జవాబు తెలుంగు జాతినిన్*

*తట్టుచు మేలుకొల్పినది ధన్యుదవయ్య మహానుభావం నీ*

*మెట్టిన మార్గమందున సుమించును జ్ఞానలతాంత గంధముల్"* **(పుట.** 61)

దీన జన రైతు పరిపోషకులు, భక్తసాగరులు, సత్కవి, పండిత బృంద నవ్య మందారులు అయిన కపిలేశ్వరపురం జమీందారులు సర్వారాయుడు. ఆయన శత జయంతిని పురస్కరించుకొని జ్ఞానానందకవి ఆ మహానాయకుని మహోదాత్త కార్య కలాపాలను కావ్యంలో ప్రతిబింబించారు.

*"హైందవ సామ్రాజ్య మనతరింపగగొట్టె*
*జేగంటి తొలి శివాజీ ప్రభుండు*
*బెదరు సుంతయులేక నెదిరించె శాత్రవ*
*సైన్యాలు హడలెత్త ఝూన్సిలక్ష్మి*
*క్విట్టిండియా నవోద్గీతా ప్రబోధాల*
*ప్రజల మేల్కొల్పె వార్ధతపస్వి*
*ఆంగ్ల భూపతుల దౌష్ట్యము ద్రిప్పికొట్టు భ*
*గత్సింగు ఘను దురికంబ మెక్క*
*ఎందఱో త్యాగ ధనుల లోహితము ధార*
*లై స్రవంతులై పారి యార్ద్ర మొనరించె*
*జాతి హృదయమున్ చైతన్య శక్తి నిచ్చి*
*ఆమహాత్ముల నీడలో నలరు వలయు."* **(పుట.25)**

'జెండా వీరుడు', 'భారత ధాత్రి', 'స్వాతంత్ర్య లక్ష్మి' ఖండికలు జ్ఞానానందకవి దేశభక్తికి జాతీయ దృక్పథానికి కర దీపికలు. ఆయన కవితలన్నింటిలో కనిపించే సాధారణాంశాలు ఇవే. గాంధీజి పిలుపుని అందుకొని జెండా నిల్పిన ఆంధ్ర వీర యోధుడు శ్రీరామమూర్తి గారు. ఆ మహనీయునికి అక్షరనివాళులు అర్పించారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని, 45 సంవత్సరాలు గడిచినా స్వాతంత్ర్య ఫలితాలు ఇంకా అందరికీ అందలేదని వాపోయారు. పేదరికం తొలగాలి " ఏమికానో? యీ దేశము గండిలేని కడుదీనుల గుండియ లుద్యమించినన్" అని ఆందోళన చెందారు జ్ఞానానందకవి. గూండాయిజం పెరిగిపోతున్నందుకు నిరాశ, నిస్పృహను వెలిబుచ్చారు. కవిగారు కవిత్వ రూపంలో ఒక లేఖ రాశారు. ఔచిత్యవంతమయిన ప్రయోగం ఇది. నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుకి రాసిన లేఖ. ఆయన

బహుభాషా కోవిదుడు, కవి, పండితుడు, గ్రంథకర్త. విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు' నవలను 'సహస్రఫణ్' పేరుతో హిందిలోకి అనువదించారు. విశేషించి జాషువా, బోయి భీమన్నల తరువాత తానే హరిజనకవినని నిత్య దారిద్ర్యంలో మగ్గిపోతున్నానని లేఖలో విన్నవించుకొన్నారు.

*"అతడు జాషుహ హరిజనులందు న తడు*
*మొదటి కవి బోయి భీమన్న పిదప వాడు*
*వారి తరువాత స్థానమ్ము వచ్చి నాకు*
*నిత్య దారిద్ర్య దావాగ్ని నెరయువాడు."* **(పుట.** 96)

కవిత్వం సహృదయానికే తెలుస్తుంది. అందుకే జ్ఞానానందకవి లేఖ రాశారు. అయినా ఆ ఆశ కూడా తీరలేదు. కవులు నేటికి సరస్వతీ పుత్రులే కాని లక్ష్మీ కటాక్ష వీక్షణులు కాలేకపోవటం అందరికి తెలిసిందే.

'ముఖ్యమంత్రి దర్శనం' అనేది కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన నివాసంలో ఆయన సముఖాన వినిపించిన కవిత ఇది. కోట్ల వారి పరిపాలనను ఈ పద్యంలో అభినందించారు.

*"తెలుగు అదృష్టవంతులు ప్రదప్త చరిత్ర గలట్టి మీమహో*
*జ్జ్వల మహనీయపాలనము వల్ల సుఖింతురు మీమహోన్నతో*
*హలకు ప్రశాంతజీవితము నందుదు రెప్పుడు ముఖ్యమంత్రి. స*
*త్ఫలితము లందుచున్ విజయభాస్కరరెడ్డి మహోదయోదయా!"* **(పుట.** 98)

ఇంకా ఈ సంపుటిలో సమాలోకనము, సందేశము, శింజని అరసిక, భూమి సమితి, బుష్పసందేశము, ఆదరణము, ఆశీస్సు, సవాలు, దివ్యస్మరణ. అక్షరకళాజ్యోతి, ఆశాగానము, తెలుగుతల్లి, రీ ఎంప్లాయిమెంట్ కబడ్దార్, అవలోకనము సంఘములకు, పురస్కారాల వేళ, శుభాకాంక్ష మొదలైన రసవత్తరాలైన ఖండికలు ఉన్నాయి.

2.15. ధర్మాగ్రహము:

ఈ కావ్యం 1998లో ముద్రితమైంది. దీనిని జ్ఞానానందకవి తన తల్లిదండ్రులైన సురగాలి ఎల్లయ్య పాపాంబ లకు అంకితం చేశారు.

*"కరుణ గలుగునయ్య సురగాలి ఎల్లయ్య*

*అమ్మ పాపమాంబ లాశిషమువలె*

*ఇంత కవినిజేసె నీ కృతివారల*

*యడుగు దమ్ములకు సమర్పణమ్ము"* (ధర్మాగ్రహము.పీటిక)

ఈ కావ్యానికి స్పందన పేరుతో ప్రముఖ భాషా వేత్త సాహితి సత్యవ్రతులు కవి విమర్శకులు 'స్ఫూర్తి శ్రీ' (టి. భాస్కర రావు) విలువైన, విపులమైన పీఠిక అందించారు. జ్ఞానానందకవి కవితా తత్వాన్ని లోతుగా పరిశీలించి, విశ్లేషించి చూపారు. గాంధీజీ ప్రబోధించిన సిద్ధాంతాలలో సత్యాగ్రహం ఒకటి. ధర్మాగ్రహం పేరు వినగానే స్ఫురించేది సత్యాగ్రహమే. ఆగ్రహం పదానికి కోపం అనే అర్థంతో పాటు పట్టుదల అనే అర్థంకూడా ఉంది. సత్యాగ్రహం అంటే సత్యంకోసం పట్టిన పట్టుదల. దాన్నే సత్యదీక్షగా చెప్పుకోవచ్చు. ఇలాగే ధర్మాగ్రహం అంటే ధర్మదీక్ష. ఆ ధర్మదీక్ష ఆవశ్యకతని జ్ఞానానంద కవి కేవలం పొడి మాటలతో కాకుండా ఒక గతి, సంగతి గల ఛందోరీతిలో పాఠకులకు ఉపదేశించారు. మతము అనే ఖండికలో ఇలా పేర్కొన్నారు.

*"హితము నెరపనట్టి మతమన్న నదియేల*

*శాంతి నిడనిసాధు సంఘమేల"* (పుట. 11)

హితం కలిగిస్తే మతమూ, శాంతినిస్తే సాధు సంఘమూ అన్నది వీరి ఆశయం. మతం మానవతను పడగొట్టడానికి కాకుండా నిలబెట్టడానికి కావాలి అని జ్ఞానానందకవి నిర్ణయం. ధర్మాగ్రహముతో మొదలయిన ఖండికలలో సమాజ దర్శనంతో స్పందించిన ఆర్ద్ర హృదయం అందించే సందేశమే స్వార్థం కన్న పరార్దమే వీరికి పరమార్థం.

*"చదువులేని వారు సంఘాలు పెట్టిన*

*అవసరమ్ము వారి కాశ్రయమ్ము*

*చదువుకొన్న వాండ్రు సంఘాలు పెట్టిన*

*నంగనాచి తనము తొంగిచూచు"* (**పుట**. 21)

ఈనాడు న్యాయబలమూ, ధర్మబలమూ కాక మంది బలమే అందలమెక్కుతుంది. విద్యావంతులు కూడా అదే మార్గాన్ని అనుసరించడం జరుగుతుంది అని కవి భావన. మన సమాజపు తీరు తెన్నులు, ప్రభుత్వాల తీరు తెన్నులూ జ్ఞానానందకవి నిశితంగా పరిశీలిచారు. అదే బాటలో నడిచిన ఇంకోపద్యం.

*"రాజకీయాల నేరాలతో జీవించు*

*వంచకు లాటకట్టించునాడు*

*అనిశమ్ము స్వార్థమై యనృతాల వచియించు*

*హీనుల నోళ్ళు మూయించునాడు*

*కులమత ఛాందసక్రూర కర్మఠుల దు*

*శ్చేష్టితాల సమాధి సేయునాడు*

*విత్తమ్ము నార్జింప పెడత్రోవలను ద్రొక్కు*

*గుండాల శక్తుల చెండునాడు.*

*ప్రజలలోన అనైక్యంపు భావజాల*

*ముడుగు నాడు నీరాకము కీడునుగాక*

*నిర్మలానంద జీవనోన్మేషగరిష*

*యువ వునూతన వర్ష ప్రభూ హసాదు"* (**పుట**. 26)

ఈవిధంగా నేటి స్థితిని గురించి జ్ఞానానందకవి ఖండితంగా చెప్పారు. దోషాలను ఎత్తి చూపటమే కాదు, గుణాలను ప్రస్తుతించటం కూడా చక్కగా చేశారు. జ్ఞానానందకవి ఆత్మీయత ప్రతి ఖండికలో కనిపిస్తుంది. సమైక్యతకు నిదర్శనంగా ఈ పద్యాన్ని చెప్పొచ్చు.

*"ఆంధ్రమ్ము తెలగాణ యైకమత్యమునకు*

*తెలగాణ నేనురా తిరిగినాను*

*ప్రతిన బూనుచు తెల్గు భాషాభివృద్ధికి*

*గ్రంథాలు నేనురా వ్రాసినాను*
*జాతియ సుకవితా సమ్మేళనములోన*
*ముదమార నేనురా చదదివినాను*
*మానవత్వపు దివ్య మార్గమ్ము శాంతికి*
*నెలవని నేనురా తలచినాను*

*ప్రతిభకును చోటులేని యీ క్షితి తలాన*
*కుల మహావ్యాఘ్రి గాండ్రించు కువలయున*
*ఇల్లు వాకిలి లేకనే యీ విధాన*
*పరమ తృప్తి యై నేనురా బ్రతుకు చుంటి."* **(పుట.** 22)

ధర్మాగ్రహంలోని కృతజ్ఞతాంజలి, గండపెండేరము, ప్రత్యభినందన, గోపినాధరెడ్డి, సుబ్బిరామరెడ్డి, మల్లెమాల, రసమయి మొదలైన ఖండికలు జ్ఞానానందకవిని సన్మానించిన, సహకరించిన, అభిమానించి ఆదరించిన వ్యక్తులను గురించి, సంస్థలను గురించి ప్రస్తుతించిన ఖండికలు. ఈ ఖండికల ద్వారా జ్ఞానానందకవి తమ కవితా ఋణాన్ని తీర్చుకున్నారు. ఇదంతా తనకి పైడితల్లి వల్ల పోందానని కింది పద్యంలో చెప్పారు.

*"తిన తిండి లేని వేళనునన్నుగని ప్రేమ*
*నన్నమ్ము వెట్టి నన్నాదరించి*
*చినిగిపోయిన కట్టుకొనునట్టి వాసనమ్ము*
*లకు దుఃఖపడుచు వస్త్రమ్ము లిచ్చి*
*పంచముండితడంచు పడదిట్టు వారికి*
*బుద్ధి సెప్పుచ్చు నన్ను బుజ్జగించి*
*ఆత్మ గౌరవమునకై ప్రాకులాడని*
*కడుప్రేమ మీరగా గారవించి*
*"నాడు కవిత మెచ్చి నాయభ్యుదయము కో*
*సరము కలలగాంచి సరసమతిని*

*మేలు గోరువాని సైలాడ పైడిత*
*ల్లిని దలంతునాడు మనసు నందు."*

"ధారణాత్ ధర్మ: అనీ ధార్యతే అనేన ఇతి ధర్మ:" అని పెద్దలు ధర్మ శబ్దాన్ని నిర్వచించారు. దేనినైతే ధరిస్తున్నామో అది ధర్మమని ఒక నిర్వచనం, మనల్ని ధరించి నిలబెట్టేది ధర్మమని ఇంకొక నిర్వచనం. "ధర్మో రక్షతి రక్షిత:"అన్న సూక్తిలో పై రెండూ అర్థాలు పెనవేసుకుపోయాయి. ధర్మాన్ని మనం రక్షించినట్లయితే అది మనల్ని రక్షిస్తుంది. ధర్మాగ్రహం కావ్యంలో మొదటి ఖండిక 'అంజలి' ఇందులో తమ మాతృమూర్తికి అంజలి సమర్పిస్తున్నాడు. అమ్మ అనే మాటలోనే అమృతం ఉంది అక్షరాలలో మొట్టమొదటిది 'అ' కంఠంలో పుడుతుంది. 'మ' స్పర్శములలో చివరిది రెండు పెదవులను కలిపి తాళం బిగించినప్పుడు పుడుతుంది అందులోనూ ద్విత్వం పెదవులు బిగించి ఉండటంవల్ల ప్రకంపనాలధ్వని చెవులలో తుమ్మెద మోతను వినిపిస్తుంది అటువంటి మాధుర్యం మాటలో కూడా పొందు పరుచుకుంది అమ్మ. సంస్కృతంలో 'ఓం' ఎటువంటిదో తెలుగులో 'అమ్మ' అటువంటిది.

*"ఏ జన్మంబున నోము నోచుకొని తల్లీ కంటివో నన్ను నీ*
*పూజాభాజనమైన గర్భమున దీప్తుల్ సిమ్ము సాహిత్యపున్*
*తేజంబిందు రహింపగా తెలిసెలే నీ స్వాంతంపుటార్ధత్వముల్*
*నా జన్మంబు ఫలించే వ్రాసెద నగణ్యం బైన సాహిత్యమున్"* (**పుట**. 1)

## ధర్మాగ్రహం స్పందన – "స్ఫూర్తిశ్రీ"

కాకినాడలో గానీ, ఆ చుట్టు ప్రక్కల యెక్కడయినా గానీ "కవిగారు" అని అంటే మాత్రం జ్ఞానానందకవి గారనే అర్థం. ఇంకా ఎందరో కవులున్నారు. అయినా ఆ రూఢిమాత్రం జ్ఞానానందకవి గారికే దక్కింది. రోడ్డుమీద సాధారణంగా ఆయన నడిచివెళ్లరు. ఎప్పుడూ సైకిల్ రిక్షామీద ఆరూఢులై వెడుతుంటారు. అప్పుడు కూడా ఆ కూర్చుండే ఠీవి చూచి తీరవలసిందే. హైస్కూలు పిల్లలు దగ్గర నుంచి

సాహిత్యాభిమానంగల స్త్రీల వరకు అందునా పెద్ద ముత్తైదువలు విరగబడి చూస్తూ "కవిగారు కవిగారు" అని చేతులు జోడించి తమలో తాము చెప్పుకుంటూ ఉండడం నేను చాలాసార్లు చూశాను. నన్ను కూడా ఒకరిద్దరు పెద్దవారు "కవిగారు ఊళ్లో లేరా? రోజూ రెండు పూటలా ఇటు వెళుతుంటే చూసేవాళ్ళం రెండుమూడు రోజులనుంచి కనిపించడం లేదు, అని అడిగారు. సాహిత్యానికి ఈ మాటలు అవసరమా? కాదని తెలిసికూడా చెప్పకుండా ఉండలేక చెబుతున్నాను. కవిగారు తమ పరిసరాల్లో ఆ విధమైన ముద్ర వేసుకున్నారు. రోజువారీ జీవితంతో సైతం ఆయన నిండైన కవి. వెనక్కి దువ్విన ఒత్తయిన శిరోజాలు, ఎంతో ముద్దుగా పెంచుకున్న పొడుగుపాటి మీసాలు, వాటిని స్పృశించడానికి దిగివస్తున్నట్టు అనిపించే చెంపలు, మోకాళ్ళు దిగజారి వ్రేలాడే ఖద్దరు లాల్చీ, కొన్ని సమయాల్లో సిల్కు లాల్చీ, అందంగా తీర్చి దిద్దినట్టు కట్టిన పంచె. వీటన్నింటికీ అందం తెచ్చే ధీరగంభీరమైన నడక ఇది నాకు చేతనైనంతలో శ్రీ జ్ఞానానందకవిగారి రూపం.

నేను తటస్థపడినప్పుడు ఆయన అలావాటు చొప్పున రిక్షా పిలుస్తారు. "నాలుగడుగులు వెళ్ళడానికి రిక్షాకావాలా? డబ్బు మరీ దుబారా చేస్తున్నారు. ఇలా అయితే నేను మీతోరాను. నాతోవన నేనుపోతాను" అని ఒక రకమయిన ఆగ్రహం చూపించేవాడిని. ఆయన "అలాగే! నడిచే వెడదాం" అని పిలిచిన రిక్షాను పంపించేస్తూ రిక్షావాని చేతిలో అర్ధరూపాయో, రూపాయో పెట్టేవారు. ఇదీ ఆయనతరహా. "అందరూ నడిచివెడితే ఆ బీదవాళ్ళకి బువ్వ దొరికేదెలా? వాళ్ళు ఒళ్ళొంచి కష్టపడుతున్నారు. ఏ అపమార్గాలలోనూ ప్రవేశించడం లేదు. అందుచేత మనలాంటి వాళ్ళం ఆదుకోవాలి" అని అన్నారు. సామ్యవాదం గురించి గంటలతరబడి ఉపన్యాసాలు దంచేవాళ్ళని చాలామందిని చూశాను. నిత్యజీవితంలో వాళ్ళు ఒక్కపైసా కూడా విదిలించినట్టు చూడలేదు. మహానుభావులు కొందరు లేకపోరు.

జ్ఞానానందకవిగారి ఆ ఒక్కముక్క ఎన్నో సంపుటాల్ని నా ముందు తెరిచిపెట్టింది. జ్ఞానానందకవిగారు "ఆపద్బాంధవుడు" అన్నార్తుల ఆకలితీర్చే అనాథరక్షకుడు అని అనిపించారు.

కవిగారిని నేను కనీసం నలభైయేళ్ళ నుంచి యెరుగుదును. సన్నిహితంగా కూడా యెరుగుదును. ఒక హైస్కూలులో సెకండరీ గ్రేడు తెలుగు టీచరుకు వచ్చే జీతమెంత? ఆయన జీవితవిధానం చూచినవాళ్ళకు ఆశ్చర్యం కలుగుతుంది. వెనక ఆస్తి ఉందేమో అనే అనుమానంకూడా కలుగుతుంది. కటిక నిరుపేదగా కడగండ్ల జీవితం ప్రారంభించారు కవిగారు. తనకొక స్థాయి కలుగుతుందనే ధైర్యం ఆయనకు నిండుగా ఉంది. అందువల్లనే తన నిత్యజీవితం లోనూ బీదతనం గోచరం కారాదని ఆయన నిశ్చయం. తొలిరోజుల్లో స్మశానాలు మాట అలా ఉంచి అప్పులిచ్చేవాళ్ళుకూడా కరువయ్యారు. ఎంతవడ్డీకయినా వెనకాడకుండా కాబూలీవాళ్ళ దగ్గర అప్పు తెచ్చుకొని తాననుకున్న రీతిలో బతుకుదిద్దుకునేవారు. దైన్యమూ హైన్యమూ అనే మాటలు కూడా తన జీవితంలో పొడచూపరాదు. ఆ హుందాతనాన్ని ఆ విధంగానే నిలబెట్టుకున్నారు. తనకు సరస్వతీదేవి అనుగ్రహించిన వరం కవిత్వం, తన కవిత్వంలో కాబూలీవాళ్ళను దయార్ద్రహృదయులని వర్ణించారు. 'అన్నా' అని సంబోధించారు. తీసుకున్నది అప్పే అయినా వడ్డీతో సహా చెల్లించవలసిందే. అయినప్పటికీ అవసరంలో ఆదుకున్నాడన్న కృతజ్ఞత ఆయన అంతరాత్మలో నిలిచిపోయింది.

కూలివానిగా జీవితంలో అడుగుపెట్టిన జ్ఞానానందకవిగారు కళాప్రపూర్ణ వరకు ఎదిగారు. దాదుగా ఇదే శీర్షికతో కవిగారి జీవితచరిత్రను సంక్షిప్తంగా రచించి ఎవరో ప్రకటించారు కూడా. కలం పట్టింది మొదలుకొని ఈనాటివరకు ఆయనచేస్తున్న సేద్యం పద్యం. రెండో మూడో వచన గ్రంథాలు. ఒకటో రెండో గేయ సంపుటాలు లేకపోలేదు అయినా ఆయన ప్రధాన వ్యవసాయం పద్య క్షేత్రంలోనే. ఫలసాయం సంతృప్తిగా లేదని

తెలిసికూడా పట్టువీడని విక్రమార్కునివలె అనవద్య పద్య విద్యకే అంకితమయ్యారు. నన్నయాది ప్రథమా పద్యకవుల మార్గాన్ని స్వాయత్తం చేసుకున్నారు. భువనవిజయ సభల్లో ఆయనను రామరాజభూషణకవిగా ఆహ్వానించేవారు. అయ్యలరాజు రామభద్రుడు, పింగళ సూరన మొదలయిన మహాకవుల స్థానంలో వారిని ఆహ్వానించేవారు. ధరించిన భూమిక యేదయినా దానికి నూటికి నూరుపాళ్ళు ధర్మం చేసేవారు. వేదిక మీద నుంచుని భుజంమీదనుంచి శాలువా వ్రేలాడుతుండగా సింహాసనాసీనుడైన శ్రీకృష్ణరాయలవంక గౌరవ ప్రత్యయాలు పెనవేసుకున్న వాలుచూపు వీలుగా చూస్తూ ఒక చేతిని పైకెత్తి గొంతెత్తి పద్యం చదువుతుంటే సభాస్తారులు "ఆ కవియే అవతరించాడా? అన్నంతగా విస్తుపోయేవారు" కవుల కథలకు రాజుల కథలులొచ్చు అని అన్నారు తిరుపతి వెంకటకవులు. రాజ సమక్షంలో కూడా ఆత్మ ప్రత్యయం వీడని బింకమూ పొంకమూ తగిన రీతిలో అభినయించి ఔననిపించుకున్న సమర్థులు శ్రీ జ్ఞానానందకవిగారు.

ఈ విధంగా చెబుతూపోతే, యిదే ఒకే గ్రంథమవుతుందేమో అన్న భయం కూడా ఉంది. అందుచేత నన్ను నేను నిగ్రహించుకొని ప్రస్తుతానికి రావడానికి ప్రయత్నిస్తాను.

మనచేతిలో ఉన్న గ్రంథంపేరు ధర్మాగ్రహం. ఇది కవిగారి ముద్రిత గ్రంథాలలో చివరిది. అచ్చుకానివీ తయారౌతూ ఉన్నవీ ఇంకా ఉన్నాయి. వారి కవితా భాగీరథి నిర్విరామంగా పొంగులెత్తి స్వర్ణాంధ్రను సస్యశ్యామలం చెయ్యాలని ఆశిద్దాం. ఆకాశమంత యెత్తున్న వానిని ఆశీర్వదిద్దామని చెప్పే చొరవ నాకు లేదు. అయినా మన హృదయాలు ఏకీభవిస్తే దేవతలు తప్పక 'తథాస్తు' పలుకుతారు.

ఈ గ్రంథంలో మొత్తం 24 ఖండికలున్నాయి. వీటిలో ఒకటి ధర్మాగ్రహం. అయితే మొత్తం పుస్తకానికి ఆ పేరే పెట్టడంలో ఔచిత్యం లేకపోలేదు అంతేకాదు,

జ్ఞానానందకవిగారికి తాము వ్రాస్తున్న కవితలు ఏ లక్ష్యంతో వ్రాస్తున్నారో దానిని గుర్తుంచుకునే జ్ఞానం ఉంది. దానితో ఆనందం పొందుతూ, పాఠకులకు ఆనందం అందించే వితరణ గుణం కూడా ఉంది. ఆ విధంగా ఆయన తన పేరును తాము సార్థకం చేసుకుంటున్నారు. కొందరు కవులు భావప్రవాహంలో కొట్టుకుపోతుంటారు. లక్ష్యం విడిచి యెక్కడెక్కిడికో కొట్టుకుపోతుంటారు. ఈ ధర్మాగ్రహ కవిగారు అటువంటి పొరపాటు చేయలేదు. అసలు కవిగానీ వక్తకానీ తాను కొట్టుకుపోవడం కాదు. తనతో పాఠకుల్ని శ్రోతల్నీ తీసుకెళ్ళాలి. ఆ రకమైన పారవశ్యం కలిగించాలి. అదే సద్యః పరనిర్వృతి అన్నారు పెద్దలు.

ఇంతకు ధర్మాగ్రహం అన్నపేరు చూడడంతోనే జాతిపిత గాంధీజీ మనకు ధారాదత్తం చేసిన అహింసాయుధం. అపుర్వాయుధం సత్యాగ్రహం గుర్తుకువచ్చింది. అయితే ఆ కాలంలో కొందరు విరుద్ధార్థాలు తీసినవాళ్ళు లేకపోలేదు. సతియొక్క ఆగ్రహమే సత్యాగ్రహమని అర్థం చెప్పి “చూడండీ మన యిళ్ళల్లో ఆడవాళ్ళకు కోపం వచ్చిందనుకోండి. ఆ పూట భూజనం మానేస్తారు. ఇదీ అలాంటిదే అని భాష్యం కూడా చెప్పిన ప్రబుద్ధులు లేకపోలేదు. దాని అలా ఉంచండి. ఆనాటి సత్యాగ్రహం తన లక్ష్యాన్ని తాను విజయవంతంగా సాధించినదనడానికి చరిత్ర సాక్ష్యం. ఇంతకూ “ఆగ్రహం” అంటే కోపమని ఆంధ్రులకు చప్పున స్ఫురించే అర్థం. సంస్కృతంలోనూ ఈ అర్థం లేకపోలేదు. కాని ప్రసిద్ధమైన అర్థం “పట్టుదల” అని ఇదే ఆర్థంతో ఉత్తర హిందూస్తానీ భాషలు దీనిని వాడుతున్నాయి. ఏతావతా “సత్యం కోసం పట్టిన పట్టు” సత్యాగ్రహం అంటే సత్యదీక్ష అనే తాత్పర్యం. అదేవిధంగా మనకవిగారు ధర్మదీక్ష అన్న అర్థంలో ధర్మాగ్రహం వాడారు. ధర్మాన్ని నిలబెట్టవలసి వచ్చినప్పుడు కోపం తెచ్చుకోవడం మహాపురుషుల లక్షణం. సామాన్య మానవులకయితే కోపం అయినదానికీ, కానిదానికీ అదే వస్తుంది ఆ రకంగా అవిష్టుడైవాడు ఊగిసలాడిపోతాడు ఎన్ని అకార్యాలయినా

చేస్తాడు. మాన్యులు అవసరాన్ని బట్టి శస్త్రం కోపం కూడా సంధించుతారు. అంటే ఆగ్రహం వారి వంశంలో ఉంటుంది కాని దానివశంలోకి వారు పోరని అర్థం. ఇంతకూ ధర్మదీక్షయొక్క ఆవశ్యకతను గుర్తించిన జ్ఞానానందులు తమ పాఠకులకు దానిని ఉపదేశిస్తున్నారు. కేవలం పొడిమాటలతో కాకుండా ఒక గతినీ సంగతినీ గల ఛందోరీతిలో తమ ఉపదేశం కొనసాగిస్తున్నారు. ఇది కేవలం ఒక ఖండికలో మాత్రమే కాకుండా ఈ సంపుటిలోని అన్ని ఖండికలలోనూ సాక్షాత్కరిస్తున్నది."

"ధారణాత్ ధర్మః" అనీ "ధార్యతే అనేన ఇతి ధర్మః" అనీ పెద్దలు ధర్మశబ్దాన్ని నిర్వచించారు. మనం దేనినయితే ధరిస్తున్నామో అది ధర్మమని ఒక నిర్వచనం కాగా, మనల్ని ధరించి నిలబెట్టేది ధర్మమని ఇంకొక నిర్వచనం "ధర్మో రక్షతి రక్షితః" అన్న సూక్తిలో పై రెండర్థాలూ పెనవేసుకుపోయాయి. ధర్మాన్ని మనం రక్షించినట్లయితే అది మనల్ని రక్షిస్తుంది. ఇంతకన్నా లోతుకు పోయి విమర్శించడానికి ఇది సమయమూ కాదు, సందర్భమూ కాదు. ఒక్క మాట చెప్పుకుందాము. "ధర్మం కొంచెమయినా నిలిచి ఉంది కాబట్టే ప్రపంచం ఇంత మాత్రంగా అయినా ఉంది" అని పామరజనులు కూడా చెప్పుకునే మాట! అనుభవం కాచివడబోసిన అమృతసారం.

ఇక్కడ కవిబ్రహ్మ తిక్కన హృదయం గుర్తించుకుందాం.

"సారపు ధర్మమున్ విమల సత్యము పాపముచేత బొంకుచే
పారము పొందలేక చెడబారిన దైనయవస్థ దక్షులె
వ్వార లుపేక్షచేసి రది వారల చేటగు గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్"

ధర్మద్రోహం జరిగినప్పుడు దక్షు లుపేక్ష చెయ్యరాదట! ఉపేక్ష చేస్తే అది వారిచేటుకే కాని సత్యధర్మాలకు నష్టం లేదట! వాటిని కలుగచేస్తూ దైవముంటాడట! అందుచేతనే సమర్థులైనవారు అసమర్థులవలె చూస్తూ ఊరుకోరాదు. షెల్లీ భాషలో కవి

Unrecognized legislator of the world కవి ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యుడు కాని రాజ్య సభాసభ్యుడు కానికాడు. ఆ విధమైన గుర్తింపు అతనికి అక్కరలేదు. అతడు ధర్మసభా సభ్యుడు సత్యసభాసభ్యుడు, అందువల్లనే అతనికి శాసించే హక్కు అధికారమూ ఉన్నాయి. వేదం కూడా కవిం – అనుశాసితారం అని వర్ణిస్తూ ఉంది. దీనిని బట్టి కవి శాసకుడన్నది వేదమ్మతమైన వాక్యం. అందువల్లనే శ్రీ జ్ఞానానందకవి ధర్మదీక్ష వహించి పాఠకులకు ధర్మదీక్ష యిస్తున్నారు. ఈ దీక్షకు మంత్ర తంత్రాలతో పనిలేదు. కవి నిజమైన కవి అయినప్పుడు వాక్ శుద్ధి కలిగిన కవి అయినప్పుడు అతనిమాట మంత్రమై మోగుతుంది. కవిది ష్టటు కలిగినవాక్కు, పట్టుదల కలిగినవాక్కులు ఎంత దుర్లభమైన వస్తువు నయినా సులభంగా పట్టుగలిగినవాక్కు.

జ్ఞానానందకవిగారు ఎన్నుకొన్న మార్గం కూడా ఇదే. తన సోదర ప్రజానీకానికి విన్నవించినా ఆయన సాధనం పద్యం, హృద్యం నిరవద్యం.

ధర్మాగ్రహం సంపుటిలో 1945 నుంచి 1998 వరకు ఉన్న రచనలున్నాయి. ఈ మధ్యకాలంలో కవిగారు రచించిన గ్రంథాలు దరిదాపు 40 ఉంటాయి. వారి శైలిని గుర్తించాలని వారి కవితా వికాసాన్ని గుర్తించాలనీ ఉబలాటపడే పరిశీలకులకూ జిజ్ఞాసువులకూ దీనిని సారసంపుటిగా అందిస్తున్నారు. మొదటి ఖండిక 1945 నాటిది. తమ మాతృమూర్తికి అంజలి సమర్పిస్తున్నారు. అమ్మ అనే మాటలోనే అమృతముంది. అక్షరాలలో మొట్టమొదటిది "అ" కంఠంలో పుడుతుంది. "మ" స్పర్శములలో చివరిది రెండు పెదవులనూ కలిపి తాళం బిగించినప్పుడు పుడుతుంది. అందులోనూ ద్విత్వం పెదవులు బిగించి ఉండడం వల్ల ప్రకంపనాల ధ్వని చెవులలో తుమ్మెద మ్రోతవంటి మ్రోతను వినిపిస్తుంది. అటువంటి మాధుర్యం మాటలో కూడా పొందుపరచుకుంది అమ్మ. సంస్కృతంలో "ఓం" ఎటువంటిదో తెలుగులో అమ్మ అటువంటిది.

"ఏ జన్మంబున నోము నోచుకొని తల్లీ కంటివో నన్ను నీ
పూజాభాజనమైన గర్భమున దీప్తుల్ సిమ్ము సాహిత్యపున్
తేజంబిందు రహింపగా తెలిసిలే నీ స్వాంతంపుటార్ద్రత్వముల్
నా జన్మంబు ఫలించె వ్రాసెద నగణ్యం బైన సాహిత్యమున్"

తనవంటి కొడుకు పూజాఫలంగా లభించవలసినవాడే అయితే తనలో ఉబికిన సాహిత్యతేజం అమ్మమనసులోని ఆర్ధ్రత్వమే అంటున్నాడు. తల్లిపట్ల భక్తి, తనపట్ల విశ్వాసమూ ఎంతగా ఉన్నాయో గుర్తించండి.

"ఆ నాకంబున నీవు వర్తిలుచు విద్యాప్రౌఢ పారంగత
జ్ఞానుల్ దివ్యసభాంతరాళమున విన్నాణంబు చెన్నార నీ
జ్ఞానానందకుమార రత్నము పఠించన్ సత్కరవిత్వంబు నీ
వానందంబున దేలవా? యదియు నాకనందముం గూర్పదా?"

చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. "నువ్వు ఎక్కడున్నవో? అని ప్రశ్నవెయ్యడం లేదు మన కవిగారు. ఆమె స్వర్గంలోనే ఉందన్నది గాఢ నిశ్చయం. అక్కడనుంచి చూచిన తల్లి తన అభ్యుదయానికి సంతోషిస్తుందట. ఆమె సంతోషమే తన సంతోషమట. వాత్సల్యమే అతికోమలమైన రసం. దానిని కవిగారు నిర్వహించిన తీరు మరీ సుతారంగా ఉంది. మొదటిపద్యంలో మొదటిపాదంలో "తల్లీ" అని యతిస్థానంలో సంబోధన వచ్చింది. ఇచ్చటి "ఈ" దీర్ఘం కన్నా దీర్ఘంగా ఉంటుంది. దానిని ప్లుతం అంటారు కవిగారు. చదువుతుంటే ఎదురుగా తల్లి ఉన్నట్టూ ఆయన పిలుస్తున్నట్టూ అనిపిస్తుంది. ఇది పద్యశిల్పంలో ఒక రహస్యం. రెండవ పద్యంలో మూడవ పంక్తి "పఠించన్" అన్నచోట యతిమీద విరుగుతుంది. ఇది నిజమైన విరతి. "విన్నాణంబు చెన్నార" అన్న రెండవపంక్తిలోని అనుప్రాస శ్రవఃపేయంగా ఉంది.

కవిగారు అయ్యదేవర కాళేశ్వరరావుగారి గురించి ఒక కావ్యమే వ్రాశారు. కాళేశ్వరరావుగారు చనిపోయినప్పుడు నాలుగుపద్యాలు వ్రాశారు. ఆ నాలుగూ ఆణిముత్యాలే మొదటి పద్యం చూద్దాం –

"ఒక మహాజ్యోతి భూమికి నొరగునట్లు

నేలపయి నొండు పండాకు రాలినట్లు

తెనుగు ఘనమ్ము గగనాన నెనుబదేండ్ల

వృద్ధయోధుండ రాలిపోయితివి నేడు."

మనస్సుకు సూటిగా తగిలే భావం. మొదటి రెండుపాదాలలోని ఉపమాసామర్థ్యం అనుపమానం. "రాలిపోయితివి" తెలుగు జాతీయం మొత్తం పద్యంలోని నడక భావానికి అనుగుణంగా పట్టుగా సరళంగా ఉంది, "పండుటాకు అని" అనకుండా "పండాకు" అని అనడంలో కవిగారు ఒక ప్రయోజనం సాధించారు.

"మతము" అనే శీర్షికతో ఒక పద్యం వ్రాశారు. "నిక్కమైన మంచినీల మొక్కటిచాలు. తళుకు బెళుకు రాలుతట్టెడేల?" అన్న వేమన్న హృదయం ప్రతిఫలిస్తున్నదీపద్యంలో –

"హితము నెరపనట్టి మతమన్న నదియేల

శాంతి నిడని సాధుసంఘమేల?" అని ప్రశ్నిస్తున్నారు. హితం కలిగిస్తే మతమూ, శాంతినిస్తే సాధు సంఘమూ ఉపాదేయములే అన్నది వీరి ఆశయం. మతం కావాలి మానవతను పడగొట్టడానికి కాక నిలబెట్టడానికి కావాలి. అటుకాని దీన్ని పూడ్చి పెట్టవలసిందే అని కవిగారి నిర్ణయం.

"కవిత పూర్వజన్మ గంధమ్ము వల్లనే

కలుగు గాని చదువులవలన గాదు"

శిరోధార్యమైన సత్యసూక్తి

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు ఆంధ్రపురాణ మహాకవి. రెండే పద్యాలు వ్రాశారు కవిగారు వారిని గురించి "ఈ మధురములగు శబ్దమ్ముల అని మొదలుపెట్టి."

"మధునాపంతుల కవీంద్ర మాన్యాంజలు లౌ"

అని మొదటి పద్యం ముగించారు. "ద థ" లను ప్రాసలో మైత్రి కలిపివాడవచ్చునన్న విషయానికి అది విశద నిదర్శనం. కవిగారి ఛందోమార్మికతకు నిశిత దృష్టికి తార్కాణం.

"ఏరీ నీవలె తెల్గులో రచనలన్ హృద్యానవద్యమ్ముగా
స్వారస్యమ్ములు పండినట్లు రచియింపన్ శాస్త్రివర్యా! కనన్
లేరంచున్ బలుకన్ యథార్థమిదిలే నీ దైన ఘంటాన జా
ల్వారున్ పొంగులువార సత్కవన ధారా నిర్ఝరీ ధోరణుల్"

ఈ పద్యం వినీ వినడంతోనే ఆనాడు శ్రీనాథుడు "ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులు లేరీ నాటి కాలంబునన్" అని మొదలుపెట్టి వ్రాసిన పద్యం గుర్తుకు వస్తుంది. ఈ అభినవ శ్రీనాథుడు సమవుజ్జీగా సవాలుచేసి ఈ పద్యం వ్రాసినట్టు తోస్తుంది. అయితే శ్రీనాథుడు తన్ను గురించి తానే వ్రాసుకున్నాడు. అభినవ శ్రీనాథుడు సమకాలీకుడైన ఆంధ్ర కల్హణుని గురించి వ్రాశాడు.

"స్వర్ణోత్సవవేళలో" అన్న శీర్షికతో బంగారం వంటి సీస పద్యాన్ని రచించారు.

"కనిపింపరాదిట తిన తిండి లేనట్టి
నిరుపేదవాని కన్నీటిబొట్టు
వినిపింపరాదట విశ్వమ్ము గర్హించు
కుటిలచిత్తుని దగాకోరు పలుకు

ధ్వనియింపరాదిట స్వార్థమాశించిన

స్తోత్ర పాటకుని యపాత్ర గీతి

తనియింపరాదిట ధర్మమ్ము నెదిరించు

కపటభక్తుని క్షుధాగర్భతలము

కదులుచున్న ప్రగతి కళ్యాణదేవత

నవ్యభారతమున నాట్యమాడి

జరుగు నేబదేండ్ల స్వర్ణోత్సవాలకు

నుజ్జ్వలంపు టూతమొసగుగాక!"

కవిగారి ఆశలకూ, ఆశయాలకూ అద్దం పడుతున్న పద్యం. కొండ "అద్దమందు కొంచమై యుండదా? అన్నాడు వేమన్న కొంచమే అయినా స్వరూపజ్ఞానానికి సహకరిస్తున్నది. నా ఉబలాట మాపుకోలక నేను వివరించుకోవనడమే కాని ప్రతి పద్యమూ కవిగారిచేతిలో మైనపుముద్దవలే ఒద్దికలు దిద్దుకొని అంతరంగాన్ని ఆవిష్కరిస్తూనే ఉంటుంది. రచనాశిల్లం గురించి ఒక్కమాట శ్రీనాథునికి సీసమంటే యిష్టమని పెద్దలు చాలామంది వక్కాణించారు. మన అభినవ శ్రీనాథునికీ అంతే సీసపద్యంలో జ్ఞానానందకవిగారు ఎన్నెన్నో గతివిన్యాసాలు చూపించారు. నాట్యభంగిమలు ప్రదర్శించరు. కదను తొక్కించారు. ఈ పద్యంలో సీసపాదాలు ప్రాససౌందర్యాన్ని సంతరించుకున్నాయి. కనిపింపరాదిట – వినిపింపరాదిట – ధ్వనియింపరాదిట – తనియింపరాదిట ఈ మాటల్ని చూచి యింకా కొన్ని మాటల్ని ఈ విధంగానే పలికి అవహేళనచేసేవారిని నేనెరుగుదును. ఈ విధమైన నియమంతో సమత చెడకుండా, క్రమత విడకుండా నిర్వహించడం దుర్వహం. ఒకటి రెండు పద్యాలు మాత్రమే కాదు. ఎన్నో ఎన్నెన్నో సీసపద్యాలు కవిగారిచేతిలో కళా సంపదను సంపాదించుకున్నాయి. ఆయనకు ఏవం విధ రచన నల్లేరుపై బండి నడక."

అనేక పర్వదినాలమీద జాతీయ పర్వదినాలమీద కవిగారు ఎన్నో కవితలు వ్రాశారు. ఆకాశవాణి కార్యక్రమాల్లో సాహిత్య సభల్లో ఎన్నో కవితాఖండాల్ని తమదైన బాణిలో వినిపించారు. కవిగారి అంతర్వేదనకూ, సామాజిక స్పృహకూ అవన్నీ నిలువుటద్దాలవంటివే. గోప్యమూ జాప్యమూ లేకుండా తమ నిశ్చిత భావాల్ని స్తవనీయమైన కవిత్వ సరణిలో ఆయన వ్యక్తం చేశారు. మన గ్రంథంలో ధాత–బంగారుభూమి–తెనుగుతల్లి–యువ–భావ–ఆకాంక్ష–బహుధాన–ఈశ్వర ధర్మాగ్రహము మొదలయిన రచనలన్నీ సమాజదర్శనంతో స్పందించిన కవిగారి ఆర్ద్రహృదయం అందించే సందేశమే. ఈ సందేశం కొన్నిచోట్ల జాలిగా, కొన్ని చోట్ల చురుకుగా, కొన్నిచోట్ల సంవేదనంలా, కొన్నిచోట్ల శాసనంలా ఇంకా ఎన్నో విధాలుగా ఉండవచ్చు. ఆవేదనలో చాలాభాగం, ఆవేశంలో చాలాభాగం తనకోసం కాదు, తన జాతికోసమే. స్వార్థం కన్నా పరార్థమే వీరికి పరమార్థం.

"చదువులేనవారు సంఘాలు పెట్టిన
అవసరమ్ము వారి కాశ్రయమ్ము
చదువుకొన్నవాండ్రు సంఘాలు పెట్టిన
నంగనాటితనము తొంగిచూచు"

ఈనాడు న్యాయబలమూ, ధర్మబలమూ కా మందిబలమే అందలమెక్కుతుంది. విద్యావంతలు కూడ అదేమార్గాన్ని అనుసరించడం కవిగారికి అనుచితమని అనిపిస్తున్నది. దానికి మందలింపే పై పద్యం.

వర్ణరహిత సమాజం, వర్గరహిత సమాజం, మతరహిత సమాజం, లౌకిక రాజ్యం, ప్రజాస్వామ్యం – మొదలయిన మాటలు ఈనాడు నిరాఘాటంగా వినవస్తున్నాయి. దాదాపు పైవన్నీ బూటకపుమాటలే, బాటవేరు, మాట వేరు, వాటిలో ఒక విషయాన్ని కవిగారు కుండబ్రద్దలుగొట్టి బయట పెడుతున్నారు.

"కులముల్ లేవని గొంతు చించుకొని పల్కుల్ పల్కు సోదర్యులా
కులపుం బేరున గొప్ప గొప్ప పదవులవ్ గుర్తింపులుబొంది యా
కులమున్ బెంచెద రట్టివారలు దగాకోరుల్ ప్రజాస్వామ్యమం
దలరన్ హైదవజాతి సంస్కృతి ప్రతిధ్వస్తంబు గాకుండునే?"

ప్రజా హృదయాన్ని కవిగారు తనవాణితో ఈ విధంగా వినిపిస్తున్నారు. ఈ ప్రశ్నలు ఒక్క కవిగారివేకాదు. ప్రతిపౌరుని ఆరని చితిని రగుల్కొల్పుతున్న ప్రశ్నలివి –

"ఎవడాపగలడురా? యీ మహాదారుణ
మారణకాండ దుర్మార్గ చరిత
ఎవడాపగలడురా? యీ నిత్య మానభం
గాల దౌర్భాగ్య సంస్కార నికృతి
ఎవడాపగలడురా? యీ యసూయాద్వేష
దుష్టభావుకుల విద్రోహచింత
ఎవడాపగలడురా? యీ భిన్నపార్టీల
కల్లోల తీవ్ర సంఘర్షణమ్ము
ఎవ్వడాపగలడు చివ్వకు కాల్దువ్వు
కులమతాల వృషభ కుంజరముల
తెలుగువారిలోన గల భిన్నభావాల
కూపిరీయవద్దు 'యువయుగాది'!

ఈ ముక్తాయింపుతో ముక్తకంఠంతో తమ ఆవేదననూ, ఆవేశాన్నీ ఆవిష్కరిస్తున్నారు కవిగారు. కావ్యం మీ చేతిలో ఉంది. ఆసక్తితో చదవండి. మన సమాజపు తీరుతెన్నులనూ, ప్రభుత్వాల తీరుతెన్నులనూ కవి యెంత నిశితంగా పరిశీలించారో గుర్తించండి. ఇదేబాటలో నడిచిన యింకొక పద్యం కూడా చూడండి.

"రాజకీయాల నేరాలతో జీవించు

వంచకులాట కట్టించునాడు

అనిశమ్ము స్వార్థమై యనృతాల వచియించు

హీనుల నోళ్ళు మూయించునాడు"

కులమత ఛాందస క్రూర కర్మఠుల దు

శ్చేష్టితాల సమాధి సేయునాడు

విత్తమ్ము నార్జింప పెడత్రోవలను ద్రొక్కు

గూండాల శక్తుల చెండునాడు

ప్రజలలోన అనైక్యంపు భావజాల

ముడుగునాడు నీరాక మాకిడునుగాక

నిర్మలానంద జీవనోన్మేష గరిమ

'యువ' వినూతన వర్ష ప్రభూ! హసాదు!"

ఈ విధంగా నేటి స్థితిని గుర్తించి రావలసిన మార్పును కవిగారు ఖండితంగా చెబుతున్నారు. దోషాలను ఎత్తి చూపడమేకాదు, గుణాలను ప్రస్తుతించడం కూడా కవిగారు ప్రశంసనీయంగా చేశారు. మొదట్లోనే తమ మాతృదేవికి అంజలి ఘటించారు. భారతీయుడుగా భారతదేశాన్నీ ఆంధ్రులుగా ఆంధ్రదేశాన్నీ ప్రశంసించారు. చారిత్రక సత్యాల నెన్నింటినో రసరమణీయంగా కీర్తించారు. భూత భవిష్యద్వర్తమానాలను వంతెనవేసి శ్లాఘపాత్రంగా ప్రవర్తించారు.

మా మిత్రులు సలాది ప్రభంజనస్వామిగారు సరస్వతీదేవి దర్శనం ఈ విధంగా చేశారు –

"అవ్యక్తానంద దోగ్ధ్రీ రసరుచిరమనా స్నిగ్ధ శబ్దార్థరూపా

శశ్వద్ధర్మైకధాత్రీ ప్రణహితకరీ లోకకల్యాణ శీలా

దుర్భావధ్వాంత చాంద్రీ ధ్వనిమధురధునీ సాధువృత్తాంత భూషా

వాగ్దేవీ సేవితవ్యా నియత మనుదినం సర్వకారుణ్యమూర్తిః''

సరస్వతీ దేవికి పది లక్షణాలున్నాయి. ఈ దశలక్షణ లక్షితయైన శారదా దేవిని సహృదయులు నిత్యమూ సేవించాలి. అవ్యక్తమయిన ఆనందక్షీరాన్ని ప్రసాదించేది రసంతో ఉజ్జ్వలమయిన మనస్సు కలది, శబ్దార్థములే స్నిగ్ధమైన రూపంగా కలది, శాశ్వత ధర్మాన్ని ధరించి ఉండేది, ప్రయాణాన్నీ హితాన్నీ కలిగించేది, లోకానికి కల్యాణం చేకూర్చడమే స్వభావంగా కలది, దుర్భావములనే చీకట్లను చెదరగొట్టే వెన్నెలను కాసేది, ధ్వని మధురమై ప్రవహించేది, సాధు వృత్తాంతములనే అలంకారములను ధరించేది, కారుణ్యమూర్తి – యిది స్వామిగారి వర్ణన సారం. ఈ పది లక్షణాలు జ్ఞానానందకవిగారి "ధర్మాగ్రహం" కావ్య సంపుటిలో చక్కగా అమరి ఉన్నాయి. అచ్చమైన, రుచిరమైన, రసానంద ప్రసాదిని అయిన వాగ్దేవిని జ్ఞానానందకవిగారు దర్శించి చిత్రించారు. మనల్ని సేవించి తరించమంటున్నారు. సహృదయ పాఠకులే ఆయా లక్షణాలకు లక్ష్యాల్ని అవగాహన చేసుకొని ఆనందిస్తారని నా ఆకాంక్ష.

కవిగారి ఆత్మీయత ప్రతి ఖండికలోనూ ప్రత్యక్షమవుతూనే ఉంది. కథా కావ్యాల్లో అయితే కవి తటస్థుడై ఉంటాడు. ఏ అర్థాంతర న్యాసంలోనో కొంచెం తొంగిచూస్తాడు. కాని యీ విధమైన ఖండకావ్యరచనలో ఆత్మాశ్రయత్వం అగ్రస్థానాన్ని పొందుతుంది. సహజంగా "నేను" అని మొదలుపెట్టకపోయినా ఆత్మానుభావమే ఆవిష్కృతమవుతుంది. మన కవిగారు లేకుండా "నేను" అని మొదలుపెట్టి స్వీయ వృత్తాంతంకూడా విస్తారంగానే చెప్పారు. దానినీ గమనిద్దాం.

"ఆంధ్రమ్ము తెలగాణ యైకమత్యమునకు

తెలగాణ నేనురా తిరిగినాను

ప్రతిన బూనుచు తెల్గుభాషాభివృద్ధికి

గ్రంథాలు నేనురా వ్రాసినాను

జాతీయ సుకవితా సమ్మేళనములోన

ముదమార నేనురా చదివినాను

మానవత్వపు దివ్యమార్గమ్ము శాంతికి

నెలవని నేనురా తలచినాను

ప్రతిభకును చోటులేని యీ క్షితతలాన

కుల మహావ్యాఘ్రి గాండ్రించు కువలయాన

ఇల్లు వాకిలి లేకనే యీ విధాన

పరమతృప్తియై నేనురా బ్రతుకుచుంటి”

ప్రతి పాదంలోనూ “నేనురా” అనే మాటను ముక్తాయించడం జరిగింది. అది అసలే లేకపోయినా “తిరిగినాను” మొదలయిన క్రియాపదాల వల్లనే అర్థం సులోధమవుతుంది. అయినా కవి యెంత “ధీమా”తో చెప్పారో గమనించడం అవసరం. సీసపద్యంలో అన్నీ సమత కలిగిన పాదాలే. వాటికి అనురూపంగా ఎత్తుగీతలో మొదటి మూడుపాదాలూ దీర్ఘపూర్వకమైన “న”తో అంతమవుతున్నాయి. వెనక చెప్పిన సమత కడదాకా నిలబెట్టుకుంటూ బెట్టుగా పద్యం సాగించడానికి ఇదొక నిదర్శనం.

“పొగెడె నా శారద జగజగ్గ దిలకించి

విశ్వైక కవినాథ విశ్వనాథ

అడిగె నా గ్రంథమ్ము నంకితమ్మై అయ్య

దేవరాన్వయహేలి ధీవరుండు

కడిగె నా శిరమును కనకాభిషేకాన
కర్మవీరుడు బొజ్జ ధర్మరాజు
తొడిగె పెండెరము నా యెడమపాదానకు
రహిని జ్యోతుం సీతరామమూర్తి
ఎందరెందరో సాహిత్య సృష్టికర్త
లెలమి పొగడిరి నాదుకైతలనుగాంచి
శారదాదేవి ఘన కటాక్షమ్ము కలిగె
వసుధ నికపైని నేమికావలయు నాకు?"

"తాంద్రపాపయ్య సర్దారు ధైర్యశ్రీకి
అకారంబైన తాలూక నాది
కవితా విపంచికా గానమ్ము మ్రోగు
పేరొందు పెదపెంకి యూరునాది
గీర్వాణ భారతకృతి రచించిన మహా
కుశలుడౌ వ్యాసర్షి కులమునాది
మహిత లక్షణమైన మానవతా వాద
భావాన నడచెడు త్రోవనాది
ఏసుకవి సార్వభౌముడ; ఏను విశ్వ
నాథ శిష్యుండ; సాహితీ నందనమున
బెడగు కబ్బంపు విరుల గల్పించినట్టి
భువహితుడ; జ్ఞానానందకవిని నేను."

ఆంధ్రకవి పండితలోకంలో ప్రసిద్ధులందరూ జ్ఞానానందకవిగారిని ఎరుగుదురు. విశ్వనాథవారు శిష్యవాత్సల్యంతో చూడగా, జాషువపాగారు సోదర ప్రేమ చూపించేవారు. పెక్కురు ప్రభుత్వాధికారులు, ప్రసిద్ధ ధనికులు జ్ఞానానందకవి కృతి భర్తలై ఆయనకు ఋణపడి ఉన్నారు. శ్రీ దామోదరం సంజీవయ్య, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ మాల కొండయ్య, జస్టిస్ పున్నయ్య ప్రభృతులు వారిలో కొందరు. కవిగారిని ఒక విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ"తో సత్కరించింది. డాక్టరేట్ తో మరొకటి డి.లిట్ తో సత్కరించాయి. కవిగారు ప్రభుత్వంవారి Language Committee లో రెండుసార్లు సభ్యులుగా ఉన్నారు. ఉన్నత విద్యాశాకవారు ఉపవాచకాలు వ్రాయించుకున్నారు. గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు వీరి ఆమ్రపాలి గోలకొండ మొదలయిన కావ్యాలు నవ్య కావ్యాలుగా పురస్కరింపబడ్డాయి. ఢిల్లీ సాహిత్య సమారోహలో తెలుగుకవిగా, జ్ఞానానందకవిగారు తమవాణిని వినిపించారు. సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. వివిధ సాహిత్య పురస్కారాలు వారిని వరించివచ్చాయి. కవి కోకిల నుండి కవి సార్వభౌమ వరకు అనేక బిరుదులు అందుకున్నారు. శ్రీకొంపెల్ల వీరి పద్యాల్ని కొన్నింటిని ఎన్నికచేసి ఆంగ్లీకరించారు. సాహిత్యాభిమానులు కవి గారికి పెద్దయెత్తున కనకాభిషేకం చేశారు. బంగారు గండ పెండారం వేశారు. ఇంకా ఎన్నెన్నో సాహిత్య గౌరవాలు పొందారు కవిగారు.

కవిగారు మాత్రం ఎవరి ఋణమూ తీర్చుకోకుండాలేరు. ప్రస్తుత సంపుటిలోని కృతజ్ఞతాంజలి, గండపెండేరము, ప్రత్యభినందన, గోపీనాథరెడ్డి, సుబ్బరామిరెడ్డి, మల్లెమాల, రసమయి మొదలయిన రచనలు అందుకు నిదర్శనాలు.

తెలుగు సాహిత్యమాణాణంలో అరవైయేండ్లకు పైగా వ్యవసాయం చేస్తున్న నిరంతర కృషీవలుడైన జ్ఞానానందకవిగారి రచనలు వాసిగాంచినవి, రాశికెక్కినవి.

క్రీస్తుప్రబంధము ద్వితీయ సంపుటి ముద్రితం కావలసి ఉంది. వివేకానంద కావ్యం తుదిమెరుగులు దిద్దుకుటూ ఉంది. ఈ గ్రంథాలన్నీ "సంపూర్ణ గ్రంథావళి" పేరున ఒకటి రెండు సంపుటాలుగా రావలసిన ఆవశ్యకత యెంతయినా ఉంది. వదాన్యులు వ్యక్తిగతంగానో, సంస్థాపరంగానో ముద్రణ కార్యక్రమానికి పూనుకోవాలి. జ్ఞానపీఠాసీనులై జ్ఞానానందకవిగారు ఆ పురస్కారాన్ని అందుకొని సాహిత్యానికీ మరింత స్థాయిని పెంచగలరని నా ఆకాంక్ష.

"ఆంధ్రత్వ మాంధ్రభాషాచ నాల్పస్య తపనః ఫలమ్"

## 2.16. దేశబంధు:

ఇది అయ్యదేవర కాళేశ్వర రావు సంక్షిప్త జీవితం. ఇది ఆంగ్ల సాహిత్యం నుండి తెలుగులోకి ప్రవేశించిన ప్రక్రియ. సాధారణంగా జీవిత చరిత్రలు గద్యరూపంలో ఉంటాయి. అయితే, కొందరు ఆధునిక కవులు మహా పురుషుల జీవిత చరిత్రలను పద్యరూపంలో రాశారు. తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరి "మహాత్ముని కథ" అలాంటిదే. ఆ బాణిలోనే జ్ఞానానందకవి అయ్యదేవర కాళేశ్వర రావు జీవిత కథా సంగ్రహాన్ని ఆయన బిరుదు నామమైన 'దేశబంధు' పేరుతో పద్యరూపంలో రచించారు. "ఒక మహాపురుషుని జీవితం చేత మహత్వ లోకమునకు కలిగిన అబ్బురపాటు ప్రేరణ కాగా ఆ మహత్వ విశిష్టతను లోకులకు తెలుపుటకై వ్రాయబడెడి కథయే జీవిత చరిత్ర" అని నా వాణి పేరుతో రాసిన ఉపోద్ఘాతంలో జ్ఞానానందకవి పేర్కొన్నారు. దేశబంధు అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు నిస్వార్థప్రేమ యావత్ తెలుగు ప్రజలకు తెలుసు. ఆయన చేపట్టిన బృహత్ కార్యాలు విస్మరింపరానివి. దేశ స్వాతంత్ర్యానికే గాక ఆంధ్రరాష్ట్ర అవతరణకు, విశాలాంధ్ర స్థాపనకు ప్రత్యేకంగా ఆయన చేసిన సేవ మరువరానిది. తాను మూడు కోట్ల గొంతుకగా గళమెత్తి శంఖారావం పూరించాడు. పంతులుగారు విశాలాంధ్ర మహాసభ స్థాపన సమయంలో

కొంతమంది మూతి విరువక పోలేదు. అయినా పంతులుగారు మాత్రం ప్రజాశ్రేయస్సు కోరి ధర్మదీక్షతో విశాలాంధ్రకై పోరాడాడు. ఈ కావ్యానికి మహాకవి జాషువా ఈ విధంగా ఆశీస్సులు అందజేశారు. "కావ్యాన్ని తుదముట్ట చదివాను నిగ్గుతేలిన రచనతో శ్రీకాళేశ్వరరావు పంతులుగారి జీవితం అక్షరరూపంలో అచ్చైపోయింది. వారే నీకు ఋణసంస్థలు కర్తలు హృదయమిస్తే భర్తలు డబ్బు ఇస్తారు. ఇది కూడా కృషికి తగ్గ ఫలితం కాదు. మన అదృష్టమట్లున్నది. రాను రాను దేశం నిన్ను గుర్తించి నీ మనః క్లేశాన్ని తీరుస్తుంది. అనుమానం లేదు వెనుకంజ వేయక ముందుకు సాగి పోవలసిందే."

ఈ కావ్యంలో ఉపసంహారంతో కలిపి 27 ఉపశీర్షికలు ఉన్నాయి. అవతరణ, వంశము, జననము, బాల్యము, విద్యాభ్యాసము, ఉద్యోగము మొదలైనవి ఆ శీర్షికలు ఉపశీర్షికల సంఖ్య ఎక్కువే అయినా కాళేశ్వరరావుకి జీవితచరిత్ర దృష్ట్యా ఇది లఘు జీవిత చరిత్రే. ప్రథమ ఉపశీర్షిక అవతరణలో కాళేశ్వరరావు జనన కాలంనాటి భారతదేశ స్థితిగతులు కొంతవరకు సూచించబడినాయి. ఒక మహానాయకుని జననాన్ని కోరుతున్న కాలంగా ఈ కావ్యాన్ని సంతరించి  కథా నాయకుని జననానికి, జీవితానికి చక్కని భిత్తికను సమకూర్చారు జ్ఞానానందకవి.

*"అవి మహాభారత క్షోణి రవులు కొన్న*
*విమత రాజన్య పరతంత్ర పీడనంపు*
*జ్వలిత జాజ్వల్యమునకీలల దహింపు*
*నిక్కి నాలుగు దెసలు నిండిన క్షణాలు"* (**పుట**.1)

ప్రముఖ ఆంధ్రనాయకులలో ఎన్నదగిన స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, రాజకీయవేత్త  కాళేశ్వర రావు. 1882 జనవరి 22న కృష్ణాజిల్లా నందిగామలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. తండ్రి లక్ష్మయ్య తల్లి వరలక్ష్మమ్మ. లక్ష్మయ్య మునగాల జమిందారు వద్ద ఎస్టేట్ మేనేజరుగా పనిచేసేవారు. అందువల్ల బాల్యం అల్లారుముద్దుగా గడిచింది. ఎలిమెంటరీ విద్యాభ్యాసానంతరం

ఆయన బందరులో నోబెల్ కళాశాలలో చేరి అక్కడ మొత్తం ఎనిమిది సంవత్సరాలు చదివి 1901లో బి.ఎ పరీక్షలో ప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యాడు.

*"ప్రాభవమ్ము నిడిన నోబిలు కాలేజి*
*యందు సకల విద్య లభ్యసించి*
*యెనిమిదేండ్లు విద్దెగొనిన మీదట గుణ*
*భద్రుడంత పట్ట భద్రుడయ్యె"* (**పుట**. 17)

1902లో తాను చదివిన కళాశాలలోనే కాళేశ్వరరావు ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. 1904 వరకు అక్కడ పని చేసి తర్వాత బి.ఎల్ పరీక్షలో నెగ్గి విజయవాడలో 1906 మొదలు లాయరుగా పని చేయసాగారు.

*"బీయే బియెల్ ప్యాసయి*
*లాయరు పని చేయగ మద్రాసున్ వీడెన్*
*శ్రీయతుడౌ కాళేశ్వరా*
*రాయడు గుంటూరు వచ్చె ప్రాక్టీసునకై"* (**పుట**.25)

4,5 నెలలకే అయ్యదేవర కాళేశ్వరరావు తన నివాసాన్ని విజయవాడకు మార్చారు. జమీందారీ చట్టం విషయంలో ఆయనకు మంచి పరిజ్ఞానం ఉండేది. అందువల్ల జమిందారుల్లో పలువురికి ఆయన లాయరుగా పని చేసి బాగా ధనాన్ని సంపాదించాడు. ఆయన విజయవాడలో పనిచేసేటప్పుడు నాటి (బ్రిటిష్) ప్రభుత్వం ఆయనకు "డిస్ట్రిక్ మున్సిఫ్" పదవిని ఇవ్వజూపింది. కాని స్వేచ్ఛాకాంక్ష కలిగిన అయ్యదేవర కాళేశ్వరరావు దాన్ని నిరాకరించారు. బందరులో ఉపాధ్యాయుడుగా పనిచేసేటప్పుడు అయ్యదేవర మీద రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభావం ప్రసరించింది. దానితో పాటు బ్రహ్మ సమాజ కార్యకలాపాల నిర్వహణ శ్రద్ధ కూడా పెరిగింది. స్త్రీ సమాజ అభ్యుదయానికి, కులభేదాల నిర్మూలనకూ, హరిజనోద్ధరణకూ ఎంతో శ్రమించాడు. స్వహస్త, పరహస్తాల ద్వారా ఎంతో ధనసహాయాన్ని అందించాడు. గాంధీజీ భారత రాజకీయ రంగప్రవేశానికి ముందే అయ్యదేవర బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలోనూ, అనిబిసెంట్ హోంరూల్ ఉద్యమంలోనూ

క్రియాశీలక పాత్ర వహించారు. కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మునగాల జమిందారు లక్ష్మిపతుల స్నేహంలో అయ్యదేవర సంఘసంస్కరణ కార్యకలాపాలు, దానితో పాటు కాంగ్రెస్ పార్టీ ఉద్యమంతో విశేష పరిచయం ఏర్పడింది. ఇంతలో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపునిచ్చారు. దానితో వకీలు వృత్తికి స్వస్తి చెప్పి కాళేశ్వరరావు గారు స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనటం ప్రారంభించారు. అది మొదలు మహాత్ముని నాయకత్వంలో సాగిన అన్ని ఉద్యమాలలోనూ అయ్యదేవర ఉత్సాహంతో పాల్గొని కారాగార శిక్షలు కూడా అనుభవించారు. అప్పట్లో జస్టిస్ పార్టీకి బలమైన స్థావరంగా ఉన్న కృష్ణాజిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం ఆయన కాంగ్రేసు సందేశాన్ని విన్పించి, ఆ జిల్లాలోనూ కాంగ్రేసుకు విస్తృత ప్రజాదరణ కల్పించారన్నది కింది పద్యంలో స్పష్టమౌతుంది.

*"దిగ్దిగంతములు వందేమాతరము ప్రతి*
*ధ్వనులీన నాయకుల్ పలుకు వేళ*
*పొగరు వట్టిన యాంగ్ల జగదీశ సింహమ్ము*
*నెదిరించు మొనగాండ్రు పొదలు వేళ*
*సకల దేహము స్వేచ్ఛా మాతృ దేవికి*
*అర్పించు బాబులు నరుగు వేళ*
*కఠిన దానవ శత్రు కల్లోల శాసన*
*జాలమ్ము దేశమున్ జమురు వేళ*
*వీర భారత జాతి గౌరవ చిహ్నంపు*
*సిడమునెత్తి "తిలకు"శ్రీ లజపతి*
*నాయకత్వమునను నడచిన మార్గమ్ము*
*లవి చరిత్రలోన నధిగమించె."* **(పుట**.2)

అయ్యదేవర రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటూనే భాషా సేవ చేశారు. విజయవాడలోని రామమోహన గ్రంథాలయ స్థాపనకు సహాయం చేసిన ప్రముఖులలో ఈయన ఒకరు. కొమర్రాజు స్థాపించిన 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి'

కార్యదర్శులలో ఒకడుగా ఈయన పని చేశారు. కారాగార జీవితంలో గ్రంథ రచన చేశారు. సంఘ సంస్కరణ, స్వాతంత్ర్యోద్యమాలతో పాటు, ఈయన కార్యక్రమాలతో ముడి పడ్డ ప్రధాన అంశం ఆంధ్రోద్యమం. ఆంధ్ర మహాసభకు తొలి రోజులలో ఈయన కార్యదర్శిగాపని చేసి, 1914న విజయవాడలో మహాసభను జరిపించాడు.

*"భాషా గభీర శుంభ ద్రత్న నిలయాన*
*భావరత్నము లేర్చు పండితుండు*
*పేరొందినట్టి కవిబ్రహ్మలకు వాక్కు*
*నేర్పించు సుకవితా నిపుణ బుద్ధి*
*సంస్కృతాంధ్రాంగ్ల భాషా దేవతల గొప్ప*
*బూలనుముడిచిన మోహనుండు*
*తెలుగు యోద్ధలమహోజ్వల శౌర్య కార్యాల*
*నెత్తి తావ్రాసిన యిద్ద సుకవి*
*ప్రథితవిశ్వనాథ వంశ వారధి రాజు*
*సభకు నాధుడైన సమయమందు*
*కరమునంది కొనియె గాంధీయమరగీత*
*నింపెసంగ కాళికేశ్వరుండు."* (పుట.72)

ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత విశాలాంధ్ర సమితిని ఏర్పరిచి ఆంధ్రదేశ అవతరణకైకృషి చేశారు. ఇలా కాళేశ్వరరావు గారి జీవిత సంఘటనలను క్రమబద్ధంగా సమకాలీన, జాతీయ, ఆంధ్రరాష్ట్ర రాజకీయాలతో సంధానిస్తూ ఈ కావ్యాన్ని నడిపారు. కాళేశ్వరరావు కృషిని వర్ణిస్తూ సాంఘిక దురాచారాలను పరోక్షంగా దుయ్యబట్టారు. జాతీయ భావనను ప్రత్యక్షంగా అభివర్ణించారు. తమదైన ఆంధ్రాభిమానాన్ని వేనోళ్ల చాటారు. జ్ఞానానందకవి ఎంతో ప్రగతిశీల భావ భాస్వంతులైనా జీవిత చరిత్ర కావ్యం కావటం వల్ల కల్పనాశక్తికి అవకాశం లేదు. విషయ నివేదనానికే ప్రాధాన్యత లభించింది. ఏది ఏమైనా పద్య జీవిత చారిత్రాత్మక కావ్యాలలో జ్ఞానానంద కవి

రచించన 'దేశబంధు' కావ్యానికి సముచిత స్థానం ఉంటుంది.

### 2.17. **నా జీవిత గాథ:**

ఇది జ్ఞానానందకవి స్వీయ చరిత్ర. జాషువా కవి తన స్వీయ చరిత్రను పద్యరూపంలో లిఖించారు. ఆ పద్ధతిలోనే జ్ఞానానందకవి కూడా తన స్వీయ చరిత్రను పద్యరూపంలో రచించారు. దీనిని కే.ఆర్.డేవిడ్ దంపతులకు అంకితం చేశారు. 'నా జీవిత గాథ'ను మూడు భాగాలుగా రాశారు. కానీ, అవి నేటికీ అముద్రితాలే. స్వీయ చరిత్ర రచనలో రచయితకు నిజాయితీ అనేది ఉండాలి. తన ఒప్పుల్ని గొప్పగా చెప్పుకోవడం తన తప్పుల్ని ప్రస్తావించకపోవడం స్వీయ చరిత్రకారుల బలహీనత. గాంధీజీ స్వీయ చరిత్ర "My Experience with Truth" లో తన బలహీనతల్ని లోపాల్ని నిస్సంకోచంగా వెలిబుచ్చటం అందరికీ తెలిసిన విషయమే. జ్ఞానానందకవి కూడా నిస్సంకోచంగా ప్రతి విషయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు.

### 2.18.**పర్జన్యం:**

పర్జన్యం శబ్దానికి మబ్బు, మేఘం, ఉరుము, వర్షం, అస్త్రయంత్రం అనే అర్థాలున్నాయి. జ్ఞానానందకవి కావ్యం చదివితే ఆయన ఉరుము, ఉరిమేమబ్బు అనే అర్థాల్ని దృష్టిలో పెట్టుకొని నామకరణం చేశారని ఊహించవచ్చు. "క్షుభితమైన భువనములో స్వైర విహారము సాగించుచున్న కటిక దరిద్ర దేవతా ప్రచండ ధాటి కాగలేక, తూగలేక, సోలి, తూలి సంతగ్లానిచే నీరసిల్లిన మానవ మానవీయ మూర్తుల మహాక్రందన ధ్వానాలను సమాజ ప్రతినిధిగా కవి భగవంతునికి నివేదించిన భావ సంగ్రధనమీ పర్జన్యము". (పర్జన్యం. పీఠిక) అని ఈ కావ్య భూమికలో అన్నారు.

రసహీనుడైన కృతి భర్త మోసం వల్ల చితికిపోయి కవి ప్రజారాజ్యంలో పడుతున్న కష్టాలు, కడు పేదల దీనాలాపనలు, ధనమధాంధతను భుజదర్పం చూపించి నిక్కు చుండిన ధనాఢ్యుల వల్లమాలిన అహంకార చిత్తప్రవృత్తులు చూపించాడు. కార్మిక జనుల దుర్భర జీవితాలు నివేదించి భవిష్యత్ భారత రాజ్యలక్ష్మి పురోగమన స్థితికి ఏవిధమైన ఆటంకములు ఉన్నా వాటిని తొలగించి ప్రపంచ చరిత్రలో భారతజాతి

ప్రతిష్ఠ పరాకాష్టకు చేరాలని జ్ఞానానందకవి దేవునికి నివేదించిన నివేదనే ఈ పర్జన్యము. తన నివేదనను ఆది దేవునికి కింది విధంగా అర్పించాడు.

*"కడలిరాయని మహోగ్రతరంగముల పొంగు*
*కవధిఁగల్పించి యాటాడువాడ*
*గగనమధ్యమున జుక్కల నెల్ల నిర్మించి*
*వెన్న ముద్దలవోలె పెట్టువాడ*
*జననిగర్భమున బుట్టినపాప నొసటిపై*
*భావిజీవిత చర్యవ్రాయువాడ*
*గడ్డి పోచలను సింగారించి మానవా*
*నీకమ్మునకు నీతినేర్పువాడ*
*భక్త వరుల హృదయ వనజాల వసియించి*
*పేదవారి డొక్క వెలితినింపి*
*విశ్వవిశ్వములను వెలుగొందు మహనీయ*
*ఆదిదేవ! నిన్ను నభినుతింతు."* (**పుట**.1)

ఈ కావ్యం నీలం సంజీవరెడ్డికి అంకితం చేయబడింది. ఆయన నలభై ఆరో జన్మదినాన్ని పురస్కరించుకొని అంకిత సభకు కేవలం ఐదుగురు కవులు మాత్రమే ఆహ్వానించబడ్డారు. అందులో ఈయన ఒకరు. కవి సామ్రాట్ విశ్వనాథ వారు ఇలా అభినందించారు. "జ్ఞానానందకవి కవిత మీరంతా విన్నారు ఆయన రచన అర్థం కావాలంటే భాషా జ్ఞానం అవసరం. మధుర కవిత్వం రావాలంటే భగవత్ ప్రసాదం కావాలి." జ్ఞానానందకవి రచనలో మాధుర్యం, స్నిగ్ధత, కూర్పు నేర్పులున్నవి . సాహిత్యపు మెలుకువలు ఎరిగిన వాడు. ఈయన వాడే ప్రాసలు వాడాలంటే పూర్వ జన్మ సుకృతం, అభ్యాససిద్ధి ఉంటే తప్ప రాయటం కష్టం. అలాంటి ప్రాసలు వేయడంలో ఈతనిది అందెవేసిన చెయ్యి. సింహాద్రి అనే విమర్శకుడు ఈ కావ్యాన్ని సమీక్షిస్తూ ఇలా అన్నారు. "వస్తు విన్యాసంలో నేమి అనుభూతి తీవ్రతలో నేమి భావోల్బణంలో నేమి జిగిదేరిన నిండా పలుకు బళ్ళగిల్కరింపులో నేమి సౌహార్థాన్ని, సౌభాగ్యాన్ని,

సర్వోదయాన్ని, శంఖమునెత్తి ఘోషించడంలో నేమి ఈ కవి జాషువా తర్వాత అతని కోవలో ప్రథమగణ్యుడు''.

*"తనకు నచ్చని భావమున జరించినవాని*
*హింసించు కరుణావిహీను డితడు*
*తనమాట కెదురుచెప్పినవాని శ్రేయమ్ము*
*దలపని దేశ బాంధవుడితడు*
*తనసమక్షమున స్తుతిని నోనర్పనివాని*
*బలుకరించని దొడ్డవా డితండు*
*తనపాటకెపుడు తందానయనని వాని*
*బూర్తిగామఱచుప్రబుద్ధుడితడు*
*ఆంజరీకండువా దాల్చి యచటనిలిచి*
*పరమదర్పాన ప్రజల కుపన్యసించు*
*వట్టిజగడాలకోరు కన్పట్టు గనిన*
*నుర్విపృక్షానికే చీడపుర్వితండు."* (**పుట**. 22)

తాను జీవిస్తున్న సమాజంలోని శిఖరాలనూ, లోతులనూ, వెలుతురునూ, చీకటినీ స్వయంగా అనుభవించి ఆవేదన చెంది, గుండెనెత్తురులో కలమద్ది రాసినవే ఈ కావ్యాలు. ఒక్కమాటలో చెప్పాలంటే అచ్చమైన అనుభూతి, అసలైన తెలుగు పలుకుబడి జ్ఞానానందకవిని ఈ స్థాయిలో నిలబెట్టగలిగింది. జ్ఞానానంద కవికి మామూలు విషయాన్ని సైతం భావ సురభిళం చేసే శక్తి ఉన్నందువల్ల ఆయన ఏది రాసినా ఒక్క బిగిని చదవాలనిపి స్తుంది. పద్యం రాయడం ఆయనకు నల్లేరుపై నడక. పలుకుబళ్ళు గంపలకొద్దిగా ఎత్తిచ్చే నేర్పు ఆయనకు ఉంది. ఆవేశానికి, ఊహలకు కొదవలేదు. పట్టిన వస్తువును పగడంగా మార్చే సహజ ప్రతిభ బోలెడంత ఉంది. పర్జన్యం కావ్యాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం బి.ఎస్సి విద్యార్థులకు 1985లో పాఠ్యగ్రంథంగా పెట్టారు. ఈ కావ్య వైశిష్ట్యానికి ఇదే తగిన కితాబు. జ్ఞానానందకవి సమాజం ఎలా ఉండాలో కిందిపద్యంలో వివరించారు.

*"ప్రవహింపవలె హైందవ క్షేత్ర మందెప్పు*

*డమల కారుణ్య గంగామృతమ్ము*

*చరియింపవలె సర్వ భరతకాశ్యపి నంత*

*మహితమౌ సచ్ఛాంతి మారుతమ్ము*

*నివసింపవలె గాంధీ భువనాన చిరముగా*

*శర్మప్రదాయిని ధర్మదేవి*

*వెలయింపవలె కులకలహాల దేశాన*

*పాపభంజక దయాదీపకళిక*

*పరిమళింపవలెను పావన భ్రాతృత్వ*

*భావకుసుమరాజి భారతమున*

*కరుణగల్గుగుండె గలవారిఁగనుజేయ*

*నాథ! నీకు ప్రార్థనమ్మునేతు."* (**పుట**. 8)

## 2.19.గాంధీ [అమరగీత]:

పాశ్చాత్య సాహిత్యంలో 'ELEGY' ఒక సాహిత్య ప్రక్రియ. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ఈ ప్రక్రియకు చెందిన ఉదాహరణలు చాటు పద్యాల రూపంగా కనిపిస్తాయి. ఆధునిక సాహిత్యంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల ప్రత్యేక స్మృతి కావ్యాలు వెలువడ్డాయి. పాశ్చాత్య సాహిత్యంలో కూడా తొలుత మిత్ర స్మృతిగా ఈ స్మృతి కావ్యాలు వెలువడ్డాయి. టెన్నిసన్ 'In Memorium' అలాంటివాటిల్లో అగ్రశ్రేణికి చెందింది. క్రమేపి అది ఇష్టులైన వారి విషయానికి పరిమితమైంది. ఆపై దేశ నాయకుల, మహాపురుషుల మరణాలకు కూడా స్పందించి కవులు స్మృతి కావ్యాలు రాయడం జరిగింది. జ్ఞానానందకవి 'గాంధీ' (అమరగీత) అలాంటిదే. ఇది 1950లో ముద్రితమైంది. లోకబాంధవుడు, ధర్మప్రబోధకుడు, మానవాళి సముద్ధరణకు శాంతి సుస్థిర స్థాపనకు ఆత్మబలిదానం చేసిన మహాత్యాగి, అమరజ్యోతి బాపూజీ ఆత్మ శాంతికై వేల కావ్యాలు వెలిశాయి. "కావ్య రచనకారులగు సుకవి వసప్రియు లమరగీతులంబాడి జగజ్జనకు నారాధించి ఋణము దీర్చుకొనిరి" అని జ్ఞానానందకవి

అమరగీత కావ్యం భూమికలో రాశారు. స్వేచ్ఛా సమర ప్రాంగణంలో అహింసా ఖడ్గం శాంతి భేరి మోగించి దేశీయులను మేల్కొపి శాంతిగానం పాడుకొన్న జగత్ విఖ్యాత గాంధీ హతాన్మరణం విని పరితాం ఆపుకోలేక స్పందించిన భావ అశ్రుకణ బిందుసందోహమే అమరగీత.

శాంతి, సత్యం, అహింస అనే త్రిరత్నాలతో సత్యాగ్రహం అనే ఆయుధం కాని ఆయుధంతో బ్రిటిష్ పాలకుల్ని ఎదురించి నిలిచి గెలిచి తన దేశ జనుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడిన ఘనుడు ఆయన. అంతటి మహోన్నత వ్యక్తి నాథూరాం గాడ్సే అనే వాడి కాల్పులకు గురై కన్నుమూశారు. యావత్ భారతజాతి కన్నీళ్ళు కార్చింది. అశ్రుతర్పణాలు ఇచ్చింది. కవిగా స్పందించి జ్ఞానానంద కవి ఆ అమరజీవి 'స్మృతి' చిహ్నంగా ఈ గాంధీ కావ్యాన్ని రచించారు. పైపైన చూస్తే ఈ కావ్యం స్మృతి కావ్యంలా అనిపించదు. ప్రబోధకావ్యంలా అనిపిస్తుంది. కానీ కవి ఆ మహాత్ముని మరణ వాస్తవాన్ని జీర్ణించుకోలేక ఆక్రోశించినట్లు సహృదయ పాఠకులకు అవగతమవుతుంది. ఈ కావ్యాన్ని జ్ఞానానందకవి అయ్యదేవర కాళేశ్వరరావుకు అంకితం చేశారు. ఈ కావ్యానికి విశ్వనాథ సత్యనారాయణ  పీఠిక రాశారు. "శ్రీ జ్ఞానానంద కవి వ్రాసిన 'గాంధీ' యన్న చిఱుపొత్తము చదివి మిక్కిలి యానందించితిని హరిజనులలో మఱి యొక గొప్పకవి జన్మించినాడనిపించింది" అని పీఠికలో పేర్కొన్నారు. భరతమాత దాస్యశృంఖలాలు ఛేదించటానికి భారతజాతిని గాంధీజీ మేల్కొల్పాడు. ప్రజలను స్వాతంత్ర్య పోరాటానికి సంసిద్ధులను చేసిన ఆయన పాత్ర మరువరానిది. మహాత్ముని మరణం వల్ల భారతజాతి స్వేచ్ఛా సౌఖ్యాల్ని కోల్పోయిందని కవిగారు ఇలా చెప్పారు.

*"కలదే? భారతజాతికీ పుడమి సౌఖ్యం బింత స్వాతంత్ర్యముం*
*గలదే? నీ మధురోక్తియో గుణనిధానా! మాకు విన్పించునే?*
*బలియై నావె? తుపాకి గుండులకు బాబా! శాంతి సన్యాసిమొ*
*క్కులతో మేమిక బూజ చేసెదము నీకుం దల్లికస్తూరికిన్."* (**పుట**.1)

ఏ జాతికి సత్యాగ్రహం, అహింస నేర్పావో ఆ జాతే నిన్ను చంపుకుందని కవి తన ఆవేదనను వ్యక్తం చేశారు.

*"ఘన సత్యాగ్రహ మంత్రం*

*బును స్వాంతంబున జపించి మద్దునహింసన్*

*జనముల కందయగ నీ*

*జననము వలె నినుఁజంపినారు సత్య సుభాషీ"* (**పుట**. 9)

'జాతస్య మరణం ధ్రువం' అని భగవద్గీత వచనం. పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదు. మనిషిగా పుట్టిన ప్రతి జీవికి అన్వయించే అధికార సూత్రం ఇది.

*"ఎంత మౌనీంద్రులైనా యీ పృథివిలోన*

*బుట్టి చచ్చెదరిది సృష్టిబోధ సుమ్ము"*

కవిగారి తాత్త్విక దృష్టి దీనిలో వ్యక్తమవుతుంది. పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నది కవివాక్కు. ఎవరు ఎంతటివారైనా మరణద్వారం దగ్గర అందరూ సమానులే. స్మృతి కావ్యాలలో స్మరింపబడే వ్యక్తి గొప్పతనాన్ని తలంపులోకి తెచ్చుకోవడం సర్వసాధారణ విషయం. జ్ఞానానందకవి కూడా అలాగే గాంధీజీ గొప్పతనాన్ని స్మరించారు.

*"పలుకరించెనె దాదభాయి నారోజి కాం*

*గ్రెసు సంస్థ నిర్మాయి కీర్తికామి?*

*మురిసిపోయెనే ముదాంబుధిఁ దేలి లజపతి*

*రాయుడు భారత నాయకుండు*

*కౌగలించెనె నిన్ను గాంచి మోతీలాలు*

*పండితుండు ప్రమోదభరితుడగుచు*

*కీలు మోడిచెనె గోపాలకృష్ణయ్య స్వా*

*ర్థత్యాగి తెనుఁగురత్నాలమూట*

*పరవశుడయెనె మా భగవత్తుసింగు*

*ప్రశు భవచనాల నీనెనె సుత్రామ సమితి*

*యైదు మూరల గావంచ యయ్యగారు*

*నేమమా? మాకు నా స్వర్గసీమలోన"* (**పుట**. 16)

జ్ఞానానందకవి గాంధీజీకి అర్పించిన కవితా జ్యోతే గాంధీ – అమరగీత.

## 2.20.క్రీస్తుశతకం:

సంస్కృత సాహిత్య ప్రక్రియ శతకం. అయినా ఆ భాషలో ఈ ప్రక్రియకు లేని ప్రాచుర్యం తెలుగులో లభించింది. తెలుగు శతక ప్రక్రియా చరిత్ర దాదాపు ఎనిమిది వందల సంవత్సరాలు. ఈ సుదీర్ఘ కాలంలో దాదాపు ఐదువేలకు పైగా శతకాలు రచింపబడ్డాయి. ఆధునిక కాలంలో కూడా ఆదరణ కోల్పోని ప్రాచీన ప్రక్రియ ఇది. జ్ఞానానంద కవి 'యేసుక్రీస్తు' పేరుతో శతకం రచించారు. దీనిలో నూటొక్క పద్యాలు ఉన్నాయి. పద్యాలన్నీ ముక్తకాలే. విషయం బైబిల్ బద్ధమైంది. మకుటం లేదు. రచన ఆత్మాశ్రయ పరమైంది. ఇది 1963లో ముద్రితమైంది. ఆదాం, అవ్వలు చేసింది చిన్నలోపమే అయినా ఒప్పుకోలేదు. లోకం అంతా పాపం అనే సముద్రంలో మునిగిపోతున్నప్పుడు మనిషిగా పుట్టి లోకాలు ఆశ్చర్య పడేటట్లుగా శిలువని ఎక్కావు ప్రభూ అంటూ ఇలా కీర్తించారు.

*"ఆదామవ్వలు సల్పినట్టి పిసరంతై నట్టి లోపానికే*
*కాదన్నావు యెహోవ రూపమున లోకంబంత పాపాబ్ధిలో*
*నీదన్నావు కుమార రూపమున క్షోణింబుట్టి నీ ప్రాణమున*
*మోదానన్ దృజించినావు భువనమ్ముల్ పొంగనిల్పన్ ప్రభూ"* **(పుట**.2)

క్రీస్తు ప్రబోధించిన వేదాంత మర్మాల్ని ప్రజలు ఆసక్తితో మూడు రోజులు నిద్రాహారాలు మాని విన్నారని ఒక పద్యంలో చెప్పారు. గొల్లలు యేసు జననాన్ని దేవదూతల వల్ల తెలుసుకుని ఆనంద పరవశులై నిన్ను పూజించారు. మృత్యువుని జయించిన యేసుప్రభూ అని కవి కీర్తించారు. ఎంత చిమ్మచీకటి కమ్ముకున్నా, కష్టాలు కలిగినా, భయంకర రోగాలు సోకినా నిన్ను భజిస్తే అవి తొలగిపోతాయి, స్వస్థత చేకూరుతుంది అని జ్ఞానానందకవి క్రీస్తు మహాత్మ్యాన్ని చాటారు. ఈ చరాచర సృష్టి అంతా భగవదాధీనమే అనీ, దాన్ని మానవులు గ్రహించలేకపోతున్నారు అనీ జ్ఞానానందకవి తెలిపారు.

*"నీ యుద్దేశములన్ గ్రహింప తరమా నిక్కముగా నీశ్వరా*
*నీయత్యద్భుత చేష్టలన్ తెలియ లేనేలేము లోకేశ్వరా*
*నీయవ్యాజ కృపావిశేషములకున్ జేయెత్తి పూజింతునో*
*నీయాశీస్సుల దన్ప గోరెదను తండ్రి క్రీస్తు మృత్యుంజయా"* (**పుట**. 25)

క్రీస్తుకు సంబంధించి తెలుగు శతకాలలో మేలైనది 'యేసుప్రభు' శతకం. బైబిల్ ఘట్టాలను రసరమ్యంగా, సురుచికరంగా, అల్పాక్షరాలలో అనల్పార్థరచనగా కవి సృష్టించారు.

2.21. **షెడ్యూల్డ్ కులాలు అంటరానివారా**?:

ఇది సాహిత్యానికి సంబంధించిన విషయం కాదు. పూర్తిగా సమాజానికి సంబంధించిన విషయం. సామాజిక వ్యవస్థకు సంబంధించిన గ్రంథం భారతీయ సామాజిక వ్యవస్థ సౌధానికి నాలుగుకాళ్ళు 'చాతుర్వర్ణ వ్యవస్థ'. దానికి అనుబంధంగా కలిసిన వర్ణం 'పంచమ వర్ణం'. వర్ణ వ్యవస్థను పేర్కొన్న ఋగ్వేద పురుష సూక్తం నుంచి స్మృతి గ్రంథాలదాకా చాతుర్వర్ణ వ్యవస్థే ఉంది. ఆ మీదటే పంచమ వర్ణం ఏర్పడటం జరిగింది. క్రమేపి అది బలపడి కొన్ని 'కులాల' వారిని అంటరానివారిగా అంటే అస్పృశ్యులుగా పరిగణించడం ప్రారంభమైంది. అది ఈనాటికీ ఏదో ఒక రూపంలో కొనసాగుతోంది. ఈ వివక్షను నిరసిస్తూ, ఆ అభిప్రాయం తప్పు అని చెప్తూ జ్ఞానానందకవి ఉదాహరణగా వివరించిన గ్రంథమే 'షెడ్యూల్డ్ కులాలు అంటరానివారా?. కేవలం హరిజనులే కాదు భారతరాజ్యాంగం పేర్కొన్న ఇతర షెడ్యూల్డ్ కులాల గురించి కూడా కవి పరిశోధించి, వేదకాలం నుంచి మూలాల్ని తవ్వి సప్రమాణికంగా నిరూపించాడు. ఈ రోజు షెడ్యూల్డ్ కులాలు అనబడుతున్న కులాలు వాస్తవంగా భారతదేశంలో జన్మించిన తెగలనీ, బయటి నుంచి వచ్చిన ఆర్యులు వారిని ఆక్రమించి ఈ వర్గ, కుల, వ్యవస్థలని ఆరోపించారనీ కవి తెలిపారు. మూలవాసులు ఆర్యులు పేర్కొన్న ప్రజలే 'బయటి నుంచి వచ్చి, స్థానికుల్ని అంటరానివారిగా, సమాజ బాహ్యులుగా చిత్రీకరించారని కవి సప్రమాణంగా నిరూపించారు. ఏవి ప్రామాణిక గ్రంథాలని మనం ఈనాడు నమ్ముతున్నామో వాటి నుండి ఉదాహరణలిస్తూ వర్ణ

వ్యవస్థలోని అక్రమాల్ని కవి బయటపెట్టారు. వర్ణపరంగా ప్రసిద్ధమైన ఆయాశబ్దాల అర్థాన్ని నిగ్గుదేల్చి విడమర్చి చెప్పారు. ఋషుల జాతకాల్ని బయట పెట్టారు. గోత్రాల్ని తవ్వారు. మూలాల్ని విడమర్చి వివరించారు. షెడ్యూల్డ్ కులాలు అంటరాని వారు కాదు అని నిరూపించారు.

## 2.22.ఆమ్రపాలి:

జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' కావ్యాన్ని ప్రాచీన ఆంధ్ర కవుల సంప్రదాయాన్ని అనుసరించి ఎనిమిది ఆశ్వాసాల కావ్యంగా తీర్చిదిద్దారు. ఆశ్వాస విభజన ప్రాచీన కవులదే. ఇది వారి సంప్రదాయ పాలనకు నిదర్శనం. ప్రథమాశ్వాసం 'అవతరణము' ఇందులో అది సూర్యాస్తమయ సమయం ఆ సమయంలో వనవిహారానికి బయలుదేరిన శాక్యధనునికి ఆమ్రవనం (మామిడితోట)లో ఒక పసిపాప దొరుకుతుంది. దిక్కులేని ఆ పాపను అక్కున చేర్చుకొని అతడు ఇంటికి తీసుకుని వెళతాడు. సంతాన హీనులైన తమకు భగవంతుడు ప్రసాదించిన వరంగా ఆ దంపతులు భావిస్తారు. ఆమ్రవనవాటికలో దొరికిన బిడ్డ కావటం చేత ఆ పాపకు 'ఆమ్రపాలి' అని పేరు పెట్టారు.

విద్యాభ్యాస దశకు చేరుకొన్న ఆమ్రపాలి ఎంతో శ్రద్ధతో సంగీతం, సాహిత్యం మొదలైన లలిత కళల్లోనూ, తత్వశాస్త్రంలోనూ, ఇంకా ఆనాటి సంఘంలో స్త్రీకి అర్హమైన అన్ని విద్యలతో పాటు క్షాత్ర విద్యలోనూ చక్కని జ్ఞానాన్ని నేర్చుకుంది దానిని జ్ఞానానందకవి కింది పద్యంలో చిత్రించారు.

*"భారతమౌని యశస్సు పదికాలముల జాటు*
*నాట్య శాస్త్రములోని నాణ్య మెరిగి*
*సురలోక వాసుల సొత్తైన కమనీయ*
*గాంధర్వ విద్యలో గణన కెక్కి*
*నలువ చెలువ కృపాకలన వేయి విధాల*
*సాహిత్య జగతిలో సంచరించి*
*ఘనత గాంచిన తపోధనుల ప్రోక్తములైన*

*తతమహావిజ్ఞాన గతుల నేర్చి*

*నాటి సంఘమునందు మేటి గౌరవమున్న*

*స్త్రీల కర్హమైన తీరులందు*

*చదువు సాములందు క్షాత్ర విద్యలయందు*

*తనరె నేర్పు శాక్యధని తనూజ."* (**పుట**.4)

అందచందాల్లోనూ, గుణగణాల్లోనూ తలమానికమైనది. తండ్రి తనతో పాటు తనయను కూడా పూజా పురస్కారాలకు తీసుకెళ్ళేవాడు. అట్టి సందర్భాలలో ఆమె దేవాలయములలో నృత్యాలు చేసేది. అది లిచ్చావీరాజుల పరిపాలనా కాలం (వైశాలినగరం) అధికారగర్వం, అహంకార దర్పం మూర్తీభవించిన యువరాజులు ఆమె అందానికి లోనయ్యారు. ఆమెను తమదిగా చేసుకోవాలని తలచారు. లిచ్ఛవుల ప్రవృత్తి శాక్యధనుడికి బాగా తెలుసు. అందువల్ల వాళ్ళ నుండి తన కుమార్తెకు ఎలాంటి ఆపద వస్తుందో అని భయపడినప్పటికి తన ఆవేదనను ఎప్పుడు పైకి చూపించేవాడు కాదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తన కుమార్తెకు పెళ్ళి చేయాలనేది అతని కోరిక. శాక్యధనుడి ఆలోచన ఇరుగు పొరుగుతో ప్రారంభమై నలుగురిలో పాకి నగరమంతా వ్యాపించింది. అపురూప సౌందర్యరాశి, కళాకోవిదురాలు అయిన ఆమ్రపాలి పట్ల ఆశలు పెంచుకున్న యువకుల మనస్సుల్లో దిగులు ప్రారంభమైంది. శాక్యధనుడు కుమార్తెకు 'స్వయంవరం' ప్రకటించడంతో ప్రథమాశ్వాసం ముగుస్తుంది.

ద్వితీయాశ్వాసంలో స్వయంవర సభ. ఆమ్రపాలి తండ్రి శాక్యధనుడు తన అహ్వానాన్ని మన్నించి స్వయంవర మహోత్సవంలో పాల్గొనటానికి వచ్చిన వైశాలి పురాధీశ్వరులైన లిచ్ఛవీ రాకుమారులకు ఆహ్వానం పలికి తన ఆనందాన్ని వ్యక్తీకరించాడు. తన కూతురు ఆమ్రపాలి అతిలోక సౌందర్యరాశి, మహాశ్రేష్ఠురాలు. అన్ని కళలలోను ప్రావీణ్యం సంపాదించిన ప్రతిభాశాలి బంగారు మేలుతీగ అని చెప్పి ఆమెకు వివాహం చేయటానికే ఈ స్వయంవర సభ ఏర్పాటు చేశానని చెబుతాడు. ఆమ్రపాలి వివాహితయై ఎవరో ఒక్కరికే దక్కటం జీర్ణించుకోలేని లిచ్ఛవులు కోపంతో రెచ్చిపోయి "ఈ అతిలోక సుందరికి పెళ్ళేమిటి? స్వయం వర సభ ఏమిటి? ఆమె ఎవరో ఒక్కనికే భార్య కావటానికి వీల్లేదు. ఆమె అందరికి అనుభోగ్య కావాలి" అని ఒక

లిచ్ఛవీ రాకుమారుడొకడు ప్రతిపాదిస్తాడు. దానిని అందరూ సమర్థిస్తారు. శాక్యధనుడు ఆందోళనకు గురై కింది విధంగా వేడుకుంటాడు.

*"ఇట ధర్మదేవతానటి దయానందమ్ము*
*దయివార నాల్గుపాదాల నడిచె*
*ఇట సాంఘీకాచార చటులాంగనామణి*
*నిజ భావమునకు పన్నీరు జల్లె*
*ఇట నైకమత్య కళేందిర హాయిగా*
*పొరపొచ్చెములు లేక తిరుగసాగె*
*ఇట వర్ణభామ యుత్కట మాన్య భావాన*
*కలుపు గోలుతనమ్ము వెలువరించె*
*ఆర్ష ధర్మ మతమహా శాంతి జలదమ్ము*
*చిలికెనిచట నమృతశీకరములు*
*రాచ కొమరులార! ప్రార్థింతు మిమ్ముల*
*ధర్మ మెరిగినట్టిధాత్రి మనది."* **(పుట.** 16)

ఆమ్రపాలి తండ్రి శాక్యధనుని కోరిక ఛిన్నాభిన్నమైంది. లిచ్ఛవ రాకుమారుల అనుచితమైన, అధర్మమైన, ఆమోదయోగ్యం కాని ప్రతిపాదన ప్రాణం పోసుకుంటుంది. బిడ్డలను కన్న తల్లిదండ్రులు వినగూడని, ఏ ఆడబిడ్డకూ జరగకూడని అన్యాయం ఆమెకు జరుగుతుంది. అయిష్టంగానే 'గణభోగ్య' గా అంగీకరిస్తుంది.

తృతీయాశ్వాసంలో ఆమ్రపాలి శృంగారపు రంగరింపులో వైరాగ్యపు చిహ్నాన్ని గుర్తించి, ప్రశాంతత కరువై, ఆమ్రవనంలో సేద తీరాలని ప్రయత్నిస్తుంది. ఆ ఆమ్రవనిలో బుద్ధదర్శనం అవుతుంది. తాను అక్కడే తన తండ్రికి దొరికింది. బుద్ధుని అందాల్ని, అంగాంగ సౌష్టవాన్ని ఆశ్వాసిస్తుంది. తన ఇంటికి అహ్వానిస్తుంది. చిరునవ్వులు చిందే బుద్ధుని పెదవుల నుండి జాలువారిన 'బోధ' ఆమ్రపాలి గుండె లోతుల్ని త్రవ్వుతుంది. 'రాగాన్ని–భోగాన్ని త్యాగం చేసిన ఆ మహామనిషి అందించిన అమృతం – ఆమ్రపాలి గుండెల్ని తాకుతుంది. ఆమె మోహం కరిగిపోతుంది. ఆత్మీయ

ప్రబుద్ధ దాహం పెరుగుతుంది. బుద్ధుని ధర్మాన్నే, కవి సుదర్శనం అని అన్వర్థ నామకరణం చేసారు.

చతుర్థాశ్వాసంలో బుద్ధుని దర్శనంలో అంకితమౌతుంది. ఆమ్రపాలిలో అంచలంచెలుగా పశ్చాత్తాపం ప్రజ్వలించడం ప్రారంభమౌతుంది. తనకోసం కట్టించిన అద్దాల మేడలో చిత్రకళలు వేసిన చిత్రకారులకు దోసిట నిండుగా బంగారు నాణేలు పోసి వారిని సన్మానించి తృప్తి పరచి వారి ఆశీస్సులు అందుకుంటుంది. ఆ కళాఖండాల్లో ఆమెను అమితంగా ఆకర్షించిన చిత్రపటం బింబిసారుడిది. అతడు మగధ చక్రవర్తి.

*"అందాలు మోహాలుకదలింపగ జేయు*
*బొమ్మ గాంచి యెదంద మురిసిపోయి*
*సహనాలు మోక్షాలు సాక్షాత్కరించెడు*
*పటమును దిలకించి ప్రణతి నేసి*
*పాఠాలు నాట్యాలు పరవశ మ్మొనరించు*
*చిత్రమ్ము నీక్షించి స్మిత మొనర్చి*
*శౌర్యాలు క్రౌర్యాలు చాటింపగలయట్టి*
*చిత్తరువును గాంచి చెమ్మగిల్లి*
*నాటి రాజ్యమందు నర్తించునట్టువుల్*
*వర్తకావతంసప్రభృతి వరులు*
*శౌర్య సింహులై సమ్రాట్టు చిత్రాల*
*గనె ముదాన శాక్యధని కుమార్తె."* **(పుట.** 37)

మొదటి చూపులోనే జన్మజన్మలబంధం పెనుబంధంలా ముడి వేసుకుంటుంది. అతడు లిచ్ఛవులకు బద్ధ శత్రువు. ఎలాగైనా బింబిసారున్ని తన భవనానికి రప్పించుకోవాలని ప్రభలమైన కోరికతో చింతనం ఆరంభమౌతుంది.

పంచమాశ్వాసంలో ఆమ్రపాలి రహస్య ఆహ్వానం మేరకు బింబిసారుడు సేనాని గోపుని రక్షణలో వైశాలి నగరానికి వెళ్ళి ఆమెతో ఐదురోజులు పాటు ఉంటాడు. వెళ్ళేటప్పుడు బింబిసారుడు ఒక ఉంగరం ఇచ్చి ఒకవేళ బిడ్డపుడితే ఆ ఉంగరంతో

బిడ్డను పంపమని చెప్పి వెళ్తాడు. తల్లి ప్రబోధంతో, తాత శాక్యధనుని ఆశీస్సులతో ధైర్య, స్థైర్య శౌర్యాలు మూర్తీభవించి తండ్రి బింబిసారున్ని చేరాడంటూ 'ఆహ్వానం' పూర్తయింది.

షష్ఠమాశ్వాసంలో బుద్ధుడు వైశాలి నగరానికి రావటమే ఆగమనం. శాంతి, సత్యం, దయలు, ఆయన బోధన సారాంశాలు. సాంసారిక మాయ మోహబంధాలు ఆయన వర్ణించిన బంధకాలు. బుద్ధుని రాకతో పుట్టిన రొద ఆమ్రపాలి భవన ప్రాంగణంలో సొదపెట్టింది. ఆమ్రపాలి అంతకు ముందు బుద్ధుని కలయికతో తన 'కలక' ఎలా తొలగిపోయింది, గుర్తుచేసుకొని ఆయనకు 'భిక్ష' వేసే నెపంతో చెలికత్తె వెంట వెళుతుంది. ఆనందుడు వారు వేశ్యలని ఆప చూస్తాడు కానీ బుద్ధుడు పాపి అనటం వల్ల వాళ్లు మరింత పాపులవుతారు అని భావించి ఆమె ఇంటికి భిక్షకొస్తానంటాడు. అనుకోని అభయాన్ని పొంది ధనవంతుల ఆశలపై నీళ్లు చల్లుతుంది. కమ్మని చెవులూరించే షడ్రసోపేతమైన విందు తయారుచేసింది. బుద్ధుడు మాత్రం ఆమె తినే అటుకుల్నే తిని ఆమెను ఆశీర్వదిస్తాడు. శిష్యులు ఆ విందును స్వీకరిస్తారు.

సప్తమాశ్వాసంలో ఆమ్రపాలి పెట్టిన విందు వైశాలి నగరానికి తెలిసింది. తాను గణభోగ్యగా త్యాగమయ జీవితం గడిపింది. కానీ, బుద్ధుడి ధర్మమార్గంలో ధన్యురాలిని అయ్యాయని ఆనందించింది. బుద్ధునికి తన తండ్రి యిచ్చిన, తాను పుట్టిన మామిడితోటనే దానం చేస్తుంది. ఆమ్రపాలి బౌద్ధాన్ని స్వీకరిస్తుంది. ఆమె కుమారుడు అంతకు ముందే బౌద్ధ సన్యాసిగా మారుతాడు.

అష్టామాశ్వాసంలో ఆమ్రపాలి వితరణతో ఆమ్రవనం బుద్ధుని బోధనామృతంతో తడిసింది. ధర్మమార్గం – ఉత్తమ శీలం – మంచి ఆలోచనలు మొదలైన అష్టాంగ మార్గాలే కాదు బౌద్ధ త్రిశరణాలు కూడా అక్కడ ప్రతిధ్వనిస్థాయి ఇది కావ్య ముగింపు.

జ్ఞానానందకవిగారి లఘుకావ్యాలలో ఆమ్రపాలి అద్వితీయ కావ్యం. ఈ కావ్యం 1972లో తొలిసారి ముద్రితమైంది. ఈ కావ్యం 1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతిని పొందింది. 1972-74 సంవత్సరాలలో ఈ కావ్యం

ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు సెకెండ్ లాంగ్వేజ్ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించబడింది. ఇంకా ఉస్మానియా విశ్వవిద్యాలయం, పి.డి.సి విద్యార్థులకు, మైసూరు విశ్వవిద్యాలయం బి.ఇ.డి. తెలుగు ఆప్షనల్ విద్యార్థులకు ఇది పాఠ్య గ్రంథంగా నిర్ణయించబడింది. ఇది ఈ కావ్య వైశిష్ట్యం.

## 2.23.గోల్కొండ:

గోల్కొండను పరిపాలించిన కుతుబ్‌షాహి వంశీయుల చరిత్రలో ఆణిముత్యాల్లాంటి ఐదు వృత్తాంతాల్ని స్వీకరించి జ్ఞానానందకవి 'గోల్కొండ' కావ్యాన్ని నిర్మించారు. చారిత్రక సంఘటనలు కవి చేతిలో కమనీయ కళాకాంతులు సంతరించుకొని సుందర శిల్పాలై నిలిచాయి. ఈ కావ్యం ఐదు శీర్షికలలో ఉంది 1. అవతరణము, 2. మీర్ జుమ్లా, 3. తానీషా, 4. అక్కన్న-మాదన్న, 5. రామదాసు ఈ రచన మొదటి ముద్రణ 1963లో జరిగింది. కవిగారు గోల్కొండను గురించి 'కావ్యభూమిక'లో ఇలా పేర్కొన్నారు. "మహోజ్జ్వలమై మహోన్నతమై, మహనీయమైన కమనీయమైన లోకమున ధగద్ధగాయమాన కాంతులతో మిఱుమిట్లు గొలిపిన గోల్కొండ పౌరాతన్య వైభవరాశి కుదా హృతముగా జీర్ణమై చూర్ణమై నిలిచియున్న నేటి శైధిల్యాకృతుల దిలకించి కలిగి నలిగి విలపించిన నా కనుగొనలలో నశ్రుకణాలు రాలినవి. గుండియలో వేదనాభార జ్వాలామాలికలు నాలుకలు చాచినవి. నాకలము వీణియలను మీట ప్రయత్నించింది. ఆ మీటిన వీణియలే స్వరాలు పలికించినవి. ఆ పలుకులే గోల్కొండ కావ్య సరస్వతి మధుర మంజుల, మంజీర శింజనీ రవాలు".

"తెలుగుజాతి మనుగడకు సురూపురేఖలు తీర్చిదిద్దిన తానీషా గోల్కొండను కనులారా గాంచిన నేను కన్నీరు నించితిని. తన్నీర సార భూతమే గోల్కొండ కావ్యరచనా నిర్మాణమునకు దారి జూపినది" అని జ్ఞానానందకవి (గోల్కొండ. పీఠిక) కావ్యరచనా ప్రేరణను తెలియజేసారు.

★★★

# మూడవ అధ్యాయం

# జ్ఞానానందకవి రచనలు - జాతీయ నాయకుల సామాజిక సేవ

**పరిచయం:**

ఒకే దేశంలో నివసిస్తూ, ఒకే తెగకు చెంది, ఒకే భాష, సంస్కృతి, ఆచారవ్యవహారాలు కలిగి ఒకే రాజకీయ వ్యవస్థకు కట్టుబడి నివసించే ప్రజలకు జాతి అని పేరు. ఈ దృష్టితో చుస్తే మనదేశంలో ఎన్నో జాతులు ఉన్నట్లు చెప్పవలసి వస్తుంది. జాతులు ఎన్ని ఉన్నా అన్ని జాతులు ఒకే రాజకీయ వ్యవస్థకు కట్టుబడి ఉన్నారు కనుకనే భారత జాతి అని వ్యవహరిస్తున్నాము. NATION అనే ఆంగ్ల పదానికి తెలుగులో సమానార్థక పదం జాతి. NATION అనే పదం నేటస్, నేషియో అనే లాటిన్ పదాల నుండి పుట్టింది. నేటస్, నేషియో అంటే పుట్టుక అని అర్థం.

లార్డ్ బ్రైస్ జాతిని ఈ విధంగా నిర్వచించాడు "జాతీయత భావాలు ఉన్న ప్రజలు ఒక రాజకీయ వ్యవస్థగా ఏర్పడి స్వతంత్రత కలిగి లేదా స్వాతంత్ర్యం కోసం వాంఛించేదే జాతి" అంటే ఒక జాతిగా ఒక దేశ ప్రజలను పిలవాలంటే వారికి జాతీయ భావాలు కలిగి ఉండి, రాజకీయ విభాగంగా రూపొంది, స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండాలి. లేదా స్వతంత్ర కోరిక బలంగా ఉండాలి. అలా ఉంటేనే అది జాతిగా పిలవబడుతుందని బ్రైస్ భావన. 1947కి పూర్వం భారతదేశాన్ని ఒక జాతిగా పిలువవచ్చు ఎందుకంటే భారతీయ ప్రజల్లో జాతీయత లక్షణాలు ఉన్నా అది ఒక రాజకీయ విభాగంగా రూపొందింది కాని స్వతంత్ర రాజ్యం కాదు. అయినా స్వాతంత్ర్యం కోసం దానికున్న బలీయమైన కోరిక భారతీయులను ఒక జాతిగా ఏర్పరచింది.

హన్స్ కోన్ అనే రచయిత జాతీయతను ఇలా నిర్వచించాడు. "తన జన్మ భూమికి ఎప్పుడూ వినయంగా ఉండి, అవ్యాజమైన ప్రేమ కలిగి ఉండటం. ఆ నేలను, అక్కడి సంప్రదాయాలను, చారిత్రకతను, అభిమానిస్తూ గాఢమైన అనురాగం ఉండటం" ఇదే జాతీయత. జన సమూహంలోని సామాజిక ఐక్యతా భావాన్ని

జాతీయత అంటాము. ఒకే నివాస స్థలం, ఒకే భాష, ఒకే మతం, ఉమ్మడి చరిత్ర, ఉమ్మడి సంస్కృతి సంప్రదాయాలు జాతీయత భావాన్ని కలుగజేస్తాయి.

భిన్న మతాలకు, విభిన్న సంస్కృతులకు, వివిధ భాషలకు నిలయం భారతదేశం. కొన్ని సందర్భాలలో మత పరమైన కలహాలు ఏర్పడవచ్చు, భాషా సంబంధమైన కలహాలు లేదా మరో కారణంగా అభిప్రాయ భేదాలు కలుగవచ్చు. అయినా తాము ఒకే జాతికి చెందిన వారమన్న భావానికి భంగం కలగకపోవడం గొప్ప విశిష్టత. ఇక్కడ జాతి శబ్దం ప్రత్యేక అర్థంలో వాడబడింది. ఒకే రాజకీయ వ్యవస్థలో నివసించే ప్రజా సమూహం అనే విశాల అర్థంలో వాడబడుతున్నది. అలాంటి భావం జాతీయత అనే పేరుతో వ్యవహృతం అవుతుంది. నిజానికి భారత ఉప ఖండంలో సుమారు మూడువేల జాతులు ఉన్నట్లు భావిస్తున్నారు. అప్పుడప్పుడు అక్కడక్కడ జాతి వైషమ్యాలు చెలరేగినప్పటికి మళ్ళీ అందరిని ఈ జాతీయ భావం సమైక్య పరచడం ఒక అద్భుతం అనవచ్చు. భిన్నత్వాన్ని అధిగమించి ఏకత్వాన్ని సాధించడంలోనే మన సంస్కృతి వైశిష్ట్యం అవగతమవుతుంది. ఆ వైశిష్ట్యమే మన జాతీయతను రక్షించగలుగుతుంది.

అంగ, వంగ, కళింగాది నామములతో ప్రాచీన భారతంలో వివిధ దేశాలు వర్ధిల్లినా ప్రాచీన భారతీయులు 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అని భావించారు. ఈ ఉదాత్త భావన మన ప్రాచీనుల జాతీయతా దృష్టికి, వారి మాతృ దేశ అభిమానానికి నిదర్శనం. మనమందరం ఒక్కటే అనే సమిష్టి భావం, దేశాభిమానం జాతీయతలోని రెండు ప్రధానాంశాలు. ఈ రెండు అంశాలు జాతీయత భావానికి దేహం ఆత్మ వంటివి. దేశాభిమానం దేహమైతే సమిష్టి భావం ఆత్మ వంటిది. ఈ రెంటిలో ఏ ఒక్కటి లోపించినా జాతీయత భావానికి భంగం కలుగుతుంది.

వివిధ భాషా ప్రాంతాలకు చెందిన జాతీయ కవులు దేశ స్వాతంత్రాన్ని , సమైక్యాన్ని మనసార అభిలషించారు. పూర్వం మతం ప్రాతిపదికగా జాతీయ భావం నెలకొనగా ఆధునిక యుగంలో జాతీయ భావం ప్రాతిపదికగా విభిన్న మతస్థులు, వివిధ ప్రాంతాలవారు ఏకం కాగలిగారు. జాతీయ కవుల దృష్టిలో స్వాతంత్ర్యానురక్తి ప్రాణ సమానం. జాతీయ భావం, స్వాతంత్ర్యానురక్తి ఈ రెండింటిలో ఏది మొదట

ఆవిర్భవించింది అని నిలదీసి అడిగితె సమాదానం చెప్పడం కొంచం కష్టమే. ఈ రెండు ఇంచు మించు ఒకే కాలంలో కలిగిన భావాలుగా పేర్కొన్నా స్వాతంత్రానురక్తిదే పై చేయిగా కనిపిస్తుంది. దేశభక్తి, స్వాతంత్రానురక్తి, అఖిల భారత దృష్టి, జాతీయ దృక్పథం మొదలైన విశిష్ట గుణాలు కలిగి జాతిని ఉత్తేజ పరిచే కవితలు రాసినవారు జాతీయ కవులు అవుతారు. అలాంటి కవులలో యస్. టి. జ్ఞానానందకవి ఒకరు. జ్ఞానానందకవి రచనలు పరిశీలించిన విమర్శకులు, పరిశీలకులు ఈయనను దళిత కవిగా కంటే జాతీయ కవిగా ఎక్కువ మంది గుర్తించారు. దళిత సమస్యతోపాటు ముఖ్యంగా చారిత్రక, జాతీయత, జాతీయోద్యమం, జాతీయోద్యమ నాయకులు మొదలైన వాటిని తన రచనల్లో ఎక్కువగా చిత్రించారు. భారత జాతిని జాగృతం చేసిన మహానీయులను, దేశనాయకులను, సంస్కర్తలను, సాహితీవేత్తలను, గురుతుల్యులను కీర్తించారు. దేశ సమైక్యత గురించి 'ఆహ్వానము' కావ్యంలో ఇలా చెప్పారు.

*"ఒక దేశమ్ము సమైక్య మా ప్రజల యందుందున్ ప్రజాస్వామ్య మం*
*దుకు రాణించు జనాళి గుండియలందున్దేశ భక్త్యాంకురా*
*లకు తావున్న యాదొక్క శోభనిజముల్ నర్తింప పాలించునా*
*యకు లున్నన్ పనిలేదు చెప్పగా సమైక్యంమ్మున్ ప్రతిష్టింపుడి."* (**ఆహ్వా.పుట**. 2)

## 3.1.నెహ్రు:

ఆహ్వానము అనే కావ్యంలో 'నెహ్రు' అనే ఖండికలో జ్ఞానానందకవి నెహ్రు చేసిన సేవను పేర్కొన్నారు. భారతదేశంలో సంపన్న న్యాయవాది, రాజకీయ వేత్త మోతిలాల్ నెహ్రు కుమారుడు జవహార్ లాల్ నెహ్రు. ఈయన యువకుడిగా ఉన్నప్పుడే భారత జాతీయ కాంగ్రెసులో వామపక్ష నాయకుడయ్యారు. బ్రిటీషు సామ్రాజ్యం నుండి సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జనకు అనుకూలుడైన నెహ్రు మహాత్మాగాంధీ సలహాలతో ప్రజాకర్షణ కలిగిన సంస్కరణవాద నాయకుడిగా ఎదిగి కాంగ్రెసుకు అధ్యక్షుడయ్యాడు. దీర్ఘకాలం కొనసాగిన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య పాత్ర వహించి గాంధీగారి రాజకీయ వారసునిగా గుర్తించబడ్డారు. జీవిత పర్యంతం స్వేచ్ఛావాదిగా ఉన్న నెహ్రు పేద దేశాల దీర్ఘకాల ఆర్థిక అభివృద్ధి సమస్యలు ఎదుర్కోవటానికి నిలకడతోకూడిన సామ్యవాదం మరియు ప్రభుత్వ రంగం అనుకూలమని

భావించారు.ఆగష్టు15,1947లో భారతదేశం స్వాతంత్ర్యం సంపాధించినపుడు న్యూఢిల్లీలో స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసే గౌరవం దక్కిన ఏకైక భారతీయుడు నెహ్రూ. పార్లమెంటరీ తరహ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం మొదలైన సుగుణాలతో గుర్తింపు పొంది పేద, అణగారిన వర్గాల పట్ల నెహ్రూ రూపొందించిన భారతదేశ సిద్ధాంతాలు నేటికీ ప్రభావం చూపుతున్నాయి. ఇవి నెహ్రూని సామ్యవాద మూలాలతో ప్రపంచాన్ని అవలోకనం చేసుకోవడాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రధానమంత్రి, కాంగ్రెసు నాయకుడైన నెహ్రూ తన పార్టీ సభ్యుల ఆధిక్యత ద్వారా హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు ఉద్దేశింపబడిన అనేక న్యాయ సంస్కరణలు ఆమోదింపచేసారు. ఈ సంస్కరణలలో వివాహ కనీస వయోపరిమితిని పన్నెండు నుండి పదిహేనుకు పెంచడం, మహిళలను వారి భర్తలనుండి విడాకులు పొంది, ఆస్తి వారసత్వం పొందేలా శక్తివంతం చేయడం, వినాశకరమైన వరకట్నాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాడు. ఆయన సుదీర్ఘ పదవీకాలంలో సంప్రదాయాలు, స్వతంత్ర భారతదేశ విధివిధానాలు రూపొందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయనను కొన్ని సందర్భాలలో 'నవ భారత రూప శిల్పి' గా కింది పద్యంలో చిత్రించారు.

"*గాంధీజీ పర్యవేక్షణలో విమర్శనా*
*దృక్పథమ్ములను నేరిచిననాడు*
*విశ్వకవీంద్రుని విజ్ఞానవాహినీ*
*సలిలాల స్నానము సలుపునాడు*
*తండ్రి మోతీలాలు ధర్మ శిక్షణ కళా*
*శాల పాఠాలు నదువునాడు*
*పాశ్చాత్య దేశాల ప్రగతి యీ దేశాన*
*తాండవింపగ దిద్ద తలచునాడు*
*ఎన్నో శ్రమల నోర్చి ఈ దేశ ప్రోజ్జ్వలో*
*జ్జ్వలపు భావి కొఱకు శాంతి కొఱకు*
*నడుము గట్టి కంకణము దాల్చినాడవు*
*సీమ భూపతులకు జిరతిరుగ."* **(అహ్వా. పుట.**9)

3.2.గాడిచెర్ల:

ఆహ్వానము కావ్యంలో 'గాడిచెర్ల' అనే ఖండికలో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు నడిపిన జాతీయోద్యమాన్ని, గ్రంథాలయోద్యమాన్ని జ్ఞానానందకవి కవితాత్మకంగా చిత్రించారు. ఆంధ్రులలో మొట్టమొదట రాజకీయ ఖైదీగా పేరుపొందినది గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీ కారుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా ఆయన తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించాడు. ఆయన సేవను జ్ఞానానందకవి కింది పద్యంలో చూపించారు.

*"శ్రమలెన్నో నిను జుట్టుకొన్నను సరే సాధించి గ్రంధాలయో*
*ద్యమదీక్షసవనమ్ము సల్పిన సముద్యద్దివ్యభావాత్మ యు*
*త్తమ జాతీయ సమైక్య సౌరభము లాంధ్రానన్ గుభాలింప మా*
*ర్గమ్ము జూపించిన త్యాగమూర్తివి నమస్కారమ్ము సర్వోత్తమా."*

(అహ్వా. పుట.61)

1883 సెప్టెంబర్ 14 న కర్నూలులో భాగీరథీబాయి, వెంకటరావు దంపతులకు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జన్మించాడు. వారి పూర్వీకులు కడప జిల్లా సింహాద్రి పురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య చదివాడు. ఇంకా చదువుకొనే ఆర్థిక స్థోమత లేకున్నప్పటికీ ప్రతిభా పారితోషికాల సహాయంతో 1906లో మద్రాసులో ఎం. ఎ డిగ్రీ పూర్తి చేశాడు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుండగా 1907లో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. రాజమండ్రిలో బిపిన్ చంద్ర పాల్ చేసిన ఉపన్యాస స్ఫూర్తితో విద్యార్థులందరూ వందేమాతరం బ్యాడ్జిలు ధరించి తరగతికి వెళ్లారు. వీరికి నాయకుడైన సర్వోత్తమ రావును కళాశాల నుండి బహిష్కరించడమే కాక ఆయనకు ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తరువాత ఆయన పత్రికా రంగంలోకి అడుగు పెట్టాడు. 'స్వరాజ్య' అనే తెలుగు పత్రికను ప్రారంభించి బ్రిటీష్ పాలనపై విమర్శలు ప్రచురించారు. 1908లో తిరునెల్వేలిలో పోలీసు కాల్పుల్లో

ముగ్గురు మరణించినప్పుడు క్రూరమైన విదేశీ పులి అనే పేరుతొ రాసిన సంపాదకీయం పై ప్రభుత్వం కోపగించి ఆయనకు మూడేళ్ళు జైలు శిక్ష విధించింది. ఆ విధంగా ఆయన ఆంధ్రులలో ప్రప్రథమంగా రాజకీయ ఖైదీ అయ్యాడు. వెల్లూరు జైలులో బందిపోట్లు, గజదొంగలు ఉండే గదిలో ఆయనను బంధించి అమానుషంగా వ్యవహరించారు. ఆయన జైలు నుండి విడుదలయ్యాక కూడా బ్రిటీష్ ప్రభుత్వం ఆయనపై ప్రత్యేక నిఘా వుంచేది. ప్రజలు ఆయనతో మాట్లాడటానికి కూడా భయపడేవారు.

*"బిట్టదరన్ బ్రిటీషుపృథ్వీపతు లెల్లరు ముక్కుమీద వ్రేల్*
*పెట్టుకొనంగ నీవొసగు బెట్టుజవాబు తెలుఁగుజాతికిన్*
*తట్టుచు మేలుకొల్పినది ధన్యుడవయ్యమహానుభావ! నీ*
*మెట్టిన మార్గమందున సుమించును జ్ఞానలతాంత గంధముల్."*

**(అహ్వా. పుట.61)**

1914లో బాలగంగాధర తిలక్ హోంరూల్ లీగ్ ఆంధ్రరాష్ట్ర కార్యదర్శిగా విస్తృత ప్రచారం చేసాడు.1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభల సమయంలో హిందూస్థానీ సేవాదళ్ ఏర్పాటులో ఆయన ప్రముఖపాత్ర వహించాడు. 1927లో కాంగ్రెసు అభ్యర్థిగా నంద్యాల నియోజక వర్గం నుండి మద్రాసు కౌన్సిల్ కు ఎన్నికయ్యాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసాడు. 1930 నుండి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ, తనకెంతో ప్రీతిపాత్రమైన గ్రంథాలయోద్యమం వైపు దృష్టి మరల్చాడు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితాంతం అధ్యక్షుడిగా ఉన్నాడు. గ్రంథాలయోద్యమ చిరునామ గాడిచెర్ల అని కింది పద్యంలో చెప్పారు.

*"తెలుగువారల గేహాల వెలిగినట్టి*
*నవనవోన్మేషచైతన్య నవ్యభావ*
*దీపికా గ్రంథనిలయాల తేజమునకు*

*కారణము చెప్పగా నీవు గాడిచెర్ల"* **(అహ్వా. పుట.61)**

గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించాడు. వారికి శిక్షణా శిబిరాలు నిర్వహించాడు . ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించాడు. దాని తరపున రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసాడు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమే కాక, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కూడా చూసి, 1960 ఫిబ్రవరి 29 న గాడిచర్ల హరిసర్వోత్తమ రావు మరణించాడు. ఆయన స్మారకార్థం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలసింది.

*"గాడిచెర్ల వంశ్య గ్రంధాలయోద్యమ*
*సారథీ తెలుంగుజగతి నీదు*
*శతజయంతి సభల జరుపుట గ్రంధాల*
*యాలచరిత దీప్తి కాలయమ్మ."* **(అహ్వా. పుట.**62)

పత్రికా రచయితగా, సంపాదకుడిగా, పుస్తక రచయితగా ఆయన చేసిన కృషి బృహత్తరమైనది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, మరాఠీ మొదలైన భాషలు కూడా ఆయనకు వచ్చేవి. ఎం.ఏ చదివే రోజుల్లోనే ఆయన సాహితీ వ్యాసంగం మొదలై జీవితాంతం కొనసాగింది ఎన్నో కొత్త పదాలు సృష్టించాడు.

3.3.**ఠాగోర్**:

విజయాభిషేకము కావ్యంలో 'ఠాగోర్' అనే ఖండికలో రవీంద్రనాథ్ ఠాగోర్ గురించి పేర్కొన్నారు. 1861మే 7 వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు పద్నాలుగో సంతానంగా రవీంద్రనాథ్ ఠాగోర్ జన్మించాడు. ఇతని బాల్యం చాలా చోద్యంగా గడిచింది. ఆముదం దీపపు వెలుగులో పుస్తకం పట్టుకొని తూలుతూ చదివేవాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌదర్యాన్ని చూచి ఆనందించేవాడు. కథలంటే చెవి కోసుకొనేవాడు. సామాన్య దుస్తులతో నిరాడంబరంగా పెరిగాడు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడలమధ్య ఉండడంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచం ఒక రహస్యమనీ ఆ

రహస్యాన్ని తెలుసుకోవాలని కుతూహలపడేవాడు. ఆయన కవిత్వాన్ని జ్ఞానానంద కవి ఇలా చెప్పారు.

*"మంజులము మధుర మోహన*
*రంజనము ప్రభావిభాసరాజసము తమో*
*భంజనము నీదు కవితకు*
*వ్యంజనము రవీ కవీ మహావిశ్వకవీ."* (**విజ. పుట**. 31)

రవీంద్రుడు బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించాడు ఆయన రచించిన 'సంధ్యాగీత్' కావ్యాన్ని కవులందరూ మెచ్చుకొనేవారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర చటర్జీ కూడా రవీంద్రుడిని ప్రశంసించాడు. రవీంద్రుడు రచించిన భక్తి గీతాలను తండ్రి విని వాటి ప్రచురణకు అవసరమైన డబ్బు ఇచ్చేవాడు. రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండిపోక బాలల హృదయాలను వికసింపచేయటానికై ప్రాచీన మునుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్ గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అది ఐదుగురు విద్యార్థులతో మొదలై క్రమంగా విస్తరించింది. చిన్న పిల్లలు ఉపాధ్యాయుల ఇళ్ళలో భోజనం చేసేవారు. ఉదయాన్నే నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని తమ గదులను తామే శుభ్రం చేసుకొని స్నానం చేయడం, ప్రార్థన చేయటం, నియమిత వేళలలో నిద్రపోవటం వారి దినచర్య. ఆరోగ్యం కాపాడుకోవడం, పరిశుభ్రత, సత్యాన్నే పలకడం, పెద్దలను గురువులను గౌరవించడం వారికి నేర్పారు. 1919లో ఆయన కళాభవన్ ను స్థాపించారు. ఇక్కడ విద్యార్థులు విభిన్న కళలను నేర్చుకునేవారు. అతనితో స్నేహం ఎలాంటిదో కింది పద్యంలో చెప్పారు.

*"నీగూఢార్థచయమ్ము విశ్వ జనతానీకమ్ము శ్లాఘించె నో*
*ఠాగోరూ! సుకవీద్గజేంద్రము! యశోలంకార! నీ గుండె*
*మ్రోగెన్ విశ్వ హితైకడిండిమ రవంబుల్ దేశ దేశాలలో*
*నీ గీతాంజలి కంజలించెదరు తండ్రీ! విశ్వ విద్యాలయ"* (**విజ.పుట**. 32)

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని రవీంద్రుడు భావించాడు అందుకోసం శ్రీనికేతాన్ని నెలకొల్పి గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. రవీంద్రుడు మొదట 'వాల్మీకి ప్రతిభ' అనే నాటకాన్ని రచించాడు. తరువాత 'అమల' అనే పిల్లవాని గురించి 'పోస్టాఫీసు' అనే నాటకం రాశాడు. రవీంద్రుడు రచించిన 'చిత్రాంగద' నాటకం ఆయనకు మంచి పేరు తెచ్చింది. 'ప్రకృతి–ప్రతీక' అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించాడు. రవీంద్రుడు కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటిర్ పూజ మొదలగు అనేక శ్రేష్టమైన నాటకాలు రచించాడు. మతాలు వేరైనా పరస్పర స్నేహంతో కలసి మెలసి ఉండాలి అనే సాంఘిక ప్రయోజనం, ఉత్తమ సందేశం మిళితమైన 'గోరా' నవల రవీంద్రునికెంతో పేరు తెచ్చింది. తన రచనలను మహాత్ముడంతటి వాడే మెచ్చుకున్నాడు అనే విషయాన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో చెప్పారు.

*"లలితకళాప్రసూనములు రంజిలగా భువనైకమోహనో*
*జ్జ్వలముగ నేర్పించితివి శాంతినికేతన మీయజాండమం*
*దలరగ హైందవక్షితి మహాత్మునియంతటివాడు నిన్ను మేల్*
*కొలిచెను నీప్రభావమునకున్ ఘటియింతుము మానమస్కృతుల్"* **(విజ. పుట.** 32)

రవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలున్నవాడు. హిందూ మేళాలో దేశభక్తి గీతాలను పాడాడు. పృథ్వీరాజు పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించాడు. బ్రిటీష్ ప్రభుత్వం తిలక్ ను నిర్బంధించినప్పుడు రవీంద్రుడు తీవ్రంగా విమర్శించాడు. బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమంలో రవీంద్రుడు ప్రముఖపాత్ర వహించాడు. జాతీయ నిధికి విరాళాలు వసూలు చేశాడు. ఠాగోర్ 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెసు సదస్సులో మొట్టమొదటగా బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరాన్ని ఆలపించాడు. రవీంద్రుడు రాసిన జనగణమనను జాతీయ గీతంగా ప్రకటించే ముందు వందేమాతరం, జనగణమనలపై దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలి అనే సుదీర్ఘ చర్చ జరిగింది. కొన్ని తర్జన భర్జనలు జరిగిన తరువాత అంతిమంగా రవీంద్రుడి జనగణమన దే పై చేయి అయింది. దీంతో రాజ్యాంగసభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ 1950 జనవరి 24న

జనగణమనను జాతీయ గీతంగా, వందేమాతరంను జాతీయ గేయంగా ప్రకటించారు. అదే సమయంలో రెండూ సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయని స్పష్టం చేశారు. రవీద్రుని జయంతిని, సాహిత్య స్మరణను కింది పద్యంలో పేర్కొన్నారు.

*"ఈ నూతైడుల నీ జయంతిసభలే యీ విశ్వమందెల్లడన్*
*ఆనందమ్ము సాగుచున్నయవి నీదైనట్టి సాహిత్యవి*
*జ్ఞాన శ్రీని స్మరింపగా మురిసి నీ సంస్కార సంభూతి వి*
*ద్యా నైపుణ్యము లుగ్గడింపగ రవీంద్రా! సాహితీ వల్లభా"***(విజ.పుట**. 30)

తన జీవితంపై రవీంద్రుని ప్రభావమెంతో ఉందని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా చెప్పుకొన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనపుడు రవీంద్రుడు మానసికంగా కృంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యాడు. వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ చికిత్స కోసం కలకత్తా నగరానికి వెళ్లాడు కానీ ప్రయోజనం లేకపోయింది. రచయితగా, సంగీతకునిగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతావేత్తగా ఠాగూర్ చరిత్రలో నిలిచిపోయాడు. మాతృభూమి, మానవసంబంధాల పట్ల అచంచలమయిన నమ్మకం, ప్రేమాభిమానాలు కలిగిన విశ్వకవి 'రవీంద్రనాథ్ ఠాగూర్, 1941 ఆగష్టు 7న మరణించాడు.

3.4.**గాంధీ**:

జ్ఞానానందకవి 'విజయాభిషేకం' కావ్యంలో గాంధీగారి సేవను కవిత్వీకరించారు. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ 2 వ తేదిన గుజరాత్ లోని పోర్ బందర్ లో ఆచారాలు బాగా పాటించే ఒక సామాన్య సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి కరంచంద్ గాంధీ తల్లి పుతలీబాయి. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ నెమ్మదిగా ఉండే బాలుడు. చిన్నతనం నుండే అబద్దాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేశాడు. 13 ఏండ్ల వయస్సు లో అప్పటి ఆచారం ప్రకారం కస్తురిభాయితో వివాహం జరిగింది. వీరికి నలుగురు పిల్లలు. చదువులో గాంధీ మధ్యస్థమైన విద్యార్థి. పోరు బందర్, రాజ్ కోట్ లో ఆయన చదువుకున్నాడు. 19 సంవత్సరాల వయస్సులో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించచడానికి

1888 లో గాంధీ ఇంగ్లాండ్ వెళ్ళాడు. తల్లికిచ్చిన మాట ప్రకారం ఆయన మాంసాహారానికి, మద్యానికి, స్త్రీ సాంగత్యానికి దూరంగా ఉన్నాడు. అనేక మతాల పవిత్ర గ్రంథాలను చదివాడు. ఈ కాలంలోనే ఆయన చదువు, వ్యక్తిత్వము, ఆలోచనా సరళి రూపు దిద్దుకున్నాయి. 1891లో ఆయన పట్టభద్రుడై భారతదేశానికి తిరిగి వచ్చాడు. బొంబాయిలోను, రాజ్ కోట్ లోను ఆయన చేపట్టిన న్యాయవాద వృత్తి అంతగా రాణించలేదు. 1893లో దక్షిణాఫ్రికాలో న్యాయవాదిగా సంవత్సరం కాంట్రాక్టు లభించింది.

ఒక సంవత్సరం కాంట్రాక్టు మీద వెళ్ళిన గాంధీగారు దక్షిణాఫ్రికాలో 21 సంవత్సరాలు గడిపాడు. కేవలం తెల్లవాడు కానందున రైలు బండి మొదటి తరగతిలో నుండి నెట్టివేయడం, హోటళ్ళ లోనికి రానివ్వకపోవడం వంటి జాతి వివక్షలు, అక్కడి సమాజంలో అన్యాయాలు కళ్ళకు కట్టినట్టు చూపాయి. వాటిని ఎదుర్కోవలసిన బాధ్యతను గ్రహించి, ఎదుర్కొని పోరాడే పటిమను ఆయన నిదానంగా పెంచుకున్నాడు. అది ఎప్పుడు సాధ్యమౌతుందో కింది పద్యంలో చెప్పారు.

*"రాజకీయాల నేరాలతో జీవించు*
*వంచకు లాటకట్టించునాడు*
*అనిశమ్ము స్వార్థమై యనృతాల వచియించు*
*హీనుల నోళ్ళు మూయించునాడు*
*కులమత ఛాందస క్రూర కర్మఠుల దు*
*శ్చేష్టితాల సమాధి సేయునాడు*
*విత్తమ్ము నార్జింప పెడత్రోవలను ద్రొక్కు*
*గూండాల శక్తుల చెందునాడు*
*ప్రజలలోన అనైక్యంపు భావజాల*
*ముడుగునాడు నీరాక మాకిడునుగాక*
*నిర్మలానంద జీవనోన్మేష గరిమ*
*యువ' వినూతన వర్ష ప్రభూ! హసాదు!"* (**ధర్మా. పుట.** 21)

గాంధీగారి నాయకత్వ పటిమ వృద్ధి చెందడానికీ, ఆయన ఆలోచనా సరళి పరిపక్వం చెందడానికీ, రాజకీయ విధివిధానాలు రూపు దిద్దుకోవడానికీ ఇది చాలా ముఖ్యమైన సమయము. ఒక విధంగా భారతదేశంలో నాయకత్వానికి ఇక్కడే బీజాలు మొలకెత్తాయి. భారతీయుల అభిప్రాయాలను కూడగట్టడమూ, అన్యాయాల పట్ల అప్రమత్తం చెయ్యడమూ ఆయన చేసిన మొదటి పని. 1894లో భారతీయుల ఓటు హక్కులను కాలరాచే ఒక బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లు ఆగలేదుగానీ ఆయన బాగా జనాదరణ పొందారు.

*"వెతలంబొంది బ్రిటీషు పాలకులచే వేసారి నైరాశ్యపున్*
*క్షితిలో మ్రగ్గెడు వీరభారతము నీచెల్వారు విందైన ధీ*
*కృత కార్యోద్యమ సాధన ప్రగతిచే ప్రీతిన్ స్వతంత్రమ్ము భా*
*రత జాతీయుల కెల్ల వచ్చెను యశోరమ్యుండ గాంధీమునీ"* **(విజ. పుట**.30)

భారత జాతీయ కాంగ్రెసు సమావేశాల్లో గాంధీ చురుకుగా పాల్గొనేవారు. అప్పటి ప్రధాన నేతలలో ఒకరైన గోపాలకృష్ణ గోఖలే గాంధీకి భారత రాజకీయాలు, సమస్యలను పరిచయం చేశాడు. చాలా మంది నాయకులకు ఇష్టం లేకున్నా గాంధీ మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారిని సమర్థించి సైన్యంలో చేరడాన్ని ప్రోత్సహించాడు. బ్రిటీష్ సామ్రాజ్యంలో స్వేచ్ఛనూ, హక్కులనూ కోరుకొనే వారికి ఆ సామ్రాజ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత వున్నదని ఆయనవాదం. బీహార్ లో బాగా వెనుకబడిన చంపారణ్ జిల్లాలో తెల్లదొరలు రైతులను ఆహారపంటలు వద్దని నీలిమందు వంటి పంటలు పండించమని నిర్బంధించే వారు. పండిన పంటకు చాలీ చాలని కూలి ఇచ్చేవారు. పేదరికం, దురాచారాలు ,మురికివాడలు అక్కడ ప్రబలి ఉన్నాయి. అంతేకాకుండా అక్కడ తీవ్రమైన కరువు సంభవించినప్పుడు సర్కారు వారు పన్నులు పెంచారు. గుజరాత్ లోని ఖేడాలోను ఇదే పరిస్థితి. గాంధీ ఆ పరిస్థితులను వివరంగా అధ్యయనం చేయించి 1918లో చంపారణ్, ఖేడా సత్యాగ్రహాలు నిర్వహించాడు. ప్రజలను చైతన్యవంతులుగా చెయ్యడం, చదువును, సంస్కారాన్ని పెంచడం జాతి వివక్షతను విడనాడడం అన్యాయాన్ని ఖండించడం ఈ సత్యాగ్రహంలో భాగం. ఈ కార్యక్రమంలో ఉక్కు మనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లాభాయ్ పటేల్

గాంధీకి కుడిభుజంగా నిలిచాడు. ఆయన నాయకత్వంలో వేలాదిగా ప్రజలు సర్కారు దౌర్జన్యాలకు ఎదురు నిలిచి జైలుకు వెళ్ళారు. సమాజంలో అశాంతిని రేకెత్తిస్తున్నారన్న నేరంపై ఆయనను అరెస్టు చేసినప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. చివరకు ఒత్తిడికి తలొగ్గి సరైన కొనుగోలు ధరలు చెల్లించడానికీ, పన్నులు తగ్గించడానికీ ఒప్పందాలు కుదిరాయి. ఖైదీలు విడుదలయ్యారు. అప్పుడే గాంధీజీని ప్రజలు ప్రేమతో "బాపు" అనీ "మహాత్మ" అనీ పిలిచేవారు. గాంధీ నాయకత్వానికి బహుముఖంగా ప్రశంసలు లభించాయి. 1919లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు నేరమనే రౌలత్ చట్టానికి గాంధీ నడిపిన సత్యాగ్రహం అడ్డుకట్ట వేసింది. కాని ప్రజలలో ఆగ్రహం పెరిగి ఎదురుదాడులు మొదలైనప్పుడు బాగా తీవ్రస్థాయిలో ఉన్న ఉద్యమాన్ని ఆపేసి పరిహారంగా నిరాహారదీక్ష చేశాడు. పట్టుబట్టి ఆ దాడులలో మరణించిన బ్రిటీష్ ప్రజల పట్ల సంతాపతీర్మానాన్ని ఆమోదింపజేశాడు. హింసకు ప్రతిహింస అనేది గాంధీ దృష్టిలో దుర్మార్గం. ఎలాంటి హింస అయినా తప్పే. 1919 ఏప్రిల్ 13న అమృత్ సర్, పంజాబ్ లోని జలియన్ వాలా బాగ్ లో సామాన్య జనులపై జరిగిన దారుణ మారణకాండలో 400 మంది నిరాయుధులై మరణించారు. ఫలితంగా సత్యాగ్రహం, అహింస అనే పోరాట విధానాలపై మిగిలిన వారికి కాస్త నమ్మకం సడలగా అవే సరైన మార్గాలని గాంధీకి మరింత నమ్మకం కుదిరింది. అంతేకాదు భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించాలనే సంకల్పం గాంధీలోనూ సర్వత్రా ప్రబలింది. 1921లో భారత జాతీయ కాంగ్రెసుకు ఆయన తిరుగులేని నాయకునిగా గుర్తించబడ్డారు. కాంగ్రెసును పునర్ వ్యవస్థీకరించి తమ ధ్యేయం "స్వరాజ్యం" అని ప్రకటించాడు. వారి భావనలో స్వరాజ్యం అంటే పాలన మారటంకాదు వ్యక్తికీ, మనస్సుకి, ప్రభుత్వానికి స్వరాజ్యము కావాలి తరువాతి కాలంలో గాంధీ తమ పోరాటంలో మూడు ముఖ్యమైన అంశాలు జోడించాడు. అవి కింది పద్యంలో పేర్కొన్నాడు.

*"అంతములేని నీహృదయమందున పాఱెడు దేశభక్తి సి*
*మంతఝురీప్రవాహములు ధర్మము సత్యము ప్రేమభావ వే*
*లంత సుధామలోర్ములు విహారమొనర్చునుగాక! భారతో*
*రంతమిదేగదా! నిజము ధర్మగుణైక మహాత్మబాపుజీ!"* **(విజ. పుట.** 30)

“స్వదేశీ ఉద్యమం” – విదేశీ వస్తువులను బహిష్కరించడం, నూలువడకడం, ఖద్దరు ధరించడం విదేశీ విద్యనూ, బ్రిటీష్ సత్కారాలనూ తిరస్కరించడం. వీటివల్ల ఉద్యమంలో క్రమశిక్షణ పెరిగింది. మహిళలు మరింతగా ఉద్యమానికి దగ్గరయ్యారు. దేశ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావాలకు అవకాశం పెరిగింది. ఆత్మాభిమానమూ, ఆత్మవిశ్వాసమూ వెల్లి విరిశాయి. శ్రమకు గౌరవాన్ని ఆపాదించడం అన్నింటికంటే ముఖ్యమైన ఫలితం.

“సహాయ నిరాకరణ ఉద్యమం” – ఏదయితే అన్యాయమో దానికి ఏ మాత్రమూ సహకరించకపోవడం. ప్రభుత్వానికి పాలించే హక్కు లేనందున దానికి పన్నులు కట్టరాదు. వారి చట్టాలను ఆమోదించరాదు. ఈ ఉద్యమానికి మంచి స్పందన లభించింది. కాని, 1922లో ఉత్తరప్రదేశ్ చౌరీచౌరా లో ఉద్రేకాలు చెలరేగి హింస జరిగింది. ఉద్యమం అదుపు తప్పుతుందని గ్రహించి గాంధీ దాన్ని వెంటనే నిలిపివేశాడు.

గాంధీజీ దృష్టిలో స్వాతంత్ర్యం అంటే పరిపుర్ణమైన వ్యక్తివికాసానికి అవకాశం. అంటరానితనం ఉన్నచోట, మురికివాడలున్నచోట, హిందూ ముస్లింలు తగువులాడుకోనేచోట స్వాతంత్ర్యం ఉంది అనుకోవడంలో అర్థంలేదు. గాంధీ ప్రవేశపెట్టిన ఈ ఆలోచనా సరళి వల్లనే భారతీయులు గర్వింపదగిన ఆధునిక భావాలు, విలువలు ఈరోజు సాధారణ జీవన సూత్రాలుగా పాదుకొన్నాయని మనం గ్రహించాలి.

*“వెలిగించుకొన్నది విజయ భారతమాత*
*నీ గాధ సూత్రాలకాగడాలు*
*పరికించుచున్నది పరమార్ధ భువనమ్ము*
*నీ త్యాగమయ కథా నీతి పథము*
*హర్షించుచున్నది అమృతధరా స్థలి*
*నీ జన్మమునకు నవ్యాజభక్తి*
*ఆలించుచున్నది అమలైక గుణభూమి*
*నీ మధుర ప్రేమ నియతి వాక్కు*
*తనువు పులకరింప వినుచునున్నది నీ మ*

*హోధరణపు పల్కు మోదమరల*

*సత్య శాంతములకు జన్మహక్కగుసీమ*

*భరతభూమి బాపు ప్రణుతి నీకు"* **(విజ. పుట.** 34)

పై పద్యంలో జ్ఞానానందకవి గాంధీ సమాజానికి చేసిన సేవను గురించి తెలిపారు. మహాత్మగాంధీ 1922లో రెండు సంవత్సరాలు జైలులో గడిపారు అప్పుడు కాంగ్రెసులో అతివాద, మితవాద వర్గాల మధ్య భేదాలు బలపడ్డాయి. హిందూ ముస్లిం వైషమ్యాలు కూడా తీవ్రతరం అయ్యాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఆయన ప్రయత్నం చేశాడు. 1924లో మూడు వారాల పాటు నిరాహారదీక్ష చేశాడు. కాని, వాటి ఫలితాలు కొంతవరకే లభించాయి. మద్యపానం, అంటరానితనం, నిరక్షరాస్యతను నిర్మూలించే ఉద్యమాలలో ఆయన లీనమయ్యారు. 1927లో సైమన్ కమీషన్ కు వ్యతిరేకంగా సాగిన పోరాటం తరువాత మరలా గాంధీ గారు స్వరాజ్యోద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అందరికి సర్ది చెప్పి 1928లో కలకత్తా కాంగ్రెసులో స్వతంత్ర ప్రతిపత్తి తీర్మానాన్ని ఆమోదింపజేశాడు. అందుకు బ్రిటీష్ వారికి ఒక సంవత్సరం గడువు ఇచ్చాడు. అయినా ఫలితం శూన్యం. 1929 డిసెంబర్ 31 న లాహోరులో భారత స్వతంత్ర పతాకం ఎగురవేయబడింది. 1930 జనవరి 26 ను స్వాతంత్ర్య దినంగా ప్రకటించాడు. ఆ రోజున ఉద్యమం చివరి పోరాటం మొదలైందని చెప్పవచ్చును మహాత్మాగాంధీ హరిజనుల గురించి కింది పద్యంలో పేర్కొన్నారు.

*"వెరువక నాటిసాంఘిక విప్లవశక్తుల లెక్క సేయకన్*

*భారత నపారధైర్య గుణసింధుడవై యెదిరించినాడ వా*

*దొరల కుపాలనమ్ముఁగని దూరముగా నివసించు వారికిన్*

*హరిజనులన్న సార్థకత నందగఁజేసిన నీకు నంజలుల్".*

**(విజ. పుట.** 33)

1946లో బ్రిటీష్ కాబినెట్ మిషన్ ప్రతిపాదనకు వచ్చింది. కాని, ఈ ప్రతి పాదన ఎట్టి పరిస్థితులలోను అంగీకరించవద్దని గాంధీజీ పట్టుబట్టాడు. ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలనే ఆలోచన దేశవిభజనకు నాంది అని

గాంధీజీ భయం. కాంగ్రెసు గాంధీ మాటను నిర్లక్ష్యం చేసింది. కాబినెట్ మిషన్ ప్రతిపాదనను నిరాకరిస్తే అధికారం క్రమంగా ముస్లిం లీగ్ చేతుల్లోకి జారుతుందని నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ అభిప్రాయపడ్డారు. 1946–47 సమయంలో 5000 మంది హింసకు ఆహుతి అయ్యారు. హిందువులు, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులు ఇలా అందరు కలిసి ఉన్న దేశాన్ని మతప్రాదిపదికన విభజించడాన్ని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి ఆలోచన సామాజికంగానూ, నైతికంగానూ, ఆధ్యాత్మకంగానూ గాంధీ తత్వానికి పెద్దదెబ్బ. కాని, ముస్లిం లీగ్ నాయకులైన మహమ్మద్ అలీ జిన్నా కి పశ్చిమ పంజాబు, సింధ్, బలూచిస్తాన్, తూర్పు బెంగాల్ లో మంచి ప్రజాదరణ ఉన్నది. కావాలంటే జిన్నాను ప్రధానమంత్రిగా చేసైనా దేశాన్ని ఐక్యంగా నిలపాలని గాంధీ ప్రగాఢ వాంఛ. కాని, జిన్నా "దేశ విభజనో – అంతర్గత యుద్ధమో తేల్చుకోండి" అని హెచ్చరించాడు. చివరకు హిందూ –ముస్లిం కలహాలు ఆపాలంటే దేశవిభజన తప్ప వేరే మార్గంలేదని కాంగ్రెసు నాయకత్వం అంగీకరించింది. అయితే, గాంధీ పట్ల ప్రజలకు, పార్టీ సభ్యులకు ఉన్న ఆదరణ దృష్ట్యా గాంధీ సమ్మతించకపోతే ఏ నిర్ణయము తీసుకొనే అవకాశంలేదు. అంతర్గత యుద్ధాన్ని ఆపడానికి వేరే మార్గంలేదని గాంధీ ని ఒప్పించడానికి పటేల్ శతవిధాల ప్రయత్నించాడు. చివరకు హతాశుడైన గాంధీ ఒప్పుకోక తప్పలేదు. కాని ఆయన పూర్తిగా కుంగిపోయాడు 1947 ఆగష్టు 15 న దేశమంతా సంబరాలు జరుపుకుంటూ ఉండగా దేశవిభజనను భరించలేక గాంధీగారు కలకత్తాలోని ఒక హరిజన వాడను శుభ్రం చేస్తూ గడిపాడు. ఆయన కలలన్నీ కూలిపోయిన సమయంలో హిందూ ముస్లిం మత విద్వేషాలు పెచ్చరిల్లి ఆయనను మరింత శోకానికి గురి చేశాయి.

ధర్మాగ్రహం కావ్యం చదవగానే మనకు గాంధీ గారు భోధించిన అహింస, సత్యాగ్రహం గుర్తుకు వస్తుంది. ఆగ్రహం అంటే కోపమని మనకు వెంటనే స్ఫురిస్తుంది. సంస్కృతంలోను ఈ అర్థం ఉంది. కాని ప్రసిద్ధమైన అర్థం "పట్టుదల" అని ఇదే అర్థంలో ఉత్తర హిందూస్తాన్ భాషలు వాడుతున్నాయి. ఏతావతా 'సత్యం కోసం పట్టిన పట్టు' సత్యాగ్రహం అంటే సత్య దీక్ష అని తాత్పర్యం. అదే విధంగా జ్ఞానానందకవి ధర్మదీక్ష అనే అర్థంలో ధర్మాగ్రహం వాడారు. ధర్మాన్ని నిలబెట్టవలసినప్పుడుకోపం

తెచ్చుకోవడం మహాపురుషుల లక్షణం. సామాన్యులకైతే అయినదానికీ, కానిదానికీ కోపం వస్తుంది. మాన్యులు అవసరాన్ని బట్టి శస్త్రం, కోపం కూడా సంధిస్తారు. అంటే ఆగ్రహం వారి వశంలో ఉంటుంది కాని దానివశంలోకి వారుపోరు. ధర్మదీక్ష ఆవశ్యకతను గుర్తించిన జ్ఞానానందకవి తమ పాఠకులకు ఉపదేశించారు కేవలం పొడి మాటలతో కాకుండా ఒక గతినీ, సంగతినీ ఛందోరీతిలో ఉపదేశించారు. ఇది కేవలం ఒక ఖండికలో కాకుండా సంపుటిలోని అన్ని ఖండికల్లో సాక్షాత్కరిస్తుంది.

స్వాతంత్ర్యనంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ, ముస్లిం విద్వేషాలు నివారించడానికి ఆత్మశోధనకు పరిమితమయ్యాయి. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్ద ఎత్తున సంభవించిన వలసలవల్ల మతకలహాలు, మారణకాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ – పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంట బయట పరిస్థితి క్షీణించింది. ముస్లిములందరినీ పాకిస్తాన్ కు పంపాలనీ, కలిసి బతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలో వినిపించసాగాయి. ఈ పరిస్థితి గాంధీకి పిడుగుదెబ్బ వంటిది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారం పాకిస్తానుకు ఇవ్వవలసిన 55 కోట్ల రూపాయలను భారత్ ఇవ్వడానికి నిరాకరించింది. ఆ డబ్బు భారత దేశంపై యుద్ధానికి వాడబడుతుందని పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని, జరగకపోతే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ దేశాల మధ్య విరోధాలు ప్రబలి మతవిద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్దానికి దారితీస్తాయనీ గాంధీ అభిప్రాయం. ఈ విషయమై ఆయన ఢిల్లీలో తన చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఆయన డిమాండ్లు: ఒకటి మతహింస ఆగాలి. రెండు. పాకిస్తాన్ కు 55కోట్ల రూపాయలు ఇవ్వాలి. ఎవరెంత ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తాన్ కు డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. హిందూ ముస్లిం సిక్కు వర్గాల నాయకులు స్నేహంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయన వద్ద ప్రమాణం చేశారు. అప్పుడే ఆయన నిరాహార దీక్ష విరమించాడు. కాని ఈ మొత్తం వ్యవహారంలో

గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. ఆయన పాకిస్తానుకు, ముస్లింలకు వత్తాసు పలుకుతున్నాడని హిందూమతంలోని తీవ్రవాదులు, హిందువులకోసం ముస్లిం జాతీయతను బలిపెడుతున్నారని తీవ్రవాదులు ఉడికిపోయారు.

3.5.**వీరేశలింగం**:

'అక్షరాభిషేకము' కావ్యంలో 'వీరేశలింగం' అనే ఖండికలో పంతులు సమాజ సేవను, సంస్కరణను తెలియజేశారు. ఈయన జాతి గర్వంచదగ్గ మహోన్నత వ్యక్తి. సంఘసంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు కృషి చేశాడు. సాహిత్యంలో అంతటి కృషిచేసిన కందుకూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. ఆయన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో కీర్తించారు.

*"పెరుగుచున్నది పేరు పెంపారి నీపేరు*
*ప్రవచించునున్నతపాఠశాల*
*మాయుచున్నది పెండ్లిమగడు చచ్చినబాల*
*తలతీయుఘోరనిత్యవ్రణమ్ము*
*తిరుగుచున్నది స్వీయదేశానc దీండ్రించి*
*సంఘసంస్కారవిస్తారశక్తి*
*చాటుచున్నది కళాసాహిత్యసౌరభ*
*మఖిలాంధ్రసీమc బ్రత్యగ్ర మగుచు*
*నీవు చూపి నేర్పి నిలిపిన రతనాల*
*తీరు తెన్ను లన్ని తెలుcగు నేల*
*వజ్రాలు నయ్యె గొజ్జcగిపూ లయ్యెc*
*గందుకూరికొలపు చందమామ!"* (**ప్రభ. పుట**. 21)

ఈయన 1848 ఏప్రిల్ 16 న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు అనే దంపతులకు జన్మించాడు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లాలోని కందుకూరు గ్రామం నుండి రాజమండ్రికి వలస వెళ్ళడం వల్ల వారికి ఈ ఇంటి పేరు

స్థిరపడిపోయింది. వీరేశలింగానికి నాలుగేళ్ల వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారు ముద్దుగా పెరిగాడు. ఐదో ఏట బడిలో చేరి బాల రామాయణం, ఆంధ్ర నామ సర్వస్వం, అమరం, రుక్మిణి కల్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం మొదలైనవి నేర్చుకున్నాడు. పన్నెండో ఏట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నప్పటినుండి అన్ని తరగతులలోను ప్రథమ శ్రేణిలో ఉండేవారు. తన పదమూడో ఏట బాపమ్మ అనే ఎనిమిదేళ్ళ అమ్మాయితో బాల్య వివాహం జరిగింది. పెరిగి పెద్దయ్యాక ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేశారు. ఆ కృషిని జ్ఞానానందకవి  కింది పద్యంలో పేర్కొన్నారు.

*"నీడకు గూడులేక పడునిందకు నింతజవాబు నీక న*
*ల్లాడు వితంతువుల్ మొగములందున హాసమరీచి తాండవం*
*బాడెను నీ కృపాకలన నార్ద్ర హృదంతరమూర్తి వైన నీ*
*కీడ సమాను లెవ్వరు కవీంద్ర మహాంధ్రయుగప్రవక్తా."*

**(అక్షరా.పుట.** 85)

చదువుకునే రోజుల్లో కేశవ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు. 1867లో పెదనాన మరణంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలని ప్రయత్నం చేశాడు. కానీ లంచం ఇవ్వనిదే రాదని తెలిసి ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదని నిర్ణయించు కున్నాడు. న్యాయవాద పరీక్ష రాసి న్యాయవాద వృత్తి చేపడదామని భావించినా, అందులోనూ అవినీతి ప్రబలంగా ఉందని, అబద్దాలు ఆడటం వంటివి తప్పనిసరి అని గ్రహించి అదీ మానుకున్నాడు. ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాడు.  ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు సంఘ సంస్కరణ భావాలను బోధించాడు సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చేయడానికి 1874 అక్టోబర్ లో 'వివేకవర్ధిని' అనే పత్రిక ను స్థాపించారు. "సంఘంలోని అవకతవకలను ఎత్తి చూపడం దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న అవినీతిని ఎత్తిచూపి అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం"

వివేకవర్ధిని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో తెలిపాడు తరువాత ఈ పత్రిక అవినీతిపరుల పాలిట సింహ స్వప్నమైంది.

*"భాషాసరస్వతి స్వాతంత్ర్య మిసుమంత*
*కూడాఁబొందక గింజుకొన్నవేళ*
*కుహనా మతస్థుల కుటిలకృత్యమదంపు*
*క్రూర సర్పము బుసల్ కొట్టువేళ*
*వైధవ్య బాధచే వనటబొందినస్త్రీల*
*యుసురులో నిప్పుకల్ విసరువేళ*
*పొగరువట్టినయట్టి మూఢవిశ్వాసపై*
*శాచికి దంష్ట్రలన్ సాచువేళ*
*ఆంధ్రసంస్కృతికి మహాపునర్జీవమ్ము*
*వోసినట్టి మాన్యబుధవతంస*
*కందుకూరి వంశఘనభూష వీరేశ*
*లింగ సుకవినీకు చెంగనాలు."* **(అక్షరా. పుట**.83)

కందుకూరికి సమకాలికుడైన కొక్కొండ వెంకటరత్నం పంతులుతో విభేదం వుండేది. కందుకూరి వివేకవర్ధిని స్థాపించిన తరువాత కొక్కొండ 'హాస్య వర్ధని' అనే పత్రికను ప్రారంభించారు. ఆ పత్రికకు పోటిగా కందుకూరి 'హాస్య సంజీవని' అనే పత్రికను ప్రారంభించాడు తెలుగులో మొదటి ప్రహసనం కందుకూరి ఈ పత్రికలోనే ప్రచురించాడు. ఎన్నో ప్రహసనాలు వ్యంగ్య రూపకాలు ప్రచురించారు. ఆంధ్ర దేశంలో 'బ్రహ్మ సమాజం' స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగం తోనే మొదలైంది. సమాజ సేవకొరకు 'హితకారిణి' అనే ధర్మ సంస్థను స్థాపించి తన మొత్తం ఆస్తిని ఆ సంస్థకు ఇచ్చేసాడు. 25సంవత్సరాలపాటు రాజమండ్రిలో తెలుగు పండితునిగా పని చేసి తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పనిచేశాడు. తాను నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని పాటించాడు. యుగకర్తగా ప్రసిద్ధి పొందిన ఆయనకు 'గద్య తిక్కన' అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని

సంస్కరణల దారి పట్టించిన సంస్కర్త. వీరేశలింగం ఈయన 1919 మే 27 న కాలం చేశారు.

3.6.రామమోహనరాయలు:

'అక్షరపూజ' ఖండ కావ్యంలో భారత సంఘసంస్కరణల చరిత్రలోనే సతీసహగమనమును నిర్మూలించడానికి కృషి చేసిన వ్యక్తి రామ్మోహన్ రాయలను జ్ఞానానందకవి ఈ విధంగా కీర్తించారు.

*"నీవైదుష్యపు వాతహేతికెదురై నిల్చున్న చాదస్తపున్*
*భావోద్రేకులు పండితప్రభువులు కంపంబొంది చిత్తైరి నీ*
*తో వాదాన నెవండు నెగ్గును మహాత్మల్ పూజనీయుల్ గదా*
*ఈ విశ్వంభర రామమోహన మనీషీ! స్త్రీ జనోద్ధారకా!"* (**అక్షర. పుట**. 55)

హిందూ పూజారుల అధికారమును ధిక్కరించి, ఆ కాలంలో సాధారణమైన బహు భార్యత్వము నేరమని జనులకు నచ్చజెప్పాడు. జయేంద్ర ఒక సంఘసంస్కర్త. తాను సంకల్పించిన సామాజిక, న్యాయ, మతపరమైన ఉద్యమాలలో రామ్మోహన్ రాయ్ మానవత్వమునే ప్రధానంగా తీసుకొన్నాడు. జనులకు తన ఉద్దేశం

సమాజంలో ఉన్న మంచి సంప్రదాయాలను నిర్మూలించడం కాదని, కేవలం వాటిపై సంవత్సరాల పాటు నిరాదరణ వల్ల పేరుకుపోయిన కుళ్ళును తుడిచివెయ్యడం అని చూపించడానికి కష్టపడ్డాడు. ఉపనిషత్తులను గౌరవించి, సూత్రాలను చదివాడు. విగ్రహారాధనను ఖండించాడు. అఖండానందాన్ని పొందడానికి, ఆధాత్మిక చింతన, భగవంతుని ధ్యానం ఉన్నత మార్గాలు. ఇవి చెయ్యలేనివారికి బలులు ఇవ్వడం మార్గమని ప్రతిపాదించాడు. వితంతు పునర్వివాహం, మహిళలకు ఆస్తిహక్కులను సమర్థించాడు. దేశంలోని దురాచారాలను వ్యతిరేకించడం కింది పద్యంలో కనిపిస్తుంది.

*"బానిసత్వపు బ్రతుకులో బహువిధాల*
*చెడిన యాచార బంధాల శిఖలమ్రగ్గు*
*హిందూ దేశమ్ము తరియింప నెంతయలసి*
*పోతివోయి "రాజ రామమోహనుండ"* **(అక్షర. పుట.** 58)

అందరికీ విద్య ముఖ్యంగా మహిళలకు విద్యను సమర్థించాడు. ఆచార సంబంధమైన సంస్కృత విద్య కంటే ఆంగ్ల విద్య మంచిదని భావించి సంస్కృత పాఠశాలలకు ప్రభుత్వనిధులను వ్యతిరేకించాడు. 1822లో ఆంగ్ల పాఠశాలను ప్రారంభించాడు. తాను కనుగొన్న సామాజిక, మతపరమైన దురాచారాలను నిర్మూలించడానికి "బ్రహ్మసమాజం" స్థాపించాడు. బ్రహ్మసమాజం వివిధ మతాలలో వున్న మంచిని గ్రహించి ఆదర్శ సమాజంగా అభివృద్ధిచెందింది.

### 3.7.**అయ్యదేవర కాళేశ్వరరావు**:

కాళేశ్వరరావు గురించి జ్ఞానానందకవి 'దేశబంధు' అనే పేరుతో కావ్యాన్ని రాశారు. కాళేశ్వరరావు నందిగామ గ్రామంలో నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రిగారు, తాతగారు మునగాల ఎస్టేటులో దివానుగా పని చేశారు. కాళేశ్వరరావు చదువులో బాగా చురుకైనవారు. ఈయన చదువుకొనే రోజులలో మత, సంఘసంస్కరణలు బాగా జరిగేవి. బందరులో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం, హిందూ సమాజం చురుకుగా పనిచేసేవి. ఆ సంస్థల నాయకులు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చేవారు. క్రైస్తవ బోధనలు కూడా జరిగేవి. మిషనరీ కళాశాల అయిన నోబుల్ కళాశాలలో వక్తృత్వ పోటీలందు పాల్గొని ప్రథమ బహుమతి పొందారు. వీరు అసమాన వివేచనాశక్తిచే సమస్త శాస్త్రాలను అభ్యసించారు. ఆధునిక భారతానికి రాజ రామ్మోహన్ రాయ్ అందించిన రచనలను, రాజకీయ వ్యాసాలను చదివారు. వారి సంఘసంస్కరణను, జీవితాదర్శాలను, ప్రజలలో ఆయన కలిగించిన చైతన్యాన్ని విద్యార్థిదశలోనే ఏవిధంగా అలవర్చుకోన్నారో కింది పద్యంలో తెలిపారు.

*"చదువుకొన్నాడు రాజా రాము మోహను*

*రాయువ్యాసాల సారంపు సొబగు*

*చవిఁజుచినాడు లెస్సైన బుద్ధిని వివే*

*కానందు దివ్యవాక్యామృతంబు*

*తెలిసికొన్నాడు సత్తెమును వీరేశలిం*

*గసుకవి సంఘ సంస్కరణ రచన*

*నడచుకొన్నాడు ధన్యంపు వర్తనమును*

*రఘుపతి బ్రహ్మర్షి ప్రదితపథము*

*మధుర సద్గుణుడు కొమ్మరాజు లక్ష్మణ*

*పండితుని ఘనంపు పరిచయమ్ము*

*గలిగి జ్ఞానధనము కాళేశరాయుండు*

*నార్జనమ్ము సేసి యలరువేళ."* **(దేశబంధు. పుట.** 15)

విజయవాడలోని కాళేశ్వరరావు ఇల్లు కవులకూ, గాయకులకూ, సారస్వతాభిమానులకూ, జాతీయ వాదులకూ అతిధి గృహంగా ఉండేది. 1917లో ప్రత్యేకాంధ్ర మహాసభ జరిగినప్పుడు, 1919లో గాంధీజీ రౌలత్ సత్యాగ్రహ సందర్భంలో విజయవాడ వచ్చినప్పుడు కాళేశ్వరరావు ఇంట్లోనే గడిపారట. ఈయన న్యాయవాదిగా బాగా సంపాదిస్తున్నప్పుడు పేద విద్యార్థులకు, అనాధ స్త్రీలకు, సంస్థలకు ధనం విరాళంగా ఇచ్చేవారట. ఈయన గ్రంథాలయోద్యమానికి ఎనలేని సేవ చేశారు. శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల, పానుగంటి నాగభూషణం, సూరి నరసింహం మొదలైనవారితో కలిసి కృషి చేశారు. హిందీ విద్యావ్యాప్తికి కూడా కృషి చేశారు. ఆంధ్రలో ముఖ్యంగా విజయవాడలో శ్రీ మోటూరు సత్యనారాయణ, ఉన్నవ రాజగోపాల కృష్ణయ్య గారితో కలిసి హిందీ భాషా వ్యాప్తికి పథకాలు వేస్తూ ఉండేవారు. ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘమునకు కొన్నాళ్ళు అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఉన్నారు. కాళేశ్వరరావు గొప్ప రచయిత. ఆయన సజీవమైన, మనోహరమైన తెలుగు భాషలో రచనలు చేశారు. ఈయన ప్రపంచంలోని అన్ని విప్లవాలను స్పృశించారు.

*"ప్రాచీన భారత సంపద గొప్పదను రమేష్*
*చంద్ర దత్తుని శాస్త్రసారమహిమ*
*దేశ దారిద్ర్యస్థితికి తెల్ల దొరలందు*
*పలుకు నౌరోజీ కబ్బాలగరిమ*
*విశ్వదేశాలకు ప్రేమ నేర్పించిన*
*క్రీస్తునాధుని కథా ప్రేరణమ్ము*
*అలగాంధీముని దక్షిణాఫ్రికా ఖండానఁ*
*దల పెట్టినట్టి యుధ్యమపుకథలు*
*ఆయఖండ చరితల తాదాత్మ్యమంది*
*తరచుకొనె దేశ భక్తిలే,తరగములు*
*చదువుకొనె దివ్యభావాలు హృదయమందు*
*పదిలపడనయ్య దేవర బాలకుండు."* **(దేశబంధు. పుట.** 15)

కాళేశ్వరరావుకు కవులన్నా, పండితులన్నా చాలా అభిమానం. వారిని సన్మానిస్తూ ధన సహాయం చేస్తుండేవారు. ఆదిభట్ల నారాయణదాసు ప్రతి సంవత్సరం వచ్చి కొన్ని రోజులు ఉండేవారు. తిరుపతి వేంకటకవులు, కొప్పరపు కవులు వస్తుండేవారట. ఈయన విజయవాడలో నటకులకు, నాటకశాలలకు చాలా ప్రోత్సాహం అందించేవారట. నటచక్రవర్తి యడవల్లి సూర్య నారాయణ, పారుపల్లి సుబ్బారావు, స్థానం నరసింహరావు, మద్దాలి శేషగిరిరావు, ఉప్పులూరి సంజీవరావు, జొన్నవిత్తుల శేషగిరిరావు, అద్దంకి శ్రీరామమూర్తి మొదలైన నటులు ఈయన చేత తరచూ సన్మానాలు అందుకోనేవారు. ఈయన స్త్రీలను బాగా గౌరవించేవారు. తల్లి, సోదరీ భావంతో ఆదరించేవారు. స్త్రీలను గౌరవించని జాతికి ప్రగతి లేదనే దృఢ విశ్వాసం కలవారు. భారతదేశంలో ప్రముఖులైన హరవిలాస్ శారదా, కార్వే పండితుడు, హర గోవిందరనడే మొదలైన వారితో స్త్రీ జనోద్ధరణకు పాటు పడ్డారు. స్త్రీలు రాజకీయాల్లో పాల్గొనడానికి వీలు కల్పించి ప్రబోధించి ఉత్తేజితులను చేశారు. చాలా మందిని ముందుకు తెచ్చారు. వారిలో ముఖ్యులు శ్రీమతి ఆచంట రుక్మిణమ్మ.

కాళేశ్వరరావు స్త్రీ జనాభ్యుదయం కోసం మద్రాసు శాసన సభలో, ఆంధ్ర శాసనసభలో అనేక శాసనాలు చేయించారు. వాటిలో ముఖ్యమైనవి

1. బహుభార్య నిషేధ చట్టం 1947లో మద్రాసులో పాసైంది.
2. వరకట్న నిరోధపు బిల్లు 1957లో ఆంధ్ర శాసనసభలో పాసైంది.

హిందూ విడాకుల చట్టం అన్నింటికన్నా కాళేశ్వరరావుకు అత్యంత కీర్తి తెచ్చి పెట్టింది. ఆయనకు అఖిలభారత స్త్రీ లోకమంతా ఋణపడి ఉంది.

కాళేశ్వరరావు కమ్యునిష్టు సాహిత్యాన్ని పూర్తిగా అవలోకనం చేసుకొని మార్క్స్, ఎంగెల్స్ మొదలుకొని కమ్యునిష్టు సిద్ధాంత కర్తల పుస్తకాలను చదివి ఆ సిద్ధాంతంపై ఎవరితోనైనా వాదించే ప్రావీణ్యం సంపాదించారు. ఈయన ప్రముఖ గాంధేయవాది. గాంధీ ఇజంకంటే అత్యున్నత సిద్ధాంతం ఏది లేదని ఈయన విశ్వాసం. ప్రజలు ఎక్కడ పోరాటం చేసినా ఆ పోరాటానికి అనుకూలంగా వ్యవహరించేవారు. హైదరాబాదులో కాంగ్రెసు వారు నవాబుకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం జరిపినప్పుడు వారిని పూర్తిగా సమర్థించారు. 1946 జనరల్ ఎన్నికల్లో కాళేశ్వరరావు విజయవాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా అత్యధిక మెజారిటితో కమ్యునిష్టు అభ్యర్థిని ఓడించి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. ఈయన 1949లో 'విశాలాంధ్ర మహాసభ'ను స్థాపించారు. దాని లక్ష్యం హైదరాబాద్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి 9 జిల్లాలను ఆంధ్రలో కలుపడం.

*"హైదరాబాదు మైసూరు లాదిగగల*
*భారత సంస్థానముల స్వేచ్ఛ కొరకు పాటు*
*వడియె కాళేశ్వరుండు తత్ప్రముఖులైన*
*నాయకేంద్రులతోడ నెంత గుణ మదియె."* (**దేశబంధు. పుట.** 67)

ఆంధ్రప్రదేశ్ ప్రప్రథమ స్పీకర్, విశాలాంధ్ర నిర్మాత, నిష్కలంక దేశభక్తుడు, ఆంధ్ర మహా నాయకుడు, కాంగ్రెసు కురువృద్ధుడు కాళేశ్వరరావు 1962లో మరణించారు. ఈయన అంతిమయాత్ర తన ప్రజల మధ్య, బంధువుల మధ్య ప్రశాంతంగా ముగిసింది. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న దేశభక్తులందరికి

స్వాతంత్ర్యాన్ని చూసే భాగ్యం కలుగలేదు. కాళేశ్వరరావు స్వాతంత్ర్యాన్నే కాక విశాలాంధ్రను కూడా చూశారు.

### 3.8.సుభాష్ చంద్రబోస్:

"పాంచజన్యం" కావ్యంలో 'సుభాసుబాబు' అనే ఖండికలో జ్ఞానానందకవి సుభాష్ చంద్రబోస్ గురించి పేర్కొన్నారు. మాతృదేశ విముక్తికి, బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడానికి కృషిచేసిన మహనీయులలో నేతాజీ అగ్రగణ్యుడు. తన జీవిత కాలమంతా లక్ష్యసాధకై కృషిచేసి స్వాతంత్ర్య సమరాంగణ చక్రవర్తిగా కీర్తి గడించాడు. సుభాష్ చంద్రబోస్ 20 ఏళ్ళ రాజకీయ జీవితంలో 10 సంవత్సరాలు జైల్లోనే గడిపారు. కట్టుబట్టలతో కాలినడకన స్వగృహాన్ని వదిలి విదేశాలకు చేరుకున్నారు. స్వీయ రుధిరధారలతో విప్లవ చరిత్రను సృష్టించి జ్వలిత జ్వాలగా ప్రకాశించాడు.

*"చిఱుతజపానువారిని వశీకరణం బొనరించి యా మహో*
*గ్ర రణములో విరోధుల శిరాలు గరాళ్ళ గృపాణదేవికిన్*
*బొరిబొరి భోజనంబుగ ననూహ్యముగా నిడినట్టి విక్రమ*
*స్థిరుఁడవురా! నమశ్శతము దీవ్యదఖండ యశః ప్రభాకరా!"*

(పాంచ. పుట. 51)

సముద్ర తరంగాలు ఉవ్వెత్తునలేచి ఒడ్డుని తాకి తిరిగి జలనిధిలో ప్రవేశించే విధంగా సామ్రాజ్యాల, వ్యక్తుల జీవితాల్లో కూడా ఆరోహణ, అవరోహణ దశలుంటాయి. పరిస్థితుల ప్రభావం వల్ల ప్రపంచ రాజకీయాలల్లో రెండో ప్రపంచ యుద్ధం ఆసియా ఖండంలోని వలస దేశాల విముక్తికి సువర్ణావకాశాన్ని సృష్టించింది. సుభాష్ చంద్రబోస్ జర్మనీ నుండి తూర్పు ఆసియా దేశాలను చేరుకొని అక్కడున్న భారతీయులను జాగృతం చేశాడు. 'ఆజాద్‌హింద్' సైన్యాన్ని ఏర్పాటు చేసి పరదాస్యం నుండి దేశ విముక్తికై 'ఛలో ఢిల్లీ' అనే నినాదంతో అందర్నీ ఉత్తేజ పరిచారు. 'జైహింద్' అనే నినాదం అందరికీ తారకమంత్రమైంది. విధి వక్రించి ఉండకపోతే భారత జాతీయ సైన్యం (INA) అస్సాం, బెంగాల్ మీదుగా ఢిల్లీచేరి ఎర్రకోటపై భారత జాతీయ

పతాకాన్ని ఎగరేసేది. నేతాజీ స్వతంత్ర సమర ఉద్యమం ఏ విధంగా చూసినా నిరుపయోగం కాలేదు. దేశ ప్రజల్లోని అన్ని వర్గాలతోపాటు భారతసైన్యాన్ని కూడా జాగృతం చేసింది. దేశ సైన్యంపై ఆధారపడి పరిపాలన కొనసాగించడం సాధ్యం కాదని బ్రిటీష్ పాలకులు గ్రహించారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత బ్రిటీష్ ఆర్థికంగా అన్ని విధాల దివాలా స్థితికి వచ్చింది. INA యుద్ధఖైదీలను శిక్షించడం సాధ్యం కాదని తెలుసుకున్నారు. వారికి అంతకు పూర్వం గల గుండెబలం, కండబలం నశించింది. ఆయన కీర్తిని కింది పద్యంలో పేర్కొన్నారు.

*"ఎగబ్రాకినవి నీ యమృతకీర్తి మేఘాలు*

*విశ్వప్రపంచాభ్ర వీథిదాక*

*ఫలియించినవి నీ యుపన్యాస బీజాలు*

*యనుజుని గుండె కమ్మని పొలాన*

*చిత్తగించినవినీ శ్రీ వాక్య మణి భూష*

*ణములు భారతము మస్తము ధరించి*

*సంతసించినది నీ సాహసోదాగ్ర చే*

*తము గాంచి ఘనబంగళము పురంధ్రి*

*మ్రొక్కినది దిశా గోళమ్ము మురిసిపోయి*

*నరనరంబుల పౌరుషం బురలిపోవు*

*నీ తనూ విలాస మది మంటిని గలసెనె?*

*వందనశతమ్ము గొమ్ము సుబాసుబాబు!"* **(పాంచ. పుట.** 54)

పుబ్బలో పుట్టి మాఘలో మాడిపోయిన విధంగా సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర సాధనా కృషి రెండో ప్రపంచ యుద్ధారంభంతో ప్రారంభమై దాని అంతంతో ముగిసిపోయిందని అనేవారు. నేటి క్లిష్ట పరిస్థితులలో నేతాజీ వంటి దృఢనాయకత్వం దేశానికి అవసరం. ఆయన దూరదృష్టి, నిష్కలంకమైన కార్యాచరణతో దేశ సమస్యలను పరిష్కరించేవారు. ప్రపంచ దేశాల కూటమిలో అగ్రస్థానాన్ని సాధించవచ్చు అనేవారు. నేతాజీ స్థితప్రజ్ఞుడు. లోప రహితమైన నాయకుడు. వర్తమాన సమస్యల పరిష్కారానికి ఆయన విధానాలు మార్గదర్శకాలు. ఇది ముమ్మాటికి నిజం.

ఇలాంటి నాయకుని అడుగుజాడలను అనుసరించడంలోనే సార్థక్యత, నిష్కృతి ఇమిడి ఉన్నాయి.

3.9.**అంబేద్కర్**:

*“నీ వేలగ్నమునందుఁ బుట్టితివొ కానీ! నీదు విస్ఫార వి*
*ద్యావైశద్యము లేరికిం గలుగునన్నా! వేదవంశమ్ములో*
*నావిర్భావము నొందుటన్ కులపు దయ్యాలున్న దేశాన నీ*
*కే విశ్రాంతి హుళక్కియైననిఁక మా కేదీ సువిశ్రాంతియున్.”*(**పాంచ.పుట**. 85)

పై పద్యం పాంచజన్యం కావ్యంలోది. అంబేద్కర్ అనే ఖండికలో అంబేద్కర్ సేవను కవిత్వీకరించారు. ఈయన 1891 ఏప్రిల్ 14 న రాంజీ, భీమాభాయ్ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు అతనికి పెట్టినపేరు భీమారావు. గ్రామనామాన్ని బట్టి పాఠశాలలో అతని ఇంటిపేరు అంబావదేకర్. తర్వాత ఇతనిని అమితంగా అభిమానించే ఒక ఉపాధ్యాయుడు ఆయన ఇంటిపేరు మీదుగా అంబేద్కర్‌గా మార్పించాడు. ఆ పేరుతోనే అంబేద్కర్ ప్రసిద్ధుడయ్యాడు. రాంజీ సక్‌పాల్‌కు 14 మంది సంతానం. వారిలో అంబేద్కర్ 14వ వాడు. రాంజీ 14 సంవత్సరాలు ఒక మిలటరీ స్కూల్‌లో హెడ్‌మాష్టార్‌గా పనిచేశాడు. ఆయనకు మరాఠీలో చక్కని భాషా పరిజ్ఞానం ఉంది. అనువాదం, గణితం ఆయన అభిమాన అంశాలు. ఈయన అనువాదంలో మంచి ప్రావీణ్యం గడించి అగ్రశ్రేణి రచయితగా పేరుపొందాడు.

“*ద్వైతా ద్వైత మతాల ఖండమున నిద్రంబోని యస్పృశ్యతా*
*భూత వ్యాఘ్రి మహోగ్రదంష్ట్రల బలంబున్ బుగ్గిగావింపగా*
*జాతి శ్రేయముకై కులస్థుల మనస్తత్వంబు మార్పింపగా*
*నే తీరుం గడగండ్లకోర్చితివో?తండ్రీ! డాక్టరంబెద్కరా!”*

(**పాంచ.పుట**. 84)

పై పద్యంలో హిందూ ధర్మశాస్త్రాలు చాతుర్వర్ణాలకు, నిమ్నవర్గాలకు అన్ని విషయాలలోను వ్యత్యాసం చూపాయి. విద్యారంగంలో నిమ్నజాతులకు ప్రవేశంలేదు.

బ్రాహ్మణులైన అధికారులుగాని, ఉపాధ్యాయులు గాని వాటిని గురించి ఆలోచించలేదు. ఈ పరిస్థితులను క్రైస్తవ మిషనరీలు తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. 19 వ శతాబ్దంలో దేశమంతటా రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా చాలా మార్పులు వచ్చాయి. అనేక మంది కృషి ఫలితంగా 1821లో పూణెలో ప్రభుత్వం ఒక సంస్కృత కళాశాలను ప్రారంభించినప్పుడు అందులో అన్ని కులాలకు ప్రవేశం ఉంటుందని ప్రకటించింది. అలా జరగడానికి వీలు లేదని కొందరు బ్రాహ్మణులు ఆందోళనలు చేశారు. కొందరు ఉపాధ్యాయులు వదిలి వెళ్ళిపోయారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్ణయం మార్చుకోలేదు. 1856లో ఒక విద్యార్థికి కులం కారణంగా పాఠశాల ప్రవేశం నిరాకరించినపుడు పలు విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం బాగా ఆలోచించి 1858లో ఒక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యాసంస్థలు కులం కారణంగా ఏ విద్యార్థిని నిరాకరించకూడదు. పాక్షికంగా ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యాసంస్థలు ఇందుకు భిన్నంగా వ్యవహరించినట్లయితే సహాయాన్ని నిలిపివేస్తామని ప్రకటించారు. ఎన్నో విపరీత సంఘటనలను ఎదుర్కొంటూ, పరిస్థితులతో పోరాడుతూ కొందరు దయామయుల సహాయాలతో అంబేద్కర్ 1907లో మెట్రిక్ పాసయ్యారు. ఎల్ఫిన్‌స్టన్ కళాశాల నుండి 1912లో B.A పట్టా అందుకున్నారు. 1913 లో బరోడా మహారాజు కొంతమంది విద్యార్థులకు ఉపకారవేతనాలిచ్చి ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి పంపాలని సంకల్పించాడు. అంబేద్కర్ అతని సహాయాన్ని కోరాడు. అంబేద్కర్ జ్ఞానపిపాస, చిత్తశుద్ధి మహారాజుని ఆకర్షించాయి. 10 సంవత్సరాలు వారి సంస్థానంలో పనిచేసే షరతుల మీద ఉపకార వేతనం ఇవ్వడానికి ఒప్పుకున్నారు.

*"పారసీయుల ముసాఫరు సత్రశాలలో*
*నిదురింప జేసెదు నేల లేక*
*ధనవంతు లమెరికా కనక ఖండములోన*
*వసతిగృహంబులో బసయు లేక*
*ప్రభువు ఋణార్థమై పనిచేయు గాంక్షింప*

*సివిలుసర్వీసులో సీటు లేక*
*భయదకుల వ్యాఘ్రి స్వైరవిహార దు*
*ర్వీథులలో గాటు బెట్టలేక*
*ఎవడు చదువ లేని పృథుల విద్య గడించి*
*యభినవ మనువంచు శాఖలజగతి*
*బేరు గాంచి నవ్య భారతరాజ్యాంగ*
*శాసనాల సృష్టి సల్పినావు"* **(పాంచ. పుట.** 87)

అమెరికా జీవితం అంబేద్కర్ జీవితంలో ఒక మైలురాయి. స్వదేశంలో ఆయన గడిపిన జీవితానికి, అమెరికా జీవితానికి ఎంతో తేడా కనిపించింది. సభ్యసమాజం నుండి దూరంగా విసిరివేయబడి సాటివారి చూపులకు, మాటలకు అనర్హుడైన ఆ విద్యార్థి అమెరికాలో అందరితోపాటు తినడం, తిరగడం, మాట్లాడడం అనేది అద్భుతమైన అనుభవం. ఇలాంటి అపూర్వమైన జీవితం తన దేశంలో లక్షలాది మందికి లేనందుకు విచారించాడు. పనిచేస్తూ చదివే అవకాశాలు అక్కడ ఉండడం ఆయనకి అమితానందాన్ని కలిగించాయి. స్వయం సహాయం మానవునిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం ఆయన గమనించాడు. 20 సంవత్సరాల వయసులోనే అనూహ్యమైన భావ పరిణతి, పరిపక్వమైన మేధ అంబేద్కర్‌కి కలిగాయంటే ఇలాంటి విభిన్నమైన అనుభవాలే కారణం. అనుభవ జ్ఞానం, పుస్తక జ్ఞానం రెండూ చక్కగా మేళవించిన విద్యావంతులు (అంబేద్కర్ లాంటివారు) ప్రపంచంలోనే అరుదు.

*"భగవంతుం డనువానికే సమసిపోవున్ జాలి, యీలాటి దు*
*ర్భరదారిద్ర్యములో మునుంగు కులమున్ రక్షింపఁగామానవుం*
*డగునే? యిట్టివి నీయెడం గలిగెనయ్యా! చూతువా! యిండియా*
*జగమందుం గల పంచమీయులనుబాష్పస్విన్నదుఃఖాన్యులన్"*

**(పాంచ. పుట.** 86)

రెండు వేల సంవత్సరాల నుండి కుల భేదాలను రూపుమాపడానికి పెద్ద ప్రయత్నం జరగలేదు. తాత్కాలిక ప్రయోజనాలు ఇచ్చే ఉద్యమాలు కొన్ని జరిగినా అవి లెక్కలోకి రావు. మూఢనమ్మకాలు వదిలిపెట్టి చుట్టూ ఉన్న పరిస్థితులు గమనించండి, అర్థం చేసుకోండి. ఒక మనిషిని దేవుడిలా పూజించడం మంచిది కాదు. వ్యక్తి పూజ వినాశనానికి దారి తీస్తుంది. దానిని మొగ్గలోనే తుంచివేయాలి. మీ సమస్యలని ఒకరి మీద ఉంచడం వల్ల మీకు వారి మీద ఆధారపడడం అలవాటైపోతుంది. తద్వారా మీరు కర్తవ్యాల నుండి విముఖులై బాధ్యతా రహితంగా ప్రవర్తించడానికి అవకాశం ఉంది. మీరు ఇలాంటి భావాలకు, ఆలోచనలకు తావిచ్చినట్లయితే మీ పరిస్థితి నీటిప్రవాహంలో కొట్టుకుపోయే కొయ్యదుంగల కంటే ఏ మాత్రం మెరుగ్గా ఉండదు. మీకు రాబోతున్న రాజకీయ హక్కుల్ని తేలికగా చూడకండి. ఇంత వరకూ హిందూ సమాజం మిమ్మల్ని కర్మ సూత్రానికి బంధించి నిస్సహాయులను చేసింది. మీలో నిరాశను, నిస్పృహను, చేతగానితనాన్ని నింపింది. ఈ మూఢనమ్మకాల నుండి వెలుపలికి రండి. ఇతర దేశాలలో జాతికి, దేశానికి గొప్ప ఆపద సంభవించినప్పుడు ప్రజలందరూ ఏకమై ఆ ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. కానీ మనదేశంలో ఏ దైవమో దిగివచ్చి తమను రక్షిస్తాడని ఎదురుచూస్తూ ఉంటారు. మనం చేయవలసిన పనిని మానివేసి మరెవరో వచ్చి చేసిపెడతారని ఎదురుచూస్తూ ఉంటారు. అలాంటి భ్రమలకు, ప్రమాదాలకు లోను కావొద్దని హెచ్చరించారు.

*"కుటిల కులపిశాచి పటుదర్పము నణంచ*
*కట్టినావు వీరకంకణమ్ము*
*మనువువై యశాన మనినావు, మంత్రివై*
*యుండియూ జగమ్ము నేలినావు."* (**పాంచ. పుట.** 85)

మీ బానిసత్వాన్ని మీరే తొలగించుకోవాలి. రాజ్యాధికారంతోనే మీ సమస్యలు పరిష్కృతమౌతాయి. తీర్థయాత్రలవల్ల కాదు. పూజలు, పురస్కారాల వల్ల తిండి, బట్ట సంఘంలో గౌరవం లభించదు. మీ జీవితంలో మార్పు రాదు. మీ జీవితాలలో మార్పు రావాలంటే, మీ పిల్లలు విద్యావంతులై సంఘంలో గౌరవ మర్యాదలు పొందాలంటే ఆ ప్రయత్నాలు మీరే చేయాలి. స్వశక్తితో సంపాదించుకోవాలి. రాజ్యాధికారం మీకు ఆ

శక్తిని ఇస్తుంది అని తరచూ బోధించేవాడు. అంటరానితనం పోవడంతోపాటు సామాజిక భావన పెరగాలని భిన్న కులాల మధ్య వివాహాలు జరిగి మానవజాతి అంతా ఏకం కావాలని ఆయన ఆశించాడు. ప్రతి మనిషికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పౌర రంగాలలో సమాన అవకాశాలు ఉండాలి. రైతులు, కార్మికులు ప్రజాస్వామ్యంలో పాల్పంచుకోవాలి అని హెచ్చరించాడు. స్త్రీలు సామాజికంగా, రాజకీయంగా ముందుకు రావాలి. వారివల్ల జరిగే పనులు సమాజంలో చాలా ఉన్నాయి. వారి తోడ్పాటుతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. అంబేద్కర్ కులం పేరిట, మతం పేరిట ప్రచారంలోకి వచ్చిన మూఢాచారాలను ద్వేషించాడు. వాటికి వ్యతిరేకంగా పోరాటం జరిపాడు. "మతం అనేది శాస్త్రానుగుణంగా, హేతుబద్ధంగా ఉండాలి. అలాలేని నాడు అది వివాదాస్పదమై క్షీణించిపోతుంది" అని అంబేద్కర్ పేర్కొన్నాడు.

### 3.10.**నీలం సంజీవరెడ్డి**:

*"సామాన్యుండగు రైతుగర్భమున నీ జన్మంబు ప్రస్ఫితమౌ*
*ధీమాచాతురిఁ జూపి విద్యలకు స్వస్తిం జెప్పి ధైర్యాన గాం*
*ధీమౌ నీంద్రునిజాడలో మెలఁగి బందీవై శ్రమల్ వద్ద నీ*
*సామంబైన మనస్సు దేశ మెఱుఁగు సంజీవరెడ్యగ్రణీ"*(ప్ర భ. పుట. 10)

అనాది నుండి ఆంధ్రదేశం త్యాగధనులకు, వీరులకు, ధీరులకు పుట్టినిల్లు. అలనాటి శాతవాహన, చాళుక్య, చోళుల నుండి నేటివరకూ పేరుగాంచిన మహనీయులను ఎందరినో ఆంధ్రమాత కన్నది. ఆ మహనీయులలో నీలం సంజీవరెడ్డి ఒకరు. ఆంధ్ర ప్రదేశ్‌లో అనంతపురం జిల్లాకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇల్లూరు అనే గ్రామంలో చిన్నపురెడ్డి, సుబ్బమ్మ దంపతులకు మే 19, 1893 లో జన్మించారు. వీరిది విద్యావంతుల కుటుంబం, మధ్యతరగతి రైతు కుటుంబం. చిన్నపురెడ్డి గారు రాయలసీమ ప్రాంతంలో బాగా పేరుపొందిన రైతు. ఆ రోజుల్లో భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తుల్లో చిన్నపురెడ్డి ఒకరు. పువ్వు పుట్టగానే పరిమళించును అన్నట్టు సంజీవరెడ్డి పుట్టగానే అనేక శుభసూచనలు కనిపించాయి. వాళ్ళ ఇంటికి జ్యోతిష్యుడు వచ్చి మీ పిల్లవాడు పెరిగి పెద్దవాడై దేశానికి రాజవుతాడని చెప్పాడు. సుప్రసిద్ధ వంగ కవీంద్రులు బంకించంద్ర ఛటోపాధ్యాయ, రవీంద్రనాథ్

ఠాగూర్‌లు కీర్తించిన దేశభక్తి గీతాలు మొట్టమొదటిసారిగా 1911 డిసెంబర్ 27న కలకత్తాలో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో మొదలై దేశం అంతా మారుమ్రోగుతున్న రోజులవి.

*"అలకాశ్మీరమునుండి సింహళముమధ్యం గల్గు విశ్వంభరా*
*స్థలము ౯ సంజీవరెడ్డికీర్తి రమ శశ్వత్ స్థాయిగా నిల్చి మా*
*తెలుఁగుందేశ పురంధ్రి చిర్నగవుతో దీవించు దేశాలలో*
*పల వాసిం గని తెల్గువారలమహాద్భాగ్యమ్ము లింపొందఁగ ౯".*(ప్రభ. పుట. 11)

రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన రైతుబిడ్డ సంజీవరెడ్డి. దూరదృష్టి, సుహృద్భావం, మానవత్వం, ఉన్నత ఆదర్శాలు మూర్తీభవించిన గొప్ప రాజనీతిజ్ఞుడు. శత్రువులతో కూడా మిత్రత్వం చేయగల ధీశాలి. నమ్మిన సిద్ధాంతాన్ని సూటిగా, స్పష్టంగా నిర్భయంగా అమలు చేయగల ధైర్యశీలి. ఒక పని చేసేటప్పుడు అది జరిగేంతవరకూ నిద్రాహారాలు మాని సహచరులతో కలసి పనిచేసేవాడు. నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనం సంజీవరెడ్డి. ఈయన భారత రాష్ట్రపతిగా ఎన్నికకావడం ఆంధ్రదేశానికి గర్వకారణం. రాష్ట్రపతి పదవికి తెలుగువాడు ఎన్నిక కావడం పెద్ద విశేషం. ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గర్వించదగ్గ అంశం. అప్పటి వరకూ దేశాధ్యక్షులుగా ఎక్కువగా సంపన్న కుటుంబాలకు, రాజరిక కుటుంబాలకు లేదా ఆవర్గానికి సంబంధించినవారు ఎన్నికయ్యేవారు. కాయా కష్టం చేసి ప్రజలకు తిండిపెట్టే రైతు కుటుంబం నుండి అధ్యక్షులు కావడం చాలా అరుదు. ఇలా మామూలు రైతు కుటుంబం నుండి అమెరికా అధ్యక్షస్థానానికి ఎదిగినవారు జిమ్మికార్టర్. భారతదేశంలో సంజీవరెడ్డి వెనుకబడిన రాయలసీమ ప్రాంతం నుండి భారతరాష్ట్రపతి పదవిని అలంకరించారు.

మున్సబుగిరి నుండి ముఖ్యమంత్రి వరకూ, ఆంధ్రరాష్ట్ర నాయకత్వం నుండి అఖిల భారత కాంగ్రెస్ ఆధిపత్యం వరకూ, లోక్‌సభ అధ్యక్షపదవి నుంచి దేశాధ్యక్ష పదవి వరకూ సమర్థంగా నిర్వహించగల దక్షుడు నీలం సంజీవరెడ్డి. విశ్వవిద్యాలయ విద్య అంతగా లేకపోయినప్పటికీ విశ్వ కళ్యాణానికి కావలసిన జ్ఞానాన్ని స్వయం కృషితో ఆర్జించారు. విద్యకు మించిన వినయం, చదువుకు మించిన సంస్కారం ఆయన

సొత్తు. ఒకప్పుడు నడిబజారులో ఉన్న హైదరాబాదు సచివాలయ భవనంలో ప్రవేశానుమతిని(గేట్ పాస్) ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నంతకాలం పార్టీనియమాలను తు.చ. తప్పకుండా పాటించారు. ఈ గడ్డమీద నెహ్రూ బ్రతికుండగా సమిష్టి నాయకత్వం గురించి మాట్లాడిన వారు సంజీవరెడ్డే. మాట్లాడడమే కాదు అప్పటి నాయకులైన కామరాజు, పాటిల్, మొరార్జీదేశాయ్ మొదలైన నాయకులతో సమాలోచనలు జరిపి దేశ నాయకత్వ సమస్యకు ఆనాడే పరిష్కారం చూపారు. సంజీవరెడ్డి స్పీకరుగా ఎన్నిక కావడం ఏమిటి అనుకున్నవాళ్ళు ఉన్నారు. తన శక్తి సామర్థ్యాలతో కొద్ది రోజుల్లోనే స్పీకర్ పదవికి అర్హుడని నిరూపించుకున్నారు. రాష్ట్రపతి పదవికి పోటీచేసి ఓడిపోయినప్పుడు బాధపడిన మాట నిజమే. కాని బాధ పదవి రానందుకు కాదు. తన పార్టీవాళ్ళే తనను వంచించినందుకు. సంజీవరెడ్డి పదవులు ఎన్ని మారినా పొలం పనులు మరచిపోలేదు.

*"పూచి విచ్చి రహించెఁబో తెల్గువనములో*
*నీవు నాటిన దొడ్డయీవిమొలక*
*పూన్కిమై ప్రవహించెఁబో భారతమ్మున*
*భవదీయ శౌర్య శుంభత్స్రవంతి*
*ముద్దారఁ గావించెఁబో విశాలాంధ్రన*
*రంజకం బైన నీ మంజువాణి*
*పొంగారఁ బొడకట్టెఁబో తెల్గుజాతికి*
*నీ వేష రాహిత్య జీవితమ్ము*
*నాల్గుపదుల మీఁద నాల్గు రెండును వర్ష*
*ములను గల్గినట్టి ముఖ్యమంత్రి*
*సార్థకమ్ము నీదు జన్మ ధన్యుఁడ వింక*
*నేలికొనుము తెలుఁగు నేల నీవు."* **(ప్రభ.పుట.** 11)

తెలుగు నాయకుల రాజకీయాలు విలక్షణమైనవి. పఠాభి, ఆచార్య రంగా, ప్రకాశం మొదలైనవారు ఆంధ్రరాజకీయాలలో కీలక పాత్ర పోషించి జాతీయ స్థాయికి ఎదిగి పేరు తెచ్చుకున్నారు. ప్రకాశం పంతులు ఎంతటి మహోన్నతుడైనప్పటికీ ఆంధ్ర

రాజకీయాల గడప దాటే ప్రయత్నం చేయలేదు. ప్రకాశం పంతులు పట్ల సంజీవరెడ్డికి గౌరవం ఎక్కువ. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రకాశం పంతులుగారిని సింహాసనం పై కూర్చోపెట్టి సంజీవరెడ్డి పాలనా భారాన్ని మోశారు. ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు సంజీవరెడ్డి పుణికి పుచ్చుకొని గురువుని మించిన శిష్యుడయ్యాడు. జాతీయ రాజకీయాలకు ఎదిగిన సంజీవరెడ్డి 7,8 సం.లు రాజకీయ సన్యాసం చేసి మరికొంత కాలానికి రాజకీయ సమరంలోకి దిగడం సాహసోపేతమైన నిర్ణయం. కాడి, మడి పక్కనపెట్టి ఎన్నికల కదన రంగంలోకి దూకిన సంజీవరెడ్డికి తెలుగు తల్లి వీరతిలకం దిద్దింది.

బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణ, జాకీర్ హుస్సేన్, వి.వి. గిరి, ఫక్రుద్దీన్ ఆలీమహమద్, సంజీవరెడ్డి. ఈ ఉద్దండుల పరంపరలో ఎవరి ప్రత్యేకత వారిది. రాష్ట్రపతి పదవి రబ్బరు స్టాంపు కాకూడదని రాజేంద్రప్రసాద్ మొదలుకొని ఆపదవి చేపట్టిని వారందరూ నిజాయతీతో కృషిచేశారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం చేసిన రాజ్యాంగ సవరణ రాష్ట్రపతి పదవిని మరింత అలంకారప్రాయం చేసింది. రాష్ట్రపతి పదవికి ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉంటుంది. సంజీవరెడ్డి ముద్ర కాగితాలపై లేదుగాని దేశ భవిష్యత్తుపై వుంది. సంజీవరెడ్డి మాటలు వింటే వారికి కొన్ని దృఢమైన అభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తుంది. అవి: దారిద్ర్య నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, అస్పృశ్యతా నివారణ. ఏ పార్టీవారైనను దారిద్ర్య నిర్మూలనకు పూనుకోవడం హర్షించదగ్గ విషయం. దీని వల్ల సంజీవరెడ్డి గాంధేయవాదంలో ప్రప్రథముడని చెప్పవచ్చు. అకుంటిత దేశభక్తి, అచంచల కార్యదీక్ష ఆయనలో నిబిడీకృతమయ్యాయి. రాష్ట్రపతి భవనంలో రాజభోగాలున్నప్పటికీ దారిద్ర్య నిర్మూలనను మరచిపోలేని దయార్ధహృదయుడు. మానవసేవే మాధవ సేవ అనేది అతని విశ్వాసం. ఆధునిక భారతదేశానికేకాక అఖిల జగత్తుకు ఆదర్శప్రాయుడు. ఆయనను అభిమానించినవారిలో పేదలు ఎక్కువగా ఉండడం విశేషం.

నీలం సంజీవరెడ్డి బహుముఖ ప్రజ్ఞావంతుడు. తెలుగుప్రజల అభిమాన నాయకుడు. భారతజాతి భవిష్యత్తుకు పునాదులు వేశారు. ప్రగతి పథంలో ఆయన చేసే ప్రయాణం సుదీర్ఘంగా సాగిపోవాలి. చరిత్ర పరిభ్రమణంలో ఆవిర్భావించే కొందరు

వ్యక్తులు తమ ఉదాత్త జీవిత విశేషాలతో సమాజానికి వెలుగును ప్రసాదిస్తారు. ప్రగతి పథంలో పయనిస్తూ కాలగమనానికి అశాశ్వతమైన భోగభాగ్యాలకు ఆసక్తి చెందక శాశ్వత యశస్సును అందుకొనే మహాపురుషులు సదాపూజనీయులు (సాదినేని రంగారావు, 1979).

**1.11.నార్ల వెంకటేశ్వరరావు:**

*" సంఘసంస్కార రక్షామహాసవనకుం*
*డాన నాశయపు టింధనము వైచి*
*సకల సమానతా సౌజన్య కారుణ్య*
*స్రోతస్వినీధార లీతలాడి*
*ప్రాక్పశ్చమ ప్రధా వైజ్ఞానిక గ్రంథ*
*సారసంగ్రహ విశేషములు సదివి*
*భావబంధుర గాఢ ప్రచులిత చైతన్య*
*రచనా సుధల తెల్గు ప్రజల*
*డెబ్బదయిదేండ్లు కలిగిన రీవియింత*
*చెక్కుచెదరక నిలిచిన శేముషిధు*
*రంధరా తేనియలు నీదు రచనలందు*
*పొర్లిపొఱు యధార్థమ్ము నార్లధీర."* **(రాజధాని. పుట.** 59)

భారత పత్రికారంగంలో తన రచనా నైపుణ్యంతో పాఠకలోకంపై బలమైన ముద్రవేసుకున్న అనేకమంది పాత్రికేయులలో నార్ల వెంకటేశ్వరరావు ఒకరు. జాతీయ స్వాతంత్ర్యోద్యమంతో సంబంధం లేకుండా నార్లవారిని ప్రభావితం చేసిన గాంధీజీ, స్వామివివేకానంద, అరవిందుడు లాంటి రాజకీయ తాత్త్వికమూర్తులే కాకుండా అభ్యుదయవాద, హేతువాద నిరీశ్వరవాదులు కూడా ఉన్నారు. ప్రసార మాధ్యమాల దృష్టిని నార్ల వెంకటేశ్వరరావు దేశ సాంఘిక సమస్యల పరిష్కారం వైపు నడిపించారు. 'సోదర సమితి' ప్రభావంతో అస్పృశ్యత లాంటి అనేక సాంఘిక సమస్యలవైపు మళ్ళించడానికి దోహదం చేశారు. కరువు సమస్యపైన, ముంపు సమస్యపైన ఆంధ్రప్రభ,

ఆంధ్రజ్యోతి పత్రికలకు సంపాదకత్వం వహించిన రోజుల్లో ఉద్యమస్ఫూర్తితో బాధితులకు విరాళాలను సేకరించారు. ఆ పత్రికలను ఆయుధాలుగా వాడుకొని పాత్రికేయులకు కొత్త స్ఫూర్తిని అందించారు. దీనికోసం కళాకారుల్ని రంగంలో దించేలా కొన్ని సంపాదకీయాలు రాశారు. పత్రికల ద్వారా సహాయకనిధులు సేకరించారు. తన జీవితంలో దాదాపు ఒక డజను పత్రికలకు పైగానే వివిధ అంశాలపై రచనలు చేశారు. అలాగే ఇంగ్లీషు జర్నలిజంలోను తెలుగులో ఉన్నంత విస్తృతస్థాయిలో కాకపోయినా కొన్ని విలువైన రచనలు చేశారు. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొంటూ వ్యాస రచనను కొనసాగించడమేకాక బ్రిటీష్ పాలనలో అరెస్టు చేయబడి కొన్ని నెలలపాటు జైలు శిక్షను అనుభవించారు. అన్నింటికన్నా ముఖ్యంగా నార్లవారు ఆంధ్రవిశారద తాపీధర్మారావు శిష్యరికంలో 'జనవాణి' పత్రిక నిర్వహణను కింది పద్యంలో వివరించారు.

*"సమతనేర్పని పురాణములను గర్హించి*
*హేతువాదమునకు చేతులెత్తి*
*ఛాందసంబైన భాషావైఖరిని నెట్టి*
*శిష్టజీవద్భాషకిష్టపడుచు*
*జనవాణి కద్దమౌ సంపాదకీయాల*
*హుందాతనానకువిందు సేసి*
*ప్రగతి నిరోధించు పనికిమాలిన యట్టి*
*వ్యర్థ ఘట్టాలను ప్రతి ఘటించి*
*నీవు రచనలందు నీదైనశైలిని*
*నిలిపి తెలుగు మేలిపలుకుబడుల*
*గుస్తరించి వన్నె గూర్చితిసంపాద*
*కులకు గౌరవమ్ము గుర్చినావు"* **(రాజధాని. పుట.** 60)

నార్ల వెంకటేశ్వరరావు విద్యార్థి దశలోనే జాతీయోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. 1927 డిసెంబరు మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. ఆ సభలో కాంగ్రెస్ పూర్ణస్వరాజ్యం కోరుతూ తీర్మానం చేసింది.

దానివల్ల ఉత్తేజితుడైన నార్లవారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. పట్టాభి సీతారామయ్య తెల్లబియ్యం, తెల్లపంచదారతో సహా ప్రతీ తెల్లవస్తువును బహిష్కరించాలని ఉద్దేశిస్తూ ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసం జేబులో ఉండగా పోలీసులకు దొరికిపోయారు. దాంతో ఆయన్ని పోలీసులు స్పృహ తప్పేవరకూ కొట్టారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వ్యాసాలు రాశారు. అందుకు నార్లవారు 7 నెలలు కఠినకారాగారశిక్ష అనుభవించారు. ఉప్పుసత్యాగ్రహంలో కూడా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా1958లోనూ, 1964లోనూ ఎన్నికయ్యారు. రాజ్యసభలో హిందీలోనూ భారతీయ భాషల్లోనూ అనువాదాల విషయంపై నిపుణుల సంఘం వెయ్యాలనే ప్రతిపాదనపై నార్లవారు చర్చలో పాల్గొన్నారు. అనువాదం అంటే యాంత్రికంగా జరిగేదికాదని మూలం అవగాహనచేసుకొని మరలా సృష్టించడం అని నార్లవారు చెప్పారు. అనువాద కార్యాన్ని సృజనాత్మకత కలిగిన రచయితలకు అప్పగించాలని సూచించారు. భారత రక్షణబిల్లుపై జరిగిన చర్చలో నార్లవారు సుదీర్ఘ ప్రసంగం చేశారు. రక్షణకు సంబంధించిన అనేక విషయాలు ఇండియా తొందరపడి బయటపెడుతుందని ఈ విషయంలో జాగ్రత్త అవసరమని ఆయన తెలిపాడు. చైనా తన గూఢచారి చర్యలతో ఏజెంట్లతో సమాచారాన్ని సేకరిస్తుండగా అలాంటివారికి మనం ఇవ్వకూడని సమాచారం ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే అధికారాలను విచక్షణతో వినియోగించాలని నార్లవారు కోరారు. 1983లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నార్లవారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుడిగా నియమించింది. అప్పుడు వారు రాష్ట్రంలో సంగీత, సాహిత్య, నాటక అకాడమీలను మూడింటినీ విలీనం చేశారు. 1984 లో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేశారు.

*“సమధర్మమ్ముగనెంచి విశ్వరచనా సామ్రాజ్య చారిత్రమం*
*దమరన్ వేమన ధర్మమార్గచరితం బందించి వీరేశలిం*
*గము సంస్కారచరిత్రసారము లోకంబందుజాటింప నాం*
*గ్లము నాంగ్లులు మెచ్చ వ్రాసితివి నార్లా! శేముషీవైభవా!”*(రాజధాని.పుట. 61)

తెలుగు భాషలో నార్లవారు రాసినన్ని సంపాదకీయాలు ఎవరూ రాయలేదు. సంపాదకీయాలలో వారికి వచ్చినంత ఖ్యాతి మరెవరికీ రాలేదు. సంపాదకీయ రచనలో వారిది ఒక విశిష్ట శైలి. భాష, భావాలను వ్యక్తీకరించడంలో వైశిష్ట్యాన్ని సంతరించుకున్న రచయితలలో నార్లవారు ఒకరు. నార్ల వారి పత్రికా రచనా విధానం ఒక్కొక్కసారి విమర్శనాత్మకంగా, ఒక్కొక్కసారి ఉత్తేజ పూరితంగా, నిర్మాణాత్మకంగా సాగేది. ఈనాడు పత్రికా ప్రపంచం అనుసరిస్తున్న భాషా సంప్రదాయాలకు ఒక రకంగా వారే ఆద్యులనడంలో అతిశయోక్తిలేదు. ఆధునిక పత్రికా రచనకి ఒక ఒరవడి దిద్దింది నార్లవారే. అంతేకాక ఒక సంపాదకుడిగా నార్లవారు తనదైన శైలిని, విశిష్ట నిర్మాణంలో, ప్రచురణలో ప్రవేశపెట్టి తన ప్రత్యేకతను చాటుకున్నారు. నార్లవారు తనజీవితాన్ని అతి సాధారణ పరిస్థితులతో ప్రారంభించి రెండు ప్రముఖ దినపత్రికలకు(ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి) సంపాదకుడిగా ఉన్నారు. అనేక నూతన ఒరవడులను సృష్టించారు. విశిష్ట సంపాదకుడిగా పేరు ప్రఖ్యాతులను ఆర్జించారు. 1985 ఫిబ్రవరి 15న నార్ల వెంకటేశ్వరరావు గారు హైదరాబాదులోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో అంతిమ శ్వాస విడిచారు.

### 3.12.**బెజవాడ గోపాలరెడ్డి**:

బెజవాడ గోపాలరెడ్డి 1907 ఆగష్టు 5 న నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు బెజవాడ పట్టాభిరామిరెడ్డి, సీతమ్మ. ఈయన ప్రాథమిక విద్య బుచ్చిరెడ్డిపాలెంలో, ఆ తర్వాత నెల్లూరులో కొనసాగింది. బాల్యంలోనే దేశభక్తి భావాలను పెంచుకున్న గోపాలరెడ్డి గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. పలుమార్లు జైలుకి వెళ్ళారు. తర్వాత మూడుపదుల వయసైనా నిండకముందే నాయకత్వ లక్షణాలతో రాణించి మంత్రిపదవిని చేపట్టారు. మద్రాసు, కర్నూలు, హైదరాబాదు, ఢిల్లీలలో 180 మాసాలపాటు వివిధ హోదాలలో మంత్రిపదవులు నిర్వహించారు. రాష్ట్ర, కేంద్రస్థాయిలలో మంత్రి పదవులు సమర్థవంతంగా నిర్వహించి ఆతర్వాత ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. తర్వాత 5 సం.లకు పైగా ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలను నిర్వహించారు. ఒకవైపున రాజకీయాలలో, పదవీబాధ్యతలతో తలమునకలుగా ఉండి క్షణం తీరికలేని రోజుల్లోనే

ఆయన సాహిత్యం, ఇతర లలితకళలపట్లా ఆసక్తిని పెంచుకున్నారు. ఇతర రాజకీయవేత్తలెవరికీ అనుభవం కాని ఈ ద్వంద్వ ప్రకృతి ఆయనకు సమకాలీన రాజకీయ నాయకుల్లో ఒక విశిష్ట స్థానం ఏర్పరిచింది. అందుచేతనే ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్‌గాను ఎన్నిక కావడం, 1951 – 1957 వరకూ ఆరు సంతవత్సరాల కాలం ఆయన ఆ పదవిని నిర్వహించారు. జ్ఞానానందకవి బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య సేవను, రాజకీయ సేవను కింది పద్యంలో చిత్రించారు.

*"సాహిత్యమ్మున రాజకీయమున వైశద్యమ్ము ధీమత్తయు*
*బాహాటింపగ సవ్యసాచివలె విద్వచ్ఛ్లాఘ్య! జోడించి యు*
*త్సాహంబు న్నిఖిలాంధ్ర వాఙ్మయ సభాధ్యక్షుండవై వెల్గు నీ*
*సౌహార్దమ్మునకు నమస్సులు మనీషా రెడ్డివంశాగ్రణి!"* (ప్రభ.పుట. 8)

సాహిత్య పరమైన పదవీబాధ్యతను చేపట్టి ఆయన భాషా సాహిత్యాలకు ఎంతో సేవ చేశారు. 'తెలుగుభాషా సమితి', 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ' వంటి సంస్థలకు సుదీర్ఘకాలం అధ్యక్షులుగా ఉండి తెలుగు భాషా సంస్కృతులకు దోహదంచేసే అనేక కార్యక్రమాలకు, గ్రంథ ప్రచురణలకు సారథ్యం వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుగానూ, జ్ఞానపీఠం అధ్యక్షులుగాను వ్యవహరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ అంతేవాసిగా ఆ మహాకవి విశ్వజనీనభావాలపైన ఎంతో మక్కువ పెంచుకున్నాడు. ఆ ఇష్టంతోనే రవీంద్రుని నాటికలు, కథలు, కవిత్వం పది గ్రంథాలకు పైగా తెలుగులోకి అనువదించాడు. ఉర్దూ, పర్షియన్ భాషలతోనూ పరిచయం పెంచుకొని గోపాలరెడ్డి ఉర్దూకవుల రచనలను, కవితలను తెలుగులోకి అనువదించారు. ఈ అనువాద సాహిత్యం ఆయన సాహిత్య కృషిలో ఒక పార్శ్వం మాత్రమే. 70 వసంతాలు నిండిన వయసులో ఆయన తనదైన సొంతగళం వినిపించడం ప్రారంభించాడు. 50 ఏళ్ళపాటు సాగించిన రాజకీయ, సాహిత్య, సాంఘిక యాత్రలో పండించుకున్న అనేక అనుభవాలను, అనుభూతులను అక్షరబద్ధంచేస్తూ అనేక స్వతంత్ర వచన కవితా కావ్యాలను రాసి ప్రచురించారు. భాషలో, భావంలో, అభివ్యక్తిలో ఒక వినూత్నమైన ఒరవడినీ, తనదైన స్వీయ ముద్రణనూ సాధించుకున్న రచనలవి. గోపాలరెడ్డి 20కి పైగా కవితా సంపుటులు

ప్రచురించారు. దేశభక్తి ప్రపూర్ణునిగా ప్రకృతి సౌందర్యారాధకునిగా, మానవతావాదిగా సామాజిక ఆలోచనాశీలిగా తాత్త్విక భావ సంపన్నునిగా అన్నింటినీ మించి హృదయవాదిగా ఆయన తన అనుభవ అనుభూతి పరంపరకు అక్షరరూపం ఇచ్చుకున్న కవితా ఖండికలివి.

*"భారత భూమికి మంత్రివై పరఁగు, దివ్య*
*లలిత కావ్య వల్లభుఁడవై చెలగు, సకల*
*సత్కళామర్మము లెఱుగు సాహితీప్ర*
*భాసమానుఁడ! జయము గోపాలరెడ్డి!"* (ప్రభ. పుట. 9)

1972లో ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పదవీవిరమణ చేసిన తర్వాత నెల్లూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా వైదొలగి తనకు ఎంతో ఇష్టమైన సాహిత్య కళారాధనలో కాలం గడిపారు. ఒకసారి రాజకీయ పదవుల వైభవాన్ని చవిచూసినవారు సాధారణంగా వాటిని దూరం చేసుకోరు. గోపాలరెడ్డి తనకు అప్రయత్నంగానే లభించిన పదవులను ఒక నిర్మోహ మాట దృష్టితో నీతి, నిజాయితీలతో నిర్వహించారేకాని పదవులకోసం ఎప్పుడూ ప్రాకులాడలేదు. సమున్నతమైన ఆదర్శభావాలతో జీవితాన్ని నిర్దేశించుకున్న స్థితప్రజ్ఞుడు గోపాలరెడ్డి. సుదీర్ఘకాలం సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా వ్యవహరించినప్పుడు ఎందరో ఉద్దండ కవిపండితులతో ఆయనకి స్నేహ బాంధవ్యాలుండేవి. పండితసీమగా పేరుపొందిన నెల్లూరు పట్టణంలో కవిత్రయ జయంతుల వంటి అనేక సాహిత్య సభలు వారి ఆధ్వర్యంలో జరుగుతూ ఉండేవి. ఎందరో కవి పండితులకు వారి చేతులమీదుగా గౌరవపురస్కారాలు అందచేశారు. దేశంలో ఎక్కడా ఏ సాహిత్య సభ జరిగినా గోపాలరెడ్డికి తప్పనిసరిగా ఆహ్వానం వెళ్తుండేది. గోపాలరెడ్డి ఆ సభలు ఎంతదూరమైనా లెక్కచేయక ఇష్టంగా వెళ్లి పాల్గొనేవారు. ఎందరో కవిమిత్రులతో కవితాగోష్ఠులు చేసేవారు. నిత్య సాహిత్య వ్రతశీలమైన ఒక చైతన్య స్రవంతిగా జీవితాన్ని మలుచుకున్న రసహృదయుడు, సర్వకళాప్రియుడు బెజవాడ గోపాలరెడ్డి. ఆయన ఉన్నతిని కింది పద్యంలో చెప్పారు.

*"ఒగు లేనివిద్య ఠాగోరు సముఖాన*

*గర్వ మింత లేక గడన చేసి*

*తెలుఁగు స్వర్గ భువికి దేవేంద్ర మూర్తి వై*

*వెలుఁగు రెడ్డి దొరకుఁ గలుగు యశము"* **(ప్రభ. పుట.** 8)

రవీంద్రుణి విశ్వమానవతావాదం, బ్రహ్మసమాజ అభ్యుదయ భావ ధోరణులపట్ల ఆకర్షితులై వారు తమ వివాహాన్ని కూడా నిరాడంబరంగా జరుపుకున్నారు. నెల్లూరు జిల్లాలో శ్రీమంతుడైన కవిపండితపోషకుడు తనకు బావ అయిన తిక్కవరపు రామిరెడ్డి కుమార్తె లక్ష్మీకాంతమ్మను గోపాలరెడ్డి 1938లో బ్రహ్మసమాజ విధానంలో వివాహం చేసుకున్నారు. తిథి, వార, నక్షత్రాల ప్రమేయం లేకుండా విశ్వకవి రవీంద్రున్ని పుట్టినరోజే పుణ్యతిథిగా ఎంచుకొని మే 8న ఆయన వివాహం జరిగింది. 30సంవత్సరాల పిన్న వయస్సులోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రమంత్రిగా ఉన్న సమయంలో ఆ వివాహం జరగడం ఆనాటి రాజకీయ వాతావరణంలో ఒక విలక్షణతను సంతరించుకున్నది. మద్రాసు పచ్చప్పాన్ కాలేజీ ఆవరణంలో ఉన్నవ లక్ష్మీనారాయణ, మాగంటి బాపినీడు పౌరోహిత్యంలో ఆ వివాహం జరిగింది. మరునాడు ఉదయం కవితా గోష్ఠి, ఆనాటి ప్రముఖ కవుల ఆశీర్వాదాభినందనలు. విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, మల్లవరపు విశ్వేశ్వరరావు వంటి మహాకవులు సభకు హాజరై నవదంపతులకు ఆశీఃపూర్వకంగా పద్యాలు చదివారు. ఆ పద్యాల సంకలనం 'కళ్యాణ కింకిణి' అనే పేరుతో ప్రచురితమైంది. ప్రభుత్వ పరంగా తనకు లభించే సౌకర్యాలెన్నింటినో వదులుకోవడం మామూలుగా రాజకీయ వర్గాలలో జరగని పని. గోపాలరెడ్డి పబ్లిక్ ఫండ్స్ ఖర్చుపెట్టే విషయంలో ఎంతో పొదుపరితనం పాటించేవారు. ఆయన మంత్రిహోదాలో తన సొంతజిల్లా నెల్లూరుకు టూర్ వెళ్ళినప్పుడు ఆయనకి, సిబ్బందికి తన బంధువుల ఇళ్లలోనే భోజనవసతులు ఏర్పాటవుతుండేవి. అందుచేత తమ జిల్లా వెళ్ళినప్పుడు డి.ఎ ఖర్చులు తీసుకోరాదని ఆర్డర్ వేశారాయన. ఈ విషయాలన్నీ ఆయన కింద పనిచేసే సిబ్బంది చెప్పుకొనేవారు. అన్నింటినీ మించి ఆయనచేసిన ఒక విశిష్ట కృషి గురించి జనసామాన్యానికి తెలియని విషయం ఒకటి ఉంది. తిరుమలలో తాళపత్రాలలో

నిక్షిప్తమైన అన్నమాచార్య కీర్తనలను వెలుగులోకి తెచ్చే కార్యక్రమంలో ఈయన కృషికూడా బలీయంగా ఉంది. బెజవాడ గోపాలరెడ్డి కీర్తిని కింది పద్యంలో పేర్కొన్నారు.

ప్రత్యగ్రస్ఫుట శాశ్వతోన్నత శుభస్ఫార న్మహాదివ్య సా
హిత్యశ్రీ రసభావబంధుక కళాహేవాకమై రెడ్డిరాట్
స్తుత్యం బైన మహేంద్రసత్కళలు సంశోభించెఁ ధొల్త ౯ శుభ
ప్రత్యూషం బగుబాస నేలుకొను గోపాలయ్య రెడ్డి ప్రభూ! (ప్రభ. పుట. 7)

అత్యంత చైతన్యవంతంగా సాగిన తన జీవన క్రమాన్ని గురించి ఆత్మ తృప్తితోనూ, ఆత్మ విశ్వాసంతోనూ ఆయన ఆనాడు చెప్పినమాటలు జీవితనౌకను కొన్ని ఆదర్శాల తెరచాపలతోనే నడపడానికి ప్రయత్నించాను. నన్ను, నా పదవులని, నా సాహిత్యాన్ని అన్నింటినీ జనం మరచిపోవచ్చును. అయినా నాకెందుకో అసంతృప్తి! ఈ జీవననాటక రంగంలో నాపాత్ర నేను చక్కగా నిర్వహించానన్న తృప్తి నాకుంది. సర్వవిపంచిక వంటి ఈ సర్వసృష్టిని గోపాలరెడ్డి ప్రేమించారు. ఈలోకం పాటతో తానూ స్వరం కలిపి మానవతా జీవనాదాలు వినిపించారు. ఈ ప్రపంచపు మహోత్సవంలో మనసారా పాల్గొన్న రసప్రపూర్ణుడు గోపాలరెడ్డి. మాతృభూమికోసం విముక్తి ఉద్యమంలో పనిచేసిన తాను దేశం సర్వస్వతంత్రమై 50 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న స్వర్ణాధ్యాయాన్ని చూడాలనే కోరిక ఉండేది. ఈ కోరికను ఒంటరిగాకాక అల్లంత దూరాన ఆకాశవీధిలో తాను ఎంతగానో ప్రేమించే రవీంద్రగురుదేవులు, గాంధీజీ, నెహ్రూలతో చేయిచేయి కలిపి భారత స్వతంత్ర్య స్వర్ణోత్సవాలను వీక్షించారు. 1997 మార్చి 9 న గోపాలరెడ్డి తుదిశ్వాస విడిచారు.

★★★

# నాలుగవ అధ్యాయం

# జ్ఞానానందకవి రచనలు - సామాజిక స్పృహ

ఒకే సంస్కృతి, సంబంధస్పృహ ఉన్న జనసమూహం 'సమాజం'. కొన్నికొన్ని సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, జీవనవిధానాలు, విశ్వాసాలు, కళలు మొదలైన సాంస్కృతికాంశాలు మానవాళిలో కొందరికి సమానంగా ఉంటాయి. అటువంటి సామాన్య సంబంధమున్న జనసమూహాన్నే సమాజం అంటారు. సమాజసభ్యుల్లో ప్రతిఒక్కడికి తానూ ఫలానా సమాజానికి చెందినవాడిననే స్పృహ ఉంటుంది. ఈ స్పృహే ఆ సమాజ సభ్యులందరినీ ఒక చోట చేరుస్తుంది.

సామాజిక స్పృహలో రెండు అంశాలు ఇమిడి ఉంటాయి 1. సామాజిక స్థితిగతుల అవగాహన 2. ఆ స్థితిగతులకు మూలభూతమైన హేతువుల పరిజ్ఞానం. నిజానికి చాలా మంది రచయితలు మొదటి అంశంతోనే సరిపెట్టుకుంటారు. కొందరు రెండో అంశాన్ని కూడా జోడిస్తారు. మొదటి అంశం అనుభూతి పరిధిని విస్తృతం చేస్తుంది. రెండో అంశం బుద్ధికి పదును పెడుతుంది. సామాజిక స్పృహ ఉన్నంతమాత్రాన ఒకానొక రచన ఉత్తమమని చెప్పడానికి వీలులేదు. ఇది వస్తుగతమైన ఏక దేశం మాత్రమే. రూపగతంగాను సంవిధానగతంగాను కూడా ఆ స్థాయికి నిలబడితే తప్ప ఆ రచనకు ఉత్తమత్వం సిద్ధించదు. కేవలం ప్రబోధాత్మకత మీదే దృష్టి నిలిపి రాసిన రచనలు కొన్ని కళాత్మకంగా దెబ్బతినడానికి కారణమిదే. ఈ సందర్భంలో పరిశీలించవలసిన మరొక అంశం ఏమిటంటే ప్రతి రచయితకు సమాజంపట్ల కొంత బాధ్యత ఉంది. అతడు వాస్తవాన్ని విస్మరింపగూడదు. దానికి వక్రభాష్యం చేయగూడదు. సమాజ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ శక్తులనూ అవి అనుసరిస్తున్న వివిధ పద్ధతులనూ గమనించాలి. వివిధ సమస్యలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి. వాటిని యదార్థంగా చిత్రించాలి. అందుకు కావలసిన చిత్తశుద్ధి అతనిలో ఉండాలి.

సమాజంలో జీవించే ప్రతి ఒక్కరు వైయక్తిక, సామాజిక ప్రవర్తనలు రెంటికీ కొన్ని నమ్మకాలను, ఆచారాలను, సంప్రదాయాలను, ఆలోచనాపద్ధతులను ఆలంబనం చేసుకుంటాడు. గుడ్డివో చెడ్డవో ఏవో కొన్ని నమ్మకాలు లేకపోతె మనిషి బతకలేడు. వ్యక్తి ఆజన్మాంతం సమాజ సభ్యుడే. మనుగడకు ఆవశ్యకమైన ప్రేమాభిమానాలూ సహాయసహకారాలూ, భద్రతా అతనికి సమిష్టి జీవనంలోనే లభ్యమవుతాయి. వ్యక్తిగతంగా అనుభవించే సుఖదు:ఖాలకు సామాజిక ప్రేరకాలే కారకాలు, నివారకాలు అవుతాయి. తోటివాళ్ళతో కష్టసుఖాల్లో కలిసి వుండని సమాజం ఊహకే అందదు. మనిషి మనుగడకు ప్రేమ ఒక్కటే ప్రాణం. దాన్ని నలుగురితో పంచుకోలేని వ్యక్తులు రోగగ్రస్తులు. ఇందుకు వాళ్ళను పూర్తిగా తప్పుపట్టనక్కరలేదు. సామాజిక అవ్యవస్థలు వాళ్ళను అలా తయారు చేశాయి. సహకారానికి మారుగా స్పర్థ, ప్రేమానురగాలకి బదులుగా జాతివిద్వేషాలు, సామాజిక ప్రయోజనాలకు బదులుగా సంకుచిత పాక్షిక ప్రయోజనాలు, విశ్వజనీనతకు బదులుగా విశ్వవినాశకమైన అణుశక్తి సాధన మానవత్వానికి బదులుగా అత్యధిక ధనార్జనాసక్తి వంటి తప్పుడు విలువలు ప్రాబల్యం వహించి మానవుడి సామాజిక జీవనానికే ఎదురై స్వతస్సిద్ధంగా అతనిలో ఉన్న మంచిని హరింపజేస్తున్నాయి. ప్రతి వ్యక్తికీ రెండోవాడి చిత్తశుద్ధిని శంకించే పరిస్థితి నెలకొన్నది. అటువంటప్పుడు సమాజం రోగగ్రస్తం అవుతుంది. దానికి చికిత్స కావాలి. అందుకు సదవగాహన, వినయం, సౌశీల్యం, ప్రేమ, సహానుభూతి కలిగిన వ్యక్తులు ఉద్యమించాలి.

> *"వృత్తులను బట్టి వర్ణమ్ము లేర్పడినవి*
> *యనెదు నీమాట లర్థమ్ములైన వదియ*
> *మూడు నాలుగే కద పంచము డెవడంచు*
> *నడుగుచున్నారు నీవేమియందు వవుర"* **(వంశధార. పుట.**
> 8)

ఏ జాతి మరొక జాతి కంటే గొప్పదికాదు, తక్కువదీకాదు. మనుష్యుల శారీరక, మానసిక శక్తులకు జాతిభేదాలకు ఏ మాత్రం సంబంధం లేదని ఇటివల పరిశోధనల్లో తేలింది. మానవుల విశ్వాసాలలో అత్యంత ప్రబలమైనది, ప్రమాదకరమైంది 'జాతి'

భావన. శారీరక, మానసిక శక్తుల విషయంలో సహజంగా కొన్ని జాతులు సమర్థమైనవి మరికొన్ని అసమర్థమైనవీ అన్న ముఢవిశ్వాసానికి స్వజాతి పక్షపాతం తోడై జాతివిచక్షణ తలెత్తింది. ఈ నాటికి ఈ జాడ్యం ఎక్కడో అక్కడ ఏదో ఒక రూపంలో విలయతాండవం చేస్తూనే ఉంది. ఇంతకూ మానవుడు కూడా ఒక జంతువే అనుకోవాలి కాకపోతే 'ఉన్నత'జాతి జంతువు. ఇతర జంతువుల లక్షణాలు మానవుడికి ఉన్నాయి. అయితే వాటికి,వీటికి వున్న భేదమల్లా  ఆ లక్షణాల విస్తృతిలోనే కాని విధంలోకాదు. నిజానికి మానవరూపాలు కొన్ని లక్షల సంవత్సరాలుగా ఉంటున్నట్టు అంచనా. అయితే మానవుడికి దగ్గరిబంధువులైన జంతువులకు భేదం ఎక్కడ ఉంది అన్న ప్రశ్న వచ్చినప్పుడు జన్యువులలో వచ్చిన మార్పువల్ల ఈ పరిణామమేర్పడిందని చెప్పవలసి ఉంటుంది. మానవులలో భిన్నజాతులు ఆవిర్భవించడానికి వాతావరణ పరిస్థితులు, ఒంటరితనం మొదలైనవాటితో పాటు ఈ ప్రక్రియలు కూడా కారణం అయ్యాయి. ఇక్కడ జాతి అంటే "నిర్థిష్టమైన సామాన్య భౌతిక లక్షణాలు వారసత్వంగా సంక్రమించిన మానవులు" అని అర్థం.

సమాజంలో ప్రాబల్యం పొందినవారు నిర్దిష్ట సాంస్కృతిక పరిమితులకు లోబడి ఉండే విధంగా నిర్ణయించిన జనసమూహమే కులం. సామాజిక ప్రవర్తనను నియంత్రించిన ఈ వ్యవస్థ స్థూలరూపంలో మనుగడ సాగిస్తూనే ఉన్నదాంట్లో అంతర్భేదాలు ఉప వ్యవస్థలు కూడా రూపుగట్టడం జరిగింది. ప్రయోజన సాధనకైతేనేం గౌరవాలకోసమైతేనేం సభ్యులు ఒక ఉపవ్యవస్థ నుంచి మరొక ఉపవ్యవస్థకు మారిన సందర్భాలు ఉన్నాయి. అలా మారకుండానే నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాలు ఉన్నాయి. రామానుజాచార్యులు పంచమ జాతికి వైష్ణవాన్ని అందించి సర్వసమతా దృక్పథాన్ని ప్రదర్శించిన వైనాన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో పేర్కొన్నారు.

*"వర్ణబాహ్యులైన పంచమజాతికి*
*నెమ్మి మీర వైష్ణవమ్మొసంగి*
*సంస్కరించినట్టి రామానుజా*
*చార్యవర్య శౌత్యకార్యధుర్య"*    **(అక్షరాక్షతలు.పుట.** 19)

మనదేశంలో చాతుర్వర్ణ వ్యవస్థ పరిధిలోకి రానివాళ్ళను పంచములుగా గుర్తించినప్పటికి వాళ్ళలోకుడా కొన్ని విభాగాలు ఏర్పడ్డాయి. సాంప్రదాయిక వృత్తులు జీవన విధానాలు నిరంతరం కొనసాగినంతకాలం నిమ్నకులముద్ర కూడా అవమానం అనిపించలేదు. ఆంగ్ల పాలనా కాలంలో పెద్ద ఎత్తున సాగిన క్రైస్తవ మతప్రచారం, మతాంతరీకరణ, దాంతో లభించే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు ఒకపక్కా, హైందవ వ్యతిరేక ప్రచారం, సామాజిక దుర్నీతులపట్ల నిరసన, కులపక్షపాతాల ఖండన, మత సామాజిక సంస్కరణ యత్నాలు, రాజకీయ పరాధీనత మరొక పక్కా ప్రబలంగా పనిచేసినందువల్ల నిమ్నస్థాయి కులాల్లోను ఆత్మగౌరవం పెరిగింది. ఆంగ్ల విద్యావిధానం అందుకు దోహదం చేసింది. గతానుగతికమైన కులవ్యవస్థకు ప్రతిఘటన ఎదురవుతూ వచ్చింది. మహమ్మదీయులు పాలించిన కొన్ని వందల సంవత్సరాల్లో రాని మార్పు బ్రిటీష్ వారు పాలించిన 150-170 సంవత్సరాల్లో వచ్చింది.రాజారామమోహన్ రాయ్ స్థాపించిన 'బ్రహ్మసమాజం', దయానంద సరస్వతి స్థాపించిన 'ఆర్యసమాజం' సాంప్రదాయిక మతాచారాలను నిరసించి సమానత్వ ప్రాతిపదికపై నూతన మత స్థాపనకు కృషి చేశాయి. అయితే వారి కృషి ఆధునిక విద్యావంతుల్లో వ్యాపించినంతగా గాఢంగా ఇతరుల్లో వ్యాపించలేదన్నది నిజం. ఆంగ్లేయపాలనా కాలంలో మొదట ఏర్పడిన 'గుమస్తావర్గం' లో చేరినవాళ్ళు ఎక్కువగా ఉన్నత కులాలవాళ్ళు. రానురాను ఇతరులకు కూడా దానిపట్ల ఆసక్తి, అవసరము పెరగడంతో పోటి ఏర్పడింది. కులపక్షపాతాలు తలెత్తాయి. ఉన్నత కుల వర్గాల నిరసన అధికమైంది. సాంప్రదాయిక వృత్తుల పట్ల ఆసక్తి పెరిగింది. నిమ్న స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు సమాజ సభ్యులందరిలో 'నౌకరీ' పట్ల మోజు పెరిగింది.

## 4.1 సమాజంలో పరిణామం:

*"ఏ దేశ చరిత్ర చూచినా*
*ఏమున్నది గర్వకారణం?*
*నరజాతి చరిత్ర సమస్తం*
*పరపీడన పరాయణత్వం"* – శ్రీశ్రీ

చరిత్ర ప్రారంభమైనప్పటి నుంచి అది నిస్సందేహంగా ఇలాగే సాగింది. ఎందుకంటే, బలవంతుడైన వాడు బలహీనుణ్ణి దోచుకోవడంతోనే, లేక పీడించడంతోనే చరిత్ర ప్రారంభమవుతుంది. ఎందుకంటే రాజులతోను, రాణులతోను మాత్రమే ఈనాటి చరిత్రలు నిర్మించబడ్డాయి. ప్రభువెక్కిన పల్లికిని మోసిన బోయిల గురించి సాధారణంగా చరిత్రలో వివరించలేదు. కనీసం ఆ ప్రయత్నమైనా చేయలేదు. ఆ ప్రయత్నం మొట్టమొదట చేసినవాడు మార్క్స్, ఏంగెల్సులే. నవ సమాజం కొసం లెనిన్ తనజీవితాన్ని నిలిపాడని కింది పద్యంలో పేర్కొన్నారు.

*"విప్లవాత్మతోడ విశ్వమ్ము కదలాడ*
*దెంతో దూరమ్ము నుండి యేతెంచిన ను*
*స్వాంతుండగు సత్కవికిని*
*వంతౌనగూడెను పఠింప పద్యము లెలమిన్"* **(అక్షరాక్షతలు.పుట. 24)**

వారి గతితార్కిక చారిత్రక భౌతికవాదం ప్రకారం సాధారణ మానవ సమాజ చరిత్ర ఈ కింది దశలలో సాగుతుంది. అవి:

- ఆదిమ కమ్యూనిస్టు సమాజం
- బానిస సమాజం
- భూస్వామ్య సమాజం
- జమిందారీ సమాజం
- పెట్టుబడిదారీ సమాజం
- సామ్యవాద సమాజం

నేటి సామాజిక సంబంధాల్ని తెలుసుకునేందుకు పునాదియైన పూర్వపు సమాజాలలోని సామాజిక సంబంధాలను తెలుసుకోవలసి ఉంటుంది.

మానవ సమాజం ఆవిర్భవించినప్పటి నుండి నేటివరకూ అనేక మార్పులకు గురి అవుతూ వచ్చింది. దాని ఫలితంగానే సమాజంలో వర్గాలు ఏర్పడ్డాయి. వీటి అన్నింటికి మూలకారణం సమాజంలోని మానవుని ఆర్థిక స్థితిగతులే. ఆ ఆర్థిక పరిస్థితులలోని మార్పుకు కారణం ఉత్పత్తి సంబంధాలలో కలిగిన మార్పు అని

చెప్పవచ్చు. మానవులు మొదట గుంపులు గుంపులుగా ఉండేవారని చరిత్ర చెబుతోంది. ఈ గుంపులుగా ఏర్పడడానికి కారణం మానవుడు సంఘజీవి. మానవుడు తన నిత్యావసరాలను తీర్చుకోవడానికి, ఆహార సముపార్జన కొరకు నాటినుండి నేటి వరకు, ఒకరి మీద ఒకరు ఆధారపడవలసి వస్తుంది. ఆధారపడుతూనే ఉన్నారు. నాటి నుండి నేటి సమాజంలోని ఎగుడు దిగుడులకు మూలకారణం ఉత్పత్తి సంబంధాలు, దానిపై ఆధారపడినవారి ఆర్థిక స్థితిగతులు అని చెప్పుకోవలసి ఉంటుంది.

### 4.1.1 ఆదిమ కమ్యూనిస్టు సమాజం:

మనిషి పుట్టుక ప్రారంభంలో ఉన్న సమాజం ఇది. ఈ సమాజంలో మానవులు గుంపులు గుంపులుగా జీవించేవారు. శాస్త్రీయంగా దీన్ని రెండు సమాజాలని పరిణామ శాస్త్రజ్ఞులు విభజన చేస్తారు.

1. మాతృస్వామిక వ్యవస్థ అని, 2. పితృస్వామిక వ్యవస్థ అని అప్పటికింకా కుటుంబవ్యవస్థ లేదు. స్వంత ఆస్తి లేదు. అంతా ఆహారం కోసం పోరాటమే. ఈ గుంపు జీవితంలో ప్రథమదశలో స్త్రీలే ఈ గుంపులకు నాయకత్వం వహించేవారు. కుటుంబ వ్యవస్థ ఏర్పడకపోవడంతో గుంపులో పుట్టిన సంతానానికి తల్లి మాత్రమే తెలుసు. అందుకే దానిని మాతృస్వామిక సమాజం అంటారు.

ఆహారం కోసమే అన్వేషణలో తొలిమానవుడు వ్యవసాయం నేర్చుకున్నాడు. దానితో గుంపులో వ్యవసాయం, పశుపోషణ, స్థిరనివాసం ఏర్పడింది. స్థిరనివాసాలతో గ్రామనిర్మాణం క్రమంగా అభివృద్ధి చెందడం కనిపిస్తుంది. ఆ వ్యవస్థలో ఆహార సంపాదన విషయంలోగాని, దాన్ని పంచుకు తినడంలో గాని అందరికి సమాన హక్కు కనబడుతుంది. గ్రామాల ఏర్పాటుతో సొంత ఆస్తి ప్రారంభమైంది. ఒక గుంపు మరొక గుంపుపై దాడులు చేసుకోవడం, గెలిచినవారు యజమానులుగాను, ఓడినవారు బానిసలుగాను పరిగణింపబడ్డారు. గెలిచిన కొద్దిమంది యజమానులు ఉత్పత్తి సాధనాల్ని తమ ఆధీనంలో ఉంచుకోసాగారు. ఈ విధంగా సమాజంలో వర్గాల పుట్టుక వల్ల, కుల మతాల వల్ల ఏర్పడిన అనాగరిక, అమానుషచర్యల్ని కింది పద్యంలో నిరసించాడు.

*"మతవృషభేంద్రముల్ పనికి మాలిన వర్ణపు దున్నపోతులన్*

*జతలుగ సాగి యీ భరతజాతిని నాశ మొనర్చి నేటికీ*

*వితముగ నుంచె నూపిరిని పీల్చుటకైనను శక్తిలేని యీ*

*పతిత కులాల మాట కనపట్టదు జాగృతి గొమ్ము సోదరా"* **(అక్షరాక్షతలు.పుట.** 29)

4.1.2 **బానిస సమాజం: సామాజిక సంబంధాలు :**

ఈ వ్యవస్థలోని సమాజంలో పీడించేవారు, పీడించబడేవారు, ధనికులు, పేదలు అనే వర్గాలు కనబడతాయి. వర్గ సమాజ ఆవిర్భాల వల్ల తగిన అభివృద్ధి జరగలేదు. ఆ వర్గ సమాజపు ప్రాథమిక రూపాన్నే బానిస సమాజం అంటున్నారు. ఇందులో స్వంత ఆస్తి కనబడుతుంది. అందరికి సమాన హక్కులు ఉండవు. "ముఖ్యంగా బానిసలకు ఏ విధమైన హక్కులు ఉండవు".1) బానిసలు యజమానుల ఆస్తిగా పరిగణించబడేవారు. యజమానుల ఇల్లు, భూమి, పశువులు అన్ని ఉన్నట్లే బానిసలను కూడా కలిగి ఉండేవారు. బానిసలు బతికి ఉన్నంతకాలం వారిని యజమానులు పోషించవలసి వచ్చేది. తిండి, తిప్పలు అన్ని యజమాని సమకూర్చేవాడు. బానిసలు యజమానికి కావలసిన పనులన్నీ చేసేవారు. బానిసలు యజమాని ఆస్తిలో భాగం కనుక వారు చనిపోతే యజమానికి నష్టం సంభవించేది. అతని ఆస్తి తగ్గిపోతుంది. బానిస నమాజంలో ధర్మం ఎలా ఉందో జ్ఞానానందకవి కింది పద్యంలో చెప్పారు.

*"ధర్మము దాగుకొన్నది యథార్థము మిక్కిలి మూగవోయె, స*

*త్కర్మ వణంకె, మంచియను దానికి లేదిసుమింత జాగ యే*

*ధర్మము లీవసుంధరను జాగృతి కొల్పునొ లేదొ కానియీ*

*దుర్మద చిత్తులైన చరితుల్ దలలెత్తనిరాకరించెదన్"* **(అక్షరాక్షతలు.పుట.** 32)

ఇది ఈ వ్యవస్థలోని మొదటి రూపమైతే, తరువాతి రూపం మరింత నికృష్టదశకు చేరుకుంది. అమ్మి కొనుక్కుంటున్నట్లుగా నాడు బానిసలను అమ్మడం, కొనుక్కోవడం జరిగేది. ఈవిధంగా బానిసల బతుకులు చవకయిపోయాయి. బానిసల కొరకు యుద్ధాలు జరిగేవని చారిత్రక ఆధారాలు అనేకం లభిస్తున్నాయి. జీవితంలో విసిగిపోయిన బానిసలు తిరుగుబాట్లు చేయడం ప్రారంభించారు. ఈ తిరుగుబాట్లు

బానిస విధానాన్ని కూకటివేళ్ళతో కుదిపివేశాయి. కాని, దాని లక్షణమైన దోపిడి మాత్రం అంతం కాలేదు. ఆహారంగా మాంసం స్థానంలో వ్యవసాయం చేసి ధాన్యాన్ని పండించుకొని తినడం ఎక్కువ కావడంతో సాగుబడి, వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి సాధనాలయ్యాయి. తెలంగాణలో బానిసత్వ సంకెళ్ళ నుండి ప్రజలను చైతన్యం చేయడానికి దేవులపల్లి రామానుజరావు సేవను కింది పద్యంలో పేర్కొన్నారు.

*"తనమాతృభూమి నితరుల పాలించుట*
*గాంచి దుఖాశ్రులు గార్చినాడు*
*పంతాన తెలగాణ 'బానిసత్వమ్ము' ను*
*పోద్రోల శపథమ్ము బూనినాడు*
*కరుడుగట్టిన యహంకారమౌ నైజాము*
*చట్టాల నెదిరింప సాగినాడు*
*ప్రజలలో చైతన్యభావ కాంతిచ్చుటల్*
*భాసిల్ల రచనలు జేసినాడు*
*చిన్నతనమునుండి వన్నెకెక్కిన యట్టి*
*కరుణరసము బరగి వరలినాడు*
*సత్యనిష్ఠ యందు సతము 'రామాజ*
*రావు' సత్పథాన బోవునాడు"* **(అక్షరగుచ్ఛము పుట.17)**

### 4.1.4 భూస్వామ్య సమాజం – సామాజిక సంబంధాలు:

భూ యజమానులైన భూస్వాములు, రైతులు అనే రెండు వర్గాలు ఈ సమాజంలో కనబడుతున్నాయి. కొద్దిమంది యజమానులు అసంఖ్యాకులైన రైతాంగాన్ని దోపిడి చేసేవారు. ఈ వ్యవస్థలో రైతులకు బానిసలు మాదిరిగా కాక కొంత స్వేచ్ఛ ఇవ్వబడింది. భూమిపై హక్కు యజమాని కలిగి ఉంటే దున్నే హక్కు రైతుకున్నట్లు కనబడుతుంది. యాజమాన్యం విలాసాలు, అవసరాలు పెరిగినకొద్దీ రైతుల్ని పీడించి పంటలు దోచుకోవడం జరిగింది. ఈ విధానాన్ని అర్థబానిస విధానం అనవచ్చు. ఈ అర్ధబానిస వ్యవస్థ పరిణామరూపమే నేటి వ్యవసాయ రంగంలోని

కౌలుదారి విధానం అని కూడ చెప్పుకోవచ్చును. భూపరిమితి చట్టం వల్ల జరిగిన మేలును భూసంస్కరణ ఖండికలో కింది విధంగా వివరించారు.

*"ఇక భూసంస్కరణ ప్రజారథము హోయింగొల్పి నిశ్చింతగా*
*ప్రకటీభూత మనోజ్ఞబంధుర ప్రజాస్వామ్య ప్రచోళిన్ చకా*
*చక వేసాగుచున్న దిప్పుడు ప్రజా సందోహమెల్లన్ సుగే*
*తిక లాలపన చేయుచున్నయది భక్తిన్ తృప్తి నిండారగన్"*

**(వెలుగుబాట. పుట.27)**

మొదట్లో రైతులు భూస్వామికి పనిచేస్తూనే ఖాళీ సమయాల్లో తమ పన్లు చేసుకునేవారు. బానిసలకు ఈ హక్కు ఉండేదికాదు. ఈ భూస్వామ్య విధానంలో కూడా బానిస వ్యవస్థ లక్షణాలు కొన్ని ఉండేవని తెలుస్తుంది. ఎలాగంటే ఒక భూస్వామి కొంత భూమిని మరొకరికి అమ్మినప్పుడు ఆ భూమిలో పనిచేసే రైతు కూడా చెట్లు, నుయ్యి మాదిరిగా అమ్ముడుపోయేవాడు. బానిస వ్యవస్థలో యజమాని బానిసకి తిండి పెట్టేవాడు. భూస్వామ్యవ్యవస్థలో రైతు వాడి తిండి వాడే సంపాదించుకోవలసి ఉండేది. దీనివల్ల రైతు భూస్వామి పెట్టే మెతుకులకోసం ఎదురు చూడకుండా తనకు కావలసింది తానే సంపాదించుకునేవాడు. ఈ వ్యవస్థలో రైతు భూమి విడిచి పారిపోవడం చట్ట విరుద్ధంగా భావించబడేది. బానిస వ్యవస్థలోని బానిసలకంటే ఈ వ్యవస్థలోని రైతుల పరిస్థితి కొంత మెరుగుపడిందని చెప్పుకోవచ్చు. మొత్తం మీద ఉత్పత్తి సాధనాలలోను, ఉత్పత్తిలోను అభివృద్ధి కనబడుతుంది. ఈ కాలానికి సమాజంలో ఒక వర్గం ఏవిధమైన శ్రమపడకుండా కూర్చుని తినడం, ఎక్కువ సంఖ్య కలిగిన మరొకవర్గం రోజంతా కష్టపడి పనిచెయ్యడం కనిపిస్తుంది. ఇలాంటి సమకాలిక పరిస్థితులకు అద్దంపడుతూ జ్ఞానానందకవి భవిష్యత్ పట్ల ఆశావాహ దృక్పథాన్ని కింది పద్యంలో వ్యక్తపరిచారు.

*"శ్రమజీవులైన కర్షక కార్మిక జనాళి*
*గుండెలో సమృతమ్ము కురియునాడు*
*పెంటప్రోగులనెత్తి వీధులూడ్చినవారి*
*పెదవిలో చిరునవ్వు కదలునాడు*

*మంచినీటికి బిక్కుమంచు నేడ్చెడి వారి*

*తలపులో సంతృప్తి కలుగునాడు*

*గద్దెనెక్కిన మొనగాండ్రు పాలితులను*

*హృదయపూర్వకముగా  నేలునాడు*

*ప్రభవ నాడు నీరాక పర్వమ్ము మాకు*

*అంతియే కాని యిలాంటి తంతువలన*

*నేప్రయోజనమును గూర్తు వీప్రజాళి*

*కయిన వచ్చితి వందుకో స్వాగతమ్ము"* **(ఆహ్వా. పుట**.22)

### 4.1.5 **జమీందారీ విధానం – సామాజిక సంబంధాలు:**

జమీందారులు భూముల్నుండి రైతులను వేరు చేశారు. వారి కమతాలకు పరిమితి విధించారు. రైతుల్నుంచి స్వాధీనం చేసుకొన్న భూమిని సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ రైతుల్ని, రైతు కూలీలుగా మార్చి వారిచే వ్యవసాయ పనులు చేయించుకునేవారు. ఆ కమతాలలో ఆ రైతుల చేత బలవంతంగా పనులు చేయించుకోవటం కనబడుతుంది. ఈవిధంగా వెట్టిచాకిరి ప్రారంభమైంది. రైతుల కష్టాలను కళ్ళకు కట్టినట్టు జ్ఞానానందకవి కింది పద్యంలో చుపించారు.

*"భువనభాగ్యంపు టభ్యుదయమ్ము గాంక్షించు*

*వెల లేని చెమటబొట్టులను గార్చి*

*పుష్కలముగ జలమ్ములు లేని తరుణాన*

*ప్రకృతిగర్భము జీల్చి పాఱజేసి*

*నెఱియలుపడినట్టి నేల దున్ని వరాల*

*పసిడిరాసులను గుప్పలుగ వోసి*

*ముదిరిపోయిన ముండ్లపొదల చదును జేసి*

*సస్యలక్ష్మికి నివాసమ్ము చూపి*

*గుండె క్రుమ్మరించి కోటిదేవతలకు*

*మూడు వేళలందు పూజసల్పి*

*యెదద సంతసించు బుజుమార్గ చరితుండు*

*రైతు కగునుగాక! ప్రాభవమ్ము!"* (అ.గు. పుట.26)

రైతు వారానికి మూడు, నాలుగు రోజులు జమీందారు పొలంలో పనిచేయాల్సి వచ్చేది. ఈ దోపిడి బాధలు పెరిగిన కొద్ది దీనిని భరించలేక రైతాంగం కూడా తిరుగుబాటు మార్గం చేపట్టింది. దాదాపుగా అన్నిదేశాల చరిత్రల్లో ఈ జమీందారుల దోపిడికి, ఈ నియంత విధానానికి వ్యతిరేకంగా రైతుల తిరుగుబాట్లు, పోరాటాలు సాగిన నిదర్శనాలు ఉన్నాయి. ఉదా:- ఆంధ్రదేశంలో 20వ శతాబ్దంలో చెలరేగిన తెలంగాణ రైతాంగ పోరాటం, శ్రీకాకుళం సాయుధ పోరాటం మొదలైనవి జమిందారీ, భూస్వామ్య దోపిడి విధానానికి వ్యతిరేకంగా వచ్చినవే. జ్ఞానానందకవి తండ్రి రైతుకూలీ. ఆయన రైతుల జీవితాలను లోతుగా చూశారు. స్వానుభవంతో రైతు శ్రమ సౌందర్యాన్ని జ్ఞానాందకవి కింది పద్యంలో చిత్రించారు.

*"సకలభారతము జీవికకు మూలంబైన*
*అన్నపూర్ణాదేవి కనుగుగుజ్జు*
*అసమానబలుదు హలాయుధుం డైనట్టి*
*బలరామునకు నాప్త బాంధవుండు*
*జా గొకింతయు లేక త్యాగమ్ము చేసిన*
*దానరాధేయుని ప్రాణసఖుడు*
*పరులకోసమ్ము సర్వస్వమ్ము నర్పించు*
*రంతి దేవునియింటి సొంతబిడ్డ*
*దేశ సౌభాగ్యమునకు రాత్రింబవళ్లు*
*కాయమును వంచి కష్టించు కర్మయోగి*
*అత్యుదార మహామహదాశయుండు*
*రైతుమాన్యోత్తమునకు దీర్ఘాయు వగుత!"* (అ.గు. పుట.29)

ఈ జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాటాలవల్ల ఉద్భవిస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని పెట్టుబడిదారులు పెరగటానికి మంచి అవకాశం లభించింది.

వీళ్ళు ఈ రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించారు. మారిన వ్యవస్థలతో పాటుగా దోపిడి విధానంలో కూడా మార్పు కనబడుతుంది. కానీ, దోపిడి మాత్రం అంతం కాలేదు. ఈవిధంగా పెరుగుతున్న పెట్టుబడిదారులు, ఈ సంఘర్షణ వల్ల లాభం పొందుతూ మరొక విధమైన దోపిడి విధానాన్ని రుద్దారు. ఈ కొత్త వ్యవస్థకే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అని పేరు. ప్రతి వ్యవస్థలోను ఉత్పత్తి విధానాన్ని బట్టి దోపిడి, ఆ సామాజిక వ్యవస్థ స్థితిగతులు ఉంటాయి. బానిస, భూస్వామ్య జమిందారి వ్యవస్థలలో ఉత్పత్తి చాలా తక్కువగా ఉండేది. బానిస, భూస్వామ్య జమిందారి చేయు ఉత్పత్తి తమ అవసరానికి సరిపడా మాత్రమే ఉండేది. దానివల్ల ఆ సమాజంలో వ్యాపారానికి ప్రధానమైన స్థానం లేదు. ఏ సమాజంలోనైతే వారి అవసరాలకు మించి ఉత్పత్తి చేస్తారో ఆ సమాజంలో ప్రజల జీవన విధానంలో మార్పు తక్షణమే సంభవిస్తుంది. అప్పుడే వ్యాపారం చేయవలసి వస్తుంది. దానికొరకు మార్కెట్ల అన్వేషణ ప్రారంభమౌతుంది. ఫలితంగా వలసల స్థాపన ప్రారంభమవుతుంది.

### 4.1.6 పెట్టుబడిదారీ వ్యవస్థ – సామాజిక సంబంధాలు

ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాల్ని ఒకే వర్గం చేతిలో కేంద్రీకృతమై ఉంటాయి. దానినే ఉన్నత వర్గము *[Upper Class]* అంటారు. ఏ దేశంలోనైనా ఉత్పత్తి సాధనాలు ఎవరి చేతుల్లో ఉంటాయో వారి చేతుల్లోనే ఆ దేశ ఆర్థిక స్థితిగతులు ఆధారపడి ఉంటాయి. భూస్వామి జమిందారీ వ్యవస్థలలో ఉన్నతవర్గం మానవుని శ్రమశక్తిని దోచుకోవటం జరుగుతోంది. ఆ ఉన్నత వర్గానికి జ్ఞానానందకవి కింది విధంగా సందేశం ఇచ్చారు.

*"నీడాబుల్ సరికట్టి పేదలకు తిండిన్ గూర్చి దేశానకున్*
*కూడుంగుడ్డలు భోగ భాగ్యములు చేకూర్పం బ్రయత్నించి యీ*
*మాడల్ బొక్కసమందు కూర్పక యెదోమర్యాద పాటించి యీ*
*నాడీ యార్థిక విప్లవభావనకు నన్నా, చేతులందింపుమీ."* **(వెలు. పుట.** 32)

ఈ రకంగా దోచుకోబడే వారిలో ఒక మాదిరి దోపిడికి గురికాబడుతున్నది మధ్యతరగతి వర్గమైతే, పూర్తి దోపిడికి గురికాబడుతూ ఒక పూటకు తిండి తింటే, రెండో పూటకు లేకుండా దోపిడికి గురి అవుతున్నవారు

కార్మిక, రైతు కూలీలు అయిన అట్టడుగు వర్గంవారిని చెప్పుకోవచ్చు ఈ విధమైన దోపిడి స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కూడా ఆచరణలో కనబడుతుంది.

### 4.1.7 సామ్యవాద సమాజం - సామాజిక సంబంధాలు:

ఈ సమాజంలో సొంత ఆస్తి ఉండదు. అందరికి అన్ని రంగాల్లోను సమాన హక్కులు ఉంటాయి. ఉత్పత్తి సాధనాలన్ని సమాజపరం చేయబడతాయి. ప్రభుత్వం కార్మిక యాజమాన్యం చేతిలో ఉంటుంది. ఆర్థికంగా గాని, సామాజికపరంగాగాని వర్గాలు కనబడవు. అభివృద్ధి ఒక ప్రణాళికాబద్ధంగా ఉంటుంది. ఉత్పత్తి నుండి వచ్చే లాభాలు సమాజపరం అవుతాయి. అందరికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తారు. ఉత్పత్తి లాభాన్ని దృష్టిలో పెట్టుకొని కాక, సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని జరుగుతుంది.

*"సామ్యవాదసిద్ధాంతశాస్త్రమును జదివి*
*దీనదశలోన మ్రగ్గెడుదేశములను*
*పిలిచి భిక్షమ్ముపెట్టిన యలఘురాల!*
*ఇందిరాప్రియదర్శినీ! వందనములు"* **(అ.గు. పుట.41)**

పై పద్యంలో నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ సామ్యవాద దృక్పథాన్ని పేర్కొన్నారు. సమాజంలోని ఈ చక్రభ్రమణం అనివార్యం. ఈ పరస్పర సంఘర్షణల కారణంగానే మానవ సంస్కృతి వికసిస్తుంది. మానవ సంస్కృతి బాహ్యరూపం ఆర్థిక సంబంధాల పునాదుల మీద నిర్మించబడిందే. ఉత్పత్తి సంబంధాల పైనే ఆర్థిక సంబంధాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి సామ్రాజ్యవాదం నసించే దాకా భారతీయులు నిద్రపోకూడదని కింది పద్యంలో ప్రబోధించారు.

*"ధ్వజమెత్తి ఘన సోషలిజము బాటను బోవు*
*ఇందిరమ్మ జయమ్ము పొందు వఱకు*
*చరఖామునీంద్రుని శాంత్య హింసాజ్యోతి*
*అష్టదిక్కుల యందు నలరువఱకు*
*భువన భాండము మెప్పు బొందు జహ్వారులాలు*

*పంచశీల వ్రతమ్ము మించు వఱకు*

*పొట్టిబహద్దూరు శాస్త్రి కట్టినట్టి సమైక్య*

*భావమ్ము దేశాన ప్రబలు వఱకు*

*విశ్వతోముఖాన వృద్ధిగాంచిన దేశ*

*బహుళ పథక రాశి వఱలు వఱకు*

*లక్ష్య సిద్ధిలోన లవలేశమైనను*

*పట్టు విడువరాదు భారతవీర ।"* **(అ. రా. పుట.21)**

## 4.2 సమాజంలో మధ్యతరగతి ప్రారంభం :

మానవ సమాజం క్రమంగా అభివృద్ధి చెందుతున్న దశలో అనేక మార్పులను పొందింది. దానిలో భాగంగానే అనేకరకాల సమాజాలు ఏర్పడ్డాయి. ఆదిమ కమ్యూనిస్టు, బానిస, భూస్వామ్య, జమిందారీ, పెట్టుబడిదారీ, సామ్యవాద సమాజాలు ఒక సమాజంనుండి మరొక సమాజానికి క్రమంగా మార్పు చెందుతూ వచ్చాయి. ఆదిమ కమ్యూనిస్టు సమాజం నుండి జమిందారు సమాజం వరకు రెండు వర్గాలు మాత్రమే సమాజంలో కనబడతాయి. పెట్టుబడిదారీ సమాజ ఆవిర్భావంతో ఉత్పత్తి సంబంధాలలో మార్పు, ఉత్పత్తి చేయబడిన వ్యక్తుల అమ్మకం మొ॥ వాటిద్వారా మధ్యతరగతి ఆవిర్భావం సమాజంలో కనబడుతుంది. ఆ సామాజిక మార్పును జ్ఞానానందకవి కింది విధంగా ఆశించారు.

*"నిలువనీరాదు గుండియలపై కుంపటి*

*కులమత వ్యత్యాస కుధరశిఖరి*

*చెలగనీరాదు దిక్కుల తాండవంబాడు*

*లంచాల దేవతా వంచనమ్ము*

*మెలగనీరాదు వస్తుల పాలు నొనరించు*

*జలనిధి కన్య కాస్యందనమ్ము*

*కలుగనీరాదు చిక్కులకు తావలమైన*

*జనసమాజమున దౌష్ట్యంపుతలంపు*

*ఎదిరిశక్తి కెపుడు నీర్ష్యాళువై యేడ్చు*
*పిట్ట మనసు గలుగు నట్టి మనుజు*
*డీ స్వతంత్ర భూమి కే మహాభారమ్ము*
*పెదవి విప్ప నిజము గదర! తండ్రి!"* **(అక్షరాభి. పుట.**87)

భారతదేశంలో ప్రాచీనకాలం నుండి బ్రిటిషు వారి రాకకు పూర్వం వరకు సమాజంలో రాచరిక [లేక] జమిందారీ వ్యవస్థ అధికారంలో కనబడుతుంది. ఇక్కడి జమిందారీ వ్యవస్థ యూరప్ దేశాలలోని జమీందారీ వ్యవస్థకు చాలా భిన్నంగా కనబడుతుంది. ఇక్కడి సమాజంలో ప్రాచీనకాలం నుండి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలు కనబడతాయి. ఆవి ఎలా ఏర్పడ్డాయో జ్ఞానానందకవి కింది పద్యంలో పేర్కొన్నారు.

*"వృత్తులనుబట్టి వర్ణమ్ము లేర్పడినవి*
*యనెడు నీమాట లర్థమ్ములైన వదియు*
*మూడునాలుగే కద పంచము డెవడంచు*
*నడుగుచున్నారు నీవేమియందు వవుర"* **(వంశ.పుట.**27)

ఈ సమాజంలో సాంఘిక గౌరవం పుట్టుకపై ఆధారపడి నిర్ణయించబడేది. బ్రాహ్మణులు, క్షత్రియులు భూములకు యజమానులుగాను, శూద్రులు ఆ భూములలో పనిచేసే వారుగాను కనబడతారు. వైశ్యులు వ్యాపారం చేసేవారు. వీరు ఆర్థికంగా బ్రాహ్మణ, క్షత్రియులంత ఆస్తిపరులు కారు. శూద్రులంతా గడిచీ గడవనివారు కాదు అని వీరిని మధ్యతరగతి వర్గంగా 'భారతదేశ చరిత్ర' అనే గ్రంథంలో 'బి.బి.మిశ్రా' గుర్తించారు. అదేకాలంలో వ్యాపారులతో పాటు శిల్ప, చిత్రకారులు, భూస్వామ్య ప్రభువులు మధ్యతరగతిగా పరిగణించబడ్డారు.

మధ్యతరగతివారు, అట్టుడుగు వర్గాలవారు తాము పడుతున్న శ్రమకి తగ్గ ఫలితాన్ని వారు పొందలేకపోతున్నారని, ఏ శ్రమ పడకుండా కొద్దిమంది కొన్ని తరాల వరకూ తిన్నా తరగనటువంటి విధంగా ఫలితాన్ని పొందుతున్నారని చెప్తారు.

### 4.3 అట్టడుగు వర్గాలు - సామాజిక సంబంధాలు :

మానవ సమాజం ఆవిర్భవించినప్పటి నుండి రెండు రకాల మనుషులు కనబడుతున్నారు. మొదటివాడు బలవంతుడు, రెండవవాడు బలహీనుడు. బలవంతుడు బలహీనుడుపై దాడి చేయడంతోనే బానిస సమాజ స్థాపనకు నాంది ఏర్పడిందని చెప్పవచ్చు. దీనికి పూర్వం ఉన్న ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో అంతా కలసిమెలసి ఆహార సముపార్జన చేసుకొనేవారు. ఆహార సముపార్జనలోని మార్పుతో పాటు సామాజిక సంబంధాలలోను విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. ఆ మార్పును కింది పద్యంలో చుపించారు.

*"వెలివాడల్ సృజియించి మానవతపై పేరిమితోడన్ సమా*
*ధులగట్టించి దరిద్రమూర్తులకు పస్తుల్ నేర్పి మౌఢ్యాన క*
*ప్పలకున్ పెండిలిసేసి సంతసిల దౌర్భాగ్యంపుసంస్కారముం*
*గలవారల్మనుచోటనభ్యుదయదీక్షాదీపముల్వెల్గునే"* **(వంశ.పుట.**31)

వ్యవసాయం చేయడమ్ ప్రారంభించారు. బలవంతుడు అయిన వాడు ఏ విధమైన శరీర శ్రమలేకుండా భూమికి యజమాని అయ్యాడు. బలవంతుని చేతిలో ఒడిపోయిన బలహీనుడు బానిసగా, అస్పృశ్యుడిగా మారాడు. అస్పృశ్యతను రూపు మాపడానికి కృషి చేసిన మహనీయులను కింది పద్యంలో కీర్తించారు.

*"జన్మమ్ముచే రాదు సద్గుణాలని యన్న*
*'రామకృష్ణు' నమోఘ రమ్యవాక్కు*
*చెప్ప వేదాల నస్పృశ్యత లేదన్న*
*ఘన 'వివేకానంద' ముని హితోక్తి*
*అనుకొన్నచో దేశమునకు భారంబన్న*
*ధారణీ సుకవి 'టాకూరు' మాట*

*తలపగా నిద్ది హైందవ శరీరమునకు*

*ప్రణమన్న 'తిలకు' యోధుని వచస్సు*

*అంటరానితనము గెంటక పోయిన*

*ఘోర కృత్యమన్న 'గోఖ్లె' పలుకు*

*ప్రగతి భారతమున పాటించి ప్రభుత య*

*స్పృశ్యత తొలగింప సిద్ధపడియె"* **(వెలుగు.పుట.** 21)

అతడు రక్తాన్ని దారపోసి శ్రమపడి భూమిని సాగుచేసి పంట పండించసాగాడు. అయితే తాను పొందుతున్న ఫలితం మాత్రం చాలా తక్కువ. ఈ విధంగా యజమాని బానిసను శ్రమదోపిడి చేయడం ప్రారంభించాడు. యజమాని ఆర్థికంగా లాభాన్ని పొందగా, బానిస తిండికి కూడా చాలీచాలని ఆర్థిక దుస్థిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ బానిసలు సమాజంలోని మార్పుతో భూస్వామ్య జమీందారి సమాజాలలో కొంత స్వేచ్ఛను పొందగలిగినప్పటికి ఆర్థికంగా ఏ మాత్రం పుంజుకోలేకపోయారు. ఈ విధంగా నాటి నుండి నేటివరకూ సమాజంలో ఒక భాగం తమ శ్రమశక్తిని ఉపయోగించి ఆహారోత్పత్తి చేస్తుండగా మరొక వర్గం మేధాపరమైన శ్రమగాని, శారీరకమైన శ్రమగాని లేకుండా ఆర్థికంగా ఉన్నతులు అవుతుంటే ఇంకోవర్గం మేధాపరమైన, శారీరకమైన శ్రమచేస్తూ శ్రమకు తగిన ఫలితాన్ని పొందలేకపోతున్న కారణంగా ఆర్థికంగా వెనుకబడుతున్నారు. అందరికి సమానత్వం తీసుకురావాలని బ్రహ్మ నాయుడు చేసిన సంస్కరణను జ్ఞానానందకవి కింది పద్యంలో పేర్కొన్నారు.

*"స్థాపించితివి సమత్వము జాటగా చాప*

*కూటి సిద్ధాంతమ్ము కువలయాన*

*నిలిపించితివి సంతసిలి చమూవారాన*

*నిఖిలవర్ణాల మున్నీలనెల్ల*

*వహియించితివి మహాభైరవఖడ్గమ్ము*

*కదనాన పరిపంథి మద మడంచ*

*పూజించితివి స్వాంతము తరింప నిరంతరమ్ము*

*సిరిచాన పెనిమిటి చరణ యుగళి*

*దీక్షతోడ ధర్మదీపాలు వెలిగించి*

*తవులు జాతిభేద మవల ద్రోసి*

*ప్రేమమూర్తి యైన రామానుజస్వామి*

*పథము నడచినావు బ్రహ్మనాయ"* **(రాజ. పుట**.10)

★★★

# ఐదవ అధ్యాయం

## జ్ఞానానందకవి రచనలు - సంస్కృతి

భారతదేశం వివిధ మతాల మిశ్రమం. భారతీయ సమాజంలో వ్యక్తి పుట్టుకే అతని కులాన్ని, అతని సామాజిక స్థానాన్ని నిర్ణయిస్తుంది. "ఆహారవిహారాల్లో, ఆచారవ్యవహారాల్లో, కట్టుబోట్టుల్లో, నగనట్రల్లో, పండుగపబ్బాల్లో, జాతకర్మాది సర్వసంస్కారాల్లో, మతవిశ్వాసాల్లో కనిపించే ఏకరూపతే సంస్కృతి (culture) అనిపించుకుంటుంది. అంశిక వైవిధ్యం కొంత ఉన్నప్పటికీ ఏకరూపత గరిష్టంగా ఉన్నపుడు ఆ సంస్కృతి సమిష్టి సంస్కృతి అవుతుంది. ఈ విధంగా తెలుగు సమాజమంతా ఏక సంస్కృతి సూత్రబద్ధమై ఉందని చెప్పక తప్పదు. సాహిత్యం, సంగీతం, చిత్రరచన, నాట్యం, శిల్పం మొదలైన సర్వకళలు తెలుగు సమాజ సంపత్తిగానే వర్ధిల్లుతూ వస్తున్నాయి. వీటి సృష్టికీ, వికాసానికీ, ప్రాచుర్యానికీ అన్ని ప్రాంతాల వారి కృషి, అన్ని స్థాయిల వారి కృషి తోడ్పడుతుంది. ప్రాంతీయ, రాజకీయ శక్తులు కొన్ని ఏ తీరుగా ఏ కాలాల్లో అలజడులు లేపినప్పటికీ వైమనస్యాలు లేపినప్పటికీ అవి తాత్కాలిక ఫలితాలు చూపినవేకాని సాంస్కృతిక మూలకందాన్ని చేధించడం మాట అటుంచి స్పృశించగలిగినవి కూడా కాదు. సంస్కృతి జీవ శక్తి అంత మహత్తరమైంది"( దక్షిణ మూర్తి. ) అని పోరంకి దక్షిణ మూర్తి గారు పేర్కొన్నారు.

జ్ఞానానందకవి పుట్టుక రీత్యా అట్టడుగు వర్గానికి చెందినవారు. నాటి సమాజంలో విద్య అందరికి అందుబాటులో లేదు. కొన్ని వర్గాలవారికి మాత్రమే పరిమితంగా ఉండేది. పాశ్చాత్య క్రైస్తవ మిషనరీల రాకతో విద్య అందరికీ అందుబాటులోకి వచ్చి అనేక మంది విద్యావంతులయ్యారు. ఈ క్రైస్తవ మిషనరీలలొనే జ్ఞానానందకవి విద్యను అభ్యసించారు.

తెలుగువారి జీవనస్థితిగతులలోకలిగిన పరిణామం అంతకు ముందు ఎన్నడూ కనీ వినీ ఎరుగనిది. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది సంఘసంస్కరణ. దానికి మారుపేరుగా నిలిచిన మహాపురుషుడు కందుకూరి వీరేశలింగం. బాల్యవివాహ నిరసన, వితంతు పునర్వివాహ సాధన, వేశ్యావృత్తి నిర్మూలన, స్త్రీ విద్యావ్యాపన ఆయన

ప్రధాన లక్ష్యాలు. అవినీతిని అడుగడుగునా విమర్శించడం, లంచగొండి అధికారులకు శిక్షలు వేయించడం వంటి ప్రమాదభరితమైన సాహసకృత్యాలు సైతం కొనసాగించాడంటే ఆయనలో ఉన్న నైతికబలం ఎంత గొప్పదో ఉహించుకోవచ్చు. అందుకే ఆయన దక్షిణ భారతదేశానికి మరొక రామమోహనరాయలు అనిపించుకున్నాడు. అతిబాల్యవివాహాలు క్రమంగా అంతరించాయి. వాటిని నిషేధిస్తూ శారదా చట్టం(1929) అమలులోకి వచ్చింది. పురుషులతోపాటు స్త్రీలలో కూడా విద్యావ్యాప్తి జరిగింది. వితంతు పునర్వివాహాలకు ప్రతిఘటన తొలగడమే కాకుండా బాలవితంతువుల సంఖ్య కూడా తగ్గుతూ వచ్చింది. 'కన్యాశుల్కం' చాలావరకు అంతరించినమాట నిజమే కాని దానికి విరుద్ధంగా 'వరకట్నం' పెరిగింది. దాన్ని నిషేధిస్తూ అయ్యదేవర కాళేశ్వరరావు ప్రవేశపెట్టిన బిల్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టం (1960)గా రూపొందింది. అయితే చట్టం దారి చట్టానిదీ, మనుషుల దారి మనుషులదీ అయిన సందర్భాలకిదొక ఉదాహరణ అయింది. 1955లో అమలులోకి వచ్చిన హిందూ వివాహచట్టం స్త్రీ పురుషులకు కొన్ని షరతులు విధించింది. విడాకులను క్రమబద్ధం చేసింది. 1956లో అమలులోకి వచ్చిన హిందూ వారసత్వచట్టం పురుషులతోపాటు స్త్రీలకు కూడా వారసత్వపు హక్కు కల్పించింది. కుటుంబ నియంత్రణ విధానానికి అనుగుణంగా కేంద్రప్రభుత్వం, వైద్యపరంగా గర్భస్రావం కావించుకోవడానికి అవకాశం కల్పిస్తూ రూపొందించిన చట్టం 1972లో అమలులోకి వచ్చింది. పడుపువృత్తి నిర్మూలనకు 1930లోను, యాచన నిరోధానికి 1941 (హైదరాబాద్ ప్రభుత్వం) లోను చట్టాలు ఏర్పడ్డాయి. అస్పృశ్యతానివారణకు నవభారత రాజ్యాంగ చట్టం అత్యంత ప్రాముఖ్యం ఇచ్చింది.

వివిధ సందర్భాలలో సామాజికులు చేసే పనుల తీరులో, ఆలోచనల్లో వాళ్ళ సంస్కృతి ప్రతిబింబిస్తూ ఉంటుంది. సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే తెలుగు సంస్కృతి ఏవిధంగా ప్రతిఫలిస్తుందో గమనించవచ్చు. కుటుంబం, కులం, వర్గం, స్థలం, ప్రాంతం జీవనస్థితిగతుల్లో ఎంత వైవిధ్యం చూపిస్తున్నప్పటికీ వాటి సమాహారం తెలుగు సంస్కృతి రూపురేఖలకు కళ్ళకు కడుతుంది. సాహిత్యంలో కృషి చేసే ప్రతి రచయితా దాన్ని ప్రదర్శిస్తునే ఉన్నాడు. భాషలో, భావనలో, వృత్తిలో, ప్రవృత్తిలో,

కళలలో, కల్పనలో, అలంకరణలో అన్నింటా ప్రత్యక్షమౌతుంది కాబట్టే సాహిత్యంలోను సంస్కృతి ప్రతిబింబించక తప్పదు.

తెలుగు సంస్కృతి అనాదిగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, నమ్మకాలు, కట్టుబాట్లు మొదలైన వాటికి మాత్రమే పరిమితమైందని కొందరి భావన. ఇది చాలావరకు సమంజసమే కావచ్చు కాని ఇలా అనడంలో ఒక చిక్కు ఉంది అనూచానంగా వస్తున్న జీవన విధానమే తెలుగు సంస్కృతి అయితే, ఇలా అనూచానంగా వస్తున్నదంతా తెలుగువారి సొంతమే అన్న అపోహలకు తావిచ్చినట్లవుతుంది. ఆర్య, అనార్య సంస్కృతుల సమ్మేళనం తెలుగు సంస్కృతిలో సుస్పష్టంగా కనిపిస్తుంది. కాలక్రమంలో తెలుగుజీవన విధానంలో అనేకమైన పరిణామాలు వచ్చాయి. ఏకాలంలో రాసే రచయిత లేదా ఏ కాలాన్ని గురించి రాసే రచయిత ఆకాలపు పరిస్థితులను యథార్థంగా చిత్రించడమన్నది అతని మొట్టమొదటి బాధ్యత కాబట్టి ఆయా పరిణామాలు, ప్రభావాలు రచనలో చోటుచేసుకోక మానవు. పాశ్చాత్యీకరణం, పారిశ్రామికీకరణం, నగరీకరణం, లౌకికీకరణం మన సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చాయి. ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దం ప్రథమార్థం అందుకు దోహదం చేసింది. ఒకప్పటి పల్లెలు ఇప్పుడు పట్నాలు అయ్యాయి. అప్పటి పట్నాలు ఇప్పుడు నగరాలు అయ్యాయి. నగరాలు చుట్టుపక్కనున్న పల్లెలన్నింటిని పొట్టనపెట్టుకొని నానాటికి వ్యాప్తి చెందుతున్నాయి. భిన్న భాషలవాళ్ళు, భిన్న ప్రాంతాలవాళ్ళు, భిన్నమతాలవాళ్ళు, భిన్న సంస్కృతులవాళ్ళు నగరాల్లో పడుగు పేకలాగా అల్లుకొనిపోయి జీవిస్తున్నారు. ఎవరి స్వార్థం ఎంత ఉన్నప్పటికీ పరస్పర ప్రభావాలు ప్రసరిస్తూనే ఉన్నాయి. ఈ ప్రభావాలు వివిధ దశలలో వివిధ సాధనాల ద్వారా పల్లెపల్లెకు వ్యాపిస్తున్నాయి. రాకపోకల సదుపాయాలు, విద్యావినోద కార్యక్రమ ప్రసారాలు, టెలివిజన్, చలనచిత్రాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందుకు తోడ్పడుతూ వస్తున్నాయి. తెలుగు సంస్కృతి సంప్రదాయాల గురించి ప్రస్తావించినప్పుడు తెలుగు జనజీవనంలో కలిసిపోయినదంతా తెలుగువారిదేనని చెప్పక తప్పదు. దీన్ని సాహిత్యంలో ప్రతిబింబింప చేయడమే సమకాలిక రచయితా కర్తవ్యం. రచయిత తెలుగు జనజీవనంలో ఏ ఒక్క అంశాన్ని స్పృశించినా దాంట్లో

తెలుగు సంస్కృతి కనిపించక మానదు. వైయక్తిక, సామాజిక సంబంధాలు, కుటుంబజీవనం, వృత్తి–ఉద్యోగాలు మొదలైనవి దాంట్లో అంతర్భాగాలే అన్నది పై చర్చకు సారాంశం. వేషభాషలు, ఆహార విహారాలు, క్రీడావినోదాలు, పెళ్ళిళ్ళు పేరంటాళ్ళు, ముద్దుముచ్చట్లు, పండగలుపబ్బాలు, వావివరసలు, వృత్తిప్రవృత్తులు, నడతా నమ్మకాలు తెలుగు జాతీయతను ప్రతిబింబించే సాంస్కృతిక అంశాలు.

5.1 **మతం**:

మతం అనే పదానికి 'సమ్మతము'అని అర్థం. ఇచ్ఛ, బుద్ధి(జ్ఞానం) మొదలైన అర్థాలు నిఘంటువుల్లో వున్నాయి.(**బహుజనపల్లి సీతారామాచార్యులు**.2004: 839). ఆంగ్లంలో Religion కు సమానార్థకంగా మతం అనే పదాన్ని వాడుతున్నారు.

*A standard definition of religion from a general dictionary is 'Prevalent system of faith and worship' (Concise oxford dictionary).*

కాలంతో పాటు, మనుషుల అభివృద్ధితో పాటు వస్తున్న భావాలలో మార్పుల ఫలితంగా అనేక మతాలు పుట్టాయి. ఇవి మార్పులకు లోనవుతూ విడిపోయాయి. ఈ మతాన్ని ఆధారంగా చేసుకొని మానవుడు జీవన విధానాన్ని ఏర్పరచుకున్నాడు. ఒక్కోసారి ఈ మతమే అతని అభివృద్ధికి అడ్డం అవుతుంది.

*"Religion is one of the earliest of social institutions. It is a product of human ingenuity with the purpose of enabling man to be at peace with himself and with the supposed agency that guides and controls the universe. Religion differs from place to place and has under gone numerous developments from time to time. Yet retaining substantially in some from its basic principles and practices. Few forces have played such a fundamental role as religion in the evolution of human society and in shaping the destinies of nations" (Hanumantha Rao.1973:1).*

భారతదేశంలో బౌద్ధం, జైనం, క్రైస్తవం,ఇస్లాం మొదలైన ముఖ్య మతాలు ఉన్నాయి. అయితే ఇవి ప్రజలను రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక రంగాలలో మార్పులకు గురిచేస్తున్నాయి. ఈ మతాలకు అవి పుట్టిన చారిత్రక అవసరాలను బట్టి సైద్ధాంతిక, తాత్విక నేపథ్యాలు ఉన్నాయి. అవి ప్రజల అభివృద్ధిని కోరుతూ ఉద్భవించినా పరిణామక్రమంలో నేడు మానవుని అభివృద్ధికి అడ్డంగా ఉన్నాయని

కొందరి అభిప్రాయం. భారతదేశంలో భిన్న అంశాలపై ప్రభావాన్ని చూపుతున్న మతాలలో క్రైస్తవ మతం ఒకటి.

### 1.1.1క్రైస్తవ మతం:

*"ఆదిన్ భూమిని నంతరిక్షమును సంయగ్రుష్టితోడన్ యెహో*
*వా దేవుండు సృజించె భాస్కరుని నాపైరే వెలుంగున్ వెసన్*
*ప్రాదుర్భావమునందు నట్లోసరిచెన్ ప్రాల్మాలు లేకుండ తా*
*నేదో చేసినదానిఁగాంచి తొలినాడే పొందే నానందమున్"*

**(క్రీ.ప్ర. పుట.** 1)

సృష్టి, అంతరిక్షం, భూమి ఆవిర్భావాన్ని జ్ఞానానందకవి పై పద్యంలో కవిత్వీకరించారు. కాల క్రమంలో సమాజాలు ఏర్పడటం,రాచరిక వ్యవస్థలు, భూస్వామ్య వ్యవస్థలు ఎర్పడ్డాయి. రోమన్ సామ్రాజ్యపు భూస్వామ్య వ్యవస్థ లోని హింసా మార్గాలను అహింసా పద్ధతుల ద్వారా ఎదుర్కొంటూ ప్రజలను ఆధ్యాత్మికత వైపు మళ్లించిన ప్రవక్త క్రీస్తు. ప్రేమ, సత్యం క్రీస్తు బోధనలలో ప్రధానాంశాలు. సిరియా ముఖ్య పట్టణమైన అంతియోకస్ లో  మొదటిసారిగా క్రీస్తును ఆదర్శంగా తీసుకొని జీవించే వారిని క్రైస్తవులు గా వ్యవహరించారు. తరువాత అదే మతంగా ప్రచారమైంది. క్రీస్తును గురించి జ్ఞానానందకవి కింది పద్యంలో వివరించారు.

*"శ్రీ మన్మంగళమూర్తి దేవుడు కృపా సింధుండు శుద్ధాత్ముండు*
*ద్ధామ ప్రేమగుణాలయుండు జగదుద్ధారుండు క్రీస్తుండు ధా*
*త్రీమాలిన్యము గల్వరని మిత్తిం గెల్చు మృత్యుంజయుం*
*డామోదంబున నీ వసుంధరకు తోడై యుండి రక్షంచుతన్"*

**(క్రీ. ప్ర. పుట.** 1)

రోమన్ చక్రవర్తి  నిషేధాజ్ఞలకు, క్రైస్తవులకు జరిగిన పోరాటం ఫలితంగా కాన్ స్టంట్ రోమన్ చక్రవర్తిగా ఎన్నికయ్యాడు. క్రైస్తవం ప్రభుత్వ మతంగా ప్రకటించబడింది. అయితే వీరు క్రీస్తు  బోధనలను తమకు అనుగుణంగా మార్చుకొని ప్రజలను దోచుకోవడం ప్రారంభించారు. వీరిద్దరి మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా లూథర్

మార్టిన్ పోప్ కి వ్యతిరేకంగా ప్రొటెస్టెంట్ శాఖను వ్యాపింపజేశాడు. తరువాత క్రైస్తవమతం ప్రొటెస్టెంట్, క్యాథలిక్ శాఖలుగా విడిపోయింది. నేడు అనేక శాఖోపశాఖలుగా విస్తరించింది.

బైబిల్ ను మొదటిసారిగా 1746లో బెంజిమన్ షూల్జ్ 'మోక్షానికి కొంచుపోయేదోవ' అనే పేరుతో క్రైస్తవ మతగ్రంథంగా తెలుగులో ముద్రించాడు. ఇతడు జర్మనీ దేశస్తుడు. ఇతని తరువాత ఫేబ్రీషియస్ అనే లూథరన్ మత ప్రచారకుడు బైబిల్ ను తమిళం లోకి, తెలుగులోకి అనువదించాడు. బైబిల్ అనువాదకులలో ముఖ్యంగా చెప్పుకోదగిన వ్యక్తి విలియంకేరి. ఇతను తన సహాయకులతో బైబిల్ ను 40 భాషల్లోకి తర్జుమా చేశాడు. తర్వాత కాలంలో అనేకులు కొన్ని భాగాలను అనువదించే ప్రయత్నం చేశారు. 1887 నాటికి తెలుగులో పాత, కొత్త నిబంధనలు కలిగిన బైబిల్ వెలువడింది. 1898లో ఏర్పడిన బైబిల్ సంఘం సూచించిన నూతన పద్ధతులను అనుసరించి 1904లో బైబిల్ మరల ప్రచురించబడింది.

### 5.1.2 క్రైస్తవ మత సాహిత్యం:

క్రైస్తవ మతం భారతదేశంలో వ్యాప్తి చెందడానికి కారణం ఆనాటి దేశ పరిస్థితులు. భారతదేశంలోఅగ్రవర్ణాల వారు నిమ్న జాతులను అంటరానివారిగా చూసేవారు. భక్తి, దేవుడు, దేవాలయం వంటి హిందూమత ములాంశాలకు కొంత మందిని దూరం చేశారు. సాంస్కృతికంగా వెలివేశారు. వారందరికోసం క్రీస్తు పుట్టాడని కింది పద్యంలో వివరించారు.

*"అమృతానందమయ స్వరూప!పరమాత్మ! భక్తలోకైక మా*
*ర్గమనీ పుట్టుక పాప జాతికి ప్రహర్షంబయ్యె సాతాను పం*
*దెములో నోడెను నీ పవిత్రమగు వాణీ మాధురీ దివ్యతో*
*యములందున్జలమాడు వారలకు నాథా! కల్గెనానందమున్"*

**(క్రీ. శ. పేజి.11)**

క్రైస్తవ మతం సాంఘిక అసమానతలను నిరసిస్తూ ముఖ్యంగా వెనుకబడిన వారికోసం పాఠశాలలు, ఆసుపత్రులు నెలకొల్పింది. ఆచార వ్యవహారాలలో, వేష

భాషల్లో మార్పులు తీసుకువచ్చింది. క్రైస్తవ మతం ఆంధ్రదేశంలోకి వచ్చాక పాశ్చాత్యుల దోహదం వలెనే ఈ మతానికి సంబంధించిన సాహిత్యం ప్రారంభమైంది. రాబర్ట్ డి. నొబిలి 'జ్ఞాన సంక్షేమం, పునర్జన్మ ఆక్షేపం' అనే వచన రచనల్ని తమిళం నుండి తెలుగులోకి అనువదించాడు. "సత్యమైన వేదంలో ఉండే జ్ఞానోపదేశాల యొక్క సంక్షేపం". "దేవుని యొక్క వాక్య సువిశేషము" "మమ్ము రక్షించే కర్త అయిన యేసుక్రీస్తు యొక్క శుభాసమాచారం" మొదలైనవి తెలుగులో వచ్చిన క్రైస్తవమత రచనలు. పింగళి ఎల్లనార్యుని తోభ్య చరిత్ర, సామంత పూడిమల్లయ అనిత్య నిత్య వ్యత్యాసం, మల్లెల తిమ్మరాజు జ్ఞాన చింతామణి అనే రచనలు పద్య కావ్యాలుగా క్రీస్తు జీవితాన్ని, క్రైస్తవమత ప్రాశస్త్యాన్నితెలియజేశాయి.

ఆధునిక కాలంలో జాషువా రచించిన 'క్రీస్తు చరిత్ర' పేర్కొనదగిన కావ్యం. అలాగే జ్ఞానానందకవి క్రైస్తవం గురించి 'క్రీస్తు ప్రబంధం, క్రీస్తు శతకం' అనే రచనలు చేశారు. ప్రజలకు అహింసా మార్గాన్ని బోధించడానికి, సక్రమమైన జీవితాన్ని అందించడానికి క్రీస్తు జన్మించాడని బైబిల్ చెప్తుంది. పరిశుద్ధాత్మ వలన కన్యక మేరీ గర్భం దాల్చి క్రీస్తుకు జన్మనిచ్చింది. క్రీస్తు జన్మించినప్పుడు లోకం ఏవిధంగా పరవశించిందనే విషయాన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో వర్ణించారు.

*"జగదేక నాథుండు జనియించినా డని*
*పుడమితల్లి ముదబ్ధిమునిగిపోయె*
*క్షుభిత లోకము గాన ప్రభవించె ప్రభువని*
*పరలోక దూతాళి మురిసిపోయె*
*ఘనుడైన దేవుండు తనయుడై నాగర్భ*
*మున పుట్టెనని మేరి పొంగిపోయె*
*కడకు చైతన్య రూపుడు పుట్టినాడని*
*సృష్టి యెల్లపరవశించిపొయె*
*కలుష రాశి తొలగగా జీయ నుదయించె*

*పసులపాకలోన ప్రభువటంచు*
*ఖేచరాళి శాంతి గీతాలు ముద్దుగా*
*ప్రభువు పుట్టు వేళపాడు కొనియె"* (క్రీ.ప్ర. పేజి-49)

సుమారు 35 సంవత్సరాలు ప్రజలకు బోధనలు చేసిన క్రీస్తు రాజుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడనే నేరం మీద సిలువ వేయబడ్డాడు అని బైబిల్ చెప్తుంది. సిలువ వేయబడిన సమయంలో ప్రకృతి భీభత్సానికి లోనైంది. సిలువపై మరణించిన క్రీస్తు మూడవ రోజు మరల బతికి కొందరికి కనిపించాడని బైబిల్ చెప్తుంది. "ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి తాము కూడియున్న యింటి తలుపులు మూసుకొని యుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి – మీకు సమాధానము కలుగును గాక అని వారితో చెప్పెను. ప్రభువును చూసి సంతోషించిరి"(యోహావా. 20:19–21. పరిశుద్ధ గ్రంథము – 101). ఆనాటి నుండి శిష్యులు క్రీస్తు బోధనలతో క్రైస్తవ మతాన్ని స్థాపించి వ్యాప్తి చేశారు.

### 5.1.3 క్రైస్తవులు:

క్రైస్తవ మతం స్వీకరించిన వారిని క్రైస్తవులు అంటారు. వీరు క్రైస్తవ మత ఆచారాల ప్రకారం జీవిస్తారు. వీరి జీవన విధానానికి ఇతర మతస్థుల జీవన విధానానికి కొంత బేధం ఉంటుంది. నిజమైన క్రైస్తవులు ఆనందాన్ని, ఆశలను క్రీస్తు ప్రేమలోనే చూసుకుంటారు. ప్రార్ధనే సర్వస్వంగా భావిస్తారు. మనిషి తనకు సంతోషం కలిగినా దుఖం కలిగినా ఇతరులతో పంచుకుంటాడు. కానీ స్వశక్తిని కోల్పోయి తానూ ఏమి చేయలేని దైన్యస్థితి ఏర్పడితే దైవం మీదకు మనసు వెళుతుంది. అప్పుడు భారాన్ని దేవుడి మీద వేస్తారు. క్రైస్తవులు ఇలాంటి పరిస్థితులలో బైబిల్ చదివి ప్రార్థనలు చేస్తారు. క్రైస్తవ జీవన విధానంలో మానవ జన్మ ఉదాత్తతను కింది పద్యంలో జ్ఞానానందకవి వివరించారు.

*"హలెలుయా హలేలుయా యన్న మధురాహ్లాదైక విన్యాసమం*
*జుల నిక్వాణము రోదసి తలములో బొబ్బిల్లె దీనావసుం*
*డెలమిన్ మానవజన్మ మెత్తెనిది యంతే గొప్ప కార్యమ్ముగా*
*నిలిచెన్ నిల్చును నిల్చుచున్నదనుసందేశమ్ము విన్పించెదున్"*

(క్రీ. ప్ర. పేజి-48)

క్రీస్తును దేవుడిగా భావించి ప్రార్థన చేయడం వల్ల ప్రపంచానికి శాంతిసౌఖ్యాలు కలుగుతాయని క్రైస్తవులు నమ్ముతారు. పరిపూర్ణ మనస్సు ఉంటే ప్రజలు ప్రేమతో జీవిస్తారని క్రైస్తవ మతం చెబుతుంది. యేసును రక్షకుడిగా భావిస్తుంది. సిలువను పాప విమోచనగా, పాపాన్ని క్షమించే గుర్తుగా భావిస్తారు. క్రీస్తు ప్రజల కొరకు పాపులకు చిక్కి ముళ్ళ కిరీటం ధరించి సిలువను భరించాడు. క్రీస్తు ప్రేమహృదయుడు, సహన స్వరూపుడు. కావున వీటిని క్రైస్తవులు ఆచరించాలి అని క్రైస్తవమతం చెప్తుందనే విషయాలను కింది పద్యంలో వివరించారు.

*"ఆనందాలు సుఖాలు దేవతల రాగాలాప గీతాలు, ని*
*త్యానూనంబగు వైభవాలు, పరలోకానంద మాధుర్య వా*
*ణీ నిక్వాణము లుజ్జగించితివి తండ్రీ ! సిల్వయజ్ఞమ్ములో*
*దీనాత్ముల్ బ్రదుకంగ నేర్పిన భవద్దివ్యత్ కృపన్మెచ్చెదన్."*

(క్రీ. శ. పేజి-2)

### 1.1.4 క్రిస్మస్ పండుగ :

*"మహిత గుణాభిరాములగు మాన్యులు వీరలు భక్తితోడ ప్ర*
*త్యహమును పూజ సేతురు మహా మహుడై నపరాత్పరున్ గుడిన్*
*బహువిధ సత్కృ యార్తులన పత్యులు పండిత కీర్తినీయులున్*
*మహిత గుణోత్తరుల్ వయస్సు మళ్ళిన వారలు కూర్మి దంపతుల్"*

(క్రీ. ప్ర. పేజి-22)

పై పద్యంలో యేసు క్రీస్తును ఎవరెవరు ఏవిధంగా ప్రార్థించుకుంటారో, స్మరించు కుంటారో తెలిపారు. యేసుక్రీస్తు జీవితంలో జరిగిన ప్రధాన ఘట్టాలను పండుగలుగా జరుపుకుంటారు. అందులో క్రిస్మస్ పండుగను బాగా జరుపుకుంటారు. క్రీస్తు పుట్టిన రోజున క్రిస్మస్ పండుగను జరుపుకుంటారు. ఆ రోజు అందరూ చర్చికి వెళ్ళడం, ప్రార్థనలు జరుపుకోవడం, ఇళ్ళకు బంధువులు రావడం, ఆనందంగా అందరు కలుసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. క్రిస్మస్ రోజు చర్చిలో ప్రార్థనలు చేస్తారు. ధ్యానంతో, పవిత్ర భక్తితో క్రీస్తును స్మరిస్తుంటారు. ప్రతి ఇంట్లో స్మరించుకునే యేసు నామాన్ని కింది పద్యంలో చిత్రించారు.

*"ఇంటింటన్ వినిపించెగాఁ దలపగా నేసయ్య నీసిల్వపున్*
*ఘంటారావము లీయజాండమున దిక్కౌ నీసుధావాక్కు మా*
*కంటన్ వత్తివిధానమున్న నదియేగా చాలుగా నీయశో*
*లుంటాకుల్ మగుమమ్ముఁ దన్పుమిక స్వర్లోకాధికారిప్రభూ!"*

(క్రీ. శ. పేజి-3)

ఈ పండుగలో ఉన్న ఒక ప్రత్యేకత క్రిస్మస్ ట్రీ. సరివి మొక్కను రకరకాల రంగు కాగితాలతో విద్యుత్ బల్బులతో అలంకరిస్తారు. క్రీస్తు పుట్టుకతోగానీ, జీవితంతోగానీ క్రిస్మస్ ట్రీ కి ఎలాంటి సంబంధం ఉందో బైబిల్ చెప్పలేదు. అదొక ఆచారం, అనుచానంగా వస్తున్న సంప్రదాయం. ఆకుపచ్చ రంగు మొక్క సంతోషానికి చిహ్నం కావచ్చు. వెలుగులు వెదజల్లుతూ మెరిసిపోతున్న ఆ మొక్క క్రీస్తు కాంతితో వెలుగొందిన పశువుల పాకలోని పచ్చగడ్డికి చిహ్నం కావచ్చు. మొక్క క్రైస్తవమతమైతే దానిలోని చీలికలు మొక్కలోని శాఖలు కావచ్చు.

చిన్ని దేశానికి పరిమితమైన ఒకానొక నాటి చిన్న క్రైస్తవమతం చిన్ని మొక్కగా వూహింపబడి పెరిగి పెద్దదయి విశాల విశ్వంలో దేశదేశాలకు విస్తరిల్లాలనే కోరికకు చిహ్నం కావచ్చు. ఇదే విధంగా క్రిస్మస్ తాత క్రిస్మస్ పండుగ రోజు ప్రధాన ఆకర్షణ. ఇతనిని క్రైస్తవులు కోర్కెలు తీర్చడానికి వచ్చిన దూతగా భావిస్తారు. ఇతను ఎరుపు రంగు కోటు కుచ్చుటోపి ధరిస్తాడు. పండుగ రోజు చర్చిలో చిన్న పిల్లలకు చాక్ లెట్స్,

స్వీట్స్ పంచడం ఆచారం. ఈ విధంగా క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఆనందోత్సాహాలతో ప్రత్యేకంగా జరుపుకుంటారు.

### 5.2 బౌద్ధం:

ప్రాచీన భారతీయ సమాజం మీద, సంస్కృతి మీద బౌద్ధమతం ఎంతో ప్రభావాన్ని చూపింది. నాటి సమాజంలో ఉన్న తీవ్రమైన కర్మకాండలు, జంతు బలులను కాదని ప్రజలు తమకు అర్థమైన, అనుసరించదగిన పద్ధతిలో ఉన్న సిద్ధార్థుని బోధనలను ఆమోదించారు. సిద్ధార్థుని బోధనలు ఒక గొప్ప బౌద్ధమత సంప్రదాయం పుట్టడానికి దోహదం చేశాయి. సమాజంలో ఏ వివక్షా లేకుండా ఎవరైనా సరే నిర్యాణానికి అర్హులే అన్న భావన ఇంచు మించు ఆరువందల సంవత్సరాల పాటు కీలకమైన సాంస్కృతిక అంశంగా రూపొందింది. బ్రాహ్మణుల ప్రాబల్యం తగ్గి యజ్ఞ యాగాదులు, కర్మకాండలు తగ్గిపోయాయి. పాలక, పాలితుల్లో బ్రాహ్మణేతర వర్గాలవారు తొలిసారిగా ఉన్నతమైన పదవులు పొందారు.

### 5.2.1 సిద్ధార్థుడు - బౌద్ధ సంప్రదాయం:

బౌద్ధమత స్థాపకుడు గౌతమ సిద్ధార్థుడు. ఈయన శాక్య వంశానికి చెందిన శుద్ధోధనుడు, మాయాదేవి దంపతులకు క్రీ.పూ 563లో లుంబిని వనంలో జన్మించాడు. చిన్న తనంలోనే తల్లి చనిపోవడం వల్ల మహాప్రజాపతి గౌతమి ఇతన్ని పెంచింది. అందువల్ల ఇతడు గౌతమ సిద్ధార్థుడుగా పేరు పొందాడు. యశోధర అనే కన్యను 16 వ సంవత్సరంలో వివాహం చేసుకున్నాడు. వారికి రాహులుడు అనే కుమారుడు పుట్టాడు. ఆ తరువాత సమాజంలోని రుగ్మతలను, వార్ధక్యాన్ని, మృతిని వాటి మూలంగా ఉన్న దుఃఖాన్నిచూసి దుఃఖ మూలాన్ని తెలుసుకోవడం కోసం, దుఃఖం లేని జీవితం పొందడం కోసం దానిలో సత్యాన్ని తెలుసుకోవడం కోసం ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. ఆ విషయాన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో వివరించారు.

*"తనత్యాగమహిమచే ధర్మమ్ము భువనాన*<br>*స్థాపింప దొరకొన్న శాంతమూర్తి*<br>*తనవాక్ప్రభావాన దయయు శాంతియు భూత*

*కోటికి నేర్పించు మేటిగురువు*
*తనతపస్సిద్ధిచే ధారుణీవలయాన*
*జ్ఞానమ్ము పండించు మౌనిమౌళి*
*తనయహింసాసూత్రమున స్వర్గమునకు ని*
*శ్రేణిఁ గల్పించు విశిష్టగుణుఁడు*
*మానవునకు క్రొత్త మార్గమ్ము చూపగా*
*తపము నాచరించు ధర్మ పరుడు*
*శాక్య మౌని యదుగుజాడల బయనించు*
*లిచ్ఛవులకు మేము నచ్చ మేమొ"* ( **ఆమ్ర. పేజి**-14)

సిద్ధార్థుడు తీవ్రమైన తపస్సుతో తన శరీరాన్ని శుష్కింప చేసుకుంటాడు. అది దుఃఖ నివారణకు మార్గంకాదని తెలుసుకొని అంతర్మథనుడై గయలో ఒక రావి చెట్టుకింద జ్ఞాన స్ఫురణ పొంది ప్రబుద్ధుడౌతాడు. అతడు చెప్పిన తత్వమే బౌద్ధం. మొదట సారనాథ్ లోని మృగయావనంలో ఐదుగురు శిష్యులకు తన తత్వంలోని ఆంతర్యం చెప్పడం జరిగింది. దీన్ని బౌద్ధ సంప్రదాయంలో ధర్మ చక్ర ప్రవర్తనం అంటారు. సిద్ధార్థుడు నలభై ఐయిదు సంవత్సరాలు తన తత్వాన్ని, తాను తెలుసుకొన్న సత్యాన్ని బోధించి ఎనభయ్యో ఏట కుశీనగరంలో తనువు చాలించాడు. దీన్ని బౌద్ధ సంప్రదాయంలో "మహా నిర్యాణం" అంటారు. బౌద్ధ జీవితానికి చెందిన జననం, మహాభినిష్క్రమనం, ప్రబుద్ధుడగుట, ధర్మ చక్ర ప్రవర్తనం, మహాపరి నిర్యాణం అనే వాటిని పంచ కల్యాణాలుగా పేర్కొంటారు.

### 5.2.2 **బుద్ధుని మార్గం**:

బుద్ధుడు తన విధానాన్ని పాళీ భాషలో చెప్పాడు. ప్రపంచం దుఃఖ మయం. కోరికలు దుఃఖానికి కారణం. కోరికలను జయించడమే దుఃఖ నివారణం. వీటికి దుఃఖ నివారణే మార్గం. అటువంటి మార్గాన్ని సమ్యక్ వాక్కు, సమ్యక్ క్రియ, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ దృష్టి, సమ్యక్ ఆలోచన, సమ్యక్ ధ్యానం, సమ్యక్ నిశ్చయం, సమ్యక్ క్లేశం అనే ఎనిమిది సూత్రాలతో కూడి ఉండటంవల్ల అష్టాంగ మార్గం అనే పేరుతో ప్రఖ్యాతి

పొందింది. బుద్ధుడు నిర్యాణాన్ని లక్ష్యంగా చేసుకోవాలని చెప్పాడు. కేవలం ఆహింసా మయమైన జీవితంతో అష్టాంగ మార్గాన్ని అనుష్టించడంలో తృష్ణా నివారణ జరుగుతుందని చెప్పాడు.

**"ఆమ్రపాలి" కావ్యంలో బౌద్ధ దర్శనం:**

జ్ఞానానందకవి "ఆమ్రపాలి" కావ్యంలో బౌద్ధధర్మాన్ని, బుద్ధుని బోధనలను కావ్యేతివృత్తానికి అవసరమైనంత వరకే స్వీకరించారు. అన్ని పాత్రలు ఆమ్రపాలి వైపు నడవగా ఆమ్రపాలి మాత్రం బుద్ధుని ధర్మానికి, బోధనలకు ఆకర్షితురాలై బుద్ధుడే శరణమని తలచి బౌద్ధ ధర్మాన్ని ఆకలింపు చేసుకొని బౌద్ధ సంఘంలో చేరాలనే ఉత్సాహాన్ని కింది పద్యంలో చిత్రించారు.

*"పరమపవిత్రుడైన భగవానునిసన్నిధి నాశ్రయించి నా*
*జరిపెడుభిక్ష గైకొనగ జాలిన నయ్యది గొప్పదౌను నా*
*కరయ నటంచుదెల్పెద గృహమ్మును పావనముం బొనర్పగా*
*చరణము పెట్టగోరెదను సద్గురురాకకు సంతసించెదన్."*

**(ఆమ్ర. పేజి-**64)

కుమారుడు విమలకొండ కూడా బౌద్ధ సన్యాసాన్ని స్వీకరించాడు. బౌద్ధమత బోధనలను బుద్ధుని జీవితం నుండి విడదీసి చూడలేం అన్నట్లు ఉంటాయి. అవి కావ్యంలో వర్ణించబడ్డాయి. బౌద్ధమతంలో ప్రధానమైనవి త్రిరత్నాలు,

*"త్రిశరణములు జదివి తీర్థమ్ము సేవించి*
*విస్తరాకులోని విందు గుడిచి*
*ఈయుగాన నెవ్వ రిట్టివిందు నొనర్చి*
*నట్టిజాడ లే దటని పలికిరి."* **(ఆమ్ర. పేజి-**68)

### 5.2.3 **ఆర్యసత్యాలు:**

ఆమ్రపాలి గణభోగ్య జీవితాన్ని గడుపుతూ మానసిక ప్రశాంతత కోల్పోయి సంఘర్షణ పడుతూ తీవ్రవ్యధకులోనై గుండెల్లో దుఃఖాన్ని పోగొట్టుకోవాలని తాను

దొరికిన ఆమ్రవనంలోకి వస్తుంది. కరుణాహృదయుడైన బుద్ధుడు అక్కడ తపస్సు చేసుకుంటూ కనిపిస్తాడు. అతడిని ఎవరో ముని అనుకొని ఆమెలో ఉన్న తీరని కోరికని నర్మగర్భితంగా వ్యక్తీకరించి తన ఇంటికి రమ్మని, సర్వసౌఖ్యాలను సమకుర్చుతానని అంటుంది. బుద్ధుడు ఆమె మనో వాంఛను గమనిస్తాడు. చాలా మృదువుగా, ప్రశాంతంగా, జీవితసత్యాలను వివరిస్తాడు. అంతేకాక ఆమె బౌద్ధ భిక్షువుగా మారిన తరువాత ఆమెతో పాటు బౌద్ధారామానికి వచ్చిన ప్రజలకు ఈ నాలుగు ఆర్యసత్యాలను వివరిస్తాడు.

బౌద్ధ ధర్మ మూల సూత్రాలలో 'సర్వమూ క్షణికమనేది ఒక మూల సూత్రం'. ఈ సూత్రం ఇది ప్రపంచం దుఃఖమయమనే దాన్ని స్పష్టం చేస్తుంది. పుట్టిన ప్రతివారికి మరణం తప్పదు. అయినా ఆశలు పెంచుకుంటారు. ప్రపంచంలో దుఃఖం లేకపోవటం గాని, పుట్టినజీవి మరణించక పోవటం అనేదిగానీ కనిపిస్తే చాలా సంతోషం కదా! అని బుద్ధుడు చెపుతూ

*"నాశము తప్పదీ బ్రతుకునకున్ భువిలోన సహస్ర వర్షముల్*
*క్లేశమొకింత లేక బ్రతుకీడ్చిన వానికైన దీవ్యదా*
*వేశము గల్గినట్టి ఋషి వరునికైననుగాని యెందుకో*
*ఆశలు పెంచుకొందురు రసహోయత మానవులెల్ల రమ్మరో"*

**(ఆమ్ర.పేజి-29)**...అని

విశదీకరిస్తాడు. మానవుని శరీరం వయః పరిమాణాన్ని అనుసరించి క్షణ క్షణం మారుతూ బాల్య, కౌమార, యౌవన, వార్ధక్య దశలను దాటి మట్టిలో కలిసిపోతుందనే విషయాన్ని కవి 'నాల్గు దశలమధ్య నవయుచున్నట్టి'అని వర్ణించారు. దృశ్య మాన ప్రపంచంలో సర్వము అనిత్యమేనని తెలుస్తుంది.

దుఃఖానికి కారణం కోరికలు అనేది బుద్ధుడు బోధించిన నాలుగు సత్యాలలో రెండవది. ఇంద్రియాలకు ప్రియమైన విషయ సంపర్కం. వాటి స్మృతి కోరిక(తృష్ణ)లకు కారణమౌతుంది. ఆ కోరికలు పూర్తిగా త్యజించ గలిగినప్పుడు దుఃఖం నివారింపబడుతుంది. ఇది మూడో ఆర్యసత్యం. ఆమ్రపాలి ఎన్నో కోరికలతో రగిలిపోతూనే బుద్ధుని ప్రథమ దర్శనం చేసుకుంది. బుద్ధుడు జీవితం క్షణికమైందనే

జీవిత సత్యాన్ని బోధించాడు. తన తపస్సు పూర్తయిన తరువాత భిక్ష స్వీకరించడానికి వస్తానని చెప్పి పంపితే బుద్ధుని పునరాగమనం వరకు భిక్షను సమర్పించడానికి ఏవిధంగా ఎదురు చూస్తుందనే విషయాన్నిజ్ఞానానందకవి కింది పద్యంలో వివరించారు.

*"పరమపవిత్రుడైన భగవానునిసన్నిధి నాశ్రయించి నా*
*జరిపెడుభిక్ష గైకొంగఁ జాలిన నయ్యది గొప్పదౌను నా*
*కరయ నటంచుఁదెల్పెద గృహమ్మును పావనముం బొనర్పఁగా*
*చరణము పెట్టఁగోరెదను సద్గురురాకకు సంతసించెదన్."* (**ఆమ్ర. పేజి**-64)

అప్పటికి ఆమెలో కోరికలు నశించిపోయాయి. తాత్కాలికమైన లౌకిక భోగాల నుండి విముక్తి మార్గానికి సిద్ధమై ఉంది. దానంతటికి కారణం ఆమెలో వివాహం చేసుకోవాలనీ, సర్వసౌఖ్యాలను అనుభవించాలనీ ఉన్న కోరికలన్నీ నశించటమే. కొడుకుని, తండ్రిని సర్వస్వాన్ని వదిలి బుద్ధుని శిష్యగణంలో చేరిపోయింది. ఆమె దుఃఖం నుండి విముక్తి పొందింది. దుఃఖ నివారణ తరువాత మోక్షానికి అష్టాంగ మార్గం అవలంభించటం ఆర్యసుత్రాలలో చివరిది. ఆర్య సత్యాలతో అన్వయం చేసినప్పుడు జ్ఞానానందకవి ఆమ్రపాలి కావ్యంలో సరిపోతున్నాయి. ఆర్య సత్యాలలో చివరిదైన అష్టాంగ మార్గంలో బౌద్ధ దర్శనం మరింతగా ప్రకాశిస్తుంది.

### 5.2.4 **అష్టాంగమార్గాలు**:

ఆమ్రపాలి కావ్యంలో 'అష్టమాశ్వాసం' లో బౌద్ధ దర్శనానికి సంబంధించిందే ఎక్కువగా ఉంది. కావ్యంలో బౌద్ధ ధర్మ సూత్రాలు, బోధనలు ఉన్నప్పటికీ ఈ ఆశ్వాసం పూర్తిగా బౌద్ధ తత్త్వాన్నే తెలియజేస్తుంది. దీని వల్లనే ఆమ్రపాలి కావ్యం చారిత్రక తత్త్వ కావ్యాల్లోకి చేరుతుందనిపిస్తుంది. కావ్యంలో గల కొన్ని లక్షణాలు ఆ స్పృహను కలుగజేస్తున్నాయి. ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం గారు చారిత్రక తత్త్వ కావ్యం గురించి చెప్తూ "కావ్యంలో వస్తువు కథ కోసం గాని రసం కోసం గాని చెప్పబడదు. చారిత్రక సన్నివేశం వెనుక రచయిత దర్శించిన తాత్త్విక సిద్ధాంతం కావ్యార్థాలకు

గమ్యమానంగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో కవి కథను ఎలా చిత్రించాడన్నది ప్రధానం కాదు. కవి కథనెలా ఒక తత్త్వానికి వ్యాఖ్యగా నిబంధించాడన్నదే ప్రధానం" అని లక్షణ చర్చ చేశారు. అయితే జ్ఞానానదకవి కథకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పూర్తిగా చారిత్రిక తత్త్వ కావ్యంగానే పరిగణించవలసిన అవసరంలేదు. కాని, చాల లక్షణాలు ఉన్నా చారిత్రిక తత్వకావ్యంగా చెప్పడం మాత్రం సమంజసంగా ఉంటుంది. బౌద్ధమతంలో అష్టాంగ మార్గానికి ప్రత్యేకత ఉంది. ఇది భిక్షువులై కర్మ క్లేశ నిరోధాన్ని చేయటానికి నిర్వహణపదం. దీన్ని ధర్మయానమనీ, బ్రహ్మయానమనీ బౌద్ధ గ్రంథాలలో పేర్కొన్నారు. కావ్యంలో అష్టాంగమార్గాన్ని ఆమ్రపాలి భిక్షువుగా మారిన తరువాతనే వివరించారు. ఇది ప్రధానంగా మోక్షానికి సంబంధించినది. కాబట్టి బౌద్ధసన్యాసులు, భిక్షువులు ఆచరించవలసిన నియమాలు దీనిలో ఉంటాయి. అయితే వీటిని సామాన్య ప్రజలు కూడా ఆచరించి బౌద్ధ ధర్మాన్ని పాటించమని బోధిస్తుంటారు.

కావ్యంలో పేర్కొన్న అష్టాంగమార్గాలు కింది విధంగా తెలిసుకోవచ్చు. బౌద్ధతత్వాన్ని ఎంతైనా వివరించవచ్చు. కాని పరిశోధన పరిధిని దృష్టిలో పెట్టుకొని దర్శనానికి సంబంధించిన పద్యాలనే పేర్కొని వివరణ అత్యంత అవసరం అనిపించిన వాటిని వివరిస్తాను.

**సమ్యక్ వాక్:**

*"పరులనెన్నడును నపభ్రంశ వాక్యాల*
*పాలు సేయరాదు పరమతస్య*
*ధర్మమార్గమందు తప్పక నడచుటే*
*మార్గా దర్శకమ్ము మానవునకు"* **(ఆమ్రపాలి. పుట.**80)

**సమ్యక్ క్రియ:**

*"ఇతర మానవాళి కితము సేయుటే గొప్ప*
*యనుచుఁదలఁప వలయు మనము నందు*
*సత్ప్రవర్తనంపుటుత్తృ భావమ్ము త*
*ప్పక యొసంగుదాని ఫలిత మరయ"* **(ఆమ్రపాలి. పుట.**80)

సమ్యక్ జీవనం:

*"హానిఁదలఁపఁగూడ దంతరంగామ్మున*
*నెట్టి జీవికైన నెన్నఁడైన*
*అవసరమ్ము కల్గునట్టి వేళకు మేలు*
*సేయ జీవితమున సిద్ధపడుము"* (ఆమ్రపాలి. పుట.80)

సమ్యక్ శ్రమ:

*"సహజమైన వైరిషడ్వర్గమును ద్రుంచి*
*గెంటవలయు గుండె గీము నుండి*
*సహన చంద్రికలు దిశాభి త్తతలముల*
*నలమ నరుఁడు కృషిని సలుపవలయు"* (ఆమ్రపాలి. పుట.80)

సమ్యక్ ఆలోచన:

*"అంతులేని వగుదురంత దుశ్చింతల*
*కాపురించు హృదయ గాహ్వరమున*
*సాధనమున వాని సమయించి యుత్తమ*
*కార్యమునకు చేయుఁగడఁగవలయు"* (ఆమ్రపాలి. పుట.81)

సమ్యక్ ధ్యానమ్:

*"పాడు తలఁపు లెడఁద పర్వెత్తి ధ్యానమ్ము*
*భగ్న పఱచునట్టి లగ్నమందు*
*నెట్టి ధ్యాసలేక యేకాగ్రతను వాని*
*గెలుపు వలయు నేల వలయు నరుఁడు"* (ఆమ్రపాలి. పుట.81)

సమ్యక్ నిశ్చయం:

*"నిష్కళంకమైన నీతిదాయకమైన*
*మానవీయమైన మానవతకు*
*ప్రణతులందఁజేసి పట్టమ్ముఁగట్టఁగా*
*వలయు సంతతము కువలయమందు"* (ఆమ్రపాలి. పుట.81)

**సమ్యక్ దృష్టి:**

*"ఉత్తమాశయాలనునున్న తాదర్శాల*
*శీలసంపదలకు నాల వాల*
*మై చరింప వలె సదా చరణమ్ముతో*
*నాశ వీడి మనుజు డవని యందు"* **(ఆమ్రపాలి. పుట.80)**

కవి వర్ణించిన అష్టాంగమార్గ సారాంశాన్ని విశ్లేషించినట్లయితే లోభాన్ని విడనాడాలి. దయను చూపుతూ దానం చేస్తూ సత్య భాషణను అలవరుచుకోవాలి. శాంతిని సామరస్యాన్ని పెంపొందించుకోవాలి. అపాయకరం కాని వృత్తిని చేపట్టి సరైన జీవన విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని అవగతమౌతుంది. బుద్ధుడు చెప్పిన అష్టాంగ మార్గాన్ని విశదీకరిస్తూ కవి ఎనిమిది పద్యాల్లోనే దీన్ని చెప్పడం ఔచిత్యంగా ఉంది.

### 5.2.5 త్రిరత్నాలు:

బౌద్ధాన్ని స్వీకరించి ఆచరించే వాళ్ళంతా త్రిరత్నాలను అంగీకరించాలని బౌద్ధ సాహిత్యం తెలుపుతుంది. అవి:

*"బుద్ధం శరణం గచ్ఛామి*
*ధర్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి"*

ఈ మూడింటిని శరణు వేడినవాడే బౌద్ధానికి అర్హులని కొన్ని బౌద్ధ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. గణభోగ్యగా జీవితాన్ని గడిపే ఆమ్రపాలి బుద్ధుణ్ణి శరణువేడింది. అతడు ధర్మాన్ని వివరించాడు. దాని అవలంభించడానికి ఆమె సంఘంలో చేరింది. ఇక్కడ 'సంఘం' అనగా బుద్ధ భగవానుని ఆశయాలతో కూడిన భిక్షుసంఘం అని అర్థం. కొత్త జీవిత విధానాన్ని కలిగి ఉంటుంది. ఈ విధంగా బుద్ధుని బోధనలను,బౌద్ధ ధర్మ నియమాలను సమర్థవంతంగా రమణీయంగా కావ్యంలో వర్ణించారు. నెమలి

పునర్జన్మ వృత్తాంతాన్ని వివరిచటం వల్ల బౌద్ధంలో కూడా కర్మసిద్ధాంతం ఉందనేది స్ఫురింప జేశారు. బౌద్ధమతంలో ఉన్న ఆత్మ – పరమాత్మ సిద్ధాంతాల జోలికి పోకుండా ఆర్యసత్యాలను, అష్టాంగమార్గాన్ని, బౌద్ధ త్రిరత్నాల మీదనే దృష్టిని కేంద్రీకరించినట్లు స్పష్టమైంది.

**5.3 ఇస్లాం సమాజం:**

ముస్లింముల రాకతో భారతదేశ సామాజిక చరిత్రలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. దాదాపు 320 సంవత్సరాలకు పైన సాగిన సుల్తానుల పాలనలో సమాజం అనేక మార్పులకు, ఒడిదుడులకు గురయింది. ప్రాచీనకాలంలో కూడా భారతదేశంపై విదేశీజాతులవారు దండెత్తారు. ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఇక్కడి ఆచారాలను, భాషలను, మతాలను స్వీకరించి భారతీయులుగానే ఉండిపోయారు; భారతీయ సమాజంలో కలసిపోయారు. ఇక్కడి ధర్మ శాస్త్రగ్రంథాలు కూడా వారి పవిత్రతకు మార్గాలను చూపించాయి. సమాజంలో వారికి స్థానం కల్పించాయి. కానీ భారతదేశంపై దండెత్తి, భారతీయులకు పాలకవర్గంగా మిగిలిన ముస్లింలు నిర్దిష్టమైన నాగరికత, మతాచారాలు, నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలు కలవారు. వారు హిందూ ప్రజానీకంలో కలసిపోలేక, తమ ప్రత్యేకతను నిల్పుకోసాగారు. సమాజంలో మార్పులు వచ్చి హిందువులు, మహ్మదీయులు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. మనిషి జీవితంలో మతం అనేది ఏవిధంగావుండాలి అనే విషయాన్ని కింది పద్యంలో బోధించారు.

*"మతము మనుష్యజీవితపుమార్గములో సహనప్రసూనసం*
*తతి గురిపించి సోదరజనమ్ముల యున్నతికై శ్రమించి ని*
*ష్కృత మొనరించి త్యాగమున శీలమునం బరువెత్తఁజేయుస*
*మ్మతిని; మతమ్ము మానవత మంటను గల్పఁగరాదు సెప్పఁగన్"*

**(గోల్కొండ. పుట. 70)**

మహ్మదీయులు తమ మత విస్తరణను ప్రారంభించి, హిందువులను కాఫర్లు అని నిందించసాగారు. ఆనాటి సమాజంలో 5% ముస్లింలు, మిగిలిన 95% హిందువులు. అల్పసంఖ్యాకులైన ముస్లింలు పాలకులు కాగా, అధిక

సంఖ్యాకులైన హిందువులు పాలితులు. హిందువులను కాఫరులు అని నిందించడంతో, హిందువులు స్వమత రక్షణార్థమైన ముస్లింములను యవనులని, తురకులని వ్యవరించసాగారు. పాలకులైన ముస్లింలకు, పాలితులైన హిందువులకు మధ్య స్నేహ సహకారాలకు బదులు ద్వేషం, విరోధం ప్రబలంగా ఉన్నాయని ఇబన్ బతూతా పేర్కొన్నాడు. మహ్మదీయులలో భూస్వాములు, వర్తకులు, కార్మికులు అనే వర్గాల వారున్నారు. వీరిలో భూస్వాములు, వర్తకులు విదేశీయులే. కార్మికులు స్వదేశానికి చెందినవారు. ముస్లింలు పాలక వర్గానికి చెందినందు వల్ల, సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం ఉండేది. రాజాస్థానాలలోను, పరిపాలనలోను, సైన్యంలోను ఉన్నత ఉద్యోగాలన్నీ వారే పొందేవారు. నాడు వాస్తవంగా నేడున్నట్లు ఒక మధ్యతరగతి వర్గం లేదు. రాజాంతఃపురవాసులు, ఆస్థాన ప్రభువులు, ఆఫ్ఘన్ జాతికి చెందిన యోధులు, ఇస్లాం మతానికి చెందిన విద్వాంసులు, మతాధికారులు సమాజంలో హక్కులను పొందేవారు. ఇబన్ బతూతా, అబ్దుర్ రజాక్ ల ప్రకారం ఆ రోజులలో హక్కులు గల వర్గానికి, హక్కులు లేని వర్గానికి మధ్య తీవ్రమైన సామాజిక అంతరం ఉండేది. భారతదేశంలో ఎక్కువమంది హిందూమతం నుంచి ముస్లిం మతం స్వీకరించినవారే. వారు పేదవారైనా మతంలో పాలకవర్గానికి చెందినవారు కాబట్టి మిగిలిన హిందువులకంటే అధికులమని భావించేవారు. భారతదేశంలోని ముస్లింలు సున్నీలనీ, షియాలనీ రెండు వర్గాలుగా చీలిపోయారు. ఢిల్లీ సుల్తానులు సున్నీశాఖను అనుసరించడం వల్ల, షియాలు సున్నీలకు బద్ధ విరోధులయ్యారు. క్రమంగా భారతదేశంలోని ఇస్లాం సమాజంలో మార్పులు రావడంతో హిందువుల పట్ల సుల్తానుల దృక్పథంలో మార్పులు రావడం గమనించదగిన అంశం. మహ్మద్ బీన్ తుగ్లక్ ఆస్థానంలో హిందువుల పండుగులైన హోలీ, దీపావళి నిర్వహించేవాడు కూడా. అతడే రాజ్యాధికారం ముందు సామాజిక, మతపరమైన వర్గాలకు ఏ ప్రాముఖ్యం ఇవ్వకుండా విశృంఖలంగా వ్యవరించాడు. మహ్మదీయులలో ఆ స్థానాలలో

ఉద్యోగాలు పొంది విలాస జీవితాలు గడపడం వల్ల యుద్ధం పట్ల ఆసక్తి ధైర్యం, శౌర్యం వంటివి క్షీణించాయి. అరబ్ దేశపు సంస్కృతి వల్ల గోల్కొండ సామ్రాజ్యం ఏవిధంగా విరాజిల్లిందో జ్ఞానానందకవి కింది పద్యంలో తెలిపారు.

అరబీదేశపు సంస్కృతిప్రభలు నీయాంధ్రావనీసంస్కృతిన్
బొరపొచ్చెమ్ములు లేక శాంతికలనన్ గోల్కొండ సామ్రాజ్యముం
బరిపాలించినయట్టి నీ ప్రభుత విశ్వశ్లాఘ్యమై యొప్పి నీ
చరితన్ నింపెను నేలనాల్గు చెఱఁగుల్ సౌరభ్యసామ్యమ్మునన్.

**(గోల్కొండ. పుట. 36)**

మహ్మదీయులలో పారశీక, అరబ్బీ, తురుష్క, మంగోలు మొదలైన విదేశీ జాతులతో పాటు, దేశీయులైన వారి సంఖ్య కూడా క్రమంగా పెరిగింది. అనేక మంది హిందువులు ప్రాణ భీతితో , సమాజంలో అధికారం, హోదా పొందాలనే కోర్కెతో, ధనాపేక్షతో మహ్మదీయ మతాన్ని స్వీకరించారు. డిల్లీలో సాలెవాళ్ళు వృత్తి పన్ను, జిజియా పన్ను తప్పించుకోవడానికి ఇస్లాంను స్వీకరించారు.

*“జిజియా యంచును జుట్టుపన్ను విధియించెన్ దానికై హైందవ*
*ప్రజలావాసము లమ్మఁగా దొడఁగె నల్లాపేరఁ గట్టించె నీ*
*బిజుగుంగాఁ డవురంగజేబు మహీతస్ఫీతంపుమజ్జీదులన్*
*రజనీనాథపతాక మెత్తెనిట హర్షస్వాంతుఁడైయుద్ధతిన్”.*(**గోల్కొండ.పుట**.22)

దేశీయ, విదేశీయ మహ్మదీయ వర్గాల మధ్య గుర్తింపుకూ , హోదాకూ అధికారానికీ ఘర్షణ ప్రారంభమైంది. డిల్లీ సుల్తానుల సమాజంలో మతాధికారమే లౌకికమైన విధులను శాసిస్తూండేది. హిందువులకు, మహమ్మదీయేతరులకు తగినంత గౌరవం ఉండేదికాదు. ఇది ఈనాటిది కాదు మొఘులుల కాలానికే ఉందనే అనే విషయాన్ని జ్ఞానానందకవి కింది పద్యంలో చెప్పారు.

*"ఇది యీనాఁటిది కాదు చెప్పికొనఁగా నీలాటికోపాన కా*
*న్పదమౌటల్ మొగలాయివారికి తలంపన్ దొల్లిసుల్తానునా*
*టిది యీకొంపలుదీయు కోపములు రెండింతల్ దయారయ్యె నేఁ*
*డది నిన్నీగతి కీడ్వసాఁగినది త్రాచై కాటు వేయం జుమ"*

(గోల్కొండ.పుట.42)

హిందువులను జిమ్మీలు అనేవారు. జిమ్మీలు అంటే ఒప్పందం ప్రకారం సంరక్షణలో ఉండేవారిని అర్థం. అల్లా ఉద్దీన్ ఖిల్జీ పాలనలో హిందువులను తక్కువుగా చూసేవారు. జిజియా అనే పన్ను చెల్లించవలసి వచ్చేది. భూమిశిస్తు కూడా హిందువులు ఎక్కువ చెల్లించవలసి వచ్చేది.

భారతదేశ చరిత్రలో ముస్లిం మతం రావడం ఎంత చారిత్రక వాస్తవమో, ముస్లిం మతస్థుల అధికార ప్రాబల్యం వల్ల, ఆర్థిక, సామాజిక రంగాలలోనూ వారు భారతదేశీయులకు ఈ దేశంలోనే ఒక ప్రత్యామ్నాయ (ఒక దానికి బదులుగా) శక్తిగా రూపొందారనడం కూడా అంతే తిరుగులేని వాస్తవం. మహమ్మదీయులు భారతదేశంలో విజేతులుగా నిల్చినప్పటికే భారతదేశంలో అనేకానేక వైవిధ్యాలు వైదిక, అవైదిక విభాగం ఏర్పడింది. వేమన అన్నట్లు "దర్శనంబులారు దైవంబ దొక్కటే". ఉన్న ఒక్కదాన్ని చూడడానికి ఆరు పద్ధతులు వచ్చాయట. అదేవిధంగా వేమన అన్నట్లుగానే, ఏ రకంగా అద్దాలగదిలో తన బొమ్మను తానే చూసుకొని కుక్క భయపడుతుందో, అన్ని మతాలను చూసుకొని మానవుడూ భయపడవలసి వచ్చింది. అటువంటి స్థితిని వర్ణనాత్మకంగాను, విశ్లేషణాత్మకంగాను అనేకమంది చరిత్రకారులు తమకు నచ్చిన పంథాలో వివరించారు, వర్ణించారు, విమర్శించారు. వాస్తవాన్ని సామాజిక పరిణామపరంగా చెప్పుకొంటే, మహ్మదీయ మతం భారతదేశంలో అడుగు పెట్టగానే అప్పటికే ఉన్న శక్తులకు, పద్ధతులకు ఒక సమాంతర శక్తిగా రూపొందింది. సమాంతర శక్తి కాబట్టి, భావాలలోను, ఆచారాలలోను, వ్యవహారంలోను ఒకరికొకరు కలవని, కలవలేని వారుగా అప్పటి సమాజం గుర్తింపునిచ్చిందనే విషయాన్ని కింది పద్యంలో వివరించారు.

*"నీదీదేశము కాకపోయినను కానీ, నీ వకస్మాత్తుగా*
*నేదో ధైర్యముఁజిక్కఁబూని మనసై యీ తెల్గుప్రాంతమ్ములోఁ*
*బాదా ల్పెట్టి గురూపదేశముల నభ్యస్తమ్ముఁ గావించి మ*
*ర్యాదాయోగ్యముగా నటించితివి తానా! భోగపారంగతా!"*

(గోల్కొండ.పుట.35)

### 5.4 మిశ్ర సంస్కృతి :

*"అల్లాయున్ రఘురామచంద్రుఁడిట నేకాత్మన్ బ్రశాంతమ్ముగా*
*సల్లాపములు సల్పుచుండుటను సస్యశ్యామలం బౌచు నీ*
*గొల్లల్ మందలుమేపుకొండపురిలో గూర్మిల్పిసాలింపగన్*
*ఢిల్లీ పాదుషా కన్ను గుట్టినది తానీషా భవత్కాలమున్"*

(గోల్కొండ. పుట. 40)

పై పద్యంలో అల్లా, రాముడు ఒక్కరే అని అందరు కలిసి మెలిసి జీవించడం, కలిసి పనులు చేసుకోవడం చూసి ఢిల్లీ రాజుకి కంటగింపు కలిగిందనే విషయాన్ని తెలిపారు. ఆ కాలంలోనే లోకజ్ఞానం కలిగి, యుక్తాయుక్త విచక్షణ లేకుండా ఎవరినీ నిందించడంకానీ, దూషించడం గానీ, విమర్శించడంగానీ చేయకూడదు అనుకొనేవారు. మహమ్మదీయుల్లోనూ, హిందువుల్లోనూ కూడా ఉంటారు అనే సత్యాన్ని మనం మరవరాదు. విద్య, విజ్ఞానం, బుద్ధికుశలత కలవారే, సహనాన్ని పొందడానికి అవకాశాలుంటాయి. మహమ్మదీయ రచయితల్లోనే హిందువులు తమ విజ్ఞానాన్ని మహమ్మదీయులకు అందకుండా చేయాలనీ దూరంగా పారిపోయారు అని ఆల్ బెరూనీ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. హిందూ దేశంలో గల హిందీ భాష పర్షయన్ భాష కంటే ఏమీ తీసిపోదని అమీర్ ఖుస్రూ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. హిందూ మహమ్మదీయ సమాజాలలో కూడా అవకాశవాదులు, ప్రాపంచిక వాదులు మొదలైనవారి ప్రాబల్యం వల్ల మార్పుకు తగిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల నుంచి పుట్టినదే మిశ్రమ సంస్కృతి. అది ఏవిధంగా ఏకమైంది అనేది కింది పద్యంలో చూడవచ్చు.

*"రాముర‌హీము లేకమయిరా యనుట్లుగ నీవునీగురుం*
*డీమహి నేక మైతిరి బళీ యిది యీశ్వర శక్తి దత్తమై*
*యీమిషపాత్రమై వెలగ నేమొ యిటుల్ జరిగెన్ గబీరు లో*
*రాముడు కనిపించెను స్థిరంబుగ నీకు గుణాలగోపనా"*

**(గోల్కొండ. పుట.** 40)

ఈ మిశ్రమ సంస్కృతి ఆవిష్కరణలో రెండు భాగాలను చూడవచ్చు. మొదటిది కేవలం సమాజంలో ఊర్ధ్వముఖమైన ఆలోచన గలిగినవారి వల్ల ఏర్పడ్డ భావాలతో కూడిన భక్తి సూఫీ ఉద్యమాలు. రెండవది నిత్యజీవితంలో భాషలోను, ఆచారాలలోను, ఆవాసాలలోను, ఆనందం.

★★★

# సింహావలోకనం

**అధ్యాయం** - 1

ఈ అధ్యాయంలో జ్ఞానదంకవి జీవిత విశేషాలను వివరించడం జరిగింది. కవిగారి బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం, వారి రచనలు, ఆయన పొందిన విశిష్టసభ్యత్వాలు, ఆయన స్థాపించిన సాహితీ సంస్థలు, కవిగారు పొందిన సన్మానాలు, బిరుదులు, అవార్డుల గురించి వివరించడం జరిగింది.

**అధ్యాయం** -2

ఈ అధ్యాయంలో జ్ఞానానందకవి రచనలను అన్నింటిని స్థూలంగా పరిచయం చేయడం జరిగింది.

**అధ్యాయ** - 3

జ్ఞానానందకవిని దళిత కవిగా కంటే జాతీయ కవిగా విమర్శకులు గుర్తించారు. కనుక ఆయన రచనల్లో ఉన్న జాతీయ నాయకుల సామాజిక సేవను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

**అధ్యాయం** - 4

ఈ అధ్యాయంలో జ్ఞానానంద కవి తన రచనల్లో పేర్కొన్న సమాజాన్ని మరీ ముఖ్యంగా సమాజంలో దళితుల జీవితం ఏ విధంగా ఉంది అనే విషయాలను వివరించడం జరిగింది.

**అధ్యాయం** - 5

ఈ అధ్యాయంలో జ్ఞానానందకవి తన రచనల ద్వారా చూపించిన బౌద్ధ సంస్కృతి, మతమార్పిడి చేసుకున్న హిందూ  క్రైస్తవ సంస్కృతి, మహ్మదీయుల సంస్కృతిని వివరించడం జరిగింది.

**పరిశోధన ఫలితాలు:**

1. సురగాలి తిమోతి జ్ఞానానందకవి రచనలు  దళిత దృక్పథంతో పాటు జాతీయ దృక్పథం కూడా  ప్రతి ఫలించాయి.

2. హరిజన, జాతీయోద్యమ సంఘటనలను కవితా వస్తువు గా స్వీకరించారు.

3. జ్ఞానానందకవి రచనల్లో ప్రధానంగా హరిజన, జాతీయోద్యమ కాలంలో జరిగిన ఆర్థిక, రాజకీయ, సాంఘీక పరిస్థితులు ఆయన రచనలలో ప్రతిబింబిస్తాయి.

4. తరతరాలుగా నిమ్న కులాలు ఈ హైందవ సమాజంలో అస్పృస్యత ఎదుర్కుంటున్న అంటరాని జాతుల పక్షాన నిలిచి తన కవిత్వం ద్వారా ప్రజల్ని చైతన్య పరిచారు.

5. గాంధీని ఆదర్శంగా తీసుకొని సత్యం,అహింసా మార్గాన్ని తన కవిత్వం ద్వారా ప్రబోధించాడు.

6. క్రైస్తవ మిషనరీలో విద్యాభ్యాసం చేయడం వల్ల క్రైస్తవ ప్రభావం ఆయన జీవితంపై ఉంది. కనుక క్రైస్తవ తాత్వికత ప్రేమ,కరుణ, సహాయం మొదలైనవి రచనల్లో ప్రతిఫలిస్తాయి.

7. భారతదేశం వివిధ సంస్కృతులకు, మతాలకు నిలయం. హిందూ, ముస్లింల ఐక్యత ఈయన రచనలో కనిపిస్తుంది.

8. తెలుగు ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలని తెలుగు జాతి ప్రపంచానికి వెలుగు జాతి కావాలని ఆకాంక్షించారు.

9. జ్ఞానానందకవి కవిత్వంలో జాతీయ నాయకులు, కవులు, కళాకారులు, ప్రముఖులు యొక్క జీవితాలను వారిసేవలు వారి తాత్వికత కనిపిస్తాయి.

10. జ్ఞానానందకవి కవిత్వంలో భాషా శైలి ఆధునిక పద్యకవులకు భిన్నంగా ఉంటుంది.

11. ఈయన కవిత్వం సీసపద్య మణిహారం. అందుకే ఈయనకి కవితా శ్రీనాథ భిరుదాంకితులయ్యారు.

12. దళిత కవిత్రయంలో ఈయన ఒకరు ( జాషువా, బోయి భీమన్న, జ్ఞానానంద కవి)

13. ఆయన వ్యక్తిత్వ వికాసం నా జీవిత గాథ ద్వారా తెలుస్తుంది.

14. జ్ఞానానందకవి అంతిమ దశ వరకు సాహిత్య సేవ చేస్తూ రాజీలేని జీవితాన్ని గడిపారు.

★★★

# ఉపయుక్త గ్రంథ సూచి


1. అరుణ కుమారి, జి. 1987. ***ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న ధోరణులు***. హైదరాబాదు: ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్.
2. ఆనందరామం, సి. 1947. ***సమాజ సాహిత్యాలు***. హైదరాబాదు: యం. శేషాచలం అండ్ కంపెనీ.
3. కృపాచారి, గుజ్జర్లమూడి. 1988. ***తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ***. నాగార్జునసాగర్: స్వంత ప్రచురణలు.
4. కృష్ణమూర్తి, భద్రిరాజు(సం). 1985. ***తెలుగు భాషా చరిత్ర***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
5. గోపి, ఎన్. 2000. ***ప్రజాకవి వేమన***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్. హౌస్.
6. చంద్ర శేఖర రెడ్డి, రాచపాళెం. 2002. ***ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు***. హైదరాబాదు: అనుపమ ప్రింటర్స్.
7. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***తరంగమాల***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
8. జ్ఞానానందకవి, యస్.టి. 1947. ***వసంతగానం***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
9. జ్ఞానానందకవి, యస్.టి. 1950. ***గాంధీ(అమరగీత)***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్
10. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***దేశబంధు(అయ్యదేవర)***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
11. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***పాంచజన్యం***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
12. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***ప్రభంజనం***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

13. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *పర్జన్యం(తొలిభాగం)*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

14. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *గోల్కొండ*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

15. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***క్రీస్తు చరిత్ర***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

16. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *క్రీస్తు చరిత్ర(వచనం)*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

17. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***విజయాభిషేకం***. కాకినాడ: రసజ్ఞశ్రీపబ్లికేషన్స్.

18. జ్ఞానానందకవి, యస్.టి.1944. ***పర్జన్యం(మలిభాగం)***. కాకినాడ: రసజ్ఞశ్రీపబ్లికేషన్స్.

19. జ్ఞానానందకవి, యస్.టి.1944.***అక్షరాభిషేకం***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

20. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***ఆమ్రపాలి***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

21. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***అక్షరాకృతులు***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

22. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***అక్షరగుచ్ఛం***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

23. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***వెలుగుబాట***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్

24. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *క్రీస్తు ప్రబంధం(తొలిభాగం)*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

25. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *నా జీవితగాథ(ప్రథమభాగం)*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

26. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *అక్షరపూజ*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

27. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *హరిజనులు అంటరానివారా?*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

28. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *పిల్లనగ్రోవి*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

29. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *రాజధాని*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

30. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *కూలి నుండికళాప్రపూర్ణ వరకు*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

31. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *వంశధార*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

32. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *వ్యూస్ అండ్ వర్స్*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

33. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *ఆహ్వానం*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

34. జ్ఞానానందకవి, యస్.టి. 1944. *ధర్మాగ్రహం*. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

35. నారాయణ రెడ్డి, సి. 1977. *ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు, ప్రయోగములు*. సికింద్రాబాదు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్.

36. పద్మారావు, కత్తి. 1995. *సాంఘిక విప్లవ రచయితలు*. పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

37. పద్మారావు, కత్తి. 2008. *దళిత సాహిత్య వాదం - జాషువా సామాజిక తత్వము*. పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

38. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1987. *భాషా శాస్త్ర పరిచయం*. నరసరావు పేట: స్టూడెంట్స్ ఫ్రెండ్స్ ప్రచురణ.

39. బాలరాజు, శ్రీ రత్నాకర. 1960. *బౌద్ధయుగము*. రాజమండ్రి: కాళహస్తి తమ్మరావు అండ్ సన్స్.

40. బిపిన్ చంద్ర. 1983. *ఆధునిక భారతదేశ చరిత్ర*. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్టు.

41. రంగనాథాచార్యులు, కె. కె. 1982. ***ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు***. హైదరాబాద్: ఆంధ్రసాహిత్య పరిషత్తు.

42. రంగారావు, సాదినేని. 1979. ***నీలం సంజీవరెడ్డి జీవిత చరిత్ర***. తెనాలి: విజయ ఆర్ట్ ప్రెస్.

43. రామమోహన్ రాయ్, కడియాల. 1982. ***తెలుగు కవితా వికాసం***. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

44. రామకృష్ణమాచార్య, నండూరి. 1995. ***తెలుగు పద్య శిల్పం***. సికింద్రాబాద్: చారి అండ్ కంపెనీ.

45. లక్ష్మీకాంతం, పింగళి. 1979. ***ఆంధ్రసాహిత్య చరిత్ర***. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

46. విజయలక్ష్మి, రాయదుర్గం. 2002. ***ఆధునికాంధ్రకవిత్వం పై బౌద్ధ మత ప్రభావం***. సికింద్రాబాదు: ఆనందబుద్ధ విహార ట్రస్టు

47. వీరన్న, గుమ్మ.2008. ***భారతీయ సంస్కృతి - తత్వం***.హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

48. వెంకటేశ్వరరావు, దార్ల. 1999. ***జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన***. హైదరాబాదు: జ్యోత్స్న కళాపీఠం.

49. శరత్ జ్యోత్స్నరాణి, యస్. 1994. డా. ***యస్. టి. జ్ఞానానందకవి జీవితం వాఙ్మయసూచి***. హైదరాబాద్: స్వంత ప్రచురణలు.

50. శ్యాంసన్ పిల్లి. 2000. ***దళిత సాహిత్య చరిత్ర***. గుంటూరు.

51. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 1988. ***శబ్దరత్నాకరము(నిఘంటువు)***. న్యూఢిల్లీ: ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్.

52. సుబ్బారెడ్డి, మద్దూరి. 1982. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం. తిరుపతి: రాగసుధా ప్రచురణలు.

★★★

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN : 2277-7881; IMPACT FACTOR – 5.818; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 7, ISSUE 1(3), JANUARY 2018

# జ్ఞానానందకవి గారి ఆమ్రపాలి – మనస్తత్వ చిత్రణ

చౌట బాలకృష్ణ
పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం
హైదరాబాదు
సెల్:8985043681

## ప్రస్తావన:

ప్రాచీన కాలం నుండి నేటి వరకు స్త్రీల జీవన స్టితిగతులలో పెద్దగా మార్పులేమి కనిపించడం లేదు. కాని కనిపించినట్లు కొంతమంది భ్రమలు కల్పిస్తున్నారు.శారీరకంగా స్త్రీల పరిస్థితులను అర్థం చేసుకోగలిగినప్పుడే మార్పు సాధించింది, లేనిది గుర్తించగలుగుతాం. నేటి సమాజంలో కొన్ని వర్గాల వారు చేసే కుట్రలకు స్త్రీలు బలి అవుతూనె ఉన్నారు. దేవదాసి, జోగిని, బసివిని, మాతంగి మొదలైన ఆచారాలు కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి స్త్రీల దుస్థితిని ఖండిస్తూ అనేక మంది రచయితలు రచనలు చేశారు. షోడశ మహా జనపథాలకు చెందిన వైశాలి అనే గణతంత్ర రాజ్యంలో ఉండే 'గణభోగ్య' ఆచారాన్ని జ్ఞానానందకవి గారు 'ఆమ్రపాలి' కావ్యంలో వర్ణించారు. ఇది ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కావ్యం. దీనిని పద్మశ్రీ యస్. టి. జ్ఞానానందకవి రచించారు.

తెలుగు సాహిత్యంలో ఉన్న అతి కొద్దిమంది నవ్య సాంప్రదాయ కవులలో సురగాలి తిమోతి జ్ఞానానంద కవిగారు అగ్రగణ్యులు. జాతి జీవనానికి, అస్తిత్వానికి సంస్కృతి ప్రధానమైనది. అలాగే మానవ వికాసానికి మానవత్వం ముఖ్యమైంది. దానిని కాపాడటానికి కలం పట్టి నిరంతర కవితా వ్యవసాయం చేశారు. సనాతన భారతీయ సంస్కృతి పరిరక్షణ తత్పరత, సంఘసంస్కరణ దీక్షా దక్షత, పరమ ఉదాత్తమైన సౌహార్ద సంపద, అనల్ప పద్య కవితా ప్రదర్శన, ప్రవీణత మొదలైన లక్షణాలు జ్ఞానానంద కవిగారికి స్వభావసిద్ధమైనవి. అందుకే కవితా విశారద, కవితా శ్రీ నాథ, పద్య విద్యా ప్రభువు వంటి అనేక బిరుదులు వరించాయి. ఆంధ్రవిశ్వకళా పరిషత్తు "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించింది.

సాహిత్యం వివిధ ప్రక్రియలలో(నవల, నాటకం, కథ, వచన కవిత్వం)వస్తున్నా వాటిని కాదని జ్ఞానానందకవిగారు ప్రాచీన కవులు ఆధరించిన సాంప్రదాయ మార్గాన్నే ఎన్నుకొని చారిత్రక కావ్యాలు, కథా కావ్యాలు, ఖండ కావ్యాలు, నాటికలు మరియు పాటలు రచించారు. సాంప్రదాయ మార్గంలో రచనలు చేసిన అతి కొద్దిమందిలో ఈయన ఒకరు. అక్షరాలతో పరిచయంలేని విద్యాగంధం ఎరుగని ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించి సాంఘిక, ఆర్థిక అసమానతలకు గురి అవుతూ దారిద్ర్యం విలయతాండవం చేస్తున్న రోజుల్లో అక్షరం చేతపట్టుకొని కళాప్రపూర్ణ వరకు ఎదిగారు.

**ఆమ్రపాలి కావ్య పరిచయం:**

'ఆమ్రపాలి' కావ్యకథ చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది. శాక్యధనికుడికి వన విహారంలో మామిడి తోటలో ఒక ఆడపిల్ల దొరుకుతుంది. పిల్లలు లేని తనకు భగవంతుడే ప్రసాదించాడని ఆమ్రవనంలో దొరికినందువల్ల ఆమ్రపాలి అని పేరు పెడతారు. ఆమ్రపాలి శ్రద్ధతో నాట్యం, సంగీతం, సాహిత్యం మొదలైన లలితకళలలోను, తత్త్వశాస్త్రంలోను ఆనాడు సంఘంలో స్త్రీకి అర్హమైన అన్ని విద్యలతో పాటు క్షాత్ర విద్యలోను ప్రావీణ్యం సంపాదిస్తుంది. అందచందాలలో, గుణశీలంలో తనకు సమానమైన వయస్సు గల వారిలో తలమానికమైంది. తండ్రి తనతో పాటు ఆమ్రపాలిని పూజా పురస్కారాలకు తీసుకెళ్ళేవాడు. ఆ సమయంలో దేవాలయాల్లో చేసే నాట్యాల్లో పాల్గొనేది. ఆ రోజుల్లో కళ్ళు మూసుకుపోయిన గర్వతో వైశాలినీ పట్టణాన్ని లిచ్ఛవ రాకుమారులు పాలిస్తుండేవారు. ఆమ్రపాలి అందాన్ని చూసి లిచ్ఛవ రాకుమారులు గ్రుక్కలు మింగేవారు. అది తెలుసుకున్న శాక్యధనికుడు వారి నుండి ఎలాంటి ఆపద వస్తుందో అని తలచి ఎన్ని కష్టాలు వచ్చినా సరే కూతురికి పెళ్లి చేయాలని భావిస్తాడు. ఎంతో సౌందర్యవతి, కళాకోవిదురాలైన ఆమ్రపాలి పట్ల ఆశలు పెట్టుకున్న యువకుల గుండెల్లో దిగులు మొదలైంది. శాక్యధనికుడు ఆమ్రపాలికి స్వయం వరం ప్రకటిస్తాడు.

ఆమ్రపాలి మీద మనసుపడ్డ లిచ్ఛవులు ఆమె ఎవరో ఒక్కరికే దక్కడం ఇష్టం లేక కోపంతో రెచ్చిపోయి ఈ అతిలోక సుందరికి పెళ్లి ఏమిటి? స్వయంవరం సభ ఏమిటి? అని ఆమె ఒక్కనికే

భార్య కావటానికి వీలులేదు ఆమె అందరి భార్య కావాలని ఒక లిచ్ఛవ యువరాజు ప్రతిపాదన చేస్తాడు. లిచ్ఛవాధీసులు ఆ ప్రతిపాదనను సమర్థిస్తారు. ఆమ్రపాలి గణభోగ్య అని శాసనం చేస్తారు. శాక్యధనికుని కూతురు ఆమ్రపాలి గణభోగ్య ఐన వార్త అన్ని పట్టణాల్లోను, పల్లెల్లోనూ వ్యాపిస్తుంది. ఆమ్రపాలి కోసం కట్టించిన భవనంలో అనేక మంది రాజుల చిత్ర పటాలను వేయిస్తారు. అందులో మగధరాజు బింబిసారుడి చిత్రపటం ఆమెను బాగా ఆకర్షిస్తుంది. తన భవనానికి రప్పించుకోవాలని తనకెంతో నమ్మకమైన భటుని ద్వారా సందేశాన్ని పంపుతుంది. ఆమ్రపాలి ఆహ్వానాన్ని మన్నించి బింబిసారుడు తన సేనాని గోపుడితో భవనానికి వెళ్లి ఆమెతో సంభోగిస్తాడు. ఆ విషయం తెలుసుకున్న లిచ్ఛవులు ఆమ్రపాలి భవనాన్ని సోదాచేయదలిచామని వర్తమానం పంపుతారు. బింబిసారుడు తాను చేసిన ఎంగిలి పనికి పశ్చాత్తాపం చెంది నీకు కొడుకు పుడితే ఈ ఉంగరాన్ని తొడిగి నా దగ్గరికి పంపించు అని తన రాజ్యం వెళ్ళిపోతాడు. కొన్నాళ్ళకు ఆమ్రపాలికి కొడుకు పుడతాడు. లిచ్ఛవుల నుండి తన కుమారుడికి ప్రమాదం ఉంటుందని గ్రహించి బాబు మీ తండ్రి మగధ రాజు బింబిసారుడు నీవు మీ తండ్రి దగ్గరికి వెళ్ళు అని బింబిసారుడు ఇచ్చిన ఉంగరాన్ని కొడుకు వేలికి తొడిగి పంపిస్తుంది.

వర్షాకాలం ప్రవేశిస్తుంది. బోధి సత్వుడు వస్తున్నట్లు తెలుస్తుంది. గౌతమ బుద్ధుడిని ప్రజలు పోటీపడి చూస్తుంటారు. చీకటి కమ్ముకున్న వైశాలీ నగరం బుద్ధుని రాకతో వెలుగురేఖ వచ్చినట్లు తలుస్తుంటారు. ఆమ్రపాలి బుద్ధుడిని దర్శించి తన ఇంటికి ఆహ్వానిస్తుంది. బుద్ధుని ధర్మ మార్గమెంత గొప్పదో తనకు తెలిసినంతలో తనకు తెలిసిన భాషలో తన జీవితం కొత్త మార్గం వైపు పయనించేటట్లు జ్ఞానబోధ చేయమని ప్రార్థిస్తుంది. ఆమ్రపాలితో పాటు అక్కడికి వచ్చిన వారందరినీ ఉద్దేశించి ఇలా బోధిస్తాడు. 'నీ ప్రాణాన్ని ఎట్లు చూసుకుంటావో అలాగే తోటి ప్రాణులను చూడటంవల్ల నీ జన్మ సఫలమౌతుంది. అశాశ్వతమైన జీవితం కోసం లేనిపోని తుచ్ఛమైన భోగాలకోసం తప్పులు చేస్తుంటారు. వందేళ్ళు బతికినా మరణం తప్పదు అనే సత్యాన్ని గ్రహించరు. ప్రాణం ఉన్నప్పుడే ధర్మాన్ని తెలుసుకొని మంచిని పెంపొందిస్తే శాశ్వితంగా నిలుస్తుంది' అని బోధిస్తాడు. ప్రజలు ఇళ్ళకు వెళ్ళిపోతారు. అక్కడితో కావ్యం ముగుస్తుంది.

**ఆమ్రపాలి, శాక్యధనికుని మనస్తత్వ చిత్రణ:**

ఆమ్రపాలి పయనించే కష్టాల కడలిలో చుట్టూ నీరు ఉన్నా దప్పిక తీర్చే గుక్కెడు మంచినీళ్ళు లేనట్లుగా ఎన్నో భోగాలు ఇంటిలో ఉన్నప్పటికీ ఆత్మీయతను పంచుకునేవారు కరువవుతారు. ఒంటరితనాన్ని మించిన బాధ ప్రపంచంలో మరొకటి ఉండదు. అది అనుభవించిందామే. జీవించాలనుకున్న దానికి భిన్నంగా మారిన ఆమె జీవిత బింబాన్ని చూచి తనలో తానూ మానసిక వ్యధకు గురైన తీరును కవి ఇలా వర్ణించారు.

అల్లారుముద్దుగా నవనిఁ బెంచిన యట్టి
    తల్లిదండ్రుల నెడందఁ దలఁచి తలచి
చిననాటినుండియు తనతోఁ జరించు నె
    చ్చెలుల శ్లేషోక్తికిఁ గులికి కులికి
తన విద్దియులకు కారణ భూతులగు గురున్
    బత్తి నిండఁగ చేతెలెత్తియెత్తి
వయసుతో పాటుగఁ బయనించు కోర్కెలు
    పూడ్చఁగాఁ బడెనంచు నేడ్చియేడ్చి
గుండెలు పగులునట్లు కుమిలిపోయి
చెప్పరాని వెతల కుప్పలోన
కూలఁబడిన యామ్రాపాలి నెవ్వారలు
ప్రేమతోడ నాదరింతు రోక్కా

గత జీవితాన్ని అంతటిని గుర్తు చేసుకొని, అనురాగాన్ని తలచుకొని అది లోపించినందున ఎంతో వ్యధకు గురైంది. తల్లిదండ్రులకు బాధ కలిగించే నిర్ణయమే తానూ తీసుకున్నా దాని వల్ల ధర్మస్థాపన చేయగలిగాననే అనుకుంటుంది. ఒక అమ్మాయి బతుకును పాడు చేయాలని భావించిన కొన్ని స్వార్థపర శక్తులు ప్రయత్నించగా ఒక ప్రేమమూర్తి ఆమెను చేరదీసి ఆదరించడం జరుగుతుంది. భ్రష్టమైన తన బతుకును గురించి చింతిస్తూ నిరాశానిస్పృహలకు లోనుకాకుండా ఆ యువతి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని జన్మను చరితార్థం చేసుకుంటుంది. ఇందులో

ఆమ్రపాలి వ్యక్తి శ్రేయస్సు కంటే సమాజ శ్రేయస్సు ముఖ్యంగా గ్రహించి తనను తానూ గణభోగ్యగా సమర్పించుకోవడం మహత్తరమైన త్యాగం. లిచ్ఛవులు ఆమ్రపాలిని గణభోగ్య కావాలని ప్రతిపాదన చేసినప్పుడు శాక్యధనికుడు

కలలోనైనాఁ దలంపగా నిజము వక్కాణింప నాశ్చర్యమే
కలుగున్ బిడ్డలఁగన్న వారలకు లోకబందు నీలాటి ప
ల్కులు విన్నంతనె ముల్కులై వెలసి మా గుండెల్ విదారించు మీ
రలు రాజన్య కుమారకుల్ భువన ధర్మ శ్రీసముద్ధారకుల్

అని ప్రశ్నిస్తాడు. ఒక తండ్రిగా ఏ మాటలైతే వినకూడదొ అవి వినేసరికి పుత్రిక మీద ప్రేమను కాపాడుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తాడు. సభలోనున్న వారికి లిచ్ఛవులు చేసే పని తప్పని చెప్పటానికి ప్రయత్నిస్తాడు. తన కుమార్తె పెండ్లికి ఆటంకం కలిగించవద్దని వేడుకుంటాడు. ఆమ్రపాలి అందరికి భార్య కావాలనే ఈ కోరిక మంచిది కాదని సభలోని ప్రజలందరినీ తమ పక్షాన చేసుకొన్నట్లు ఈ విధంగా ఆవేదన చెందుతాడు.

"అందురా? యిది ధర్మమైన కార్యమ్మని
    లేరొకో? తమకు చెల్లెండ్రు నుడవ
విందురా? యిది మహానంద సత్క్రియయన్న
    ఎఱుఁగరో? ధర్మంపు చరిత మీరు
కందురా? యిది బుద్ధ కర్మంది బోధగా
    చదువరో? ధమ్మాల సారనీతి
కొందురా? యిది బుధానంద వస్తువు గాఁగ
    తెలియరో? హైందవ స్త్రీల చరిత
గురుకులాన విద్యఁ గఱచిన మీకెల్ల
ననుభవైక వేద్యమై తనర్చు
నన్నుఁబోలువాని విన్నాణపుంబల్కు
లెంత్రలేసి నుడువ నీ క్షణాన"

తమకు చెల్లెల్లు ఉంటే ఇది ధర్మమైన పని అని ఎవరూ అనరు. ధర్మం తెలిసినవారెవ్వరూ ఇది మంచి పని అని చెప్పరు. బౌద్ధ ధర్మాన్ని వివరించే ధమ్మాలలో ఎక్కడా ఇటువంటి విషయాన్ని ప్రోత్సహించలేదు. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న భారత స్త్రీ పాతివ్రత్యాన్ని తెలుసుకోవాలని శాక్యధనికుడు చేసిన ప్రసంగంలో ప్రశ్న తానేవేసి దానికి సమాధానం కూడా తానే చెప్తాడు. మంచి గుణాలతో అందరూ మెచ్చుకొనేటట్లు నడుచుకుంటున్న నా కూతురు మీకు గణభోగ్యగా కావాలంటున్నారు. దానికి బదులు గుండెల్లో కత్తులు నృత్యం చేయడమే నాకు సుఖాన్ని కలిగిస్తుంది. ఇక్కడ ధర్మ దేవత నాలుగు పాదాలు నడిచింది. సాంఘికాచారాలకు దేవత పన్నీరు జల్లింది. ఐక్యమత్యం కొనసాగింది. కుల భావాలు ఎన్ని ఉన్నా కలసిమెలసి తిరిగారు. హర్షమత ధర్మం శాంతిని నెలకొల్పింది. అటువంటి గొప్ప దేశం మనదని గుర్తుచేస్తాడు శాక్యధనికుడు. ఆమ్రపాలిని గణభోగ్యగా చేయాలనుకున్న తర్వాత మాది గొప్ప సార్వభౌమత్వం అని గొప్పగా చాటుకోలేదు. ప్రజలు చులకనగా చూస్తారు. ఇటువంటి పనులను ప్రజలు హర్షించరని శతవిధాలుగా వివరిస్తాడు. ఆమ్రపాలి వేశ్య కాకుండా చేయాలని ప్రయత్నించి నిస్సహాయతతో కన్నీళ్లు పెట్టుకుంటాడు. లిచ్ఛవ యువరాజుల కోరిక, వాళ్ళని ప్రశ్నించే సాహసం ప్రజలల్లో కనిపించకపోవడం, తనని కాపాడాలని తండ్రి పడుతున్న ఆవేదన వీటన్నింటిని గమనించిన ఆమ్రపాలి తండ్రి వైపు చూస్తుంది. విద్ధమనస్కుడై విషాద పరీతుడై హఠాత్తుగా నిలబడి పెళ్ళికి పనికిరాదు కానీ ఆమె మీకు గణభోగ్యగా కావాలా? అని నిస్సహాయత నిలువెత్తు రూపమై వాళ్ళని నిందిస్తున్నట్లుగానే నిలబడిపోతాడు.

**ముగింపు:**

ఎన్నో ఆశలు పెట్టుకున్న అందమైన అమ్మాయి ఆమ్రపాలి. లిచ్ఛవుల దుష్టపన్నాగాల వల్ల 'అందరికి భార్య గణభోగ్య' గా మారవలసి వస్తుంది. ఆమెను కాలక్రమంలో సమాజంలో వేశ్యగా ముద్ర వేసి నిరాదరణకు గురిచేయడం జరుగుతుంది. ఆ పరిస్థితులలో ఆమె పడిన మానసిక సంఘర్షణ, మానసిక సంక్షోభాన్ని పరమ దయనీయంగా జ్ఞానానందకవి గారు చిత్రించారు. అందరికి భార్య(వేశ్య)గా మారిన ఆమ్రపాలికి ధనానికిగాని, సేవలకుగాని, భోగాలకుగాని కొదవ

లేకపోయినా ఏదో మానసిక సంఘర్షణకు లోనౌతుంది. ఒక పక్క పిల్లలు లేని తండ్రికి లేక లేక దొరికిన పిల్లని ఎంతో గారాబంగా పెంచి పెళ్లి చేయాలనుకున్నాడు. స్వయంవర సభలో కూతురు గొప్పతనాన్ని విశిష్టతను ప్రకటించినప్పుడు తండ్రి హృదయం ప్రస్ఫుటం అవుతుంది. లిచ్ఛవుల శాసనాన్ని విన్నప్పుడు శాక్యధనికుడు ఒక తండ్రిగా, చక్రవర్తిగా పొందిన మానసిక వ్యధను, ఆవేదనను, తండ్రి పరిస్థితిని చూసి ఆమ్రపాలి పొందిన మానసిక సంఘర్షణను జ్ఞానానందకవి గారు ఈ కావ్యంలో జీవింపచేశారు.

# Ph.D. Synopsis

# gnananandakavi rachanalu samajika samskrutika adhyayanam

(Socio, Cultural study of Gnanandakavi Writing's)

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the degree of
Doctor of Philosophy
in
Telugu

**Researcher**
**CHOUTA BALAKRISHNA**
**(Reg No.12HTPH15)**

Department of Telugu
School Of Humanities
University of Hyderabad
Hyderabad- 500046
Telangana State

March– 2019

# జ్ఞానానందకవి రచనలు – సామాజిక, సాంస్కృతిక అధ్యయనం

(పిహెచ్.డి.పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతగ్రంథం)


పరిశోధన

చౌట బాలకృష్ణ

12HTPH15

పర్యవేక్షణ

డా. బాణాల. భుజంగరెడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు– 500046

తెలంగాణ



మార్చి– 2019

## విషయసూచిక(index)

1. పరిశోధన శీర్షిక (Research Tittle)
2. .2పరిశోధన లక్ష్యం (Aim of the Research)
3. పరిశోధన పరిధి (Scope of the Research)
4. పరిశోధన విధానం/పద్ధతి (Research Methodology)
5. పూర్వపరిశోధనల పరామర్శ (Review of literature)
6. పరిశోధన ప్రణాళిక (Research Design)
7. పరిశోధన ఫలితాంశాలు (Research Results)
9. ఉపయుక్త గ్రంథసూచి (Bibliography)

### 1.పరిశోధన శీర్షిక (Research Tittle) :

ఆధునిక యుగం ప్రారంభమై పద్య రచనా ఉరవడి తగ్గి ఆధునిక సాహిత్యం ఉధృతంగా విస్తరిస్తున్న క్రమంలో నవ్య సంప్రదాయమార్గంలో పద్యాన్ని చేతబట్టి, పద్యానికే కట్టుబడి రచనలు చేసి సామాజికంగా,ఆర్థికంగా, ఒక సాధారణ స్థితి నుండి అక్షర జ్ఞానంతో ఉన్నత స్థాయికి ఎదిగి తెలుగు సాహితీ లోకంలో గుర్తింపు పొందిన వ్యక్తి, జాతీయకవి, పద్మశ్రీ జ్ఞానానందకవి.

సాహిత్యం వివిధ ప్రక్రియలలో(నవల, నాటకం, కథ, వచన కవిత్వం)వస్తున్నా వాటిని కాదని జ్ఞానానందకవి ప్రాచీన కవులు ఆదరించిన సంప్రదాయమార్గాన్నే ఎన్నుకొని చారిత్రక కావ్యాలు, కథాకావ్యాలు, ఖండ కావ్యాలు, నాటికలు మరియు పాటలు రచించారు. సంప్రదాయ మార్గంలో

రచనలు చేసిన అతి కొద్దిమందిలో ఈయన ఒకరు. ఈయన రచనల్లోని సామాజిక, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించుకొని "జ్ఞానానందకవి రచనలు – సామాజిక సాంస్కృతిక అధ్యయనం" అనే శీర్షికను ఎన్నుకున్నాను

## 2.పరిశోధన లక్ష్యం (Objectives of the Study) :

జ్ఞానానందకవి రచనలు పరిశీలించిన విమర్శకులు, పరిశీలకులు ఈయనను దళితక విగా కంటే జాతీయ కవిగా ఎక్కువ మంది గుర్తించారు. దళిత సమస్యతోపాటు ముఖ్యంగా చారిత్రక, జాతీయ, జాతీయోద్యమం, జాతీయోద్యమ నాయకులుమొదలైన వాటిని తన రచనల్లో చిత్రించారు. జ్ఞానానందకవి అన్ని రచనల్లో జాతీయతా దృక్పథాన్ని పరిశీలిస్తాను.

భారతదేశం వివిధ మతాల మిశ్రమం. భారతీయ సమాజంలో వ్యక్తి పుట్టుకే అతని కులాన్ని, అతని సామాజిక స్థాయిని నిర్ణయిస్తుంది. జ్ఞానానందకవి పుట్టుక రీత్యా అట్టడుగు వర్గానికి చెందినవారు. నాటి సమాజంలో విద్య అందరికీ అందుబాటులో లేదు. కొన్ని వర్గాలవారికి మాత్రమే పరిమితంగా ఉండేది. పాశ్చాత్యుల, మిషనరీల రాకతో విద్య అందుబాటులోకి వచ్చి అనేక మంది విద్యావంతులయ్యారు. ఈ క్రైస్తవ మిషనరీలలోనే జ్ఞానానందకవి విద్యను అభ్యసించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న కుళ్ళంతా ఎత్తి చూపి తాను జీవిస్తున్న సమాజంలో శిఖరాలను, లోతులను, వెలుతురును, చీకటిని స్వయంగా అనుభవించి తన రచనల ద్వారా చూపించిన సమాజాన్ని పరిశీలిస్తాను.

జ్ఞానానందకవి గొప్ప లౌకికవాది. పరమత సహనశీలి. వీరి రచనలు జాతిని చైతన్యం చేసేవిగా ఉంటాయి. ఒక వ్యక్తి అనుసరించే సంస్కృతీ సంప్రదాయాలే ఆ వ్యక్తీ మతాన్ని నిర్ధారిస్తాయి. ఈయన రచనల్లో హిందూ, ముస్లిం, క్రైస్తవ సంస్కృతులతోపాటు బౌద్ధ సంస్కృతిని కూడా పరిశీలిస్తాను.

### 3.పరిశోధన పరిధి (Scope of the Research)

జ్ఞానానందకవి రచనలను పరిచయం చేసి వాటిలో సామాజిక, సంస్కృతిక అంశాలు, జాతీయ నాయకుల సేవ, సంస్కృతిక అంశాలను పరిశీలించడం ఈ పరిశోధన పరిధి.

### 4.పరిశోధన విధానం/పద్ధతి (Research Methodology)

ఈ పరిశోధన రెండు విధాలుగా జరిగింది. మొదట గ్రంథాలయాలు, రచయితల దగ్గర పుస్తకాల సేకరణ. రెండు ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి వాటిని సమీక్షించి విశ్లేషణ పద్ధతిలో పరిశోధన చేయడం జరిగింది.

### 5.పూర్వపరిశోధనల పరామర్శ (Review of literature)

కళాప్రపూర్ణ జ్ఞానానందకవి రచనలపై ఇప్పటి వరకు నాలుగు పరిశోధనా వ్యాసాలు, మూడుసిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి. మొదట శరత్ జ్యోత్స్నారాణి ఆచార్య సి. ఆనందరామం పర్యవేక్షణలో "కళాప్రపూర్ణ డా. జ్ఞానానందకవి జీవితం – వాఙ్మయ సూచి" అనే శీర్షిక తో 1985లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. యస్. పరాంకుశం ఆచార్య వేదుల సుబ్రమణ్యశాస్త్రి పర్యవేక్షణలో "కళాప్రపూర్ణ డా.జ్ఞానానందకవి సాహిత్యం సమాలోచన" అనే శీర్షిక తో1993లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. యస్. రాజేశ్వర శర్మ ఆచార్య మాదిరాజు రంగారావు పర్యవేక్షణలో "జ్ఞానానందకవి కావ్యాలు –పరిశీలన" అనేశీర్షికతో 1995లో కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధనచేశారు. దార్ల వెంకటేశ్వరరావు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి పర్యవేక్షణలో "జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన" అనే అంశంపై 1998లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. పోలే ముత్యం ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచారి పర్యవేక్షణలో "యస్. టి. జ్ఞానానందకవి గోల్కొండ కావ్యం పరిశీలన" అనే అంశంపై 2002లో ఆచార్య

నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. వై. సారయ్య ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పర్యవేక్షణలో "యస్.టి. జ్ఞానానందకవి వివేకానందగానము – అనుశీలన" అనే అంశంపై 2005లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. పోలే ముత్యం ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పర్యవేక్షణలో "పద్మశ్రీ సురగాలి తిమోతి జ్ఞానానందకవి సాహిత్యం – విమర్శనాత్మక పరిశీలన" అనే అంశం పై 2008లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు.

## 6.పరిశోధన ప్రణాళిక (Research Design)

ఒకటవ అధ్యాయం : **జ్ఞానానందకవి జీవిత విశేషాలు**

రెండవ అధ్యాయం : **జ్ఞానానందకవి రచనలు - పరిచయం**

మూడవ అధ్యాయం : **జ్ఞానానందకవి రచనలు - జాతీయ నాయకుల సామాజిక సేవ**

నాల్గవ అధ్యాయం : **జ్ఞానానందకవి రచనలు - సామాజిక స్పృహ**

ఐదవ అధ్యాయం : **జ్ఞానానందకవి రచనలు - సంస్కృతి**

ముగింపు :

ఉపయుక్త గ్రంథసూచి :

**మొదటి అధ్యాయం : జ్ఞానానందకవి జీవిత విశేషాలు :**

డా. సురగాలి తిమోతి జ్ఞానానంద కవి క్రీ.శ.1922 వ సంవత్సరం జూలై 16వ తేదీన నేటి విజయనగరం జిల్లా బొబ్బిలి తాలూకాలోని పెదపెంకి అనే చిన్న గ్రామంలో క్రైస్తవ ఆచార సంప్రదాయాలు పాటించే ఒక సామాన్య నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం, వివాహం, రచనలు,ఆయన పొందిన సభ్యత్వాలు, స్థాపించిన

సంస్థలు, ఆయన పొందిన సన్మానాలు, బిరుదులు మరియు అవార్డులను ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం జ్ఞానానందకవి రచనలు - పరిచయం** :

జ్ఞానానదకవి అన్ని రచనలను పరిచయం చేశాను. ఆయన రచించిన కావ్యాలు ఆమ్రపాలి, గోల్కొండ, క్రీస్తు ప్రబంధం మరియు గాంధీ(అమరగీత) వీటితో పాటు ఖండకావ్యాలను తరంగామాల, వసంతగానం, పాంచజన్యం, ప్రభంజనం, విజయాభిషేకం, అక్షరాక్షతలు, క్రీస్తుచరిత్ర, అక్షరాభిషేకం, అక్షరాకృతులు, అక్షర గుచ్ఛం, వెలుగుబాట, క్రీస్తు ప్రబంధం, నా జీవితగాథ, అక్షరపూజ, హరిజనులు అంటరానివారా?, పిల్లనగ్రోవి, రాజధాని, కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు, వంశ ధార, వ్యూస్ అండ్ వర్క్స్, ఆహ్వానం, ధర్మాగ్రహం, వివేకానందగానం మొదలైన వాటిని స్థూలంగా పేర్కొన్నాను.

**మూడవ అధ్యాయం**:

**జ్ఞానానందకవి రచనలు - జాతీయ నాయకుల సామాజిక సేవ**:

భారత జాతిని జాగృతం చేసిన మహానీయులను, దేశనాయకులను, సంస్కర్తలను, సాహితీవేత్తలను, గురుతుల్యులను కీర్తించడం, స్మరించడం కవి కవితా వైభవం. జ్ఞానానదకవి తన రచనల్లో పేర్కొన్న జవహర్ లాల్ నెహ్రూ, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీ, కందుకూరి వీరేశలింగం, రాజా రామ్మోహన్ రాయ్, అయ్యదేవర కాళేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్, నీలం సంజీవరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు మరియు బెజవాడ గోపాలరెడ్డి లాంటి మహనీయుల సామాజిక సేవను ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

**నాల్గవ అధ్యాయం : జ్ఞానానందకవి రచనలు - సామాజిక స్పృహ** :

భారతీయ సమాజంలో వ్యక్తి పుట్టుకే అతని కులాన్ని, అతని సామాజిక స్థాయిని నిర్ణయిస్తుంది. జ్ఞానానందకవి పుట్టుక రీత్యా అట్టడుగు వర్గానికి

చెందినవారు. నాటి సమాజంలో విద్య అందరికీ అందుబాటులో లేదు. నాటిసమాజంలో అస్తవ్యస్థ సామాజిక పరిస్థితులు, పీడనలు కులమత వైషమ్యాలు, వేధింపులు కనిపిస్తాయి. కవిగారు తన రచనల ద్వారా చూపించిన సమాజ పరిణామాన్ని, ఆదిమ కమ్యునిస్టు సమాజాన్ని, బానిస సమాజం – సామాజిక సంబంధాలు, భూస్వామ్య సమాజం – సామాజిక సంబంధాలు, జమిందారి సమాజం – సామాజిక సంబంధాలు, పెట్టుబడిదారి సమాజం – సామాజిక సంబంధాలు, సామ్యవాద సమాజం – సామాజిక సంబంధాలు, సమాజంలో మధ్య తరగతి ప్రారంభం మరియు అట్టడుగు వర్గాల సామాజిక సంబంధాలను ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

**అయిదవ అధ్యాయం : జ్ఞానానందకవి రచనలు - సంస్కృతి :**

జ్ఞానానందకవి గొప్ప లౌకికవాది. పరమత సహనశీలి. వీరి రచనలు జాతిని చైతన్యం చేసేవిగా ఉంటాయి. ఒక వ్యక్తి అనుసరించే సంస్కృతీ సంప్రదాయాలే ఆ వ్యక్తీ మతాన్ని నిర్ధారిస్తాయి. ఈయన హిందూ, ముస్లిం, క్రైస్తవ సంస్కృతులతోపాటు బౌద్ధ సంస్కృతిని కూడా తన రచనల్లో చూపించారు. ఈ అధ్యాయంలో మతం, క్రైస్తవ మతం, క్రైస్తవమత సాహిత్యం, క్రిస్మస్ పండుగ, బౌద్ధం, బుద్ధుని మార్గం, ఆర్య సత్యాలు, అష్టాంగా మార్గాలు, త్రి రత్నాలు, ఇస్లాం సమాజం మరియు మిశ్ర సంస్కృతి గురించి చర్చించాను.

## 8.పరిశోధన ఫలితాంశాలు (Research Results) :

- ❖ సురగాలి తిమోతి జ్ఞానానందకవి రచనలు దళిత దృక్పథంతో పాటు జాతీయ దృక్పథం కూడా ప్రతి ఫలించాయి.
- ❖ హరిజన, జాతీయోద్యమ సంఘటనలను కవితా వస్తువు గా స్వీకరించారు.

- జ్ఞానానందకవి రచనల్లో ప్రధానంగా హరిజన, జాతీయోద్యమ కాలంలో జరిగిన ఆర్థిక, రాజకీయ, సాంఘీక పరిస్థితులు ఆయన రచనలలో ప్రతిబింబిస్తాయి.
- తరతరాలుగా నిమ్న కులాలు ఈ హైందవ సమాజంలో అస్పృస్యత ఎదుర్కుంటున్న అంటరాని జాతుల పక్షాన నిలిచి తన కవిత్వం ద్వారా ప్రజల్ని చైతన్య పరిచారు.
- గాంధీని ఆదర్శంగా తీసుకొని సత్యం,అహింసా మార్గాన్ని తన కవిత్వం ద్వారా ప్రబోదించాడు.
- క్రైస్తవ మిషనరీలో విద్యాభ్యాసం చేయడం వల్ల క్రైస్తవ ప్రభావం ఆయన జీవితంపై ఉంది. కనుక క్రైస్తవ తాత్వికత ప్రేమ,కరుణ, సహాయం మొదలైనవి రచనల్లో ప్రతిఫలిస్తాయి.
- భారతదేశం వివిధ సంస్కృతులకు, మతాలకు నిలయం. హిందూ, ముస్లింల ఐక్యత ఈయన రచనలో కనిపిస్తుంది.
- తెలుగు ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలని తెలుగు జాతి ప్రపంచానికి వెలుగు జాతి కావాలని ఆకాంక్షించారు.
- జ్ఞానానందకవి కవిత్వంలో జాతీయ నాయకులు, కవులు, కళాకారులు, ప్రముఖులు యొక్క జీవితాలను వారిసేవలు వారి తాత్వికత కనిపిస్తాయి.
- జ్ఞానానందకవి కవిత్వంలో భాషా శైలి ఆధునిక పద్యకవులకు భిన్నంగా ఉంటుంది.
- ఈయన కవిత్వం సీసపద్య మణిహారం. అందుకే ఈయనకి కవితా శ్రీనాథ భిరుదాంకితులయ్యారు.
- దళిత కవిత్రయంలో ఈయన ఒకరు (జాషువా,బోయిభీమన్న, జ్ఞానానందకవి)

- ఆయన వ్యక్తిత్వ వికాసం నా జీవిత గాథ ద్వారా తెలుస్తుంది.
- జ్ఞానానందకవి అంతిమ దశ వరకు సాహిత్య సేవ చేస్తూ రాజీలేని జీవితాన్ని గడిపారు.

## 9.ఉపయుక్త గ్రంథసూచి (Bibliography) :


1. అరుణ కుమారి, జి. 1987. ***ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న ధోరణులు***. హైదరాబాదు: ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్.
2. ఆనందరామం, సి. 1947. ***సమాజ సాహిత్యాలు***. హైదరాబాదు: యం. శేషాచలం అండ్ కంపెనీ.
3. కృపాచారి, గుజ్జర్లమూడి. 1988. ***తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ.*** నాగార్జునసాగర్: స్వంత ప్రచురణలు.
4. కృష్ణమూర్తి, భద్రిరాజు(సం). 1985. ***తెలుగు భాషా చరిత్ర***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
5. గోపి, ఎన్. 2000. ***ప్రజాకవి వేమన***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్. హౌస్.
6. చంద్ర శేఖర రెడ్డి, రాచపాళెం. 2002. ***ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు- సందర్భాలు.***
7. **జ్ఞానానందకవి, యస్.టి.** 1944. గోల్కొండ. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
8. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***ఆమ్రపాలి***. కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.
9. జ్ఞానానందకవి, యస్.టి. 1944. ***క్రీస్తు ప్రబంధం(తొలిభాగం).*** కాకినాడ: రసజ్ఞశ్రీ పబ్లికేషన్స్.

10. పద్మారావు, కత్తి. 1995. *సాంఘిక విప్లవ రచయితలు.* పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

11. పద్మారావు, కత్తి. 2008. *దళిత సాహిత్య వాదం - జాషువా సామాజిక తత్వము.* పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

12. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1987. *భాషా శాస్త్ర పరిచయం.* నరసరావు పేట: స్టూడెంట్స్ ఫ్రెండ్స్ ప్రచురణ.

13. బాలరాజు, శ్రీ రత్నాకర. 1960. *బౌద్ధయుగము*. రాజమండ్రి: కాళహస్తి తమ్మరావు అండ్ సన్స్.

14. బిపిన్ చంద్ర. 1983. *ఆధునిక భారతదేశ చరిత్ర.* హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్టు.

15. రంగనాథాచార్యులు, కె. కె. 1982. *ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు*. హైదరాబాద్: ఆంధ్రసాహిత్య పరిషత్తు.

16. రంగారావు, సాదినేని. 1979. *నీలం సంజీవరెడ్డి జీవిత చరిత్ర.* తెనాలి: విజయ ఆర్ట్ ప్రెస్.

17. రామమోహన్ రాయ్, కడియాల. 1982. *తెలుగు కవితా వికాసం.* హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

18. రామకృష్ణమాచార్య, నందూరి. 1995. *తెలుగు పద్య శిల్పం.* సికింద్రాబాద్: చారి అండ్ కంపెనీ.

20. లక్ష్మీకాంతం, పింగళి. 1979. *ఆంధ్రసాహిత్య చరిత్ర.* హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

21. విజయలక్ష్మి, రాయదుర్గం. 2002. *ఆధునికాంధ్రకవిత్వం పై బౌద్ధ మత ప్రభావం.* సికింద్రాబాదు: ఆనందబుద్ధ విహార ట్రస్టు.

22. వీరన్న, గుమ్మ.2008. ***భారతీయ సంస్కృతి - తత్వం.***హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

23. వెంకటేశ్వరరావు, దార్ల. 1999. ***జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన.*** హైదరాబాదు: జ్యోత్స్నా కళాపీఠం

24. శరత్ జ్యోత్స్నారాణి, యస్. 1994. ***డా. యస్. టి. జ్ఞానానందకవి జీవితం వాఙ్మయసూచి.*** హైదరాబాద్: స్వంత ప్రచురణలు.

25. శ్యాంసన్ పిల్లి. 2000. ***దళిత సాహిత్య చరిత్ర.*** గుంటూరు.

★★★